

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 195

సోమవారం 6-10-2025



'హెల్త్ ఎమర్జెన్సీ'కి సిద్ధమా!
నగదు రహిత చికిత్సలకు తిరస్కారాలు
క్లెయిమ్‌ల వరంగా వివాదాలు
- 12లో



భారత్ రికార్డు ప్రదర్శన
ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో
భారత్‌కు 22 పతకాలు..
- 11లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



“అండమాన్ టూర్... అమేజింగ్ టూర్. ఎందుకంటే... ఇది రోడ్డు టూర్ కాదు. అలాగని రైలు బండి పర్యటనా కాదు. గాల్లో విమాన విహారమూ కాదు. నీటి మీద క్రూయిజ్‌లో విహారం. ఇంకా... నగరం మధ్య వీధుల్లో విహారం కాదు. ఇది... సముద్రం మధ్య దీవుల్లో విహారం. ఎటు చూసినా సముద్రమే... ఎటు వెళ్లినా ప్రకృతి ఆహ్లాదమే. ఒకవైపు ఇంద్రధనసు సూర్యోదయం. మరో వైపు ప్రకృతి చెక్కిన రాతి వంతెన. ఇన్ని ప్రకృతి అద్భుతాల సుమహారం ఈ టూర్.”

అండమాన్‌పై ప్రత్యేక కథనం సాక్షి ప్లస్ ట్రావెల్ ఈపేపర్‌లో..

మంచిమాట



ప్రతి ఉదయానికీ ఒక కారణం ఉంటుంది, ప్రతి అడుగుకూ ఒక గమ్యం ఉంటుంది. అలాగే, మానవ జీవి తానికీ ఒక గొప్ప ఉద్దేశం ఉంది, అదే సేవ. మనం ఈ సృష్టిలో కేవలం తీసుకునేవాళ్ళం మాత్రమే కాదు, ప్రేమతో పంచేవాళ్ళం కూడా. హృదయానికీ చేతులకూ మధ్య ఒక వంతెనగా నిలిచే సేవ అనేది మనకు తెలియకుండానే మన మనసులోని అహంకారాన్ని తొలగించి, మన ఆత్మను మరింత కాంతిమంతం చేసే ఒక మహోన్నతమైన మార్గం. ఇది మనకు లభించే అపారమైన ఆత్మసంతృప్తి.

అత్యుత్తమ మానవ ధర్మం: సేవ

సర్వే భవంతు సుఖినః, సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు, మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్

అందరూ సుఖంగా ఉండాలి, అందరూ రోగరహితులు కావాలి. అందరూ శుభాలు చూడాలి, ఎవరూ దుఃఖాన్ని అనుభవించకూడదు. ఈ శ్లోకం మానవ జీవిత అంతిమ లక్ష్యం సర్వజన సుఖం అని తెలియజేస్తుంది. ఈ లక్ష్యాన్ని సాధించే ఏకైక మార్గం నిస్వార్థమైన సేవ.

సేవ అంటే కేవలం శ్రమ, ధనం ఇవ్వడం కాదు, అది మన హృదయాన్ని ఉన్నతమైన ప్రేమతో, కరుణతో నింపుకునే ఒక మహోన్నతమైన యజ్ఞం. సేవలో అసాధ్యం అంటూ ఏదీ లేదని ఫ్లోరెన్స్ నైటింగేల్ చరిత్ర నిరూపిస్తుంది. బ్రిటన్‌లో ఉన్నత కుటుంబంలో పుట్టిన ఆమె, సంపదను, సుఖాలను కాదని, నర్సింగ్‌ను ఒక పవిత్రమైన సేవగా మార్చారు. ఆమె క్రిమియన్ యుద్ధ సమయంలో సైనికులకు సేవ చేస్తూ, చీకటిలో లాంతరు పట్టుకుని రోగుల పడకల వద్దకు వెళ్లి వారికి ఆశాదీపం అయ్యారు. ఆమె అంకితభావం, కరుణ, నిస్వార్థ సేవ నర్సింగ్ వృత్తికే ఒక కొత్త గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ఆమె చూపిన కరుణ, నిస్వార్థత లక్షలాదిమందికి స్ఫూర్తినిచ్చాయి.

సేవా ధర్మో హి పరమో ధర్మః

సేవయే అత్యుత్తమ ధర్మం. మన స్వార్థాన్ని, అహంకారాన్ని వదిలి ఇతరుల సుఖం కోసం పాటుపడటమే నిజమైన ధర్మమని ఈ సూక్తి స్పష్టం చేస్తుంది. సేవలో లభించే ఆనందం, సంతృప్తి ఇంకే ఇతర భౌతిక సుఖాల్లో లభించవు.

పరోపకారేణ పరమాత్మ సంతుష్టః

ఇతరులకు మేలు చేయడం ద్వారా పరమాత్మ సంతోషిస్తాడు. ఈ సూక్తి సేవను భగవంతుడికి చేరువయ్యే మార్గంగా చూపిస్తుంది. మనలోని దివ్యత్వం ఇతరుల సేవ ద్వారానే ప్రకాశిస్తుందని, అది భగవంతుని ఆశీర్వాదాలను పొందే మార్గమని తెలియజేస్తుంది.

సేవ కేవలం ఇతరులకు సహాయం చేయడం మాత్రమే కాదు, అది మన ఆత్మను శుద్ధి చేసుకునే ఒక గొప్ప అవకాశం. మన కష్టాల్లో ఉన్నప్పుడు ఇతరులకు సహాయం చేసినప్పుడు మన బాధలు మర్చిపోతాం. అదే సేవ అంతిమ లక్ష్యం. సేవ మనలోని ప్రేమను, కరుణను పెంచి, మన జీవితానికి ఒక గొప్ప అర్థాన్ని, ఉద్దేశం ఇస్తుంది. ప్రతి చిన్న సేవ కూడా మన మనసుకు ఒక గొప్ప శాంతిని, తృప్తిని ఇస్తుంది. ఈ ఆత్మ సంతృప్తి ప్రపంచంలో ఏ ఇతర సంపదా ఇవ్వలేనిది. సేవ ద్వారా మనం మన జీవితాన్ని ప్రకాశవంతంగా, అర్థవంతంగా మార్చుకోగలం.


– కె. భాస్కర్ గుప్తా
వ్యక్తిత్వ వికాస నిపుణులు



ఆధునిక ప్రపంచంలో, ప్రఖ్యాత మానవతావాది, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మదర్ థెరిసా జీవితం సేవకు పర్యాయపదం. ఆమె చేతులు లక్షలాది మంది నిరాశ్రయులను ఆదరించిన చేతులు. ఆమె మాటలు వేలాదిమందికి ధైర్యాన్నిచ్చిన మాటలు. నిస్వార్థసేవతో ఆమె చూపిన కరుణ, ఆమెను ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రేమాస్పదమైన కరుణామూర్తిగా మార్చింది. పంచుకుంటే పెరిగే ప్రశాంతతను ఆమె జీవితం ప్రతిబింబిస్తుంది. ఆమె సేవలో కనిపించేది కేవలం కరుణ మాత్రమే కాదు, అసాధారణమైన ధైర్యం, సహనం. ఆమె నిస్వార్థ సేవే ఆమెను ప్రపంచానికి ప్రేమకు ప్రతిరూపంగా నిలిపింది. ఈ ఉదాహరణలు సేవ కేవలం ఒక పని కాదని, అది మన జీవిత లక్ష్యాన్ని నిర్వచించే ఒక జీవన విధానమని రుజువు చేస్తాయి.

సందర్భం

ఆదికవికి అనేక ప్రణతులు



భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం శ్రీమద్రామాయణం. మానవ వికాసం కోసం, మానవుడు పరిపూర్ణత్వాన్ని పొందడం కోసం వేదాల్లో చెప్పిన అంశాలనే సామాన్య మానవులకు కూడా అర్థమయ్యేలా రామకథను ఆధారంగా చేసుకుని వాల్మీకి రామాయణాన్ని వ్రాశాడు. రామాయణాన్ని పరమ పవిత్ర భక్తి వేదంగా పఠిస్తూ పారాయణ చేసేవారు కొందరైతే, మహోత్కృష్ట కావ్యంగా చదువుతూ ఆనందించేవారు కొందరు, మరికొందరు అందులోని కౌశల్యానికి ముగ్ధులైతే, ఇంకొందరు అందులోని మానవీయ విలువలను గ్రహించేవారు.

రామాయణం భారతీయుల ఆత్మ... అయితే, యావత్ మానవజాతికి చుక్కాని వంటిదని చెప్పొచ్చు.

నిత్యజీవితంలో నీతి నియమాలకు కట్టుబడకుండా, ధర్మనిరతితో ప్రవర్తించకుండా భగవంతుడికి దగ్గర కావాలనుకోవడం అవివేకం. ఆ విశ్వంభరుడికి విలువలతో కూడిన మానవ జీవన ప్రయాణమే ప్రామాణికం కాని కులగోత్రాలు, కాసులు, కిరీటాలు కాదు. అగ్రకులాన జన్మించినా అడ్డదారులు తొక్కితే ఆయన క్షమించడు. అణగారిన కులాలలో పుట్టినా విలువలతో.. పవిత్రంగా జీవన పయనం సాగించే వారిని చేయి పట్టుకుని నడిపించక మానడు. అంటే ఆ దైవానికి మన గుణగణాలు ప్రధానం కాని కుల మతాలు ప్రమాణం కాదు. ఇందుకు మన ముందున్న చక్కని ఉదాహరణ వాల్మీకి మహర్షి.

రామాయణంలో హృదయాన్ని ద్రవింపజేసే చక్కని కథ ద్వారా మనవాళికి మార్గదర్శనం చేసే సుభాషితాలెన్నో చెప్పాడు వాల్మీకి. మానవుడి జీవితాన్ని సుఖమయం చేసే ధర్మమాలను ధర్మసూత్రాలను తాను విరచించిన రామాయణ కావ్యం విశదీకరించాడాయన. జగదానంద కారకుడు, శరణాగతవత్సలుడు, సకల గుణాభిరాముడు అయిన శ్రీరాముని దివ్య చరిత్రను, శ్రీరామనామ మాధుర్యాన్ని మనకందించిన కవికోకిల ఆదికవి వాల్మీకి మహర్షికి మానవాళి యావత్తు రుణపడి ఉంటుందంటే అతిశయోక్తి కాదు.

అర్థవంతమైన చక్కని పదాలతో, శాస్త్ర అనుకూలమైన సమాసాలు, సంధులు, మధురమైన, ఆర్ద్రత కలిగించే వాక్యాలతో కూడిన శ్రీరామాయణ మహాకావ్యాన్ని మనకందించాడు వాల్మీకి మహర్షి. రామాయణంలో అంశాలన్నీ సత్యాలే. రామాయణంలో మానవ ధర్మాలైన శిష్య ధర్మం, భ్రాతృధర్మం, రాజ ధర్మం, పుత్రధర్మం, మిత్రధర్మం, పతివ్రతా ధర్మాల తోపాటు ప్రేమలు, బంధాలు, శరణాగత వత్సలత, యుద్ధనీతి, రాజనీతి, ప్రజాభ్యుదయం, సత్యవాక్పరిపాలన, ఉపాసన రహస్యాలు, సంభాషణా చతురత, జీవిత విలువలు, ధర్మాచరణ వంటి అనేక రకాల ఉపదేశాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే రామాయణ కావ్యంలో మంచి చెడుల గురించి చెప్పనిదంటూ ఏది లేదు.

ఇంత విలువైన సత్యాలను చెప్పి, ఇంతటి మహత్తర కావ్యాన్ని అందించిన కవి వాల్మీకి మహర్షికి ప్రతి ఒక్కరూ చేతులెత్తి నమస్కరించాలి. ప్రతివారు రామాయణ కావ్యం చదివి, చక్కని గుణవంతులైతే వాల్మీకి ఋణం తీర్చుకున్నట్టే.

– డి.వి.ఆర్.

(7, మంగళవారం ఆశ్వయుజ శుద్ధ పూర్ణిమ నాడు వాల్మీకి జయంతి)

ఆధ్యాత్మికథ

వేణు గానం

అదొక నదీ తీరం. అక్కడి పచ్చటి చెట్ల నడుమ అందమైన శ్రీ కృష్ణుడి విగ్రహం ఉంది. ఆ దారిన పోతున్న ఓ నాస్తికుడైన రాజు కొద్దిసేపు కూర్చుని వెళ్దామని అక్కడ ఆగాడు. వేణువు ఊదే శ్రీ కృష్ణుడి విగ్రహం పక్కనే ఒక యువ సంగీతకారుడు కూర్చుని సాధన చేస్తూ ఉన్నాడు. అతడి ధ్యాస అంతా సాధన మీదే ఉంది. రాజు రాకను అతడు పట్టించుకోలేదు. రాజు సంగీతకారుడి దగ్గరికి వెళ్ళి భుజం తట్టాడు. రాజును చూసి ఉలిక్కిపడ్డాడు సంగీతకారుడు.

“శ్రీ కృష్ణుడు వేణువు ఊదితే ఆవులు పాలిచ్చేవట కదా” అని వెటకారంగా అన్నాడు రాజు . ‘స్వామి వేణుగానానికి ప్రకృతే పరవశించిపోతుందని’ చెప్పాలనుకున్నాడు సంగీతకారుడు. ‘రాజు తలిస్తే దెబ్బలకు కొదువా?’ సామెత గుర్తుకొచ్చి గమ్మున తల వంచుకుని ఉండిపోయాడు.

అలసి ఉన్న రాజు విగ్రహం ముందున్న మెట్ల మీద కూర్చున్నాడు. అంత చక్కటి వాతావరణంలో మంచిగా నిద్రపోతే బాగుంటుందని భావించాడు. ఎంత ప్రయత్నించినా కళ్ళు మూత పడలేదు.

కొద్దిసేపు గడిచింది. చల్లటి గాలి తెరలు తెరలుగా వీస్తోంది. ఆ సంగీతకారుడు సాధన ప్రారంభించాడు. జల తరంగిణి మీద ఓ రాగాన్ని వాయించసాగాడు. ఆ రాగం వింటూ రాజు ‘సంగీతానికి చింతకాయలే రాలవు, నాకు నిద్ర ఎలా వస్తుంది?’ అని నవ్వుకున్నాడు. అయితే చక్కటి ఆ రాగానికి రాజుకు చిన్నచిన్నగా నిద్ర పట్టసాగింది. అలాగే మెట్ల మీద పడుకుని గాఢ నిద్రలోకి వెళ్ళిపోయాడు.



గంట తర్వాత లేచి కూర్చున్నాడు రాజు. కళ్ళు తడి అయి ఉన్నాయి. మంచి నిద్ర వచ్చినట్లు గ్రహించాడు. ఆ ఆలోచనారహిత స్థితికి సంగీతం కారణమని గుర్తించాడు. కళ్ళు తుడుచుకుంటూ ‘చాన్నాళ్ళయ్యింది ఇంత ప్రశాంతంగా నిద్రపోయి’ అనుకున్నాడు. సంగీత విద్యకు హద్దు లేదు, యుద్ధభూమికి కొలతలేదన్న విషయం గుర్తుకు వచ్చింది. “సంగీతంలో ఎంతో మహత్తు ఉంది. అందుకే శ్రీ కృష్ణుడి వేణు గానానికి ఆవులు తప్పక పాలు ఇచ్చి ఉంటాయి” అని గట్టిగా అన్నాడు. అవునన్నట్లుగా చిన్నగా తల ఊపాడు సంగీతకారుడు.

రాజు గబగబా లేచి వెళ్ళి శ్రీ కృష్ణుడి పాదాలకు నమస్కరించాడు. రాజధానిలో చక్కటి సంగీత పాఠశాల ఏర్పాటు చేస్తానని అక్కడినుంచి కదిలాడు. శ్రీ కృష్ణుడు ముసిముసినవ్వులు నవ్వుతున్నట్టుగా అనిపించింది సంగీతకారుడికి.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా



ప్రదీప్ రంగనాథన్

సింగారి సిన్నదానా...

“సింగారి సిన్నదానా నీ ఇంటి దారిల్లోనా పసోడై పాడుకోన రింగ రింగ...” అంటూ సాగుతుంది ‘డ్యూడ్’ సినిమాలోని ‘సింగారి’ పాట. ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘డ్యూడ్’. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ‘డ్యూడ్’ తెలుగు వెర్షన్ నుంచి ‘సింగారి’ పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ ఆలపించారు. “అత్తర్లు పూసుకున్న... పౌడర్లు రాసుకున్న... ఊరేగి వస్తావున్నా నీకోసమే కన్నా...’ అనే లిరిక్స్‌తో సాగుతుంది ఈ ‘సింగారి’ పాట.



నాగ ప్రణవ్, కావేరి

కొంచెం కొంచెంగా...

నాగ ప్రణవ్, కావేరి కర్ణిక లీడ్ రోల్స్‌లో ఆద్య రెడ్డి, అజయ్ ఘోష్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘ఓ... చెలియా’. నాగ రాజశేఖర్ రెడ్డి దర్శకత్వంలో రూపశ్రీ కోపూరు నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమాలోని ‘కొంచెం కొంచెంగా... నేనే నువ్వైపోతుంటే..’ అంటూ సాగే పాట లిరికల్ వీడియోను హీరో నవీన్‌చంద్ర విడుదల చేసి, మాట్లాడుతూ– “లవ్, థ్రిల్ అంశాలతో రూపొందిన ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి” అన్నారు. ఎమ్ఎమ్ కుమార్ స్వరపరచిన ఈ పాటకు సుధీర్ సాహిత్యం అందించగా వాగ్దేవి, మనోజ్ పాడారు.



రీ యూనియన్‌లో స్టార్స్ సందడి

ఆనందం... భావోద్వేగం

“1980ల నాటి నా ఆత్మీయ స్నేహితులతో ప్రతి రీ యూనియన్ ఓ మధురమైన జ్ఞాపకం. నాటి జ్ఞాపకాల గురించి చెప్పుకోవడం, హాయిగా నవ్వుకోవడం... ఇలా కొన్ని దశాబ్దాలుగా విడదీయలేని బంధం మా మధ్య కొనసాగుతోంది. ప్రతి రీ యూనియన్‌కి ఫస్ట్ టైమ్ కలిసినట్లుగా అనిపిస్తుంటుంది” అని సోషల్ మీడియా వేదికగా చిరంజీవి పేర్కొన్నారు. 1980లకి చెందిన స్టార్స్ కొందరు ప్రతి ఏడాదీ కలుస్తుంటారు. ఒక్కోసారి ఒక్కో స్టార్ ఇంట్లో రీ యూనియన్ జరుగుతుంది. ఈసారి చెన్నైలో నటి-దర్శకురాలు శ్రీప్రియ, ఆమె భర్త, నటుడు-నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి స్వగృహంలో తారలందరూ కలిశారు. చిరంజీవి, వెంకటేశ్, వీకే నరేశ్, ప్రభు, జాకీ ష్రాఫ్, జయసుధ, రమ్యకృష్ణ, రేవతి, రాధ... ఇలా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ పరిశ్రమకు చెందిన 31 మంది స్టార్స్ కలుసుకున్నారు. అందరూ ‘యానిమల్’ థీమ్ దుస్తులు ధరించారు. ఖుష్బూ, సుహాసిని, లిస్సీ, పూర్ణిమలు ఈ రీ యూనియన్‌ని కో ఆర్డినేట్ చేశారు. ‘స్నేహం, ఐకమత్యం’ వీటికి ఈ రీ యూనియన్ ఓ చిహ్నం అని స్టార్స్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... గత ఏడాది చెన్నైలో భారీ వర్షాల కారణంగా రీ యూనియన్ జరగలేదు. దాంతో తాజా రీ యూనియన్ స్టార్స్‌కి హ్యాపీగా, ఎమోషనల్ మూమెంట్‌గా నిలిచింది.



తేజ సజ్జా హీరోగా నటించిన మైథలాజికల్ అడ్వెంచరస్ యాక్షన్ మూవీ ‘మిరాయ్’. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా మంచు మనోజ్ విలన్ రోల్ చేశారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం గత నెల 12న విడుదలైంది. ‘మిరాయ్’ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను వసూలు చేసిందని, నార్త్ అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్క్ అందుకుని, ఇంకా ఈ సినిమా సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమవుతోందని చిత్రబృందం పేర్కొంది. ఈ సందర్భంగా తన ఇంట్లో ఓ ఆత్మీయ వేడుకను నిర్వహించి, ‘మిరాయ్’ సినిమా యూనిట్‌ను నిర్మాత ‘దిల్’ రాజు అభినందించారు. ఈ వేడుకలో కేక్ కట్ చేసి, ‘మిరాయ్’ సక్సెస్‌ను సెలబ్రేట్ చేశారు.



వినోద్ వర్మ

ఎవరు మీరు?

‘అమ్మాయిని కదా అందం విషయంలో అస్సలు తృప్తి ఉండదు. ఎంతున్నా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది’, ‘అసలు ఎవరు మీరు... సైతానా?’ అనే డైలాగ్స్ ‘అరి’ సినిమా తాజా ట్రైలర్‌లో ఉన్నాయి. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. జయశంకర్ దర్శకత్వంలో రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి, శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా ఆదివారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

హై హై ప్రతి నాయికా

డ్యూయెట్స్ పాడుతూ, కాసిన్ని జోక్స్ వేస్తూ, ఎమోషనల్ సీన్స్‌లో కన్నీళ్లు పెట్టుకుంటూ... కథానాయికల పాత్రలు దాదాపు ఇలానే ఉంటాయి. అందుకే విభిన్న తరహా పాత్రలు దక్కితే ‘సై’ అనేస్తారు. అదే నెగటివ్ క్యారెక్టర్ అయితే... నటించడానికి చాలా స్కోప్ ఉంటుంది కాబట్టి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు. ఇప్పటికే స్టార్ హీరోయిన్స్ సమంత, తమన్నా వంటివారు విలన్ రోల్స్ చేసి, సక్సెస్ అయ్యారు. శ్రద్ధా శ్రీనాథ్, అనన్యా నాగళ్ల, సంయుక్త, రచితా రామ్, రుక్మిణీ వసంత్... ఇలా యువ తారలు సైతం విలన్ రోల్స్ చేసేందుకు ఆలోచించడం లేదు. ప్రతి నాయిక పాత్రల్లో నటనపరంగా విజృంభించి, ‘హై హై ప్రతినాయికా’ అని ప్రేక్షకులు అనేలా తమ సత్తా నిరూపించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో లేడీ విలన్‌గా చేస్తున్న కొందరు హీరోయిన్స్ గురించి తెలుసుకుందాం.



టబు



సోనాక్షీ

స్లమ్ డాగ్‌లో...

వెంకటేశ్ ‘కూలీ నెం.1’, నాగార్జున ‘నిన్నే పెళ్లాడతా’ వంటి చిత్రాల్లో హీరోయిన్‌గా, అల్లు అర్జున్ ‘అల..వైకుంఠపురములో..’ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా టబు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలోని ‘స్లమ్ డాగ్’ (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు టబు. విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో టబు విలన్‌గా కనిపిస్తారని సమాచారం. పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇదిలా ఉంటే... గతంలో ‘మక్బూల్’, ‘అంధా ధూన్’ వంటి హిందీ చిత్రాల్లో టబు నెగటివ్ రోల్స్ చేసిన విషయం తెలిసిందే.

ధన పిశాచి... టాలీవుడ్‌కి విలన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు బాలీవుడ్ నటి సోనాక్షీ సిన్హా. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ‘జటాధర’లో సోనాక్షీ సిన్హా విలన్ రోల్ చేస్తున్నారు. ఇందులో ఆమె ధన పిశాచిగా కనిపించనున్నారు. సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సోనాక్షీ సిన్హాతో పాటు దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శిల్పా శిరోద్కర్ పాత్రలోనూ నెగటివ్ షేడ్స్ ఉంటాయట. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్‌లు ‘జటాధర’ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కేరళలోని తిరువనంతపురంలో గల అనంత పద్మనాభస్వామి దేవాలయం నేపథ్యంలో సాగే ఈ చిత్రం నవంబరు 7న విడుదల కానుంది.

దెయ్యంగా పూజ?

దర్శక-నిర్మాత-నటుడు-కొరియోగ్రాఫర్ రాఘవా లారెన్స్ ‘కాంచన’ ఫ్రాంచైజీ నుంచి రానున్న తాజా చిత్రం ‘కాంచన 4’. ఈ చిత్రంలో రాఘవా లారెన్స్‌తో పాటు పూజా హెగ్డే, నోరా ఫతేహీ మెయిన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారని తెలిసింది. ఈ చిత్రంలో దెయ్యం పాత్రలో పూజా హెగ్డే కనిపిస్తారట. పూజ లేదా నోరా ఫతేహీ... ఇలా ఎవరో ఒకరి పాత్ర నెగటివ్ షేడ్స్‌లో ఉంటుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. దాదాపు సగం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ‘కాంచన 4’ సినిమా వచ్చే వేసవిలో విడుదల కావొచ్చు.



రష్మిక, పూజ

వారియర్ విలన్..

కాలేజీ అమ్మాయి, ప్రేయసి, భార్య... ఇలా హీరోయిన్‌గా విభిన్న రకాల పాత్రల్లో నటించి, మెప్పించారు రష్మికా మందన్నా. ఇప్పుడు తనలోని నెగటివ్ యాంగిల్‌ని తెరపై ఆవిష్కరించేందుకు రెడీ అవుతున్నారట రష్మిక. హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఓ హీరోయిన్‌గా దీపికా పదుకోన్ ఖరారయ్యారు. ఇంకా రష్మికా మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, ఆలియా. ఎఫ్... వంటి వారు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. రష్మికా మందన్నా నెగటివ్ షేడ్స్ ఉన్న వారియర్ విలన్ పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇదే నిజమైతే రష్మిక విలన్‌గా కనిపించనున్న తొలి చిత్రం ఇదే కావొచ్చు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా 2027లో విడుదల కానుంది.

ఇంకా మరికొందరు కథానాయికలు ‘ప్రతి నాయిక’లుగా కనిపించనున్నారు.



సూర్యతేజ

ప్రేమకథతో...

సూర్యతేజ పసుపులేటి హీరోగా నటించి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన చిత్రం ‘మన ఊరి ప్రేమాయణం’. అలమేలు మంగమ్మ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం టైటిల్, లోగోని సూర్యతేజ బర్త్‌డే సందర్భంగా సీనియర్ నటుడు సుమన్ ఆవిష్కరించారు. “ప్రేమకథతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన చిత్రం ఇది” అన్నారు సూర్యతేజ.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 195
సోమవారం 6-10-2025
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

మహిళలూ మురిపించారు



ఇటీవల పురుషుల ఆసియా కప్‌లో పాకిస్తాన్‌ను భారత జట్టు చిత్తు చేయగా... మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టు కూడా అదే పని చేసింది. కొలంబోలో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ బృందం 88 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. -11లో



కొండచరియల బీభత్సం

పశ్చిమ బెంగాల్‌లోని మిరిక్, డార్జిలింగ్ హిల్స్‌లో వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడి 20 మంది మృతిచెందారు.

వివరాలు 6లో ▸



నేడు ఇజ్రాయెల్, హమాస్ చర్చలు

గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదల లక్ష్యాలుగా సోమవారం ఈజిప్టులో చర్చలు మొదలుకానున్నాయి.

వివరాలు 6లో ▸



లద్దాఖ్ కోసం పోరాటం ఆగదు

లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాతోపాటు రాష్ట్రాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో పోరాటం చేద్దామని వాంగ్‌చుక్ అన్నారు.

వివరాలు 6లో ▸



17 కొత్త మార్పులు

బిహార్ ఎన్నికల్లో 17 మార్పులు తెస్తున్నామని.. వాటిని దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టే అవకాశం ఉందని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చెప్పారు.

వివరాలు 6లో ▸

ఆఫ్రికా టు ఆంధ్రా!

నకిలీ మద్యం ప్లాంట్ వ్యవహారంలో విస్తుపోయే వాస్తవాలు

తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డికి 'కీలక' నేత అండ

ఆఫ్రికాలో వ్యాపారం ద్వారా 'మద్యం'పై అపార అనుభవం

ఎన్నికల ముంగిట మద్యం వ్యాపారంపై కీలక నేతతో చర్చలు

రాష్ట్రంలో, గోవాలో మద్యం ఫ్యాక్టరీ లీజుపై కీలక సమాచారం

- భారీ స్థాయిలో డబ్బు ఆర్జించేలా స్కెచ్
- అందువల్లే టీడీపీని ఎన్నో ఏళ్లుగా నమ్ముకున్న శంకర్ యాదవ్‌ను కాదని ఇతనికి టికెట్
- ఎన్నికలయ్యాక ముందుగా అనుకున్న స్కెచ్ మేరకు నకిలీ లిక్కర్ దందా
- రాష్ట్రంలో రెండు చోట్ల, పొరుగు రాష్ట్రంలో ఒక చోట నకిలీ మద్యం తయారీ ప్లాంట్
- ములకలచెరువు ఘటన నేపథ్యంలో మిగతా 2 ప్లాంట్లు మూసివేత
- అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేతతోనూ సాన్నిహిత్యం
- కీలక నేత ఆదేశాలతో ఈ వ్యవహారం సద్దుమణిగేలా చక్రం తిప్పుతున్న ఈ ముఖ్య నేత

2లో



2024లో చంద్రబాబు నుంచి తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా బి-ఫాం తీసుకుంటున్న జయచంద్రారెడ్డితో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు

నకిలీ మద్యంపై సీఎం సరికొత్త డ్రామా

తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, పార్టీ నేత సురేంద్రనాయుడు సస్పెన్షన్

2లో

దందా డైరీలో నిక్షిప్తం

ప్లాంట్ నుంచి బెల్ట్ షాపులకు నకిలీ మద్యం సరఫరా.. బెల్ట్ షాపుల వివరాలతో కూడిన డైరీ లభ్యం

నకిలీ మద్యం తాగి ఒకరి మృతి!



పెద్దన్న మృతదేహం

ఏం స్కెచ్ వేశావ్ చంద్రబాబూ?

రాత్రికి రాత్రే నకిలీ మద్యం సూత్రధారుల మార్పు

సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపాటు

రాష్ట్రంలో మద్యం అక్రమాలకు ములకలచెరువు ఘటనే నిదర్శనం

నకిలీ లిక్కర్ వ్యవహారంలో రాష్ట్రాన్ని నంబర్ వన్ చేయాలన్నదే మీ లక్ష్యమా?

మద్యం దుకాణాలు, ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు, బెల్టుషాపులు అన్నీ టీడీపీ వాళ్లవే.. అక్రమ మద్యం తయారీదారులు కూడా వీరే



- అలా తయారు చేసిన నకిలీ మద్యాన్ని మీ వాళ్లే, మీ షాపుల ద్వారా, మీ బెల్టుషాపుల ద్వారా అమ్ముతారు
- వచ్చిన ఆదాయాన్ని వాటాలు వేసుకుని అందరూ పంచుకుంటున్నారు
- వ్యవస్థీకృతంగా ఈ దందా కొనసాగుతోంది.. ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి కల్తీ మద్యమేనన్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి
- ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని మీ ముఠా కొట్టేస్తోంది
- ములకలచెరువు ఘటన తర్వాత సప్లై చేసిన మద్యం షాపుల్లో, బెల్టు షాపుల్లో ఎందుకు తనిఖీలు చేయలేదు?
- మీ సహకారం ఉంది కాబట్టే అసలు సూత్రధారులను తప్పిస్తూ తూతూ మంత్రంగా కేసులు
- మీ సొంత ఆదాయం కోసం పేదల ఆరోగ్యంతో చెలగాటం న్యాయమేనా?

2లో

పిన్నిని ముక్కలుగా నరికి..!



స్వయాన అక్క కొడుకే ఆమె పాలిట రాక్షసుడిగా మారాడు. తన భార్య పుట్టింటికి వెళ్లిపోవడానికి పిన్నే కారణమని భావించి దారుణానికి ఒడిగట్టాడు. వృద్ధురాలని కూడా చూడకుండా తన మైనర్ కొడుకుతో కలిసి ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచుల్లో చుట్టి వేర్వేరు కాలువల్లో పడవేశాడు. సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే ఈ ఘటన విజయవాడలో జరిగింది.

10లో

తురకపాలెంలో మరో మహిళ మృతి



గుంటూరు జిల్లా తురకపాలెంలో మరో మహిళ జ్వరం, శరీరంపై బొబ్బలు వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందింది. మెలియాయిడోసిస్ వ్యాధి వల్లే ఆమె మరణించినట్లు వైద్యులు చెప్పారని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

3లో

బిగ్‌ఫిక్స్ రాకుంటే బైబై



సాఫ్ట్‌వేర్ కోడ్ జనరేషన్‌లో అప్‌గ్రేడ్ కానివారికి లేఆఫ్‌ల ముప్పు

- ఏఐ టూల్ కోడింగ్ నైపుణ్యం లేని ఉద్యోగులను తొలగిస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- ఏటా ఏఐ ఆధారిత కొలువులు సాధిస్తున్న 3 లక్షల మంది.. వారిలోనూ స్కిల్స్ మెరుగుపరుచుకోని 1.20 లక్షల మందికి ఉద్వాసన
- ఇంజినీరింగ్ కాలేజీలు అందిస్తున్న ఎమర్జింగ్ కోర్సుల్లో కానిరాని సరికొత్త మార్పులు
- ఏఐఎంఎల్, డేటా సైన్స్ వంటి కోర్సులు చేసిన వారికీ గగనంగానే ఉద్యోగాలు
- నాస్కామ్–బీసీజీ అధ్యయనంలో వెల్లడి

- వివరాలు 5లో

మన్యంలో మరణ మృదంగం



పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కురుపాం ఆశ్రమ పాఠశాలలో వారం వ్యవధిలోనే ఇద్దరు బాలికల మృతి

- పచ్చకామెర్లు, విష జ్వరాల విజృంభణ
- వంద మందికి పైగా బాలికలకు అనారోగ్యం
- పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌ల్లో చికిత్స
- ఐసీయూలో ముగ్గురు బాలికలు

3లో

మీ పరిపాలన సిగ్గుచేటు

- ఇంత మంది ఉండి గాడిదలు కాస్తున్నారా?
- కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో పచ్చ కామెర్లు సోకి ఇద్దరు బాలికలు మృతి చెందినా పట్టించుకోరా?
- సీఎం, మంత్రులపై జగన్ ఆగ్రహం

3లో

సచివాలయ ఉద్యోగుల 'ఆత్మగౌరవం' భగ్నం

- నెల్లూరులో సచివాలయ ఉద్యోగుల సభను అడ్డుకున్న పోలీసులు
- టౌన్‌హాల్ గేట్‌కు తాళాలు.. రోడ్డుపై బైఠాయించిన ఉద్యోగులు
- ఖాకీల తీరుపై సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆగ్రహం

5లో



నెల్లూరులో ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రేపు చలో విజయవాడ — ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు

దశల వారీ ఉద్యమం — కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్

డిమాండ్లు పరిష్కరించకుంటే **సమ్మె తప్పదు** — విద్యుత్ ఉద్యోగుల హెచ్చరిక

పట్టు వీడని వైద్యులు.. — రెండో రోజు కొనసాగిన రిలే దీక్షలు

5లో

ఇదండీ సంగతి



కలర్ ఫోటోలు అనేసరికి ప్రచారం స్టయిల్ మార్చాడు!



పల్నాడు జిల్లా బొప్పూడిలో వనాలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు. చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

వృక్షాలను రక్షిస్తే.. అవి జీవరాశిని సంరక్షిస్తాయి

11లో

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్

- పల్నాడు జిల్లా బొప్పూడిలో నక్షత్ర, రాశి, పంచవటి, నవగ్రహ వనాలు ప్రారంభం
- మొక్కలు నాటిన హైకోర్టు న్యాయమూర్తులు

నకిలీ మద్యం తాగి ఒకరి మృతి

గుంతకల్లు టౌన్: అనంతపురం జిల్లా గుంతకల్లులోని హనుమాన్ సర్కిల్‌లో ఓ వైన్ షాపు వద్ద మద్యం తాగుతూ బేల్దారి పెద్దన్న (39) అనే వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కర్నూలు జిల్లా మద్దికెర మండలం యడవలి గ్రామానికి చెందిన పెద్దన్న బేల్దారి పని చేస్తుంటాడు. ఆదివారం ఉదయం ఓ వైన్ షాపులో మద్యం కొనుక్కున్నాడు. పక్కనే ఉన్న అనధికార పర్మిట్ రూమ్‌లో బండలపై కూర్చొని కొద్ది కొద్దిగా తాగుతుండగా 15 నిమిషాల్లోనే విపరీతంగా మైకం తలకెక్కి కిందకు ఒరిగిపోయాడు. అతని వెంట వచ్చిన మరో వ్యక్తి కూడా విపరీతమైన మైకంలో తూలుతూ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత కొందరు వెళ్లి చూడగా పెద్దన్న మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు పెద్దన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి చిన్న పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ చెప్పారు. మద్యం తాగిన వ్యక్తి కుప్పకూలిపోయి చనిపోయాడని తోటి మందుబాబులు, స్థానికులు వైన్ షాపు సిబ్బందికి చెప్పినా వారు పట్టించుకోక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం తాగడానికి ఏర్పాటు చేసిన బండలను పగులగొట్టారు. కాగా, అన్నమయ్య జిల్లాలో నకిలీ మద్యం తయారీ రాకెట్ గుట్టు రట్టయిన నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చిన నకిలీ మద్యం తాగినందునే ఇలా జరిగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వైన్‌షాప్ వద్ద పెద్దన్న ఉన్న దృశ్యాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏం స్కెచ్ వేశావ్ బాబూ?



రాత్రికి రాత్రే నకిలీ మద్యం సూత్రధారుల మార్పు
సీఎం చంద్రబాబుపై మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు

2024-25 ఆర్థిక ఏడాది మొదటి ఐదు నెలల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా లిక్కర్ అమ్మకాలు ఉన్నప్పుడు రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం రూ.6,782.21 కోట్లు. ప్రైవేట్ మద్యం షాపులు, ఊరూరా బెల్ట్ షాపులు, ఇతరత్రా విచ్చలవిడి అమ్మకాల నేపథ్యంలో 2025-26 ఆర్థిక ఏడాది మొదటి ఐదు నెలల్లో ఆదాయం రూ.6,992.77 కోట్లు మాత్రమే. అంటే కేవలం 3.10 శాతం వృద్ధి మాత్రమే. ఏటా సహజంగా వచ్చే 10 శాతం పెరుగుదల కూడా రాలేదు. అంటే దీని అర్థం ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని సిండికేట్ల రూపంలో, నకిలీ లిక్కర్ తయారీ రూపంలో మీ ముఠా కొట్టేస్తున్నట్టేగా చంద్రబాబూ?

-మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లాలో నకిలీ మద్యం మాఫియా వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. నకిలీ మద్యం తయారీ కేసులో అసలు సూత్రధారులను కాపాడేందుకు సీఎం చంద్రబాబు స్కెచ్ వేసి, రాత్రికి రాత్రే కేసు మార్చేశారని ఆరోపించారు. టీడీపీ నేతల సొంత ఆదాయాల కోసం ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడటం న్యాయమేనా? అంటూ సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు, ఇప్పుడు నకిలీ లిక్కర్ వ్యవహారంలోనూ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నట్టున్నారంటూ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆదివారం పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

- చంద్రబాబు గారూ.. మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన మీరు, ఇప్పుడు నకిలీ లిక్కర్ వ్యవహారంలోనూ రాష్ట్రాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నట్టున్నారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో మీ పార్టీ నాయకులు ఏకంగా నకిలీ మద్యం తయారీ ఫ్యాక్టరీయే పెట్టి సప్లై చేసిన ఘటన రాష్ట్రంలో మద్యం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్రానికి సంపద పెరగడం సంగతేమోకానీ, లిక్కర్ సిండికేట్లతో, నకిలీ మద్యం తయారీల ద్వారా, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మీ పార్టీ నాయకులు గడించిన అక్రమ సంపాదనను పైనుంచి కింది వరకూ వీరంతా పంచుకుంటున్నారు. వ్యవస్థీకృతంగా ఈ దందా కొనసాగుతోంది.
- మీ లిక్కర్ సిండికేట్లకు, గ్రామ స్థాయి వరకూ విస్తరించిన బెల్టుషాపుల మాఫియాలకు, నకిలీ మద్యం వ్యాపారానికి అడ్డు రాకూడదనే ఉద్దేశంతోనే ఒక వ్యూహం ప్రకారం మీరు ప్రభుత్వ మద్యం దుకాణాలపై విష ప్రచారం చేశారు. ఉద్దేశ పూర్వకంగా వాటిని తీసివేసి, వాటి స్థానంలో మీ సిండికేట్లకు అప్పగించారు. మద్యం దుకాణాలు టీడీపీ వాళ్లవే. బెల్టుషాపులు టీడీపీ వాళ్లవే. ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు టీడీపీ వాళ్లవే. అక్రమ మద్యం తయారీ దారులు కూడా టీడీపీ నేతలే. వాళ్లు తయారు చేస్తారు.. ఆ తయారు చేసిన దాన్ని మీ వాళ్లే, మీ షాపుల ద్వారా, మీ బెల్టుషాపుల ద్వారా అమ్ముతారు. అలా వచ్చిన డబ్బును వాటాలు వేసుకుని పంచుకుంటారు. రాష్ట్రంలో ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యమేనన్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి.
- లిక్కర్ వ్యవహారంలో మీ వ్యవస్థీకృత నేరాల ద్వారా ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడ్డమే కాదు, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన డబ్బును మీరు దోచుకుంటున్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి, విచ్చలవిడిగా మద్యం విక్రయాలను పెంచారు. మార్టులు పెట్టారు. తిరిగి మళ్లీ ఇల్లీగల్ బెల్టుషాపులు తెరిచి ప్రతి వీధిలోనూ పెట్టారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా లిక్కర్ అమ్మడం మొదలు పెట్టారు. ఇంత విచ్చలవిడిగా తాగిస్తున్నా సరే, కాగ్ నివేదికల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఐదు నెలల్లో, అంటే ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే లిక్కర్ అమ్మకాలు ఉన్నప్పుడు రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం రూ.6,782.21 కోట్లు కాగా, 2025–26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఐదు నెలల్లో, విచ్చలవిడిగా లిక్కర్ అమ్మినా సరే ఆదాయం రూ.6,992.77 కోట్లు మాత్రమే వచ్చింది. కేవలం 3.10% వృద్ధి మాత్రమే. ఎక్కడైనా ప్రతి ఏటా సహజంగా వచ్చే 10% పెరుగుదల కూడా రాలేదు. అంటే దీని అర్థం ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని సిండికేట్ల రూపంలో, నకిలీ లిక్కర్ తయారీ రూపంలో మీ ముఠా కొట్టేస్తున్నట్టేగా అర్థం?
- నకిలీ లిక్కర్ వ్యవహారాలు కొన్ని నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా వెలుగు చూస్తున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, గోదావరి జిల్లాల్లోనూ, ఇప్పుడు రాయలసీమలోనూ ఈ ఘటనలు బయటకు వచ్చాయి. కానీ విచారణ, దర్యాప్తు తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. కారణం.. ఈ అక్రమాల వెనుక ఉన్నది మీ బినామీలు అయిన మీ టీడీపీ వాళ్లే. దీన్ని అరికట్టాలన్న చిత్తశుద్ధి ఉండి ఉంటే, ఇవాళ ములకలచెరువు ఘటన తర్వాత సప్లై చేసిన మద్యం షాపుల్లోనూ, బెల్టుషాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు జరిగి, నకిలీ బాటిళ్లను పట్టుకునే వారు. కానీ అలా జరగలేదు.
- పైగా దీనికి కారకులైన వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అన్నమయ్య జిల్లా స్థాయి ముఖ్య నేత, టీడీపీ ఇన్‌ఛార్జి కనుసన్నల్లో ఈ నకిలీ మద్యాన్ని తయారు చేస్తే, వీరిని తప్పిస్తూ తూతూ మంత్రంగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు, టీడీపీ ఇన్‌ఛార్జి అనుచరుడి మద్యం దుకాణం వైపు అధికారులెవ్వరూ కన్నెత్తి చూడలేదు. ఈ నేరాన్నంతటినీ విదేశాల్లో ఉన్న మరో వ్యక్తి పైకి తోసేసే ప్రయత్నం చేస్తున్నారు. అసలు సూత్రధారులను కాపాడేలా స్కెచ్ వేసి, మీరు ఇచ్చిన ఆదేశాల మేరకు మీ కార్యాలయ డైరెక్షన్‌లో రాత్రికి రాత్రే కేసు మార్చేశారు. దీనికి కారణం ఈ దందాకు మీ నుంచి, మీ చెప్పు చేతల్లో ఉన్న వ్యవస్థల నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయి కాబట్టే. మీ సొంత ఆదాయాల కోసం ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడటం న్యాయమేనా?

ఆఫ్రికా టు ఆంధ్రా!

నకిలీ మద్యం ప్లాంట్ వ్యవహారంలో విస్తుపోయే వాస్తవాలు
తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డికి 'కీలక' నేత అండ

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో అంతా తానై చక్రం తిప్పుతున్న ఓ కీలక నేత అండతోనే నకిలీ మద్యం మాఫియా రాష్ట్రంలో రెక్కలు విప్పుకుందని తెలుస్తోంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువు సమీపంలో నకిలీ మద్యం తయారీ రాకెట్ సూత్రధారిగా భావిస్తున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి ఆ 'కీలక' నేతతో ఉన్న సంబంధం వల్లే ఇంత భారీ స్థాయిలో యథేచ్ఛగా ప్లాంట్ స్థాపించినట్లు విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. నిజానికి గత ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డి పేరును ప్రకటించే వరకు ఆయనకు రాజకీయంగా పెద్ద గుర్తింపు లేదు. అయితే అంతకు కొద్ది రోజుల ముందు 'మద్యం' వ్యాపారానికి సంబంధించిన పలు విషయాలను ఈయన 'కీలక' నేతతో చర్చించినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. పార్టీ అధికారంలోకి వస్తే స్థానికంగా మద్యం తయారీతోపాటు గోవాలో ఖాయిలా పడిన మద్యం పరిశ్రమను లీజుకు తీసుకుని వ్యాపారం చేయొచ్చని.. భారీ స్థాయిలో డబ్బు ఆర్జించవచ్చని లెక్కలతో సహా చెప్పడంతోనే టికెట్ ఇచ్చారన్న ప్రచారం ఉంది. అందువల్లే టీడీపీని ఎంతో కాలం నమ్ముకుని ఉన్న, ఆ పార్టీలో గట్టి పట్టున్న నేతగా పేరున్న శంకర్ యాదవ్‌ను కాదని చివరి క్షణంలో జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో పోటీ చేయక ముందు నుంచి సౌత్ ఆఫ్రికాలో జయచంద్రారెడ్డి మద్యం వ్యాపారంలో ఉన్నారని ఆయన వర్గీయులే చెబుతున్నారు. ఆ అనుభవంతో రాష్ట్రంలో 'మద్యం' వ్యాపారం చేసే 'స్కెచ్'ను 'కీలక' నేతకు ఇచ్చినట్లు సమాచారం. మొన్న ములకలచెరువులో బట్టబయలైన నకిలీ ప్లాంట్ తీరుతెన్నులు, ఇన్నాళ్లూ సాగించిన అక్రమ వ్యాపారం తీరు చూస్తుంటే 'కీలక' నేత అండదండలు లేకుండా ఇంత భారీగా దందా నడిపించడం అసాధ్యమని ఎక్సైజ్, పోలీసు వర్గాల్లో సైతం చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం దందా సవ్యంగా సాగేందుకు 'కీలక' నేత ఆదేశాలతో అన్నమయ్య జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్య నేతతో జయచంద్రారెడ్డి సన్నిహితంగా ఉంటూ వస్తున్నారు. ఇదిలా ఉండగా ములకలచెరువు తరహాలో విజయవాడ ప్రాంతంలో ఒకటి, కర్ణాటకలో కూడా మరో నకిలీ మద్యం ప్లాంట్ నడుస్తున్నట్లు సమాచారం. అయితే శనివారం నుంచి వీటిని తాత్కాలికంగా బంద్ చేసినట్లు తెలిసింది.

జనార్దనరావును ముందు పెట్టి దందా

కళ్లకు కనిపిస్తున్న ఆధారాలు, ఈమధ్య కాలంలో జరిగిన పరిణామాలు చూస్తుంటే ఈ కేసులో ఏ–1గా కేసు నమోదైన అద్దేపల్లె జనార్దనరావును ముందు పెట్టి.. జయచంద్రారెడ్డి కథ నడిపించారని స్పష్టమవుతోంది. జయచంద్రారెడ్డిది ములకలచెరువు సొంత మండలం. విజయవాడకు చెందిన జనార్దనరావుతో జయచంద్రారెడ్డికి కాలేజీ రోజుల నుంచే స్నేహం ఉంది. తిరుపతిలో చదువుకుంటున్న రోజుల్లో ఇద్దరి మధ్య ఉన్న స్నేహం జయచంద్రారెడ్డి సొంత మండలంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ప్రారంభించే స్థాయికి వచ్చింది. జయచంద్రారెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరినప్పుడు ఆయన పక్కనే ఉన్నాడు. చంద్రబాబు చేతుల మీదుగా బి–ఫాంను స్వీకరించే సమయంలోనూ జనార్దనరావు పక్కనే ఉన్నాడు. పైగా ఆ సమయంలో జనార్దనరావు చంద్రబాబుతో చాలా సేపు మాట్లాడినట్లు టీడీపీ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో నకిలీ మద్యం రాకెట్‌పై ఆ పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

అధికారమే అండగా..

ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ రాకెట్ నడిపేందుకు ఎక్కడో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంకు చెందిన వ్యక్తికి సాధ్యం అవుతుందా? ఒకవేళ సాధ్యమైనా ఇంతటి ప్రమాదకరమైన నకిలీ మద్యం తయారీకి బలమైన స్థానికుల సహకారం లేకుండా సాహసం చేయగలడా? ఇలాంటి పనికి స్థానికులు భవనాలను లీజుకు ఇస్తారా? జయచంద్రారెడ్డి అధికార టీడీపీ ఇన్‌చార్జి కావడం, 'కీలక' నేత అండతో, అధికార బలంతో, వ్యవస్థలను మేనేజ్ చేయొచ్చని ఇక్కడ నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఒకవేళ జయచంద్రారెడ్డికి సంబంధం లేకుంటే నకిలీ మద్యం వ్యాపారం ఏ ఇబ్బంది లేకుండా సాగడానికి సహకరించినదెవరో అధికారులు ఇప్పటి దాకా ఎందుకు తేల్చలేదు? నకిలీ మద్యం వ్యాపారం నిర్వహించడం కూలీలకో, అధికారం లేని వ్యక్తులకో సాధ్యమా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే జయచంద్రారెడ్డి పీఏ రాజేష్ నకిలీ మద్యం కేసులో ఐదో నిందితుడు కావడం ఆయన పాత్ర ఉందని నిర్ధారిస్తోంది. సాధారణ వ్యక్తి అయిన రాజేష్‌కు మద్యం దుకాణం నిర్వహించే స్థాయి లేదు. పాల వ్యాను కొనుగోలు చేసే ఆర్థిక స్థోమతా లేదు. ఈ లెక్కన కీలక సూత్రధారుల్లో జయచంద్రారెడ్డి కూడా ఒకరని స్పష్టమవుతోంది. అయితే ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని జయచంద్రారెడ్డి మాత్రం ఓ వీడియో విడుదల చేయడం తెలిసిందే.



టీడీపీలో చేరిన రోజు జయచంద్రారెడ్డితో జనార్దనరావు (ఫైల్)

ఆ మంత్రికి భయం పట్టుకుంది

నకిలీ మద్యం తయారీ రాకెట్‌లో టీడీపీ నేతల ప్రమేయం లేదని ఇంత వరకు ప్రభుత్వం కానీ, టీడీపీ వర్గాలు కాని ఖండించలేదు. శుక్రవారం ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రాయలసీమకు చెందిన ఓ మంత్రి ముందుండి పరిస్థితిని చక్కబెడుతున్నారని సమాచారం. టీడీపీ నేతల ప్రమేయం బయటకు వస్తే దాని ప్రభావం తనపై పడుతుందన్న భయంతో ఆ మంత్రి మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఆ మంత్రి 2సార్లు ములకలచెరువులో జయచంద్రారెడ్డి ఇంటికి అనధికారికంగా వచ్చారని స్థానిక టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు.

'నకిలీ' దందా డైరీలో నిక్షిప్తం

నకిలీ మద్యం ప్లాంట్ నుంచి బెల్ట్ షాపులకు నకిలీ మద్యం సరఫరా
బెల్ట్ షాపుల వివరాలతో కూడిన డైరీ లభ్యం

సాక్షి, రాయచోటి/ ములకలచెరువు/పెద్దతిప్ప సముద్రం/ఇబ్రహీంపట్నం (మైలవరం): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బట్టబయలైన నకిలీ మద్యం తయారీ ప్లాంట్ వ్యవహారంలో మరి కొన్ని కీలక వివరాలు లభ్యమయ్యాయి. అక్కడ దొరికిన డైరీ (చిన్న పుస్తకం)లో నకిలీ మద్యం తయారీ కేంద్రం నుంచి వివిధ ప్రాంతాల్లోని బెల్ట్ షాపులకు సరఫరా అయిన వివరాలు రాసి ఉండటం చర్చనీయాంశమైంది. అయితే ఆయా బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు తొందరపాటుతో చర్యలకు ఉపక్రమించొద్దని పెద్దల నుంచి ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. దీంతో తూతూ మంత్రంగా ఒకటి రెండు షాపులపై దాడులు చేసి మమ అనిపించేలా 'షో' చేస్తున్నారు. కాగా, పాల వ్యాన్ తరహాలో ఉన్న ఆటోలో నకిలీ మద్యం సరఫరా అయ్యేది. ఈ విషయమై రెండు రోజులుగా ప్రజల్లో భారీగా చర్చ జరగడంతో రాజేష్‌కు చెందిన ఈ వ్యాన్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పెద్దతిప్పసముద్రం మండల టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడు ఇంటిలో, ఆయన నిర్వహిస్తున్న ఆంధ్రా వైన్స్‌లో నకిలీ మద్యం గుర్తించగా ఆయన్ను ఇప్పటికే అరెస్ట్ చేయడం తెలిసిందే. టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ టి.రాజేష్ పరారీలో ఉన్నట్టు చెబుతూ ఆయన దుకాణం జోలికి వెళ్లక పోవడంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆదివారం సాయంత్రం రాజేష్ నిర్వహిస్తున్న 'రాక్ స్టార్' మద్యం దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూధనరావు మీడియాకు వెల్లడించారు. ఈ షాపులో ఎంత నకిలీ మద్యం నిల్వ ఉందనే వివరాలను మాత్రం వెల్లడించ లేదు.



ఉప్పరవాండ్లపల్లెలో పట్టుబడిన నకిలీ చీప్ లిక్కర్

జనార్దనరావు, రాజు ఇళ్లల్లో తనిఖీలు

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నకిలీ మద్యం తయారీ కేసులో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ఇద్దరు వ్యక్తుల ఇళ్లు, పచారీ దుకాణం, బార్‌లో శనివారం సోదాలు చేపట్టిన విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికంగా పచారీ దుకాణం, బార్ నిర్వహిస్తున్న జనార్దనరావు, అతని పచారీ దుకాణంలో పనిచేసే కట్టా రాజు ఇళ్లను తనిఖీ చేశారు. వ్యాపార వేత్తగా ఉన్న జనార్దనరావు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండనప్పటికీ పలువురు టీడీపీ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. జనార్దనరావు ప్రస్తుతం విదేశాల్లో ఉండగా, కట్టా రాజు పరారీలో ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా, జనార్దనరావు బార్‌లో ఇన్నాళ్లూ మద్యం తాగిన వారంతా బెంబేలెత్తిపోతున్నారు.

దానిమ్మ తోటలో నకిలీ లిక్కర్ బాక్సులు

పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల పంచాయతీ పరిధిలోని ఉప్పరవాండ్లపల్లిలో వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన దానిమ్మ తోటలో మూడు బాక్సుల్లో బీర్లు, నకిలీ మద్యం పట్టుబడింది. ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందుకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో కలసి ఆ ప్రాంతానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన బీరు బాటిళ్ల హోలోగ్రామ్ లేబుల్ స్కాన్ కాకపోవడంతో బీర్లు కూడా నకిలీవని తేలింది. ఈ మేరకు సీఐ అనుమానం వ్యక్తం చేస్తూ విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు వివరించినట్లు సమాచారం. పట్టుబడిన మద్యం బాక్సులను కట్టా సురేంద్ర నాయుడు ఇటీవల బాబు అనే వ్యక్తి ద్వారా ఇక్కడకు పంపినట్లు రైతు వెంకటరెడ్డి పోలీసులకు తెలిపాడు. బాబు అనే వ్యక్తి మండలంలోని టి.సదుం పంచాయతీ పరిధిలోని చెన్నరాయునిపల్లికి చెందినవాడు. కట్టా సురేంద్ర నాయుడుకు నమ్మిన బంటు. కల్తీ మద్యం బాక్సులను బెల్ట్ షాపులకు తరలించేవాడని తెలుస్తోంది. దానిమ్మ తోటలో పట్టుబడిన నకిలీ మద్యం వ్యవహారంలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న పాల వ్యాను తరహా వాహనం

నకిలీ మద్యంపై సీఎం సరికొత్త డ్రామా

సాక్షి, అమరావతి : అన్నమయ్య జిల్లాలో బయట పడిన నకిలీ మద్యం రాకెట్‌లో టీడీపీ కీలక నేతల ప్రమేయం బట్టబయలు కావడంతో సీఎం చంద్రబాబు సరికొత్త డ్రామాకు తెర లేపారు. ఈ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించి, పార్టీకి సంబంధం లేని వారిని బాధ్యులను చేయాలని చూసినా.. అది బెడిసి కొట్టింది. దీంతో టీడీపీ తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ నేత కట్టా సురేంద్ర నాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తద్వారా ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని, కింది స్థాయిలో ఏదో జరిగిందని ప్రజల దృష్టి మళ్లించేలా కొత్త కుతంత్రం రచించారు. 'కల్తీ మద్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చంద్రబాబు ఆదేశాల మేరకు వారిద్దరిని సస్పెండ్ చేస్తున్నాం' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. భారీ యంత్రాలతో వివిధ బ్రాండ్లను పోలిన నకిలీ మద్యాన్ని ఈ యూనిట్లో తయారు చేస్తూ 'కీలక' నేత అండతో వారు ఉమ్మడి చిత్తూరు, అనంతపురం తదితర జిల్లాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఈ రాకెట్ బయట పడటంతో అమరావతి పెద్దలు తమకేమీ సంబంధం లేనట్లు.. స్థానిక నాయకులే కారణమంటూ డ్రామాలకు పూనుకోవడంపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

నకిలీ మద్యం సూత్రధారులు కూటమి నేతలే

మాజీ మంత్రి శైలజానాథ్



అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో దుష్టపాలన సాగుతోంది. తంబళ్లపల్లిలో వెలుగు చూసిన నకిలీ మద్యం సూత్రధారులు కూటమి నేతలే. ఈ దందా వెనుక ఇంకా ఎవరెవరున్నారో మీరే చెప్పాలి చంద్రబాబూ' అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి లిక్కర్ షాపులో ఉన్న మద్యం నిల్వలను తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం శైలజానాథ్ అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఏ స్కాంలకూ ఆస్కారం లేకుండా ప్రభుత్వమే మద్యం షాపులను నడిపిందని, కానీ అప్పట్లో ఏదో జరిగిపోయినట్టు చంద్రబాబు రాద్ధాంతం చేశారని మండిపడ్డారు. ఇప్పుడు లిక్కర్ షాపులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడంతోపాటు నకిలీ మద్యాన్ని ఏరులైపారిస్తున్నారని ధ్వజమెత్తారు.

నకిలీ మద్యం కేసులో దోషులను గుర్తించాలి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



ప్రొద్దుటూరు: అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించి పాత్రధారులు, సూత్రధారులను గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నరలో రూ.1,500 కోట్ల వరకు నకిలీ మద్యం విక్రయాలు జరిగాయన్నారు. "నకిలీ మద్యం కర్మాగారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై విచారణ జరిపి దీనికి ఎవరు పెట్టుబడులు పెట్టారు? తిరిగి మద్యం అమ్మకాల తర్వాత ఏ అకౌంట్లకు డబ్బు జమ అయ్యింది? అన్న అంశాలను వెలికి తీయాలి. నకిలీ మద్యం తయారీకి సంబంధించి ముడి సరుకు ఎక్కడెక్కడి నుంచి దిగుమతి చేశారో వివరాలను బయట పెట్టాలి' అని అన్నారు.

నకిలీ మద్యం సూత్రధారులు ప్రభుత్వ పెద్దలే

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత దందానే
- సీఎం చంద్రబాబు దీనికి సమాధానం చెప్పాలి



సాక్షి, అమరావతి : అన్నమయ్య జిల్లా ములకలచెరువు వద్ద భారీగా పట్టుబడ్డ నకిలీ మద్యం తయారీ వెనుక ఉన్నది ముమ్మాటికీ ప్రభుత్వ పెద్దలేనని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత దందానేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక టీడీపీ నేత సురేంద్రనాయుడు పాత్రధారి మాత్రమేనని, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలని.. సీఎం చంద్రబాబు ఈ దందాకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

నాణ్యమైన మద్యం అంటే ఇదేనా!?..

ప్రభుత్వ పెద్దల అండదండలు లేకుండా హైవే పక్కనే ఓ పరిశ్రమను తలపించేలా నకలి మద్యాన్ని ఎలా తయారు చేయగలరు? ఈ ప్రభుత్వ పెద్దలు గత ఎన్నికల్లో చేసిన వాగ్దానాలేంటి? అధికారంలోకి వచ్చాక చేస్తున్న దుర్మార్గాలేంటి? నాణ్యమైన మద్యం అంటే ఇదేనా!? ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్‌తో రోజుకు 30 వేల క్వార్టర్ బాటిళ్లు తయారుచేసి, మద్యం షాపులకు, బెల్టు షాపులకు పంపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పైగా.. వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహిస్తే.. పెద్దఎత్తున లిక్కర్ స్కాం జరుగుతోందని కూటమి పార్టీలు, ఎల్లో మీడియా సంస్థలు దుష్ప్రచారం చేశాయి. మరి ఇవాళ ములకలచెరువులో భారీగా బయటపడ్డ నకిలీ మద్యం గురించి టీడీపీ కూటమి ప్రభుత్వం, ఈ ఎల్లో మీడియా ఏం సమాధానం చెబుతాయి? అప్పుడు మద్యం తాగినవాళ్లందరికీ లివర్లు, కిడ్నీలు పాడైపోయాయని అన్నారుగా.. ఇప్పుడు పాడవవా? ఇక నిన్న అరెస్టైన సురేంద్రనాయుడు ఏ నాయకుడికి ముడుపులిస్తే ఈ దందా జరుగుతుందో సమాధానం చెప్పాలి.

ములకలచెరువులోనే ఐదేళ్లలో రూ.500 కోట్ల దందా..

ఇదిలా ఉంటే.. ఈ నకిలీ మద్యంతో కూడిన క్వార్టర్ బాటిల్ తయారీకి రూ.8 లేదా రూ.9 ఖర్చవుతుంది. అదే బాటిల్‌ను బెల్టుషాపుల వారికి రూ.110కి అమ్మితే వాళ్లు రూ.130కి అమ్ముతున్నారు. అంటే ఒక్కో బాటిల్ మీద రూ.100 ఆదాయం వస్తోంది. ఒక్క ములకలచెరువులో ఒక రోజులో 30 వేల బాటిళ్ల నకిలీ మద్యం తయారవుతుండగా రూ.30 లక్షల అక్రమార్జన జరుగుతోంది. ఇలా ఏడాదికి రూ.100 కోట్లు, ఐదేళ్లలో రూ.500 కోట్లు దండుకుంటున్నారు. ఇలా రాష్ట్రంలో ఇంకెన్ని చోట్ల నకిలీ మద్యం తయారుచేస్తున్నారో ప్రజలకు తెలియాలి.

మీ పరిపాలన సిగ్గుచేటు

ఇంత మంది ఉండి గాడిదలు కాస్తున్నారా?

- గిరిజన బాలికలు, పేద పిల్లలు అంటే అంత చులకనా?
- సీఎం చంద్రబాబు, మంత్రులపై వైఎస్ జగన్ ఆగ్రహం
- కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లు సోకి ఇద్దరు బాలికలు మృతి చెందినా పట్టించుకోరా?
- ఆర్వో ప్లాంట్ చెడిపోయి మరెంతో మంది అనారోగ్యం పాలైనా స్పందించరా?
- 611 మంది చదువుతున్న స్కూలుపై ఇదేనా మీ శ్రద్ధ?
- ఏడాదిలో ఒక్క పార్వతీపురం మన్యం జిల్లాలోనే 11 మంది విద్యార్థులు మృతి చెందితే మీరు కళ్లు మూసుకోవడం వాస్తవం కాదా?
- ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే.. ఇప్పటికైనా కళ్లు తెరవండి
- పిల్లల ఆరోగ్యం పట్ల, బడుల్లో వసతుల పట్ల శ్రద్ధ పెట్టండి
- మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించండి

సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంటు పాడవ్వడంతో కలుషిత నీరు తాగి పచ్చ కామెర్లు సోకి నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలు మృతి చెందడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరెంతో మంది తీవ్ర అనారోగ్యం పాలవ్వడం తనను కలచి వేస్తోందన్నారు. 611 మంది చదువుతున్న పాఠశాలలో ఇంత జరుగుతున్నా అసలు పట్టించుకోరా.. మీరు, ఇంత మంది మంత్రులు ఉండి గాడిదలు కాస్తున్నారా? అంటూ సీఎం చంద్రబాబుపై మండిపడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి పిల్లల ఆరోగ్యం పట్ల, బడుల్లో వసతుల పట్ల శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

➡ చంద్రబాబు గారూ.. పాలనలో మీ నిర్లక్ష్యం, మీ అలసత్వం కారణంగా ఇవాళ పేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా మీకు కనికరం లేదు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంటు పాడవ్వడంతో కలుషిత నీరు తాగడం మూలాన, పచ్చ కామెర్లు సోకి నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. మరెంతో మంది తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మీ పరిపాలనకు ఇది సిగ్గుచేటు వ్యవహారం కాదా? 611 మంది చదువుతున్న స్కూల్లో ఇంత జరుగుతున్నా అసలు పట్టించుకోరా? ఒక ప్రభుత్వం స్పందించాల్సిన తీరు ఇదేనా? ముఖ్యమంత్రిగా మీరు, ఇంత మంది మంత్రులు ఉండి గాడిదలు కాస్తున్నారా? గిరిజన బాలికలు, పేద పిల్లలు అంటే అంత చులకనా? ఒక్క పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఒక్క ఏడాదిలో 11 మంది విద్యార్థులు అనారోగ్యంతో మరణించినా మీరు కళ్లు మూసుకున్న మాట వాస్తవం కాదా? ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే చంద్రబాబు గారూ.

➡ పేదల తల రాతను మార్చేది చదువేనని మేం నమ్మి, అమ్మ ఒడి సహా ఎన్నో సంస్కరణలు తెస్తూ నాడు–నేడు పనుల ద్వారా ఆ స్కూళ్లను దేవాలయాలుగా మార్చాం. కరెంటు, లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, డిజిటల్ ప్యానెళ్లు, తాగు నీరు, మరుగు దొడ్లు సహా 11 రకాల మౌలిక సదుపాయాలను కల్పించాం. పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా రక్షిత తాగు నీటి కోసం ఆర్వో ప్లాంట్లు పెట్టాం. మా ప్రభుత్వ హయాంలో నిరంతర సమీక్ష, పర్యవేక్షణ ద్వారా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నాం. మీరు అధికారంలోకి వచ్చాక, మీ సుపుత్రుడు విద్యా శాఖను చేపట్టిన తర్వాత, ప్రైవేటు వ్యక్తుల లాభాల కోసం వారితో చేతులు కలిపి.. క్రమంగా ప్రభుత్వ విద్యా సంస్థలను నాశనం చేసుకుంటూ వచ్చారు. మా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన మంచి పేరు ప్రతిష్టలను దెబ్బ తీశారు. ఇంగ్లిష్ మీడియంను, సీబీఎస్ఈ నుంచి ఐబీదాకా ప్రయాణాన్ని, టోఫెల్ క్లాసులు, స్కూలు పిల్లలకు ట్యాబులు, సబ్జెక్ట్ టీచర్స్ కాన్సెప్టును, రోజుకో మెనూతో పెట్టే మధ్యాహ్న భోజనం గోరుముద్ద.. వీటన్నింటినీ నాశనం చేశారు. మీ దుర్మార్గాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు తగ్గిపోయారు.

➡ ఆర్వో ప్లాంట్లు రిపేరు వస్తే వాటిని పట్టించుకునే నాథుడే లేడు. హాస్టళ్లలో విషాహారం కారణంగా మరణాలు సంభవించడమో, ఆస్పత్రుల పాలవ్వడమో పరిపాటిగా మారింది. ఇలాంటి మీ నిర్లక్ష్యమే ఇవాళ కురుపాం గురుకుల పాఠశాలలో గిరిజన బాలికల ఉసురు తీసింది. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆ కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి. ఇప్పటికైనా కళ్లు తెరిచి.. వెంటనే పిల్లల ఆరోగ్యం పట్ల, బడుల్లో వసతుల పట్ల శ్రద్ధ పెట్టాలి. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తున్నాను. ఎందుకంటే ఇది ప్రభుత్వం చేసిన తప్పిదం కాబట్టి.

మన్యంలో మరణ మృదంగం

విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల బాలికలు



కురుపాం ఆశ్రమ పాఠశాలలో వారం వ్యవధిలోనే ఇద్దరు బాలికల మృతి

వందమందికిపైగా విద్యార్థులకు కామెర్లు, జ్వరాలు

సాక్షి, పార్వతీపురం మన్యం/కురుపాం: విద్యార్థుల మరణ మృదంగంతో మన్యం విలవిల్లాడుతోంది. పచ్చకామెర్లు, విష జ్వరాలు పార్వతీపురం మన్యం జిల్లాను కలవరపెడుతున్నాయి. గిరిజన బాలలను కబళిస్తున్నాయి. వారం వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మరణించడం కలకలం రేపుతోంది. వంద మందికిపైగా విద్యార్థులు కామెర్లు, జ్వరాలతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌ల్లో చికిత్స పొందుతున్నారు. వీరంతా కురుపాం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాల విద్యార్థులే కావడం గమనార్హం. జిల్లాలోని సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో అపరిశుభ్రత, కలుషిత ఆహారం–నీరు, వైద్యసదుపాయాల లేమి, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జ్వరాలు, పచ్చకామెర్లు ప్రబలాయనే వాదన బలంగా వినిపిస్తోంది. గత జులై నుంచి ప్రస్తుత అక్టోబరు వరకు జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుతున్న 11 మంది విద్యార్థులు వివిధ అనారోగ్య కారణాలతో మరణించడం గమనార్హం.

తాగునీటి కలుషితం వల్లేనా?

కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో 934 మంది విద్యార్థులు ఉండగా, నాలుగైదు రోజుల్లోనే 120 మంది విద్యార్థులకు పచ్చకామెర్లు, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చాయి. తాగునీటి కలుషితం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా మందిలో పచ్చకామెర్ల లక్షణాలు బయటపడటంతో శనివారం పాఠశాలల్లో రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో 79 మంది ఉన్నారు. విశాఖ కేజీహెచ్‌లో ముగ్గురు ఐసీయూలోనూ, 34 మంది జనరల్ వార్డులోనూ చికిత్స పొందుతున్నారు. మిగిలిన నలుగురు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కామెర్ల బారిన పడిన విద్యార్థినుల్లో గుమ్మలక్ష్మీపురం మండలం కంబగూడకు చెందిన పువ్వల అంజలి గత నెల 26న, కురుపాం మండలం దండసూర గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని తోయక కల్పన ఈ నెల 1న మృతి చెందారు. వారంలోనే ఇద్దరు మృతి చెందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హడావిడిగా రక్త పరీక్షలు జరిపి, మిగిలిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. పచ్చకామెర్ల బాధితుల్లో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి నాలుగు రోజుల క్రితం పాఠశాలను సందర్శించి, ఆర్వో ప్లాంట్ సమస్యపై అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు హడావిడిగా కొత్త ప్లాంట్‌ని ఏర్పాటు చేశారు.



మరణించిన చిన్నారులు అంజలి, కల్పన(ఫైల్)

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మన్యం జిల్లాలో గిరిజన పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నా.. ప్రభుత్వంలో చలనం రావడం లేదు. గత ఏడాది జులై నుంచి ఇప్పటి వరకు 11 మంది ఆశ్రమ, సంక్షేమ పాఠశాలల విద్యార్థులు వివిధ కారణాలతో మృతి చెందారు. వీరంతా అనారోగ్యానికి గురి కావడం.. సకాలంలో సరైన వైద్యం అందకపోవడం వంటి కారణాలతోనే ప్రాణాలు వదిలారు. తాము అధికారంలోకి వస్తే ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం చేపడతామని చెప్పిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇప్పటివరకు అమలుకునోచుకోలేదు. ఆమె సొంత జిల్లాలోనే గిరిజన విద్యార్థులు విషజ్వరాలు, పచ్చకామెర్ల బారిన పడినా ఇప్పటివరకు పట్టించుకోలేదు. తీవ్ర విమర్శల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం హడావుడిగా మేల్కొన్న ఆమె విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కూడా ఇప్పటి వరకు విద్యార్థుల పరిస్థితిపై స్పందించకపోవడం విచారకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జిల్లాలోని రెండు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)లకు రెగ్యులర్ పీవోలు లేరు. పార్వతీపురం ఐటీడీఏ డీడీ కూడా ఇన్‌చార్జే కావడంతో ఆశ్రమ పాఠశాలలు అధ్వానంగా మారాయని విమర్శిస్తున్నారు.

భయం వేస్తోంది..



గురుకుల పాఠశాలకు పిల్లలను పంపాలంటేనే భయం వేస్తోంది. నా ఇద్దరు కుమార్తెలు గురుకులంలో ఒకరు పదో తరగతి, ఇంకొకరు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. రక్త పరీక్షలు చేసేందుకు తీసుకొచ్చాను. ఇప్పటికే ఇక్కడ ఇద్దరు చనిపోవడంతో భయంగా ఉంది.
– బిడ్డిక నాగరాజు, సంగెద్ద గ్రామం, కురుపాం మండలం, విద్యార్థిని తండ్రి

సౌకర్యాలు లేవు



ఉన్నత చదువుల కోసం చేర్పిస్తే.. విగతజీవిగా ఇంటికి వస్తున్నారు. పాఠశాలలో వందల మంది పిల్లలకు వసతులు, మరుగుదొడ్లు సరిగా లేవు. కలుషిత నీరో, లేక కలుషిత ఆహారమో తెలియదు. పచ్చకామెర్ల బారిన పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువైంది.
– మండంగి కృష్ణ, లాబేసు గ్రామం, కొమరాడ మండలం, విద్యార్థిని తండ్రి

విద్యార్థులందరికీ రక్త పరీక్షలు



విద్యార్థులందరికీ రక్తపరీక్షలు నిర్వహించాం. నివేదికలు ఇంకా రాలేదు. జ్వరాలు, పచ్చకామెర్ల అనుమానిత లక్షణాలు ఉంటే మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తున్నాం. ముందు జాగ్రత్తగా కురుపాం మండలంలోని శివన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఈనెల 6వ తేదీ నుంచి వారం రోజుల పాటు సెలవులను ప్రకటించాం.
– డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి, కలెక్టర్, పార్వతీపురం మన్యం

సమగ్ర విచారణ జరిపిస్తున్నాం..



బాధిత విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధుల విజృంభణపై విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించాం. వారు సమగ్ర విచారణ జరిపి, నివేదికలు సమర్పిస్తే తదుపరి చర్యలు తీసుకుంటాం.
– ఎం.గౌతమి, గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి

సర్కారు నిర్లక్ష్యం వల్లే గిరిజన బాలికలకు అస్వస్థత

- ఇద్దరు బాలికల మరణం బాధాకరం
- ఆ చిన్నారుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలి
- వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పశ్రీవాణి, రాజన్నదొర, తనూజారాణి, మజ్జి శ్రీను ధ్వజం

మహారాణిపేట(విశాఖపట్నం): కురుపాం గిరిజన బాలికల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం, ఇద్దరు బాలికలు చనిపోవడానికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, దీనికి సర్కారే బాధ్యత వహించాలని వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఉప ముఖ్యమంత్రులు పాముల పుష్పశ్రీ వాణి, పి.రాజన్నదొర ధ్వజమెత్తారు. ఆదివారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గిరిజన బాలికలను పుష్పశ్రీవాణి, రాజన్నదొర, అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు తదితరులు పరామర్శించారు. అనంతరం కేజీహెచ్ వైద్యులతో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పశ్రీ వాణి మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలల నిర్వహణను కూటమి సర్కారు గాలికొదిలేసిందని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అసమర్థురాలని ధ్వజమెత్తారు. పాఠశాల హాస్టల్లో కలుషిత నీరు తాగి పచ్చ కామెర్ల బారిన పడి అంజలి, కల్పన అనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందారని, సుమారు 120 మంది ఆస్పత్రి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన చిన్నారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అంజలి మృతికి నాటు వైద్యం కారణమని సర్కారు సాకులు వెతుకుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఒక్క గురుకుల పాఠశాలకు కూడా ఈ సర్కారు దోమతెరలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఆదివారం తీరుబడిగా స్పందించిన మంత్రి సంధ్యారాణి పాఠశాలల్లో నీరు బాగానే ఉందని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. ఇద్దరు చిన్నారులు కలుషిత నీరు వల్లే చనిపోయారని, కల్పన సికిల్ సెల్ అనీమియాతో చనిపోయిందని మంత్రి ప్రకటించడం పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. ఎంపీ డాక్టర్ తనూజా రాణి మాట్లాడుతూ కూటమి సర్కారు ఆశ్రమ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడం లేదని మండిపడ్డారు. కలుషిత నీరే ఇద్దరు చిన్నారులను బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతమంది పిల్లలు పచ్చకామెర్ల బారిన పడుతుంటే కూటమి సర్కారు చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు.



కేజీహెచ్‌లో బాలికలను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పశ్రీ వాణి, రాజన్న దొర, తనూజా రాణి, మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్ రాజు

వైద్యానికి డబ్బులు లేవని ఐటీడీఏ పీఓ చెప్పడం దారుణం

మాజీ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర మాట్లాడుతూ గిరిజన పిల్లల వైద్యం కోసం డబ్బులు లేవని ఐటీడీఏ పీఓ చెప్పడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. పేద చిన్నారులకు వైద్యం చేయించలేని మంత్రి, సర్కారు పెద్దలు పదవుల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి సర్కారు నిర్లక్ష్యం వల్లే ఇంతమంది పిల్లలు ఆస్పత్రుల పాలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చకామెర్లు చిన్న వ్యాధి అని కూటమి ప్రతినిధులు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను, వారి వెంట ఉన్న తల్లిదండ్రులను పట్టించుకునే నాథుడు లేడని, పర్యవేక్షణకు ఒక్క అధికారినీ నియమించలేదని విమర్శించారు.

కురుపాం, అనంతపురం ఘటనలపై నివేదిక ఇవ్వండి

సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కురుపాం, అనంతపురంలో జరిగిన ఘటనలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కురుపాంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన గురించి మంత్రి సంధ్యారాణితో చంద్రబాబు మాట్లాడారు. అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్తున్నట్లు మంత్రి సంధ్యారాణి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే అనంతపురంలోని శిశు సంరక్షణ కేంద్రంలో పసిబిడ్డ మృతిపై సీఎం ఆరా తీశారు.

తురకపాలెంలో మరో మహిళ మృతి

- 'మెలియాయిడోసిస్' వల్లే ఆమె మృతిచెందినట్లు వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యుల వెల్లడి

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా తురకపాలెంలో మరో మహిళ జ్వరం, శరీరంపై బొబ్బలు వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందింది. మెలియాయిడోసిస్ వ్యాధి వల్లే ఆమె మరణించినట్లు వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో గ్రామంలో మళ్లీ అలజడి మొదలైంది. ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు... తురకపాలెం గ్రామానికి చెందిన చల్లా దుర్గారావు, కృష్ణవేణి (24) దంపతులు క్వారీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఒక కుమారుడు సంజు(4) ఉన్నాడు. కృష్ణవేణికి వారం రోజుల కిందట జ్వరం వచ్చింది. స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందినా జ్వరం తగ్గకపోవటంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం జ్వరం ఎక్కువ కావడంతో విజయవాడ నుంచి మంగళగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని గమనించిన వైద్యులు.. తురకపాలెంలో మరణాల గురించి తెలుసుకుని గుంటూరు ప్రభుత్వాస్పత్రికి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కృష్ణవేణి మరణించింది. ఆమె శరీరంపై అక్కడక్కడా బొబ్బలు కూడా ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మెలియాయిడోసిస్ అనే వ్యాధి కారణంగానే కృష్ణవేణి మరణించినట్లువైద్యులు చెప్పారని వారు పేర్కొన్నారు. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణవేణి మృతిచెందిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తురకపాలెంలో మెలియాయిడోసిస్ అనే అరుదైన వ్యాధి ప్రబలిందని ఆరు నెలల కిందటే గుర్తించినా, 45మంది మృత్యువాత పడినా ప్రభుత్వం ఎటువంటి ప్రత్యామ్నాయం చూపలేదని మండిపడుతున్నారు.



మన తప్పులను గుర్తెరగకుండా,
ఇతరుల తప్పులపై దృష్టి పెట్టటం తగని పని.
– ‘పద్మభూషణ్’ హుస్సేన్ అహ్మద్ మదానీ

సాక్షి
సోమవారం, 6 అక్టోబర్ 2025

తవ్వుకుంటే తట్టెడు

తవ్వకం ఒక పురాతన ప్రక్రియ. నాగరికతలు మొదలైన నాటి నుంచే తవ్వకం ప్రక్రియ మనుషులకు తెలుసు. రకరకాల ప్రయోజనాల కోసం మనుషులు నేలను తవ్వుతారు. వ్యవసాయ అవసరాల కోసం; రక్షణ అవసరాల కోసం; విలువైన ఖనిజాల వెలికితీత కోసం – మనుషులకు తవ్వకం అలవాటైన పనే! చనిపోయిన మనుషుల మృతదేహాలను, జంతువుల మృతకళేబరాలను పాతిపెట్టడానికి కూడా నేలను తవ్వడం పురాతన కాలం నుంచి వస్తున్న అలవాటే!

ఆధునిక కాలంలో తవ్వకాల తీరుతెన్నులు మారాయి. అమూల్య ఖనిజాల కోసమే కాదు, చారిత్రక అవశేషాల కోసం కూడా తవ్వకాలు జరపడం మొదలైంది. తవ్వకాల కారణంగానే అనేక చారిత్రక విశేషాలు బయటపడటం; ఒకప్పుడు భూమ్మీద జీవించి అంతరించిపోయిన జీవుల శిలాజాలు బయటపడటం మనకు తెలుసు. చారిత్రక, మానవ పరిణామ అవశేషాల కోసం శాస్త్రవేత్తలు తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు.

ఒక్కోచోట తవ్వుతుంటే లంకెబిందెల వంటి నిధినిక్షేపాలు బయటపడుతుంటాయి. మరొక్కోచోట తవ్వుతుంటే పురాతన కంకాళాలు బయటపడుతుంటాయి. ఏవి బయటపడినా, వాటితో పాటు చరిత్ర కూడా బయటపడుతుంటుంది. ఘనమైన కట్టడాలను నిర్మించాలంటే, పునాదుల కోసం నేలను తవ్వాలి. మృతులను పూడ్చిపెట్టాలంటే, సమాధుల కోసం తవ్వాలి. కొందరు పాలకులు సమాధులను అద్భుత నిర్మాణాలుగా తీర్చిదిద్దిన ఉదంతాలు చరిత్రలో కోకొల్లలు. అలాంటి వాటిలో ప్రపంచ వింతల్లో ఒకటిగా చెప్పుకొనే తాజ్‌మహల్ ఒకటి. అంతకంటే ముందు ఈజిప్టు సహా పలుచోట్ల సమాధుల మీద పిరమిడ్లు నిర్మించారు.

పంటపొలాలకు నీరు పారించడం కోసం కాలువలు తవ్వుతారు. జలసమృద్ధి కోసం బావులు, చెరువులు నిర్మించడానికి కూడా నేలను తవ్వుతారు. రాతికోటలకు రక్షణ కల్పించడానికి చుట్టూ అగడ్తలను తవ్వుతారు. చరిత్రలో పేరు నిలిచిపోవాలనే కోరికతో కొందరు, మరణానంతరం పరలోకంలో అక్కరకొచ్చే పుణ్యాన్ని సంపాదించుకోవాలనే ఆశతో మరికొందరు రాజులు తమ తమ రాజ్యాలలో వాపీ కూప తటాకాదులను శక్తివంచన లేకుండా తవ్వించేవారు.

సాధారణంగా నీటి అవసరాలు, రక్షణ అవసరాల కోసం మినహాయిస్తే; ఎక్కడైనా గోతులను తవ్వాక, పనులు పూర్తయిన వెంటనే వాటిని పూడ్చిపెడతారు. మన దేశంలోని పలు నగరాల్లో నగరపాలక సంస్థలు రకరకాల పనుల కోసం గోతులు తవ్వి, పనులు పూర్తయ్యాక వాటిని పూడ్చిపెట్టడం మరచిపోతుంటారు. ‘ఎవరు తవ్విన గోతిలో వారే పడతారు’ అనే సామెత ఉంది. కానీ, మన నగరపాలక సంస్థలు తవ్విపెట్టిన గోతుల్లో తరచుగా సామాన్య జనాలే పడుతుంటారు. కాబట్టి ఎవరు తవ్విన గోతిలో వారే పడతారు అనుకోవడాన్ని కేవలం ఒక అపోహగానే భావించాలి. అయితే, రాజకీయాల్లో మాత్రం గోతి కాడ నక్కల్లా మసలుకొనేవారే రాణిస్తుంటారు.

చారిత్రక, శాస్త్ర పరిశోధనల్లోనే కాదు; గోతులకు, సమాధులకు భాషా సాహిత్యాల్లోనూ ప్రాధాన్యం ఉంది. ‘అర్ధంతరంగా విప్లవాన్ని ముగించిన వాడు తన గోతిని తానే తవ్వుకున్నవాడు అవుతాడు’ అని జర్మన్ రచయిత జార్జ్ బుక్నర్ అన్నాడు. తన గోతిని తానే తవ్వుకోవడం కంటే అవివేకం మరొకటి ఉండదు. ‘గత వైభవ మార్గాలన్నీ సమాధుల వైపే దారితీస్తాయి’ అన్నాడు ఇంగ్లిష్ కవి థామస్ గ్రే. సమాధులను తవ్వేటప్పుడే గత వైభవానికి చెందిన ఆనవాళ్లు బయటపడిన సందర్భాలు కోకొల్లలు.

మానవ నాగరికత ప్రస్థానంలో ఇంతటి ప్రాశస్త్యమున్న గోతులు తవ్వే విద్యలో పోటీలు లేకపోవడాన్ని లోటుగా భావించిన హంగేరియన్లు– ఆ లోటు తీర్చడానికి సమాధుల కోసం గోతులు తవ్వే పోటీని ప్రారంభించారు. అలాగని ఇదేదో స్థానిక పోటీ కాదు, అంతర్జాతీయ పోటీ. హంగరీ శ్మశాన వాటికల నిర్వహణ సంఘం ఎనిమిదేళ్లుగా పోటీ నిర్వహిస్తూ వస్తోంది. ‘కరోనా’ కాలంలో రెండేళ్లు ఈ పోటీకి అవరోధం ఏర్పడినా, ఈ ఏడాది ఇటీవల జరిగిన పోటీల్లో లాజ్లో కిస్, రాబర్ట్ నేగీ అనే వారు శరవేగంగా నిర్ణీత కాలవ్యవధిలో సమాధి గోతిని తవ్వి విజేతలుగా నిలిచారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.చతుర్దశి ప.11.24 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర ఉ.6.04 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర తె.5.04 వరకు (తెల్లవారితే మంగళవారం), **వర్జ్యం:** ప.3.16 నుండి 4.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.55 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.14 వరకు, **అమృత ఘడియలు:** రా.12.23 నుండి 1.54 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

మంచి విషయం



స్టార్టప్‌లు చాలావరకు తక్కువ మూలధనాన్ని కలిగి ఉంటాయి. అది మంచి విషయం అంటాన్నేను. ఎందుకంటే, సమస్యలపై అప్పుడు మీరు డబ్బును వెదజల్లలేరు. బదులుగా – మీ సొంత తెలివితేటలతో పరిష్కరించుకోవటం నేర్చుకుంటారు.

– జెర్రీ గ్రీన్‌ఫీల్డ్, బిజినెస్‌మ్యాన్

కదిలితేనే కదా!



మీరు మీరున్న ఫీల్డును దాటి, నలుగురితో కలిసిపోతేనే మీ నైపుణ్యాలు మెరుగుపడతాయి. నేను నా సమయాన్ని ఎక్కువగా వానిటీ వ్యాన్ బయటే గడుపుతాను. ఎవరి నుంచి ఏం నేర్చుకోవచ్చో, వాళ్ల దగ్గరికి వెళితేనే కదా తెలుస్తుంది.

– భూమి పెడ్నేకర్, నటి

దేన్నీ వదలను



అది ఫ్రెండ్లీ మ్యాచ్ అయినా, పాయింట్ల కోసమైనా, ఫైనల్ అయినా, అసలు ఏ ఆట అయినా – నేను ఒకేలా ఆడతాను. నా జట్టు కోసం, నా కోసం, నా అభిమానుల కోసం గట్టిగా నిలబడి ఆడతాను. గెలవడానికి ప్రయత్నిస్తాను.

– లియోనెల్ మెస్సీ, ఫుట్‌బాలర్

తలపై తుపాకీ



నాన్న ఒకసారి నాతో ఇలా అన్నారు: ఎవరైనా నీ తలపై తుపాకీ పెట్టి.. "అబద్ధం చెప్పు లేదా నేను నిన్ను కాల్చేస్తాను" అని అన్నప్పుడు మాత్రమే నువ్వు అబద్ధం చెప్పాలి – అని. అది నాకు బాగా గుర్తుండిపోయింది. నిజం బతకనివ్వనప్పుడు అబద్ధంతో జీవించాల్సిందే.

– జేడెన్ స్మిత్, ర్యాపర్

ఉత్సాహమే ఊపిరి



మీరు జీవితంతో విసుగు చెందనట్లయితే; మీ స్నేహితులు, మీ చుట్టూ ఉన్న వాళ్లు, మీ కుటుంబ సభ్యులతో మీరు ఉత్సాహంగా ఉంటున్నట్లయితే, అదంతా మీరు చేస్తున్న పనిని మరింత సృజనాత్మకంగా మార్చుతుంది.

– క్రిస్టియన్ లౌబౌటిన్, ఫ్యాషన్ డిజైనర్

ప్రవహించాలి



18 ఏళ్ల వయసులో తొలిసారి ఇల్లొదిలి ఇంగ్లండ్ వెళ్లినప్పుడు, ఆ కొత్త ప్రదేశానికి అలవాటు పడలేక నాకు చాలా ఒంటరిగా అనిపించింది. టీమ్ లోని నా ఇంగ్లిష్ మేట్స్ నాకు సహాయంగా ఉన్నారు. భావోద్వేగాలను అణచివేయడం కంటే, వాటిని బయటికి ప్రవహించనివ్వడం మనకు మంచిని చేస్తుంది.

– జెమైమా రోడ్రిగ్స్, ఇండియన్ క్రికెటర్

ఐటీ పరిశ్రమకు గడ్డు రోజులు

సందర్భం



సుష్మా రామచంద్రన్

అత్యంత నైపుణ్యం కలిగిన టెక్నాలజీ వృత్తినిపుణులు ఎవరైనా సరే అమెరికా వెళ్ళాలని కలలుగనడం సహజం. భారీ టెక్ లేదా భారతీయ సాఫ్ట్‌వేర్ సంస్థల ద్వారా వారు తమ కలలను సాకారం చేసుకునే ప్రయత్నం చేస్తారు. దానికి, ఆరేళ్ళ పాటు చెల్లుబాటయ్యే హెచ్–1బి వీసా చేజిక్కించుకోవాలని అర్రులు చాస్తారు. కానీ, ఆ రకం వీసాల సంఖ్యపై పరిమితి ఉంది. గ్రహీతలను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఇవి ఆ వీసాకున్న ప్రతికూలాంశాలు. హెచ్–1బి వీసా దారులు అమెరికాలో గ్రీన్ కార్డును చేజిక్కించుకోగలగడం, దీర్ఘకాలంలో పౌరసత్వాన్ని కూడా సంపాదించుకోవడం దానికున్న అనుకూలాంశాలు. హెచ్–1బి వీసాతో వృత్తి జీవితం మొదలుపెట్టి, తదనంతర కాలంలో ఉన్నత స్థాయికి చేరిన వారి జాబితా పెద్దదే. టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ళ, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఎన్విడియా స్థాపకుడు జెన్‌సెన్ హువాంగ్, జూమ్ స్థాపకుడు ఎరిక్ యువాన్ వంటి వారిని అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మారిన పరిస్థితులు

ఈ వీసాలపై 1,00,000 డాలర్ల చొప్పున ఒక విడత లెవీని ట్రంప్ ప్రభుత్వం విధించింది. అంత భారం మోయడం కష్టమని పెద్ద టెక్ కంపెనీలు శ్వేత సౌధానికి నచ్చజెబితే ఈ అంశానికి సంబంధించి, ఇతర కోణాలలో కూడా వీలైనంత త్వరగా మార్పు రావచ్చు. కానీ దీనివల్ల అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాలపైనే పెను ప్రభావం పడబోతోందనడంలో సందేహం లేదు. హెచ్–1బి వీసాలకు సౌజన్యం వహిస్తున్న పది టాప్ కంపెనీలలో భారతీయ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒక్కటే ఉంది. అమెజాన్ 10,000 వీసాలకు పైగా సంఖ్యతో 2025లో ఈ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. దానితో పోలిస్తే 5,500 వీసాలతో టి.సి.ఎస్. చాలా వెనుకనున్నట్లు లెక్క. మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్, ఆపిల్ వంటి ఇతర దిగ్గజాలు జాబితాలో చాలా దిగువన ఉన్నాయి.

అంతమాత్రాన ఈ పరిణామం వల్ల భారతీయ సాఫ్ట్‌వేర్ రంగానికి వాటిల్లే నష్టం లేదనుకోవడం పొరపాటు. ఎందుకంటే, హెచ్–1బి వీసాదారుల్లో దాదాపు 71 శాతం మంది భారతీయులే.



◆ హెచ్–1బి వీసాలపై 1,00,000 డాలర్ల ఒక విడత లెవీని ట్రంప్ ప్రభుత్వం విధించింది. ఒక విడత ఫీజు చెల్లించడం వల్ల అయ్యే ఖర్చు, తత్ఫలితంగా ఒనగూడగల ప్రయోజనాన్ని విశ్లేషించుకుని కంపెనీలు కొత్తవారిని తీసుకునే వ్యూహాలను రూపొందించుకుంటాయి.

దెబ్బ మీద దెబ్బ

అమెరికన్ కంపెనీలు ఇకమీదట కూడా, బయట దేశాల నుంచి ఎక్కువ పనులు చేయించుకోవాలని కోరుకుంటాయా, ఫలితంగా, భారత్‌లో మరిన్ని గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీ) నెలకొంటాయా అనేది ప్రశ్న. దేశంలో వాటిని నెలకొల్పడంలో అగ్ర టెక్ సంస్థలు పట్టుదలతో ఉన్నాయి. అమెరికా వంటి అధునాతన ఆర్థిక వ్యవస్థలోకన్నా తక్కువ జీతభత్యాలతో భారతదేశంలో నిపుణులైన వారిని నియమించుకోవడం తేలిక.

ఐటీ సేవలకు భారతీయ కంపెనీలపై ఆధారపడటం ఇక ముందు కూడా కొనసాగవచ్చు. కానీ అధిక ఫీజు వల్ల అటువంటి సేవలు మరింత ఖరీదైనవిగా మారతాయి లేదా లాభదాయకతను తగ్గిస్తాయి. ఒక విడత ఫీజు చెల్లించడం వల్ల అయ్యే ఖర్చు, తత్ఫలితంగా ఒనగూడగల ప్రయోజనాన్ని విశ్లేషించుకుని కంపెనీలు కొత్తవారిని తీసుకునే వ్యూహాలను రూపొందించుకుంటాయి. ఈ ఫీజు వసూలు చాలా కాలం కొనసాగితే, ఈ వీసాకు సౌజన్యం వహించడాన్ని అవి తగ్గించుకోవచ్చు. ఎల్1, ఓ1 వంటి ఇతర వీసా మార్గాలున్నాయి. కానీ, వీటికి షరతులుంటాయి. అందరు దరఖాస్తుదారులు వాటిని ఉపయోగించుకోలేరు.

ఔట్ సోర్సింగ్‌కు ఇచ్చే కంపెనీలపై పన్ను విధించాలని అమెరికాలో ఇప్పటికే ఒక ప్రతిపాదన వచ్చింది. ఆ బిల్లు భారతీయ ఐటీ పరిశ్రమ పాలిట పెను తుపాను అవుతుంది. సాఫ్ట్‌వేర్ సర్వీసులను ఎగుమతి చేయడం ద్వారానే భారతీయ ఐటీ పరిశ్రమ బ్రహ్మాండమైన వృద్ధిని సాధించగలిగింది. వాటి వ్యూహంలో హెచ్–1బి వీసాలు కూడా అంతర్భాగం.

అవకాశాల తలుపులు

సంక్షోభాలు అవకాశాలకు కూడా తలుపులు తెరుస్తాయని అంటారు. హైటెక్ నవీకరణ, పరిశోధనకు దేశంలో తగిన వాతావరణాన్ని సృష్టించడంలో ప్రభుత్వం–పరిశ్రమలు ఇప్పటికైనా చేతులు కలపాలి. బెంగళూరు, హైదరాబాద్ నగరాలు భారతీయ సిలికాన్ వ్యాలీగా ప్రసిద్ధి వహించాయి గానీ, అత్యధునాతన టెక్నాలజీని తీర్చిదిద్దే వాగ్దానాన్ని అంతగా నిలబెట్టుకోలేకపోయాయి. అట్టడుగు స్థాయి నుంచి సమూల మార్పులు తీసుకురాగలిగినదిగా భారతీయ ఐటీ రంగం ప్రతిష్ఠను సంతరించుకోలేకపోయింది. ఇతర దేశాలలో వచ్చిన నవీకరణలను అనుసరించేదిగానే అది పేరుపడింది.

అమెరికా చేరిన భారతీయ ప్రజ్ఞావంతులు అక్కడి సంస్థలను డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో అగ్ర స్థానాన నిలపడంలో కృతకృత్యులవుతున్నారు. పరిశోధన, అభివృద్ధి, కొత్త వెంచర్ల ప్రారంభానికి అమెరికాలో వాతావరణం అనుకూలంగా ఉండే మాట నిజమే. భారత్‌లో అందుబాటులో ఉన్న మానవ ప్రతిభా వ్యుత్పత్తుల సంపదను వినియోగించుకునేందుకు ఇక్కడ కూడా అటువంటి పరిస్థితులను కల్పించాలి. ఇందుకు ప్రభుత్వాన్ని ఒక్కదాన్నీ నిందించి ప్రయోజనం లేదు. భారతీయ కంపెనీలు పరిశోధన–అభివృద్ధి విభాగంపై నిధులు వెచ్చించేందుకు విముఖత చూపుతూ వస్తున్నాయి. దేశంలో ‘స్టెమ్’ గ్రాడ్యుయేట్లు అపారంగా ఉన్నారు. వారిని ప్రోత్సహించే వాతావరణాన్ని దేశంలోనే సృష్టించుకోవలసిన అవసరం మున్నెన్నటికన్నా ఇపుడే ఎక్కువగా ఉంది.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

ఒక తల్లి – ఆమె కూతురు

కామెంట్



కరణ్ థాపర్

అరుంధతీ రాయ్ తన పేరులోని ‘ఫస్ట్ నేమ్’ వదులుకున్నారని మీకు తెలుసా? 18 ఏళ్లప్పుడు ‘‘నా మొదటి పేరు సుజానాను వదిలేసుకున్నాను. అప్పట్నుంచీ క్రమంగా, ఉద్దేశపూర్వకంగా, వేరెవరి మాదిరిగానో రూపాంతరం చెందుతూ వచ్చాను’’ అని తన తాజా పుస్తకంలో వెల్లడించారు. ‘మదర్ మేరీ కమ్స్ టు మి’లో ఆమె ఇలాంటి ఇంకా అనేక చిరు జ్ఞాపకాలను పంచుకున్నారు. మత్తుమందు లేకుండా గర్భస్రావం చేయించుకున్న సంగతి మన దృష్టిని ఆకర్షించే మరో దృష్టాంతం. అప్పటికి ఆమెకు ఇరవై రెండేళ్ళు. ‘‘అది భయంకరం. కానీ, అలా జరిగిపోయిందంతే’’ అని రాశారు. అదే రోజు రాత్రి ఆమె మరుసటి రోజు షూటింగ్‌లో పాల్గొనేందుకు హోశంగాబాద్ నుంచి పంచ్‌మఢీ వెళ్ళే రైలు ఎక్కేశారు.

తల్లి మేరీ రాయ్‌తో ఆమెకు పడేది కాదు. ఈ పుస్తకం పాక్షికంగా ఆ సంగతులనూ, అరుంధతి జీవితంలోని వివిధ దశల్లోని ఆత్మానుగత వివరాలనూ వెల్లడిస్తుంది. అవి తరచూ కలతకు గురిచేస్తాయి. అరుంధతి తన తల్లిని ‘శ్రీమతి రాయ్’ అనే సంబోధిస్తూ వచ్చారు. పుస్తకం వెనుక వైపు అట్టలో ఆమెను ‘బందిపోటు’ అని పేర్కొన్నారు. కానీ, ఈ పుస్తకం చదువుతూంటే ఆమె నాకు రాక్షసిగానే తోచారు.


అరుంధతికి ఆరేళ్లున్నప్పుడు మొదటిసారి విమాన ప్రయాణంలో ‘‘అమ్మా! పిన్ని నీలాగా కాకుండా అంత సన్నగా ఉంటుంది ఎందుకని?’’ అని ప్రశ్నించడం ద్వారా తల్లికి చిర్రెత్తుకొచ్చేటట్లు చేసింది. ఆ ప్రశ్నకు ఆవిడ ఎంతగా కోప్పడిందంటే, అరుంధతి దానికి భయపడి విమానం కూలిపోవాలని కోరుకున్నారట. ‘‘విమానం కూలి మేమంతా చస్తే సరిపోతుంది అనిపించింది.’’

అరుంధతిని మేరీ తరచు ‘బిచ్’ అనే తిట్టేవారు. సోదరుడు క్రిస్టాఫర్‌ను ఇంకా దారుణమైన మాటలన్నారు. ‘‘తను కౌమారంలో ఉన్నప్పుడు, అమ్మ ఒకసారి అందికదా: ‘నువ్వు అసహ్యంగా ఉన్నావు, తెలివితక్కువ సన్నాసి, నేను నీ స్థానంలో ఉంటే ఈపాటికి ఆత్మహత్య చేసుకునేదాన్ని.’’

మేరీ రాయ్‌లో మెచ్చుకోదగిన పార్శ్వం కూడా ఉంది. ఆమెది దృఢ సంకల్పం. ఆమె నెలకొల్పిన పల్లికూడంను చక్కని పాఠశాలగా పరిగణించేవారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను చెప్పడంతోబాటు మంచి నడవడికను అలవరచేవారు. వారి స్నానపానాలను, మరుగుదొడ్లను శుభ్రం చేయడాన్ని మేరీ స్వయంగా పర్యవేక్షించేవారు. ఓసారి బాలురు ఆడపిల్లల వక్షోజాలు, వేసుకునే బ్రాల గురించి అసభ్యంగా మాట్లాడడం ప్రారంభించినపుడు, మేరీ తన కప్ బోర్డు నుంచి ఒక బ్రాను బయటకు తెచ్చి ‘‘ఇదే బ్రా. దీన్ని ఆడవాళ్లందరూ వేసుకుంటారు. మీ అమ్మలు వేసుకుంటారు. త్వరలోనే మీ అక్కచెల్లెళ్ళు వేసుకోవచ్చు. ఇది మిమ్మల్ని అంతగా ఉత్తేజపరుస్తోందనుకుంటే, దీన్ని ఉంచుకోండి’’ అన్నారట.



అరుంధతీ రాయ్



◆ తల్లి మేరీ రాయ్‌తో ఆమెకు పడేది కాదు. ఈ పుస్తకం పాక్షికంగా ఆ సంగతులనూ, అరుంధతి జీవితంలోని వివిధ దశల్లోని ఆత్మానుగత వివరాలనూ వెల్లడిస్తుంది. అవి తరచూ కలతకు గురిచేస్తాయి.

అరుంధతి నటించిన లేదా స్క్రిప్టు సమకూర్చిన ‘మాసీ సాహెబ్’, ‘ఇన్ విచ్ యానీ గివ్స్ ఇట్ దోజ్ వన్స్’, ‘ఎలక్ట్రిక్ మూన్’ లాంటి చిత్రాలతో ఈ పుస్తకం అరుంధతి జీవితపు తొలినాళ్ళలోకి తీసుకెళుతుంది. అయితే ‘గార్డియన్’ పత్రిక చిత్ర సమీక్షకుడు డెరెక్ మాల్కమ్ ‘‘పేరు మార్చి ఉండాల్సింది. ‘గివ్స్ ఇట్ దోజ్ వన్స్’ అనే దానికి ఇంగ్లీషులో అర్థమే లేదు’’ అని పెదవి విరిచారు. అరుంధతి, ఆమె బృందం ఆ వ్యాఖ్యను బాగా వాడుకున్నారు. ‘‘మిస్టర్ మాల్కమ్, ఇంగ్లండ్‌లో మీరు ఇక ఎంతమాత్రం ఇంగ్లిష్ మాట్లాడటం లేదు’’ అని పబ్లిసిటీ చేశారు.

ఆమె జైలులో గడిపిన ఒక రోజు గురించి కూడా ఈ పుస్తకం ప్రస్తావించింది. ‘‘జైలు గది తలుపు వెనుక వైపు మూసుకున్న శబ్దం, నాలోని ధైర్యాన్ని, విశ్వాసాన్ని నీరుగార్చేసింది. నేను మరో ప్రపంచంలోకి అడుగు పెడుతున్నానన్నది స్పష్టం. అక్కడున్నన్నాళ్ళూ ఏమి చోటుచేసుకోవడానికైనా అవకాశం ఉంది’’ అని పేర్కొన్నారు. నిజానికి, ఆమె అంత దుర్బలంగా ఏమీ అయిపోలేదు. అక్కడ ఆమె కొందరిని స్నేహితులుగా చేసుకున్నారు. జైలు పక్షులను తనవైపు తిప్పుకొని ఉంటారని నా అనుమానం.

పుస్తకం చివరి పేజీల కొచ్చేసరికి, తల్లితో ఆమెకున్న సంక్లిష్ట సంబంధాన్ని అర్థం చేసుకుంటాం. ఒక్కోసారి ఆమె తల్లిని ద్వేషించారు. మరికొన్ని సందర్భాల్లో ప్రేమించారు. శ్రీమతి రాయ్ చనిపోవడానికి కొద్ది నెలల ముందు కుమార్తెకు ఒక మెసేజ్ చేశారు. ‘‘ఈ ప్రపంచంలో నిన్ను మించి నేను ఎవరినీ ఎక్కువగా ప్రేమించింది లేదు.’’ అది అరుంధతిని ఆశ్చర్యపరచింది. కానీ, జవాబు మాత్రం అంతే ప్రేమాస్పదమైన రీతిలో ఇచ్చారు. ‘‘నాకింత వరకు తెలిసినవారిలో నువ్వు చాలా అసాధారణమైన, అద్భుతమైన మహిళవి. నేను నిన్ను ఆరాధించే వ్యక్తిని.’’

తల్లితో పడకపోయినా, ఆమె లేని లోటును అరుంధతి అనుభవిస్తోందనే నా సందేహం. ‘‘నేను నిన్ను కలుస్తాను’’ అంటూ పుస్తకాన్ని ముగించారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

తొలి మహిళా సైన్స్ లెక్చరర్

వైజ్ఞానిక వెలుగుచుక్కలు – 30

అది 1930. దేశ రాజధాని ఢిల్లీలో రాధ బీఎస్సీ చదవాలని కలలు కంటోంది. అప్పటికి డిగ్రీ స్థాయిలో సైన్స్ చదివే అవకాశం మహిళలకు ఏ కళాశాలలోనూ లేదు. తండ్రి కాలేజీల చుట్టూ తిరగడం, వెనక్కి రావడం... రెండేళ్లయ్యింది. కానీ ఆ అమ్మాయి మాత్రం వెనక్కి తగ్గడం లేదు; ‘అవసరమైతే గాంధీ మహాత్ముడిలా సత్యాగ్రహం చేస్తాను హిందూ కాలేజీ ఎదుట’ అనేదాకా వెళ్ళింది. అలా బీఎస్సీ సైన్స్ డిగ్రీలో హిందూ కళాశాలలో ప్రవేశం దొరికింది.




రాధా పంత్

కేరళలోని పాల్‌ఘాట్ ప్రాంతం కల్పాతి గ్రామంలో 1916 సెప్టెంబర్ 5న రాధ జన్మించారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి 1940లో పీహెచ్‌డీ సాధించారు. పీహెచ్‌డీ కొరకు 2, 4 డై మీతోక్సీ ఐసోప్థలి కామ్లం; 2, 6 డై హైడ్రాక్సీ ఐసోథాలికామ్లాలను తొలిసారి తయారు చేసిన శాస్త్రవేత్త రాధ. బొంబాయి హాఫ్కిన్ ఇనిస్టిట్యూట్ వారి న్యూట్రిషనల్ బయో కెమిస్ట్రీ విభాగంలో సీనియర్ రిసెర్చ్ ఫెలోగా పని చేస్తూ... ఎంతోకాలంగా ఉన్న నమ్మకాన్ని పటాపంచలు చేస్తూ... ‘సోయా కన్నా శనగలే మేలైన పోషక విలువలు కలిగి ఉన్నాయని’ రుజువు చేశారు. 1945లో అలహాబాద్ విశ్వవిద్యాలయంలో తొలి మహిళా అధ్యాపకురాలిగా బయోకెమిస్ట్రీ నేపథ్యంతో చేరారు. అనతి కాలంలోనే అదే విశ్వవిద్యాలయంలో బోటనీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న దివ్య దర్శన్ పంత్‌ను వివాహం చేసుకున్నారు. 1954–56 మధ్యకాలంలో భార్యాభర్తలిద్దరూ యూనివర్సిటీ ఆఫ్ లండన్ వెళ్లి పోస్ట్ డాక్టోరల్ పట్టాలు పొందారు.

‘ఎవర్ ఎ ఫైటర్ ’ పేరుతో రాధా పంత్ తన జ్ఞాపకాలను రాసుకున్నారు. 1956లో అలహాబాద్ యూనివర్సిటీలో తను పరిశోధనను కొనసాగించాలనుకున్నప్పుడు ఆ విభాగంలో కేవలం 6 గదులు మాత్రమే ఉన్నాయనీ; ఇక పరిశోధనకు కావలసిన గ్రంథాలు, వసతులు ఏమాత్రం లేవనీ చెప్పారు. అటువంటి అలహాబాద్ యూనివర్సిటీలోనే 1968లో జీవరసాయన శాస్త్ర విభాగంలో ఎంఎస్సీ కోర్సును ప్రారంభించ గలిగారు. రాధా పంత్ బృందం హృదయ రోగాలు, పట్టుపురుగులు ఇలా అనేక విభిన్న అంశాల మీద విలువైన ఫలితాలు సాధించారని ‘ద బయో కెమిస్ట్’ జర్నల్‌లో కుసుమ్ పంత్ జోషి పేర్కొన్నారు. పట్టుపురుగులకు సంబంధించి రాధా పంత్ కృషి గురించి ఫ్రెంచ్ జర్నల్ ‘సెరికొలో జియా’ ఒక ప్రత్యేకమైన ప్రచురణని వెలవరించిందంటే ఆమె స్థాయి ఏమిటో గమనించవచ్చు. 2008 డిసెంబర్ 19న కన్నుమూసిన రాధ చిరస్మరణీయురాలు.

– డా।। నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

డేటా పాయింట్



తీర్థయాత్ర

జ్యోతిర్మయం

‘ప్రాణాలు లేనివైనప్పటికీ కొండలు, నదులు, సరస్సులు పుణ్యతీర్థాలై జనుల పాపాలను పరిహరించి పవిత్రులుగా ఎలా చేయగలుగుతున్నాయి’ అని రోమశ మహర్షిని ధర్మరాజు అడుగుతాడు. ‘దేవతలు, ఋషులు ఆశ్రయించటం వల్ల పుణ్యక్షేత్రాలు పవిత్రాలై అన్ని కోర్కెలు తీర్చే మహిమ కలవై ఉన్నా’యని రోమశుడు చెబుతాడు.

నదీ తీరాలలో, పర్వత ప్రాంతాలలో, అరణ్యాలలో ఋషులు, దేవతలు అనేక సంవత్సరాలు తపస్సు చేసిన కారణంగా ఆ ప్రదేశాలు పవిత్రత పొందాయి. పుణ్య క్షేత్రాల సందర్శనం, పవిత్ర తీర్థాలలో స్నానమాచరించటం వల్ల మానసిక ప్రశాంతత సిద్ధిస్తుంది. కుటుంబంలోని వ్యక్తులు కాని, స్నేహ బృందాలు కాని తీర్థయాత్రలకు వెళుతుంటారు. దీనివల్ల ఐకమత్య భావన, సహకారతత్వం, మనుషుల మధ్య అనుబంధం ఏర్పడుతాయి. స్థల చరిత్ర వంటివి చర్చించుకుంటూ చూడటం వల్ల జ్ఞానమూ ఆదాన ప్రదానమవుతుంది. ఇది లౌకిక ప్రయోజనం.

అయితే, తీర్థ యాత్రలు మోక్షప్రదాలు, ముక్తి దాయకాలు. ఆ సమయంలో మనసు నిర్మలంగా ఉండాలి. పుణ్య స్థలాలకు, దేవాలయాలకు వెళ్ళినప్పుడు అక్కడ కూడా ఆత్మ వంచన, పరనింద, పర వంచన చేసి మనసుని కలుషితం చేసుకోరాదు. దుష్ట స్వభావులు దివ్య తీర్థాలలో వేల సార్లు మునిగినా పవిత్రులు కాలేరు. భగవంతుని సమీపంలో కలతలకు, కల్మషాలకు దూరంగా ఉన్నామనే భావన కలగాలి. మనో వాక్కాయాలను శుద్ధిగా ఉంచుకుంటే అడుగడుగునా తీర్థాలే. పుణ్య క్షేత్రాలే. లేకపోతే అవి వట్టి నీటి రేవులే. పుణ్య క్షేత్రాల దర్శనం వ్యక్తులకు ఆధ్యాత్మిక భావ వాతావరణాన్ని మనసులో కల్పించుకోవటానికి ఒక ఆలంబన కావాలి.

– డా।। చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

సమస్యల పరిష్కారానికి దశల వారీ ఉద్యమం

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఉద్యమం చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌వో) అసోసియేషన్ నిర్ణయించింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సీహెచ్‌వోలకు 7 నెలల ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులరైజ్ చేయాలనే మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. కానీ.. ఇందుకు విరుద్ధంగా మంత్రి సత్యకుమార్ అసెంబ్లీలో ప్రకటన చేశారని మండిపడ్డారు. సీహెచ్‌వోలకు రెండు నెలల బకాయిలే ఉన్నాయని.. వారిని రెగ్యులరైజ్ చేయాలనే మార్గదర్శకాలు లేవని మంత్రి చెప్పడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు రోస్లిన్, పోకల శ్రావణి, అంకారావు, జగదీష్, దుర్గ గోపాల్, జార్జ్, నరేష్ పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు సర్వీసు నిబంధనలపై అవగాహన

సాక్షి, అమరావతి: డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించనున్నట్టు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త టీచర్లకు అవసరమైన అన్ని రకాల ఫార్మాట్స్‌ను https://www.vidyakranthi.in/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి వర్తించే సౌకర్యాలు, పాటించాల్సిన విధులు సమగ్రంగా ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే, డీఎస్సీ టీచర్ల సంక్షేమం కోసం జిల్లాల వారీగా కన్వీనర్లను నియమించామని, సర్వీసు అంశాల్లో వీరు కొత్త టీచర్లకు సహాయకులుగా ఉంటారని వివరించారు.

ఉద్యోగులకు బకాయిల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ



శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.33 వేల కోట్లకు చేరాయని చెప్పారు. ఏ ఉద్యోగికి ఎంత బకాయి ఉంది, ఎప్పుడు చెల్లిస్తారనే విషయాలను సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసి, సర్టిఫికెట్ రూపంలో అందించాలన్నారు. ఉద్యోగులకు బకాయిలు చెల్లించలేకపోతే వారికి రావాల్సిన మొత్తానికి సమాన విలువ కలిగిన భూమిని కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షులు శిమ్మ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎం.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు స్వప్రయోజనాలకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

ఏపీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ ఆక్షేపణ




లండన్‌లో నిర్వహించిన చర్చా కార్యక్రమానికి హాజరైన ప్రవాసాంధ్రులు

సాక్షి, అమరావతి: స్వప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ ఆక్షేపించింది. లండన్‌లోని హౌన్స్లో ప్రాంతంలో ఏపీ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఆదివారం చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ప్రవాసాంధ్రులు ప్లకార్డులు చేతబూని 'సే నో ప్రైవేటైజేషన్ ఆఫ్ మెడికల్ కాలేజీస్' అంటూ నినాదాలు చేశారు. ప్రవాసాంధ్రుడు అనంత్‌రాజు పరదేశి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చర్చలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి మరీ చంద్రబాబు నియంతలా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు వద్దని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ)కి లేఖ రాయడం సిగ్గుచేటు అన్నారు. ఒకవైపు కేంద్రం మెడికల్ కాలేజీలు నెలకొల్పి ప్రజారోగ్యాన్ని కాపాడాలని తపన పడుతుంటే.. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతోందన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. చర్చా కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి పాతకోట, మలిరెడ్డి కిషోర్‌రెడ్డి, కార్తీక్ భూమిరెడ్డి, బీవీ నారాయణరెడ్డి, శ్రీకాంత్ పసుపుల తదితర ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

బిగ్‌ఫిక్స్ రాకుంటే బైబై

సంప్రదాయ కోడింగ్‌తో కొలువులు నెట్టుకొస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు టెక్నాలజీ రంగంలో తెరపైకి వచ్చిన 'బిగ్‌ఫిక్స్' సవాల్ విసురుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టూల్ కోడింగ్‌కు అనుగుణంగా నైపుణ్యాలకు పదునుపెట్టుకోని వారి ఉద్యోగాలకు ఎసరుపెడుతోంది. ఇప్పటికే కొన్ని బహుళజాతి కంపెనీలు 'అప్‌డేట్' కాని ఉద్యగులకు లేఆఫ్‌లు (ఉద్యోగాల నుంచి తొలగించడం) ప్రకటించగా మరికొన్ని సంస్థలు అదేబాటలో పయనిస్తున్నాయి. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీలు (నాస్కామ్) ఇటీవల బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ)తో కలిసి ఏఐపై చేపట్టిన అధ్యయనంలో ఈ ఆశ్చర్యకర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా ఏటా ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్న దాదాపు 12 లక్షల మంది విద్యార్థుల్లో 68 శాతం మంది ఎమర్జింగ్ కోర్సులు చేస్తుండగా వారిలో 5 లక్షల మందే ఉద్యోగాలు పొందుతున్నారు. అలా కొలువులు సాధించిన వారిలోనూ ఏఐ ఆధారిత ఉద్యోగాలు చేస్తున్నది 3 లక్షల మందే. వాళ్లలోనూ సామర్థ్యాలను మెరుగుపరుచుకోనందుకు దాదాపు 1.20 లక్షల మంది ఏడాది తిరగకుండానే లేఆఫ్ లేఖలు అందుకుంటున్నారు. మిగతా వాళ్లలో 20 శాతం మందే సుమారు రూ. 40 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్నారు.

సాక్షి, హైదరాబాద్



సాఫ్ట్‌వేర్ కోడ్ జనరేషన్‌లో అప్‌గ్రేడ్ కానివారికి లేఆఫ్‌ల ముప్పు

- ఏఐ టూల్ కోడింగ్ నైపుణ్యం లేని ఉద్యోగులను తొలగిస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- ఏటా ఏఐ ఆధారిత కొలువులు సాధిస్తున్న 3 లక్షల మంది.. వారిలోనూ స్కిల్స్ మెరుగుపరుచుకోని 1.20 లక్షల మందికి ఉద్వాసన
- ఇంజనీరింగ్ కాలేజీలు అందిస్తున్న ఎమర్జింగ్ కోర్సుల్లో కానరాని సరికొత్త మార్పులు
- ఏఐఎంఎల్, డేటా సైన్స్ వంటి కోర్సులు చేసిన వారికీ గగనంగానే ఉద్యోగాలు
- నాస్కామ్-బీసీజీ అధ్యయనంలో వెల్లడి

ఏమిటీ 'బిగ్‌ఫిక్స్'?

విలువైన డేటాతో నిక్షిప్తమయ్యే లేదా బిగ్ డేటా సెంటర్లకు అనుసంధానమయ్యే కంప్యూటర్లు, సర్వర్లు, ల్యాప్‌టాప్‌ల వంటి పరికరాలను ఆటోమేటిక్‌గా మేనేజ్ చేయడాన్నే బిగ్‌ఫిక్స్ అంటారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కంపెనీలు సెక్యూరిటీ కోసం సరికొత్త కోడింగ్, మాడ్యూల్స్‌ను అనుసరిస్తున్నాయి. సాధారణ కోడింగ్ నుంచి ఏఐ టూల్ కోడింగ్‌కు అప్‌డేట్ అయితే తప్ప బిగ్‌ఫిక్స్ తేలికగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఈ రూట్‌లో వెళ్లలేని సీనియర్ టెకీలు ఇప్పుడు లేఆఫ్‌లకు గురవుతున్నారు. బిగ్ డేటా కేంద్రాలపై ఆధారపడే బహుళజాతి సంస్థలు సరైన శిక్షణ ఇవ్వకపోవడం కూడా ఇందుకు సమస్యగా మారుతోంది. సమీకృత ఏఐ ఆటోమేషన్‌లో సర్వర్ల స్థితి, సెక్యూరిటీ లాగ్స్, రిసోర్స్ యూజీలను ట్రాక్ చేయడానికి మారుతున్న కోడింగ్ కీలకంగా నిలుస్తోందని నిపుణులు చెబుతున్నారు. ఏఐ కోడ్ జనరేషన్‌పై ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయితే తప్ప ఉద్యోగంలో అభివృద్ధి కనిపించదని అంటున్నారు.

ఎమర్జింగ్ కోర్సుల్లో కొత్తదనం ఏదీ?

కొన్ని కాలేజీలు ఇంకా దశాబ్దకాలం నాటికి సీ, సీ ప్లస్ కోడింగ్‌తోనే ఎమర్జింగ్ కోర్సులు మొదలు పెడతున్నాయి. ఐఐటీలు, ఎన్ఐటీలు కొన్ని ఆధునిక కోడ్‌ను అనుసరిస్తున్నాయి. ఏఐ మోడల్స్ స్వయంగా అల్గోరిథంను అనుసరిస్తున్నాయి. ఉదాహరణకు ఇంటర్నెట్‌లో ఏదైనా సెర్చ్ చేస్తే దానికి సంబంధించిన సమాచారం ఆటోమేటిక్‌గా వస్తోంది. 600కుపైగా ప్రోగ్రాములతో రూపొందించిన కోడ్ టీ5 ప్లస్, స్టార్ కోడ్ 2 వంటి జనరేటివ్ మోడల్స్ ఇప్పటికీ ఐఐటీలకే పరిమితం అవుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో బోధిస్తున్న ఎమర్జింగ్ కోర్సుల్లో ఈ తరహా మోడల్స్ ఉండటంలేదు. దీంతో ఏఐఎంఎల్, డేటా సైన్స్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సైతం టెక్నాలజీ రౌండ్, కోడింగ్ రౌండ్‌లలో ప్రతిభ చూపలేకపోతున్నారు. ఫలితంగా ఫ్రెషర్స్ ఏఐ కోర్సుల ద్వారా ఆశించిన ఉద్యోగాలు పొందలేని స్థితి నెలకొంది.

కోడింగ్ కొత్తగా..

ఏఐ రంగంలో ఎప్పటికప్పుడు గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలోలాగా ఒకే మోడల్ కాకుండా మల్టీ ఏజెంట్స్ కొలాబరేషన్‌తో ఏఐ పనిచేస్తోంది. మారుతున్న ఈ మోడల్స్‌ను ఏఐ ఏజెంట్ సిస్టమ్‌గా పిలుస్తున్నారు. ఉదాహరణకు మెటా కోడ్ ఏజెంట్‌పై 2024 నుంచి అనేక పరిశోధనలు చేశారు. ఇప్పుడిది ఇంటెలిజెన్స్ డేటా సెంటర్‌లో కోడ్ రాసే స్థాయికి ఎదిగింది. ఈ కోడ్‌ను ప్రాక్టికల్‌గా పరీక్షించడం, తప్పులు సరిచేయడం చేస్తుంది. 'ఆటోడెవ్' ఫ్రేమ్‌వర్క్ కొన్ని మోడల్స్‌తో కలిసి కొత్త సాఫ్ట్‌వర్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. ఐఐటీ మద్రాస్, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, యూరోపియన్ ఏఐ అలయన్స్ కొత్తగా ఎథికల్ ఏఐ కోడ్ జనరేషన్, ట్రాన్స్‌ఫరెన్స్ ఏఐ రైటింగ్ కోడ్, ఏఐ జనరేటెడ్ అకౌంటబులిటీ ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొచ్చాయి. దీంతో వాటి మూలాలు, పనిచేసే విధానం, వాటికి మెరుగైన ప్రోగ్రామింగ్ ఇవ్వడంలో మెళకువలు ఉన్న ఏఐ నిపుణులు మాత్రమే ఈ వేగాన్ని అందుకొనే పరిస్థితి ఉందని నిపుణులు చెబుతున్నారు.

మారాల్సిందే

ఎమర్జింగ్ కోర్సులు చేస్తున్న విద్యార్థులతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం మారుతున్న ఏఐ కోడ్‌కు అప్‌డేట్ కావాలి. లేకపోతే ఈ రంగంలో నిలదొక్కుకోవడం కష్టం. కొన్ని బహుళజాతి కంపెనీలు ఈ దిశగా శిక్షణ ఇస్తున్నాయి. ఆన్‌లైన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు నైపుణ్యం సాధించాలి.

– డాక్టర్ కేపీ సుప్రీతి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి, జేఎన్‌టీయూహెచ్

లేఆఫ్‌లు తప్పట్లేదు

టెక్ రంగంలో అనుభవం ఉన్నవాళ్లు కూడా పరిమిత కాలంలో ఏఐ కోడింగ్‌ను నేర్చుకోవడం, కొత్త కోడింగ్‌లో నైపుణ్యం పొందడంలో విఫలమవుతున్నారు. వారికి ప్రాజెక్టులు అప్పగించడం కంపెనీలకు కష్టంగా ఉంది. ఎందుకంటే డేటా సెంటర్‌తో అనుసంధానమయ్యే కంపెనీ సమాచారాన్ని కాపాడే సామర్థ్యం వారికి ఉండటం లేదు. అందుకే లేఆఫ్‌లు ఇవ్వడం అనివార్యమవుతోంది.

– పరిమళ సిద్ధార్థ్, ఓ ఏఐ సంస్థ హెచ్ఆర్ మేనేజర్

భారత్‌లో ఏఐ ఆధారిత ఉద్యోగాల్లో వేతనం (రూ. లక్షల్లో)

కేటగిరీ	ప్రారంభం	3 ఏళ్ల అనుభవం	5 ఏళ్లపైన అనుభవం
ఏఐ ఇంజనీర్	5	10	50
డేటా సైంటిస్ట్ ఏఐ	5.77	9.50	18.5
డేటా సైంటిస్ట్ (ఏఐ స్కిల్స్)	-	13.31	-
జనరేటివ్ ఏఐ	6-12	12-25	25-50

పట్టు వీడని వైద్యులు.. రెండో రోజు కొనసాగిన రిలే దీక్షలు

- 2030 వరకూ 20 శాతం ఇన్ సర్వీస్ కోటా కొనసాగించాలని డిమాండ్
- మా సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ ఆందోళన విరమించం
- ప్రభుత్వానికి తేల్చి చెప్పిన పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నేతలు



విజయవాడ ధర్నా చౌక్ వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల నిరసన

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు, ప్రభుత్వం మధ్య చర్చలు కొలిక్కి రావడం లేదు. పీజీ మెడికల్ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ విభాగంలో 20 శాతం కొనసాగించాలని వైద్యులు భీష్మించారు. ఇందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆదివారం కూడా చర్చలు విఫలమయ్యాయి. ఏటా ఇన్ సర్వీస్ కోటాపై పునః సమీక్షించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2030 వరకూ అన్ని క్లినికల్ కోర్సులకు 20 శాతం కోటా వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న ఈ దీక్షల్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన వైద్యులు పాల్గొంటున్నారు. తమ డిమాండ్‌లపై స్పష్టమైన రాతపూర్వక హామీ ఇచ్చే వరకూ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. పీహెచ్‌సీ వైద్యులు 20 ఏళ్ల పదోన్నతులు లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టైమ్ బౌండ్ ప్రమోషన్లు, ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించడం, నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనాన్ని గిరిజన భత్యంగా చెల్లించడం, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేల భత్యం మంజూరు చేయడం, స్థానికత్వం-పట్టణ వైద్యాధికారుల సర్వీస్ అర్హత సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన డిమాండ్‌లని పేర్కొన్నారు. నిరసనలో అసోసియేషన్ నేతలతో పాటు, వందలాది మంది వైద్యులు పాల్గొన్నారు. కాగా, టైమ్ బౌండ్ పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్‌లకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని, అయినప్పటికీ వైద్యులు అంగీకరించలేదని సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యుల తీరుపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సచివాలయ ఉద్యోగుల 'ఆత్మగౌరవం' భగ్నం

నెల్లూరు (పొగతోట): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవం కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. నెల్లూరు టౌన్‌హాల్‌లో ఆదివారం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు ఆత్మగౌరవ సభ ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆత్మగౌరవ రొట్టె, ఆత్మగౌరవ సమావేశం, కొవ్వొత్తుల ప్రదర్శన తదితర కార్యక్రమాలకు పోలీసుల అనుమతి కోరారు. ఆత్మగౌరవ రొట్టె, కొవ్వొత్తుల ర్యాలీకి అనుమతించకపోవడంతో ఆత్మగౌరవ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి నాయకులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు టౌన్‌హాల్‌కు భారీగా తరలివచ్చారు. అక్కడ పెద్దఎత్తున మోహరించిన పోలీసులు సభ నిర్వహణకు అనుమతిలేదంటూ ఉద్యోగులను బయటకు పంపించేశారు. అనంతరం టౌన్‌హాల్ గేట్లకు తాళాలు వేశారు. పోలీసుల తీరుకు నిరసనగా జేఏసీ నాయకులు, ఉద్యోగులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు అక్కడి నుంచి బలవంతంగా వీఆర్సీ మైదానం వద్దకు వెళ్లాలంటూ హుకుం జారీ చేయడంతో అక్కడికి చేరుకుని నిరసన కొనసాగించారు.

మా డిమాండ్లు నెరవేర్చాలి

ఉభయ గోదావరి జిల్లాల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక డిమాండ్



హాజరైన సచివాలయ ఉద్యోగులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సచివాలయ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమావేశం జరిగింది. 1,500 మంది సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు. ఐక్యవేదిక చైర్మన్ జానీ పాషా మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, వలంటీర్ విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, రికార్డ్ అసిస్టెంట్ పే స్కేల్ జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో క్యాడర్ అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సంఘ సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్, నాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- ఈ నెల 15లోగా సమస్యలు పరిష్కరించాలి
- విద్యుత్ ఉద్యోగుల హెచ్చరిక



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సాక్షి, అమరావతి/కృష్ణలంక (విజయవాడ తూర్పు): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె తప్పదని విద్యుత్ ఉద్యోగులు హెచ్చరించారు. విజయవాడలో కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులతో ఉద్యమ కార్యాచరణ గురించి రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. అక్టోబర్ 14న వర్క్ టు రూల్ పాటిస్తామని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. విద్యుత్ సంస్థల్లో 27 వేల మంది కాంట్రాక్టు కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 1999 ముందు నియామకమైన ఉద్యోగులకు మాత్రమే పెన్షన్ సౌకర్యం ఉందని, తర్వాత వారికి పెన్షన్ సౌకర్యం లేదన్నారు. ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు నగదు రహిత మెడికల్ కార్డు ఇవ్వాలన్నారు. జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపచేయాలని సమావేశంలో తీర్మానించింది.

రేపు చలో విజయవాడ

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు

- ఉపాధ్యాయులను కూటమి సర్కార్ నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం
- సమస్యలు పరిష్కరించకపోగా.. బోధనేతర పనులతో వేధిస్తోందని ఆవేదన
- ఐఆర్, పీఆర్సీ లేవు.. 4 డీఏ బకాయిలూ చెల్లించట్లేదని మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోగా.. బోధనేతర పనులతో వేధిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ సమస్యలపై ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని మండిపడింది. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆగస్టులో జిల్లా స్థాయిలో ఆందోళనలు చేపట్టినా స్పందించలేదని.. అందుకే ఈనెల 7న 'చలో విజయవాడ' పేరుతో మహా ధర్నా చేస్తున్నట్టు ప్రకటించింది. సమాఖ్య చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్నా ఇప్పటివరకు విద్యా సంస్కరణలపై నిర్ణయం తీసుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వంలోని అన్ని మేనేజ్‌మెంట్ల ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు తెస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటికీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి అనేక డిమాండ్లు పరిష్కరించలేదని.. ఐఆర్ ఇవ్వలేదని, పీఆర్సీ నియమించలేదని వాపోయారు. గత ప్రభుత్వం తెచ్చిన హైస్కూల్ ప్లస్‌లను పూర్తిగా నిర్వీర్యం చేశారని.. అక్కడి పోస్టులను సర్‌ప్లస్ చేసి గ్రామీణ బాలికలకు ఉన్నత విద్యను దూరం చేశారని ధ్వజమెత్తారు. తాము ఆరోగ్య బీమా చెల్లిస్తున్నా వైద్యం చేయించుకోలేకపోతున్నామని మండిపడ్డారు. ఉపాధ్యాయులంటే ప్రభుత్వానికి గౌరవం లేదని.. సర్వీసులో ఉంటూ చనిపోయిన వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలు కూడా చేపట్టలేదని విమర్శించారు. అందుకే ఈనెల 7న ఉద్యమించబోతున్నట్లు తెలిపారు.

పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

ఈనెల 7న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నట్టు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ కుమార్‌రెడ్డి, గెడ్డం సుధీర్, స్కూల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు తమ్మినాన చందనరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సైతం ధర్నాకు మద్దతు పలికింది.

బాబు పాలనలో విద్య, వైద్యం సర్వనాశనం

- పీపీపీ అంటే.. 'ప్రజల సొమ్ము పక్కదారిలో పంచుకోవడమే'
- ఈనెల 9న మాకవరపాలెం మెడికల్ కళాశాల పనులను మాజీ సీఎం వైఎస్ జగన్ పరిశీలిస్తారు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు
- ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించడం దుర్మార్గమైన చర్య : బొత్స
- ఉత్తరాంధ్రలోని ఏడు ప్రధాన అంశాలపై ఒత్తిడి తెచ్చేలా ప్రభుత్వంపై పోరాటం
- ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, చిత్రంలో కన్నబాబు, ఎంపీ తనూజరాణి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తే.. సీఎం చంద్రబాబు ఆ రెండింటినీ సర్వనాశనం చేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు మండిపడ్డారు. పీపీపీ అంటే.. 'ప్రజల సొమ్ము పక్కదారిలో పంచుకోవడమే'నని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పుడే కాదు.. చంద్రబాబు థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు చేసింది ఏమీలేదంటూ విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం ఆదివారం విశాఖలో జరిగింది. టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ..

జగన్‌ది హార్డ్ వర్క్.. బాబుది షో వర్క్..

'రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హార్డ్‌వర్క్ చేస్తే.. చంద్రబాబు మాత్రం షో వర్క్, పబ్లిసిటీ మాత్రమే చేస్తున్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు. మా అధినేత చేసిన పనులను చంద్రబాబు నిర్వీర్యం చేయడమే కాక రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుడితే అందులో ఉత్తరాంధ్ర ప్రాంతంలోనే నాలుగు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన పాడేరులో మెడికల్ కళాశాలను నిర్మాణంచేసి చూపించిన నాయకుడు వైఎస్ జగన్. ఇందులోని పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఈనెల 9న అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మెడికల్ కళాశాలను మాజీ సీఎం వైఎస్ జగన్ సందర్శిస్తారు.

కూటమి సర్కారుకు జగన్ ఫోబియా: బొత్స

శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'పేదవాడి వైద్యానికి సంబంధించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దుర్మార్గమైన చర్య. టీడీపీ కూటమి ప్రభుత్వానికి జగన్‌మోహన్‌రెడ్డి ఫోబియా పట్టుకుంది. పేదవాడి ఆరోగ్యం విషయంలో మా నాయకుడు, మా పార్టీ రాజీపడే ప్రసక్తేలేదు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలన పూర్తికాకుండానే విద్య, వైద్య వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారనడానికి కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చ కామెర్లు, జ్వరాలతో ఇద్దరు గిరిజన విద్యార్థులు మృతిచెందడం.. మరో 37 మంది విద్యార్థులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఘటనే ఉదాహరణ. కూటమి ప్రభుత్వానికి ప్రజల మాన, ప్రాణాలపై పర్యవేక్షణ కొరవడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నేరాలు, హత్యలు, హత్యాచారాలు పెరిగిపోయాయి' అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎంపీ తనూజ రాణి, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పండుల రవీంద్రబాబు, కుంభా రవిబాబు, నక్కా రామారావు, సురేష్‌బాబు, పాలవలస విక్రాంత్.. పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, పుష్పశ్రీవాణి, బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, పార్టీ జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాస్, పరీక్షిత్ రాజు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు బొత్స ఝాన్సీలక్ష్మి, బొడ్డేడ ప్రసాద్, బెల్లాన చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు కోలగట్ల వీరభద్రస్వామి, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, శోభా హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఏడు అంశాలపై తీర్మానం

ఉత్తరాంధ్రలోని ఏడు ప్రధాన అంశాలపై టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పోరాటం చేయాలని సమావేశం తీర్మానించింది. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు, భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు, జీవీఎంసీ పరిధిలో 42 వేల మంది చిరు వ్యాపారుల షాపుల తొలగింపు, లులు వంటి సంస్థలకు కారుచౌకగా భూముల ధారాదత్తం వంటి అంశాలకు వ్యతిరేకంగా పోరాడాలని, ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తీర్మానించారు.

17 పారదర్శకత కోసం మార్పులు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో షురూ • ఇకపై దేశమంతటా అమలు


సీఈసీ జ్ఞానేశ్ కుమార్

- అనుమానాలకు తావులేకుండా ఉండటానికే..
- ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 కంటే తక్కువ మంది ఓటర్లు
- ఈవీఎంలపై అభ్యర్థులు, పార్టీ గుర్తుల కలర్ ఫొటోలు
- ఓటర్లకు స్పష్టంగా కనిపించేలా పెద్ద అక్షరాలు
- మొబైల్ ఫోన్లు భద్రపర్చుకోవడానికి ప్రత్యేక గది
- వంద శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కవరేజీ
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి

పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల్లో 17 నూతన మార్పులు తీసుకొస్తున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. దీని వల్ల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఎన్నికల్లో వీటిని ప్రవేశపెట్టే అవకాశం ఉంటుందని వివరించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దేశానికి ఒక రోల్‌మోడల్ అవుతాయని అన్నారు. ఎన్నికల నిర్వహణతోపాటు ఓట్ల లెక్కింపులో ఈ కొత్త మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధూ, వివేక్ జోషీతో కలిసి జ్ఞానేశ్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్ తర్వాత 15 రోజుల్లోగా ఎలక్టర్ ఫొటో గుర్తింపు కార్డు(ఎపిక్)ను సంబంధిత ఓటర్‌కు అందజేయడానికి ప్రామాణిక నియమావళి (ఎస్‌ఓపీ)ని ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు తమ మొబైల్ ఫోన్లను భద్రపర్చుకొనే సౌలభ్యం కల్పించబోతున్నామని వివరించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టంచేశారు.

మార్పుల్లో కీలకమైనవి..

- బిహార్‌లో ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,200 కంటే తక్కువ మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల జనం బారులు తీరి గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. త్వరగా ఓటు వేసి వెళ్లిపోవచ్చు. తక్కువ మంది ఓటర్లతో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న తొలి రాష్ట్రంగా బిహార్ రికార్డుకెక్కనుంది.
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యపై పరిమితి విధించారు. 1,500 నుంచి 1,200కు తగ్గించారు. దీనివల్ల బిహార్‌లో అదనంగా 12,817 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి వస్తోంది. మొత్తం కేంద్రాల సంఖ్య 90,712కి చేరుకోనుంది.
- ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) బ్యాలెట్లపై అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తుల విషయంలో ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఈసారి కలర్ ఫొటోలు ముద్రించబోతున్నారు. పేర్లు, సీరియల్ నంబర్లు స్పష్టంగా కనిపెంచేలా పెద్ద అక్షరాల్లో ముద్రిస్తారు. ప్రస్తుతం ఈవీఎంలపై నలుపు తెలుపు రంగు ఫొటోలే ఉంటున్నాయి. దీనివల్ల అభ్యర్థులను గుర్తించడంలో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిహార్‌లో ఈ కష్టాలకు తెరపడినట్లే. దేశవ్యాప్తంగా ఇదే విధానం అమలు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయానికి వచ్చింది. దేశంలో ఈవీఎంలపై కలర్ ఫొటోలు ముద్రించిన మొట్టమొదటి ఎన్నికలుగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలు చరిత్రకెక్కబోతున్నాయి.
- ఎన్నికల విధులు నిర్వర్తించే బూత్-లెవెల్ అధికారులకు అధికారికంగా గుర్తింపు కార్డులు జారీ చేయబోతున్నారు. తద్వారా ఓటర్లు వారిని సులభంగా గుర్తించడానికి వీలవుతుంది.
- బిహార్ ఎన్నికల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ వంద శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కవరేజీని తప్పనిసరి చేశారు. అనుమానాలకు తావులేకుండా ప్రతి అంశాన్నీ సీసీటీవీ కెమెరాల్లో రికార్డు చేశారు.
- పోలింగ్ కేంద్రాల వల్ల మొబైల్ ఫోన్లు భద్రపర్చుకోవడానికి ప్రత్యేకంగా ఒక గదిని కేటాయిస్తారు.
- పోలింగ్ ఏజెంట్లకు ప్రిసైడింగ్ అధికారి ఫామ్ 17సీని అందజేస్తారు. ఫామ్ 17సీలోని వివరాలకు, ఈవీఎం కౌంటింగ్ యూనిట్లలోని ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమైతే దానికి సంబంధించిన వీవీప్యాట్లను రీకౌంటింగ్ చేస్తారు.
- ఈవీఎంలలోని ఓట్లను లెక్కించడానికి ముందే పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.

నవంబర్ 22లోగా బిహార్ ఎన్నికలు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాది నవంబర్ 22వ తేదీలోగా నిర్వహిస్తామని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22న ముగుస్తుందని అన్నారు. రాష్ట్రంలో 243 శాసనసభ స్థానాలు ఉండగా, వీటిలో 38 ఎస్సీ, రెండు ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) కోసం బూత్-లెవెల్ అధికారులకు సైతం శిక్షణ ఇచ్చామన్నారు. 243 అసెంబ్లీ స్థానాలకు గాను 243 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను(ఈఆర్‌ఓ) నియమించామని తెలిపారు. ఎస్ఐఆర్‌ను జూన్ 24న ప్రారంభించామని, ఈఆర్‌ఓతోపాటు బూత్-లెవెల్ అధికారుల సాయంతో గడువులోగా విజయవంతంగా పూర్తిచేశామని వివరించారు. ఎస్ఐఆర్ విజయవంతం అయినందుకు ఓటర్లకు జ్ఞానేశ్ కుమార్ అభినందనలు తెలియజేశారు. తమకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పండుగలో చురుగ్గా భాగస్వాములు కావాలని బిహార్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఛత్ వేడుకలో పాల్గొన్నంత ఉత్సాహంగా ఎన్నికల పండుగలో పాల్గొనాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని సూచించారు. బిహార్‌లో 90,217 మంది బూత్ లెవెల్ అధికారులు ఎస్ఐఆర్ నిర్వహించారని, అద్భుతంగా పనిచేసి దేశానికి ఒక ఉదాహరణగా నిలిచారని జ్ఞానేశ్ కుమార్ ప్రశంసించారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణ విషయంలో మొత్తం దేశానికే వారు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. బిహార్‌లో 22 ఏళ్ల తర్వాత ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసినట్లు వెల్లడించారు.

లద్దాఖ్ కోసం పోరాటం ఆగదు

- పూర్తి అహింసాయుత మార్గంలో పోరాటం చేద్దాం
- లేహ్ ఘటనపై స్వతంత్ర న్యాయ విచారణ జరిగేవరకు జైల్లోనే ఉంటా
- న్యాయవాది ద్వారా లద్దాఖ్ ప్రజలకు సోనమ్ వాంగ్‌చుక్ సందేశం

లేహ్: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వటంతోపాటు రాష్ట్రాన్ని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో శాంతియుత పోరాటం కొనసాగిద్దామని లద్దాఖ్ ప్రజలకు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. గత నెల 24న లేహ్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారటంతో నలుగురు వ్యక్తులు చనిపోయిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు కారకుడిగా పేర్కొంటూ జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసి రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో నిర్బంధించారు. వాంగ్‌చుక్ సోదరుడు కసెతన్ దోర్జీ లేతో కలిసి న్యాయవాది హాజీ ముస్తఫా శనివారం జైల్లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ముస్తఫా ద్వారా లద్దాఖ్ ప్రజలకు వాంగ్‌చుక్ సందేశం పంపారు. 'నేను శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నాను. నాకోసం ప్రార్థించినవారందరికీ ధన్యవాదాలు. లేహ్ ఘటనలో చనిపోయినవారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని, అరెస్టయిన వారు ధైర్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను. గత నెల 24న జరిగిన ఘర్షణపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నా. అలా విచారణ జరగని పక్షంలో నేను జైల్లోనే ఉండాలని నిర్ణయించుకున్నా. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా ఇచ్చి ఆరో షెడ్యూల్ చేర్చాలన్న లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమోక్రాటిక్ అలయన్స్ (కేడీఏ)కు నేను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నా. డిమాండ్ల సాధన కోసం ప్రజలంతా శాంతియుతంగా, ఐకమత్యంతో సంపూర్ణంగా గాంధీ మార్గంలో పోరాటం చేయండి'అని వాంగ్‌చుక్ ఇచ్చిన సందేశాన్ని ముస్తఫా తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. లేహ్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. నిరసనకారులను సోమవారం చర్చలకు ఆహ్వానించింది. అయితే, వాంగ్‌చుక్‌తోపాటు పోలీసులు అరెస్టు చేసినవారందరినీ విడుదల చేసి, లేహ్ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించేంతవరకు చర్చల్లో పాల్గొనబోమని ఎల్ఏబీ, కేడీఏ తేల్చి చెప్పాయి.

నేడు ఇజ్రాయెల్, హమాస్ చర్చలు

ఈ వారంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం

కైరో: గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదల ప్రధాన లక్ష్యాలుగా సోమవారం ఈజిప్ట రాజధాని కైరోలో చర్చలు మొదలుకానున్నాయి. పరోక్షంగా జరిగే ఈ చర్చల కోసం ఇజ్రాయెల్, హమాస్ ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ వారంలోనే కాల్పుల విరమణ, బందీల విడుదల మొదలుకానుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 20 సూత్రాల కాల్పుల విరమణ ప్రతిపాదనలపై ఇజ్రాయెల్‌తోపాటు హమాస్ సానుకూలంగా స్పందించడం తెల్సిందే. హమాస్ చెర నుంచి ఇజ్రాయెలీలకు విముక్తి కల్పించడం, బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీని యన్లను విడుదల చేయడంపైనే సోమవారం ప్రధానంగా చర్చలు జరపనున్నారు. ఈ చర్చల్లో అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ సైతం పాలుపంచుకుంటారని ఈజిప్ట విదేశాంగ శాఖ తెలిపింది. బందీల విడుదల, గాజాలో 2025 ఆగస్టులో ఉన్న ప్రాంతాల్లోకి ఇజ్రాయెల్ బలగాలను ఉపసంహరించుకోవడంపై అంగీకారం కుదిరిన నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి అతి సమీపంలో ఉన్నట్లేనని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తెలిపారు. కాల్పుల విరమణ దిశగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ముస్లిం మెజారిటీ కలిగిన 8 దేశాలు ఓ ఉమ్మడి ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాయి. పాలస్తీనా అథారిటీకి గాజాను అప్పగించాలని, గాజాను వెస్ట్‌బ్యాంక్‌లో విలీనం చేయాలని, గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని ఆ దేశాలు డిమాండ్ చేశాయి. ఈ చర్యలన్నిటి కంటే ముందుగా బందీల విడుదల, అందుకు బదులుగా ఖైదీలకు విముక్తి జరగాల్సి ఉందన్నారు. ఇలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గాజాపై బాంబింగ్‌ను నిలిపివేయాలని ఇజ్రాయెల్‌ను కోరిన తర్వాతా దాడులు కొనసాగినట్లు సమాచారం. గాజా నగరం, రఫాలపై ఆదివారం జరిగిన దాడుల్లో కనీసం 12 మంది చనిపోయారని వివిధ ఆస్పత్రుల సిబ్బంది చెప్పారు. కాల్పుల విరమణ ఇంకా మొదలుకానందున, గాజాలో ప్రస్తుతానికి బాంబింగ్‌ను పూర్తిగా ఆపేయలేదని ఇజ్రాయెల్ ప్రభుత్వ ప్రతినిధి మీడియాకు చెప్పారు. అదేవిధంగా, చర్చలను జాప్యం చేసేందుకు హమాస్ చేసే ప్రయత్నాలపై ఓ కన్నేసి ఉంచామని కూడా ఆమె తెలిపారు.

నేపాల్‌లో ప్రకృతి విలయం

భారీ వర్షాలు, వరదలతో 51 మంది మృతి • మరో 12 మంది జాడ గల్లంతు

కఠ్మాండు/న్యూఢిల్లీ: కుండపోతగా కురుస్తున్న వర్షాలతో వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో నేపాల్‌లో కనీసం 51 మంది ప్రాణాలు కోల్పోయారు. వరదల్లో కొట్టుకుపోయిన కొందరి జాడ తెలియాల్సి ఉందని ఆదివారం ఉదయం అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో 114 మందిని సహాయక సిబ్బంది కాపాడారన్నారు. నేపాల్‌లోని ఏడు ప్రావిన్స్‌లకు గాను ఐదు ప్రావిన్స్‌ల పరిధిలో రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వం సోమవారం జాతీయ సెలవు దినంగా ప్రకటించింది. కోషి ప్రావిన్స్‌లోని ఇలమ్ జిల్లా ప్రకృతి ప్రకోపానికి తీవ్రంగా ప్రభావితమైంది. రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఈ జిల్లాలో 37 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు గల్లంతయ్యారు. ఇలమ్‌లో కొండచరియ విరిగి ఓ నివాసంపై పడటంతో అందులో నిద్రిస్తున్న కుటుంబంలోని ఆరుగురు చనిపోయారని అధికారులు వివరించారు. ఖోటంగ్, రౌటహట్ జిల్లాల్లో పిడుగుపాటుకు ఐదుగురు బలయ్యారు. పంచ్‌తర్ జిల్లాలో కుంభవృష్టి కారణంగా రోడ్లు దెబ్బతినడంతో జరిగిన ప్రమాదంలో ఆరుగురు చనిపోయారు. లంగంగ్ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు వెళ్లి నలుగురు గల్లంతయ్యారు. రసువా జిల్లాలో నలుగురు, ఇలమ్, బారా, కఠ్మాండుల్లో ఒక్కొక్కరు చొప్పున వరదల్లో కొట్టుకుపోయారని అధికారులు వివరించారు. ఆదివారం మధ్యాహ్నానికి పరిస్థితి మెరుగవడంతో రాజధాని కఠ్మాండులోకి ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలను అనుమతించారు. అయితే, వర్షాల తీవ్రతకు అక్కడక్కడా రోడ్లు కొట్టుకుపోయి దెబ్బతినడంతో వాహనదారులు ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో, నేపాల్ ప్రజలు జరుపుకునే అతిపెద్దదైన దుషైన్ పండుగ ముగియడంతో వివిధ ప్రాంతాల నుంచి కఠ్మాండుకు తిరిగి వచ్చే వారితో రోడ్లు కిటకిటలాడుతున్నాయి. రాత్రి వేళ వాహనదారులు ప్రయాణాలను మానుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రోడ్లు కొట్టుకుపోయాయని, కొండచరియల ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. కొన్ని రహదారులను ముందుజాగ్రత్తగా మూసివేశామన్నారు. ఆగకుండా కురుస్తున్న వానలు, దృగ్గోచరత తక్కువగా ఉండటంతో కఠ్మాండులోని అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు శనివారం విమానాల రాకపోకలను నిలిపివేశారు.

ఆదుకుంటాం: మోదీ

నేపాల్‌లో భారీ వర్షాలతో వాటిల్లిన నష్టంపై భారత ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మిత్ర దేశం నేపాల్‌కు ఎలాంటి అవసరమున్నా ముందుగా స్పందించి ఆదుకునేందుకు భారత్ కట్టుబడి ఉంటుందని ఆదివారం ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ కష్ట కాలంలో నేపాల్ ప్రజలకు, ప్రభుత్వానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.


డార్జిలింగ్‌లోని కుప్పకూలి నీళ్లలో పడిపోయిన బాలాసోన్ వంతెన


వంతెనలోని ఓ భాగంపై ఇరుక్కున్న జనం


తీవ్రంగా దెబ్బతిన్న సిలిగురి-డార్జిలింగ్ రహదారి

బెంగాల్‌లో కొండచరియల బీభత్సం

- మిరిక్, డార్జిలింగ్ హిల్స్‌లో 20 మంది మృతి
- ఇళ్లు, రహదారులు ధ్వంసం, కూలిన వంతెనలు
- ఎక్కడికక్కడే చిక్కుకుపోయిన వేలాది మంది పర్యాటకులు

డార్జిలింగ్: పశ్చిమ బెంగాల్‌లోని మిరిక్, డార్జిలింగ్ హిల్స్‌లో కుండపోత వర్షాలు బెంబేలెత్తించాయి. శనివారం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల ధాటికి పెద్ద సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు చిన్నారులు సహా కనీసం 20 మంది మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. వరదలు, కొండచరియల బీభత్సం వల్ల ఇళ్లు ధ్వంసమయ్యాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వంతెనలు కూలిపోవడంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వేలాది మంది పర్యాటకులు ఎక్కడికక్కడే చిక్కుకుపోయారని బెంగాల్ ప్రభుత్వ అధికారులు ఆదివారం వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఉత్తర బెంగాల్‌లో 12 గంటల వ్యవధిలో 300 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అంచనా. డార్జిలింగ్, సర్సాలీ, జస్‌బీర్‌గావ్, మిరిక్ బస్తీ, ధార్‌గావ్, నాగ్రాకటా, మిరిక్ లేక్ తదితర ప్రాంతాల్లో మరణాలు సంభవించినట్లు చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బెంగాల్ మంత్రి ఉదయన్ గుహ పేర్కొన్నారు. మిరిక్‌లోనే అత్యధికంగా నష్టం వాటిల్లినట్లు ఎన్డీఆర్ఎఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇక్కడ 11 మంది మృత్యువాత పడ్డారని, ఏడుగురు క్షతగాత్రులను రక్షించామని వివరించింది. డార్జిలింగ్‌లో ఏడుగురు మరణించారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని సబ్ డివిజనల్ అధికారి రిచర్డ్ స్పష్టంచేశారు. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో జనం ప్రాణాలు కోల్పోవడం పట్ల బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందజేస్తామని ప్రకటించారు. సోమవారం ఉత్తర బెంగాల్‌లో పర్యటిస్తానని చెప్పారు. భూటాన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం ఉత్తర బెంగాల్‌ను ముంచెత్తుతోందని స్థానికులు తెలిపారు.


ధ్వంసమైన ఇళ్లు

ప్రధాని మోదీ సంతాపం

పశ్చిమ బెంగాల్‌లో వర్షాలు, కొండచరియల కారణంగా జనం మరణించడం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో ప్రధానమంత్రి పోస్టు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలకు తగిన ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. డార్జిలింగ్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని ఉద్ఘాటించారు. ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ సైతం సంతాపం ప్రకటించారు.

సెలవులకని వచ్చి..

డార్జిలింగ్: దసరా సెలవులల్లో సరదాగా గడపడానికి డార్జిలింగ్‌కు చేరుకున్న పర్యాటకులకు చేదు అనుభవమే మిగిలింది. ఉత్తర బెంగాల్‌లో భారీ వర్షాలు, వరదలకు తోడు కొండచరియలు విరిగిపడడంతో టూరిస్టులకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వేలాది మంది బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఆహారం, మంచినీరు కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రకృతి అందాలకు పెట్టింది పేరు డార్జిలింగ్. ఈ ప్రాంతాన్ని క్వీన్ ఆఫ్ హిల్స్ అంటారు. దేశ విదేశాల నుంచి నిత్యం వేలాది మంది వస్తుంటారు. దసరా సెలవులు కావడంతో భారీగా తరలివచ్చారు. ఎడతెరిపిలేని వర్షాలు వారి ఆనందాన్ని ఆవిరి చేశాయి. పర్యాటక ప్రాంతాలు ఆదివారం బోసిపోయి కనిపించాయి. ఎక్కడ చూసినా దెబ్బతిన్న రహదారులు, కూలిన చెట్లే దర్శనమిచ్చాయి. రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. టూరిస్టులు అతిథి గృహాలు, హోటల్ గదుల్లోనే ఉండిపోయారు.

12 గంటల్లో పెను విధ్వంసం

ఉత్తర బెంగాల్‌లోని డార్జిలింగ్ సహా కొండ ప్రాంతాల్లో 12 గంటల వ్యవధిలోనే భారీ వర్షం కురిసింది. వరదలు, కొండచరియల వల్ల ఇళ్లు కూలిపోవడంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నిత్యం సందడిగా కనిపించే డార్జిలింగ్ హిల్స్‌లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. సహాయక చర్యల కోసం వచ్చిన వాహనాల చప్పుడు మాత్రం వినిపిస్తోంది. కొండల నుంచి రాళ్లు కూలుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దుకాణాలు మూతపడ్డాయి. బాధితులు సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. బౌద్ధ గురువులు ఆకలితో ఉన్న పిల్లలకు బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు. కాలేజీ విద్యార్థులు విరాళాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. డార్జిలింగ్‌లో 1968లో భారీ వర్షం కురిసింది. అప్పట్లో వందలాది మంది మరణించారు. ఆనాటి విషాదాన్ని వృద్ధులు గుర్తుచేసుకుంటున్నారు.

దగ్గు మందు కలకలం

- మధ్యప్రదేశ్‌లో 14కు చేరిన మరణాలు
- ప్రభుత్వ వైద్యుడి అరెస్ట్

ఛింద్వారా/బేతుల్: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లా విషపూరిత దగ్గు సిరప్ తాగి 14 మంది చిన్నారులు చనిపోవడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఇందుకు సంబంధించి మరికొన్ని పరిణామాలు శని, ఆదివారాల్లో చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడొకరిని నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై శనివారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్యుడితో పాటు సిరప్ ఉత్పత్తిదారుపైనా కేసు నమోదు చేశారు. మరణాలకు కారణంగా భావిస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్‌పై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. సిరప్‌లో అత్యంత విషపూరితమైన పదార్థం ఉన్నట్లు నమూనాల్లో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

భయపెట్టిన మరో 'బోయింగ్'

- విమానంలో అన్నీ బాగానే ఉన్నా ఓపెన్ అయిన ర్యాట్
- బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌లో విమానం అత్యవసర ల్యాండింగ్
- ఈ నెల 4న ఘటన
- వెల్లడించిన ఎయిర్ ఇండియా

ముంబై: భారత్‌కు చెందిన ప్రముఖ పౌర విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా వద్ద ఉన్న బోయింగ్ 787 విమానాలు ప్రయాణికులను భయపెడుతూనే ఉన్నాయి. గత జూన్ 12న అహ్మదాబాద్‌లో ఈ సంస్థకు చెందిన బోయింగ్ 787–8 రకానికి చెందిన ఏఐ171 విమానం ఉప్పకూలి 260 మంది మరణించిన ఘటన మరువకముందే శనివారం(4న) బ్రిటన్‌లో అదే సంస్థకు చెందిన అదే రకం విమానం ప్రమాదపు అంచుల వరకు వెళ్లింది. అమృతసర్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళ్తున్న విమానంలో రామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్) ఉన్నట్టుండి ఆన్ కావటంతో ప్రయాణికులు, సిబ్బందితోపాటు ఎయిర్ ఇండియా అధికారులు ఉలిక్కిపడ్డారు. ఎట్టకేలకు విమానం బర్మింగ్‌హామ్‌లో సురక్షితంగా దిగినప్పటికీ.. అందులో ప్రయాణించినవారికి మాత్రం అది పీడకలగా మిగిలిపోయింది.

ఏం జరిగిందంటే..

ఈ నెల 4న అమృతసర్ నుంచి బర్మింగ్‌హామ్‌కు బయలుదేరిన బోయింగ్ 787 (ఏఐ 117) విమానం గమ్యస్థానానికి కొద్దిసేపట్లో చేరుకుంటుందనగా అందులోని ర్యాట్ ఒక్కసారిగా ఆన్ అయింది. ర్యామ్ అనేది విమానం వెనుక చక్రాల సమీపంలో ఉండే చిన్నపాటి టర్బైన్. ఇది సాధారణంగా విమానం లోపలికి ముడుచుకుని ఉంటుంది. విమానంలో ఇంజిన్లు పనిచేయనప్పుడు, ఎలక్ట్రానిక్, హైడ్రాలిక్, సాఫ్ట్‌వేర్ లాంటివి పూర్తిగా విఫలమైనప్పుడు మాత్రమే అత్యవసరంగా విమానానికి శక్తిని అందించేందుకు ఈ ర్యాట్ దానంతట అదే బయటకు వచ్చి తిరగటం ప్రారంభిస్తుంది. కానీ, ఈ విమానంలో అన్ని వ్యవస్థలు చక్కగా పనిచేస్తున్నప్పటికీ ర్యాట్ ఆన్ అవటంతో పైలట్లు ఉలిక్కిపడ్డారు. వెంటనే తమాయించుకుని బర్మింగ్‌హామ్‌లో విమానాన్ని సురక్షితంగా దించినట్లు ఎయిర్ ఇండియా ఆదివారం ప్రకటించింది. ఈ ఘటన నేపథ్యంలో ఈ విమానం ప్రయాణించాల్సిన బర్మింగ్‌హామ్-ఢిల్లీ సర్వీస్‌ను రద్దుచేసి, విమానాన్ని పరీక్షల కోసం పంపినట్లు వెల్లడించింది. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాద సమయంలో ర్యాట్ ఆన్ అయింది. అయినా, విమానం శక్తిని పుంజుకోలేక కూలిపోయింది. అయితే, ఆ విమానంలో ఫ్యూయల్ స్విచ్‌లు ఆపివేయటం వల్లనే ప్రమాదం జరిగిందని జూలైలో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) వెల్లడించిన దర్యాప్తు నివేదికలో తెలిపింది.

డీజీసీఏ విచారణ


ముంబై: ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 విమానంలో ఎలాంటి సాంకేతిక లోపం లేకపోయినా ర్యామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్) తెరుచుకోవటంపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) దర్యాప్తు ప్రారంభించింది. విమానంలో అత్యవసర ర్యాట్ ఓపెన్ అయ్యేలా ఎలాంటి సాంకేతిక సమస్యలను గుర్తించలేదని డీజీసీఏ అధికారి ఒకరు తెలిపారు. అయినా, విమానాన్ని సర్వీసింగ్ కోసం పౌర సేవల నుంచి తప్పించినట్లు వెల్లడించారు. ఆ ఘటనపై లోతైన దర్యాప్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



భక్తుల కోలాహలం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,04,301 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 90,774 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.0610 టీఎంసీలు.

నేడు కలెక్టరేట్‌లో ‘పీజీఆర్ఎస్’

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీపింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు.



న్యూస్‌రీల్

ఉత్సాహంగా కరాటే పోటీలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శారీరక దారుఢ్యంతో పాటుగా మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కరాటే ఎంతగానో దోహదం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వాడో–ఆర్ వైయూ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జీఎం దాస్ చెప్పారు. స్థానిక సీతారామపురంలోని ఐకాన్ స్కూల్ ఆవరణలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు ఆదివారం జరిగాయి. పోటీల ప్రారంభ సందర్భంగా జీఎం దాస్ మాట్లాడుతూ విద్యార్థులు కరాటేలో శిక్షణ తీసుకోవడం ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరిగి చదువులో కూడా రాణిస్తారన్నారు. ఐకాన్ స్కూల్ డైరెక్టర్ పార్థసారథి మాట్లాడుతూ కరాటే పోటీలకు తమ పాఠశాల ఆవరణ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై పలు అంశాల్లో ప్రతిభ చూపారు. ఆదిల్ పాషా బ్లాక్ బెల్ట్ సాధించగా.. 22 మంది ఎల్లో బెల్ట్, 10మంది ఆరెంజ్ బెల్ట్, 12 మంది గ్రీన్ బెల్ట్,10మంది పర్పుల్ బెల్ట్, 25 మంది బ్రౌన్‌బెల్ట్ సాధించారు. వీరికి జీఎం దాస్, పార్థసారథి సర్టిఫికెట్లను అందజేశారు.

మహిళలు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి




లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని, అప్పుడే ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి అన్నారు. మొగల్రాజపురంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన హర్ హెల్త్ ఉమెన్ సెంటర్‌ను ఆదివారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ఇలాంటి సెంటర్ వల్ల మహిళలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సెంటర్ సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఆర్. అర్చన మాట్లాడుతూ ఇక్కడ గర్భవతులకు చైల్డ్ బర్త్ క్లాసులు, బ్రెస్ట్ ఫీడింగ్ కన్సల్టేషన్, ప్రసవానికి ముందు, తర్వాత యోగా తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ఎం. త్రిపురసుందరీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



మచిలీపట్నంఅర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) కృష్ణా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. అనిత వ్యవహరించారు. కృష్ణా జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా అంబటిపూడి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా వి. సాంబశివరావు, కార్యదర్శులుగా పి. శివాజీ, గణేష్, సీహెచ్ నాగప్రసాద్, వై. శ్రీనివాసరావు, ఎస్. శివలక్ష్మి, వైవీ కృష్ణకాంత్, ఉపాధ్యక్షులుగా పి. సత్యనారాయణ, జేకే కిరణ్ కుమార్, డి. సాంబశివరావు, నాగరాజు, కల్యాణి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఏ. రాంగోపాల్, జి. వెంకటేశ్వరరావు, సీహెచ్ నారాయణ మూర్తి, ఎస్. పద్మావతి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రామారావు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్, జిల్లా పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య. టి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు



బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆరు పళ్ల విభాగంలో ఎనిమిది జతలు, ఆదివారం నాలుగు పళ్ల విభాగంలో ఎనిమిది జతలు పోటీలో నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు ఎడ్లపోటీలు తిలకించేందుకు హాజరయ్యారు.

అరుణగిరి

- భవానీ నామస్మరణతో మార్మోగిన ఇంద్రకీలాద్రి
- దుర్గమ్మ సన్నిధికి రికార్డు స్థాయిలో భవానీల రాక
- నేటి నుంచి ఆర్జిత సేవలు



భక్తులతో కిక్కిరిసిన దుర్గమ్మ ఆలయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి సన్నిధికి భవానీల రద్దీ కొనసాగుతోంది. దసరా ఉత్సవాలు ముగిసి మూడు రోజులవుతున్నా భవానీలు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివస్తూనే ఉన్నారు. అమ్మవారి ఆలయంతో పాటు కొండ దిగువన ఎక్కడ చూసినా భవానీ భక్తులే కనిపిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భవానీలను అమ్మవారి దర్శనానికి అనుమతించగా, రాత్రి వరకు రద్దీ కనిపించింది. సర్వ దర్శనం రెండు క్యూలైన్లతో పాటు రూ. 100, రూ.300, వీఐపీ క్యూలైన్‌లో సైతం దర్శనానికి అనుమతించారు. అంతే కాకుండా భవానీలకు త్వరగా దర్శనం చేయించేందుకు ఆలయంలోకి ప్రవేశించే ఆరు క్యూలైన్లతో పాటు



సీఎం గేటు ద్వారా కూడా అవకాశం కల్పించారు. విజయదశమి, తర్వాత మూడు రోజులు కలిపి మొత్తం 5లక్షల మంది భవానీలు అమ్మవారి దర్శనానికి విచ్చేసి ఉంటారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎండ, ఉక్కపోత..

వినాయకుడి గుడి నుంచి కొండపైకి చేరుకునేందుకు మూడు గంటలకు పైగా సమయం పట్టినట్లు భవానీలు పేర్కొంటున్నారు. కొండ దిగువన మంచి నీటిని పంపిణీ చేయడం లేదని వారు ఆరోపించారు. అంతే కాకుండా ఆదివారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాటు ఉక్కపోతగా ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఓం టర్నింగ్ వద్ద పలువురు పెద్దవారు అలసటతో సొమ్మసిల్లి పడిపోయారు. క్యూలైన్‌లో భవానీలతో పాటు వచ్చిన చిన్నారులు ఇబ్బందులకు గురి కావడంతో విషయం తెలుసుకున్న ఆలయ ఈవో, ఇతర అధికారులు బిస్కెట్లను పంపిణీ చేశారు.

నేటి నుంచి యథాతథం..

దసరా ఉత్సవాలు, భవానీల తాకిడి తగ్గుముఖం పట్టడంతో ఆదిదంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించే అన్ని ఆర్జిత సేవలను సోమవారం నుంచి యథాతధంగా నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన మొదలు శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణంనిర్వహించనున్నారు. భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు పొందలేని వారు నేరుగా ఆలయానికి విచ్చేసి కౌంటర్లలో టికెట్లు పొందవచ్చు. సోమవారం నుంచి దర్శన టికెట్ల విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం నుంచి మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలుస్తోంది.



దీక్ష విరమణ చేస్తున్న భక్తులు

కిటకిటలాడిన క్యూలైన్లు..

తెల్లవారుజామున రెండు గంటల నుంచే భవానీలు, భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యారు. మరో వైపున భవానీల తాకిడితో బస్టాండ్, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. వేలాదిగా భవానీలు తిరుగు ప్రమాణం అవుతుండగా, అదే స్థాయిలో రైళ్లు, బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల ద్వారా భవానీలు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం క్యూలైన్ల ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవడం కనిపించింది. రద్దీ నేపథ్యంలో ఘాట్‌రోడ్డుపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. వినాయకుడి గుడి వద్ద నుంచి మాత్రమే భవానీలు, భక్తులను ఆలయానికి అనుమతించారు. అమ్మవారి దర్శనం పూర్తయిన అనంతరం మహా మండపం దిగువన ఇరుముడులను, మాల విరమణ చేసిన భక్తులు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాల కోసం బారులు తీరారు.



ప్రసాదం కౌంటర్ వద్ద భక్తుల రద్దీ

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురు సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో శీనానాయక్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడికి ట్రస్ట్ బోర్డు నియామకం నేపథ్యంలో పలువురు సిబ్బందికి విధులు కేటాయిస్తూ ఈ ఆదేశాలు జారీ చేశారు. రూ. 300, రూ. 100 టికెట్ల తనిఖీ పాయింట్‌లో విధులు నిర్వర్తిస్తున్న అటెండర్ వీరబాబు, ఓం టర్నింగ్ లడ్డూ కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెల్పర్ పి. భాస్కర్, అద్దాల మండపం వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎన్ఎంఆర్ ఎస్. వెంకటేశ్వరరెడ్డి, ప్రోటో కాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న అవుట్‌సోర్స్ కె. శ్రీనివాస్, పీవీ రెడ్డి చారిటీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న అటెండర్ ఈ.శేషగిరిని ట్రస్ట్‌బోర్డుకు కేటాయించారు. వీక్‌లీ ఆఫ్‌లలో విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ గణేష్‌ను ఓం టర్నింగ్ లడ్డూ పాయింట్‌కు, మాడపాటి సత్రంలో విధులు నిర్వర్తిస్తున్న రికార్డు అసిస్టెంట్ పి. రాంబాబును టికెట్ తనిఖీ పాయింట్‌కు, ఎన్ఎంఆర్ సునీతను వీక్‌లీ ఆఫ్‌ల నుంచి శివాలయం టికెట్ల కౌంటర్‌కు బదిలీ చేశారు. రూ.300 టికెట్ తనిఖీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న అవుట్ సోర్స్ నరేంద్ర, కండక్టర్ డి. విజయ్‌కుమార్‌ను కనకదుర్గనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు బదిలీ చేశారు.

అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి

పటమట(విజయవాడతూర్పు): అన్ని రంగాల్లో వెనుకబడిన అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు అన్నారు. పటమట అయ్యప్పనగర్‌లోని రాష్ట్ర సంఘం కార్యాలయ భవనంలో రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లోని అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సంఘం ప్రతినిధులందరు ఐక్యంగా కృషి చేయాలన్నారు. సైకం భాస్కరరావు, మునిరెడ్డి కృష్ణ, జుట్టు నీలకంఠం, లకనం నాగాంజనేయులు, అవనిగడ్డ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరు మారలేదే!

తారస్థాయికి ఎంపీ వర్సెస్ తిరువూరు ఎమ్మెల్యే ఫైట్

- టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కొలికపూడి డుమ్మా
- నేతలు ఆహ్వానించినా స్పందించని వైనం
- ఎంపీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసినట్లు ప్రచారం
- గ్రామాల్లోనూ ఎంపీ, ఎమ్మెల్యే వర్గాలుగా విడిపోయిన ‘తమ్ముళ్లు’



తిరువూరులో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ చిన్ని

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో విభేదాలు మరోమారు బహిర్గతమయ్యాయి. తిరువూరు మండల, పట్టణ టీడీపీ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసే నిమిత్తం నెలరోజులుగా పనులు జరుగుతున్నాయి. ఆదివారం ఈ కార్యాలయ ప్రారంభోత్సవం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం శనివారం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన సమాచారాన్ని స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాసరావుతో పాటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా పాల్గొంటారని ఎంపీ కార్యాలయం జారీ చేసిన కార్యక్రమ పత్రంలో పేర్కొంది. అయితే తన ప్రమేయం లేకుండా ఏర్పాటు చేస్తున్న పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే విముఖత చూపి వేరే కార్యక్రమాలు ఖరారు చేసుకున్నారని ఆయన వర్గీయులు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ఆహ్వానించడానికి వెళ్లిన నాయకులను సైతం ఎమ్మెల్యే పట్టించుకోలేదని సమాచారం. చివరికి ఎంపీ కేశినేని మాత్రమే కార్యాలయాన్ని ప్రారంభించారు. వారం రోజుల్లో తిరువూరు పట్టణంలోని వార్డుల్లో, రాజుగూడెం గ్రామంలో కూడా పార్టీలోని ఎంపీ, ఎమ్మెల్యే అనుచరుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. పార్టీ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాసరావు ఎంపీతో కలిసి కార్యక్రమాలకు హాజరవుతుండగా, ఎమ్మెల్యే గైర్హాజరుపై పార్టీ స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. తన ప్రమేయం లేకుండానే తిరువూరు నియోజకవర్గంలోని పలు నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులను కేటాయించడం కూడా ఎమ్మెల్యే అలకకు కారణంగా భావిస్తున్నారు.

ఎంపీ క్యాంపు కార్యాలయమేనా?

తిరువూరులో ఆదివారం ప్రారంభించిన టీడీపీ కార్యాలయం విజయవాడ ఎంపీ కేశినేని క్యాంపు కార్యాలయంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంపీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారని, ఈ కార్యాలయాల్లో ఎంపీ సిబ్బంది నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

క్యూ కట్టిన వాహనాలు



కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద బారులుదేరిన వాహనాలు

కంచికచర్ల(నందిగామ): దసరా సందర్భంగా సొంతూరు బాట పట్టిన ప్రజలు ఆదివారం తిరుగు పయనమయ్యారు. సెలవులు పూర్తవటం, సోమవారం నుంచి పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పని ప్రదేశాలకు వివిధ వాహనాల్లో బయలు దేరారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. దీంతో కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు బారులుదీరాయి. టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ సిస్టం ఉన్నప్పటికీ, ప్లాజా వద్ద ఐదు లైన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కువ వాహనాలు రావటంతో ఆలస్యం అవుతోందని ప్రయాణికులు అంటున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 15 వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లాయని టోల్‌ప్లాజా మేనేజర్ జయప్రకాష్ తెలిపారు.



యువతకు తియ్యని స్ట్రోక్!

చిన్న వయసులో బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్‌కు ప్రధాన కారణం మధుమేహమే!

» విజయవాడ కృష్ణలంకకు చెందిన 29 ఏళ్ల రమేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటారు. అతనికి రెండేళ్ల కిందట మధుమేహం ఉన్నట్లు గుర్తించాడు. తనకు ఎలాంటి దుష్ఫలితాలు లేవంటూ సక్రమంగా మందులు వాడలేదు. దీంతో ఇటీవల హఠాత్తుగా పక్షవాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

» భవానీపురానికి చెందిన 35 ఏళ్ల రాజేంద్ర ప్రైవేటు ఉద్యోగి. విధుల్లో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటాడు. దీంతో రెండేళ్ల కిందట దయాబెటిస్ సోకింది. సక్రమంగా మందులు వాడకపోవడంతో అదుపులో ఉండేది కాదు. ఇటీవల ఆయాసం రావడంతో వెంటనే ఆస్పత్రికి వెళ్లగా హార్ట్ అటాక్‌కు గురైనట్లు తెలిపారు.

ఇలా వీరిద్దరే కాదు.. ఇటీవల కాలంలో అనేక మంది చిన్న వయస్సులోనే పక్షవాతం లేదా గుండెపోటుకు గురవుతున్నారు.

- జీవనశైలితో చిన్న వయస్సులోనే మధుమేహం
- గుండె, మెదడు రక్త ప్రసరణపై తీవ్ర ప్రభావం
- ప్రీ డయాబెటిక్ వారికి హార్ట్‌స్ట్రోక్ ముప్పు
- జీవనశైలిలో మార్పులు అవసరం
- మార్పు రాకుంటే పెనుముప్పే అంటున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కదలికలేని జీవన విధానం, వినూత్న ఆహారపు అలవాట్లు చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, ఒబెసిటీ వ్యాధుల బారిన పడేలా చేస్తున్నాయి. జీవనశైలి వ్యాధులను నిర్లక్ష్యం చేయడంతో మూడు పదుల వయస్సులోనే బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్‌స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఒకప్పుడు మధుమేహం సోకిన ఐదు నుంచి పదేళ్ల తర్వాత స్ట్రోక్‌కు గురయ్యేవారు. ఇప్పుడు ప్రీ డయాబెటిస్‌లో కూడా స్ట్రోక్ వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నిత్యం వంద మందికిపైగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు బ్రెయిన్‌స్ట్రోక్, గుండెపోటులకు గురైన వారు వస్తుంటారు. వారిలో 30 నుంచి 40ఏళ్ల వయస్సు వారు 15 నుంచి 20 శాతం ఉంటున్నారు. యువతలో గుండె పోటు, బ్రెయిన్‌స్ట్రోక్‌కు అదుపులో లేని మధుమేహమే కారణమని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన ఒత్తిళ్లు, అదుపులోలేని మధుమేహం, ఆధునిక జీవనశైలి కూడా స్ట్రోక్‌కు దారితీస్తున్నట్లు చెబుతున్నారు.

ఇలా చేస్తే సేఫ్..

- క్రమం తప్పకుండా మందులు వాడుతూ మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి.
- హెచ్‌బీఏ1సీ 6.5 శాతం ఉండేలా చూసుకోవాలి
- జీవనశైలిని మార్చుకుని వ్యాయామం, యోగా వంటి వాటిపై దృష్టి పెట్టాలి
- మధుమేహులకు ఆల్కాహాల్, సిగరెట్ అలవాటు ఉంటే మార్చుకోవాలి.
- ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి.
- అవసరమైతే వైద్యుల సూచన మేరకు రక్తం పలుచబడే మందులు వాడాలి.

ప్రధాన కారణాలివే..

- మధుమేహుల్లో గుండె, మెదడు రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ గడ్డలు ఏర్పడతాయి. దీంతో రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడి స్ట్రోక్‌కు గురవుతుంటారు.
- మధుమేహం అదుపులో లేని వారిలో రక్తం గడ్డ కట్టే గుణం ఉంటుంది. అలాంటి గడ్డలు రక్తప్రసరణకు అడ్డువచ్చి స్ట్రోక్ వస్తుంది.
- సుగర్ పేషెంట్స్‌కి రక్తనాళాలు సన్నపడటం, బిగుతుగా మారడం జరుగుతుంది. దీంతో రక్తప్రసరణ సరిగ్గా జరగక పోవడంతో స్ట్రోక్‌కు గురయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.
- ఈ మూడు కారణాలతో ఎక్కువగా స్ట్రోక్‌కు గురవుతున్నట్లు చెబుతున్నారు.

సుగర్ అదుపులో లేకుంటే ముప్పే..



ఇటీవల 30, 40 ఏళ్ల వయస్సులో బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారిని చూస్తున్నాం. వారిలో మధుమేహులు కూడా ఉంటున్నారు. అదుపులో లేని మధుమేహం బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తోంది. రక్తనాళాలు కుచించుకుపోవడం, కొలెస్ట్రాల్, రక్తం గడ్డలు మెదడు రక్తప్రసరణపై ప్రభావం చూపుతాయి. మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడంతో పాటు, కొలెస్ట్రాల్, రక్తం పలుచబడే మందులు కూడా వైద్యుల సూచన మేరకు వాడాలి. సక్రమంగా మందులు వాడటం, ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం ద్వారా స్ట్రోక్ రాకుండా చూడవచ్చు.

– డాక్టర్ డి. అనీల్‌కుమార్ న్యూరాలజిస్ట్

క్రమం తప్పకుండా మందులు వాడాలి..



మధుమేహులు దుష్ఫలితాలు రాకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం. అందుకు క్రమం తప్పకుండా మందులు వాడాలి. చాలా మంది ఒకసారి వైద్యుడు రాసిన మందులనే నెలల పాటు వాడుతుంటారు. అది మంచిది కాదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సుగర్‌లెవల్స్ పరీక్ష చేయించుకోవడం ద్వారా మందులు పనితీరు తెలుసుకోవచ్చు. అవసరమైతే వైద్యులు మందులు మార్చడం, డోసు పెంచడం, తగ్గించడం చేస్తారు. సక్రమంగా మందులు వాడటం, జీవనశైలి, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే స్ట్రోక్ బారిన పడకుండా చూడవచ్చు.

– డాక్టర్ ఎం. శ్రీకాంత్, మధుమేహ నిపుణుడు

రేపటి ఫ్యాప్టో ధర్నాకు వైఎస్ఆర్టీఎఫ్ మద్దతు

మచిలీపట్నం అర్బన్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య (ఫ్యాప్టో) విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ధర్నాకు వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ (వైఎస్ఆర్టీఎఫ్) సంపూర్ణ మద్దతు అందిస్తుందని కృష్ణాజిల్లా అధ్యక్షులు ఎం.వి.మహంకాళి రావు, ప్రధాన కార్యదర్శి వి.వి.చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం 16 నెలలు గడిచినా ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. గతంలోనూ టీడీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏల విషయంలో ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ బకాయిలు, మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అందిస్తామని, ఐఆర్‌ను ప్రకటిస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటి వరకూ నెరవేర్చలేదని గుర్తుచేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

క్లుప్తంగా

ఆర్యవైశ్యుల జీవన విధానం ఆదర్శనీయం



పటమట(విజయవాడతూర్పు): ప్రస్తుత ఆధునిక సమాజంలో ఆర్యవైశ్యుల జీవన విధానం ఎంతో మందికి ఆదర్శమని శ్రీ వాసవి మాట్రిమోనియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేవీఆర్ఎస్‌పి రాజు అన్నారు. ఆదివారం గురునానక్ కాలనీ ఆర్ఆర్ గార్డెన్స్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పెనుగొండ సుబ్బరాయుడుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వివాహ విషయాల్లో మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఈ సంస్థను ఏర్పాటు చేసి ఉచితంగా సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో ఐక్యత చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నగరంలోని ఆర్యవైశ్య ప్రముఖులు తొండెపు హనుమంతరావు, రఘుబాబు, హరినాథ్ నగరంలోని పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పోలీసుల స్వాధీనం



ఇబ్రహీంపట్నం: జాకీర్ హుస్సేన్ కాలేజీ రోడ్‌లో అక్రమ రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో స్థానిక పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన 8 టిక్కీల బియ్యం బస్తాలు, వాటిని తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ బియ్యం రవాణాపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ తాము అందుబాటులో లేమంటూ సమాధానం చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ అధికారులు అక్రమ రేషన్ వ్యాపారుల వద్ద నుంచి అందిన కాడికి దోచుకుంటూ తమ విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పత్తి రైతు చిత్తు

- అధిక వర్షాలతో రంగు మారుతున్న పత్తి పైరు
- పూత రాలిపోయి కాపు లేక వెలవెలబోతున్న వైనం
- క్రాప్ ఇన్సూరెన్స్ లేకపోవడంతో తీవ్రంగా నష్టం
- పెట్టుబడులు కూడా రాని వైనం



వత్సవాయి మండలంలో వర్షాలకు గిడసబారి పగిలిన పత్తి

వత్సవాయి/జి.కొండూరు: ఈ ఏడాది పత్తి పంట రైతులను చిత్తు చేసింది. అధిక వర్షాలకు గిడసబారి పత్తి కాయ పగిలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. పత్తి తీతకు వచ్చే దశలో వర్షాలు పడుతుండడంతో పూత రాలిపోయి, కాయలు మచ్చలు వచ్చి రాలిపోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. నష్టాల్లో ఆదుకునే క్రాప్ ఇన్సూరెన్స్ సైతం ప్రభుత్వం తొలగించడంతో నష్టాలను పూడ్చుకునే మార్గం కనిపించక పత్తి రైతులు లబోదిబోమంటున్నారు.

భారీగా పెరిగిన పెట్టుబడులు...

గతంలో కంటే పత్తి పంటకు పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎకరం పత్తి పంట సాగు చేయాలంటే కౌలుతో కలిపి రూ.50 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ఎకరం భూమి కౌలు ధర రూ.20 వేల వరకు ఉండగా, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు కలిపి మరో రూ.25 వేలు అవుతుంది. ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చి రూ.7 వేలు ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు ఉంటుంది. లేనిపక్షంలో నష్టాలు తప్పవు.



చెవుటూరు గ్రామ శివారులో అధిక వర్షాల వలన రంగుమారిన పత్తి పైరు

మొక్కజొన్న సాగుపై ఆశ...

పత్తి పంట దెబ్బతినడంతో రెండవ పంటగా రైతులు మొక్కజొన్నపై ఆశలు పెట్టుకుంటున్నారు. తీతకు వచ్చిన పత్తిని తీసుకుని వెంటనే పత్తిని తొలగించి దాని స్థానంలో మొక్కజొన్న పంట వేసేందుకు రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. గతేడాది కూడా పత్తి పంట నష్టం రావడంతో రెండవ పంటగా మొక్కజొన్న సాగుచేశారు. ఎకరానికి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చి క్వింటా రూ.2 వేల పైనే పలకడంతో రైతులకు కొంత ఊరట లభించింది. ఈ సీజన్ కూడా రైతులు మొక్కజొన్నపైనే ఆశలు పెట్టుకుంటున్నారు.

ఎకరానికి 5 క్వింటాళ్లు కూడా రాదు



ఈ ఏడాది పత్తి పంట ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడులు కూడా రావు. వర్షాలకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. పెరిగిన పెట్టుబడులు, కౌలుతో పత్తి రైతుకు నష్టం తప్పదు.

– ఎస్.లక్ష్మీనారాయణ, మక్కపేట, వత్సవాయి మండలం

నష్టపరిహారం అందించాలి



వ్యవసాయాధికారులు గ్రామాలలో పర్యటించి నష్టపోయిన పత్తి పంటను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక అందించాలి. వ్యవసాయశాఖ నివేదిక మేరకు నష్టపరిహారం చెల్లించి రైతును ఆదుకోవాలి.

– కనగాల రమేష్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు

క్రాప్ ఇన్సూరెన్స్ ఉంటే భరోసా ఉండేది



నేను 25 ఎకరాలు కౌలుకి తీసుకొని పత్తి సాగు చేశాను. కౌలు ఎకరానికి రూ.15వేలు, పెట్టుబడి ఇప్పటి వరకు ఎకరానికి రూ.25వేల చొప్పున రూ.10లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షాల వలన మొదట వచ్చే పూత, కాయ రాలిపోయింది. మళ్లీ పూత రావాలంటే పెట్టుబడి పెట్టాలి. తీవ్రంగా నష్టపోతాం. క్రాప్ ఇన్సూరెన్స్ ఉంటే భరోసా ఉండేది.

– హేమానాయక్, రైతు, గడ్డమణుగు, జి.కొండూరు మండలం

వర్షాలకు పత్తి పైరు ఎర్రబారింది



నేను దేవుడి మాన్యంతో పాటు కౌలుకి తీసుకొని మొత్తంగా 70 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వర్షాల వల్ల పత్తి పైరు అంతా ఎర్రబారుతోంది. కాత వచ్చే దశలో రోజూ వర్షం పడడంతో పూత రాలిపోయింది. మరలా పూత రావాలంటే ఎరువులు, పైమందులు వాడాలి. ఇప్పటికే ఎకరానికి కౌలుతో కలిపి రూ.30వేల నుంచి నలభై వేల వరకు ఖర్చు అయ్యింది.

– సాదుపాటి శ్రీనివాసరావు, రైతు, చెవుటూరు, జి.కొండూరు మండలం

హైస్కూల్ ప్రహరీని ఢీకొన్న ప్రైవేటు బస్సు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే 65వ నంబర్ జాతీయ రహదారిపై అదుపు తప్పిన ప్రైవేట్ ట్రావెల్స్ ఎలక్ట్రికల్ బస్ రహదారికి అవతల వైపు ఉన్న హైస్కూల్ ప్రహరీ గోడను ఢీకొట్టి లోపలకు దూసుకు వెళ్లింది. అదృష్టవశాత్తు అవతల రోడ్‌లో ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సేకరించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి సుమారు 10.30 గంటలకు న్యూగో ఎలక్ట్రికల్ ప్రైవేట్ బస్ విజయవాడ నుంచి హైదరాబాద్ బయలుదేరింది. గొల్లపూడి ఆంధ్రా హాస్పిటల్ దాటిన తరువాత రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్ దగ్గర బస్ నిలిపి డ్రైవర్ టీ తాగారు. అనంతరం బస్ స్టార్ట్ చేసి ఒక వాహనం అడ్డుగా ఉండటంతో దాన్ని తప్పిస్తూ స్టీరింగ్‌ను కుడి వైపునకు తిప్పి మళ్లీ ఎడమ వైపునకు తిప్పుదామనుకునే లోపు అదుపు తప్పి అదే వైపునకు వెళ్లి సెంట్రల్ డివైడర్ పైకి ఎక్కి రోడ్డుకు అవతల ఉన్న శ్రీపోసాని నరసింహారావు చౌదరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడను ఢీకొంది. ఆ వేగానికి పాఠశాల లోపలకు కొంత మేర దూసుకుపోయింది. ఆ సమయంలో బస్‌లో ముగ్గురు ప్రయాణికులే ఉండటంతో వారికి గానీ, డ్రైవర్‌కు గానీ ఏమీ కాలేదు. జాతీయ రహదారి కావడంతో వాస్తవానికి ఆ సమయంలో గొల్లపూడి వైపు నుంచి వాహనాలు వస్తుంటాయి. అయితే ఘటన జరిగిన సమయంలో ఆ మార్గంలో ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వం

భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రంబాల సతీష్ కుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ(ఆర్.సి.పి.ఐ) రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ కుమార్ అన్నారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకువెళుతోందని, కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల శ్రమను యాజమాన్యాలకు దోచిపెట్టే విధంగా ముందుకు సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటుచేసి యువతను ప్రోత్సహిస్తామని చెప్తున్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకుడు దేవర నాగన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను వెంటనే ప్రారంభించాలని, రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీలను పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, శివకోటి రాజు, వి.మంగ, సుగుణమ్మ, రియాజ్, అరుణ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలే



గన్నవరం: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే ఆదివారం గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. అమరావతి పర్యటన నిమిత్తం ఆయన తిరుపతి నుంచి సాయంత్రం ఇక్కడికి విచ్చేశారు. విమానాశ్రయంలో అథవాలేకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ జె.రంగలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా ఉప సంచాలకులు ఎం.రమాదేవి తదితరులు స్వాగతం పలికారు.

ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు

- నవంబర్ 8,9 తేదీల్లో నరసరావుపేటలో నిర్వహణ
- వెల్లడించిన పల్నాడు జిల్లా బాలోత్సవ్ కమిటీ సభ్యులు



పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆవరణలో నవంబరు 8,9 తేదీల్లో ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా బాలోత్సవ్ కమిటీ అధ్యక్షుడు, ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు పేర్కొన్నారు. కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని, అదేస్ఫూర్తితో ఈ ఏడాది పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలు నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. గౌరవ సలహాదారుడు, శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. పోటీల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.అంజిరెడ్డి, గౌస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనేలా రూపకల్పన చేసి తమ కళలను ఆవిష్కరింప చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పోటీలో పాల్గొనదలచిన ఉపాధ్యాయులు ఈనెల 26వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98665 62260, 99498 09821 నంబర్లలో లేదా palnadubalotsavam@gmail.com మెయిల్ ఐడీలో సంప్రదించాలని సూచించారు.

బందరు కాలువలో పడి యువకుడు గల్లంతు



బందరు కాలువలో గాలిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

పెనమలూరు: యనమలకుదురులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు బందరు కాలువలో పడి గల్లంతైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన ఉద్దగిరి లక్ష్మి తన ఇద్దరు కుమారులతో కలసి ఉంటోంది. పెద్ద కుమారుడు వెంకటేష్ (20) తాపీ పనులు చేస్తాడు. అతను శనివారం పనికి వెళ్లి సాయంత్రం వచ్చి బందరు కాలువ వంతెన వద్ద కూర్చున్నాడు. తల్లి లక్ష్మి కుమారుడు వెంకటేష్‌ను ఇంటికి రమ్మని చెప్పగా, వెంకటేష్ తల్లిని ఇంటికి వెళ్లమని తాను వెంటనే వస్తానన్నాడు. అయితే వంతెనపై కూర్చున్న వెంకటేష్ రాత్రి 9 గంటలకు ప్రమాదవశాత్తు వంతెన పైనుంచి బందరు కాలువలో పడి గల్లంతయ్యాడు. ఇది చూసిన స్థానికులు వెంకటేష్ తల్లి లక్ష్మికి సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు వచ్చి కాలువలో గాలించినా వెంకటేష్ ఆచూకీ తెలియలేదు. దీంతో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని అధికారులు రంగంలోకి దించారు. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది బందరు కాలువలో వెంకటేష్ కోసం గాలిస్తున్నారు. ఇంకా ఆచూకీ తెలియలేదు.

ఒక్క రోజులో బెజవాడ రైల్వే డివిజన్‌కు రూ.5 కోట్ల ఆదాయం



ప్రయాణికులతో రద్దీగా మారిన విజయవాడ రైల్వేస్టేషన్

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): ఒకేరోజు అత్యధిక మంది ప్రయాణికుల నిర్వహణ, ఆదాయంలో విజయవాడ డివిజన్ సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. ఈనెల 4న విజయవాడ డివిజన్ నుంచి ఇతర ప్రాంతాలకు 2.8 లక్షల మంది ప్రయాణికుల రవాణా ద్వారా రూ.5 కోట్ల ఆదాయం సాధించింది. ఇది కేవలం ఒక్కరోజులో డివిజన్ సాధించిన సరికొత్త మైలురాయిగా నిలిచింది. దీంతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ డివిజన్‌కు వచ్చే ప్రయాణికులతో కలుపుకొని మొత్తం 5.5 లక్షల మంది ఒక్క రోజు ప్రయాణం చేశారు. అందులో విజయవాడ స్టేషన్ నుంచి 82 లక్షల మంది ఇతర ప్రాంతాలకు ప్రయాణించడం ద్వారా రూ.2 కోట్లు ఆదాయం వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ స్టేషన్‌లో దిగిన వారితో కలుపుకొని 1.7 లక్షల మంది ప్రయాణికులుగా నమోదైంది. ప్రయాణికుల రద్దీ పెరుగుదలను సమర్థంగా నిర్వహించడానికి డివిజన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో అదనంగా 25 బుకింగ్, రిజర్వేషన్ కౌంటర్‌లను ప్రారంభించారు. 72 ఏటీవీఎం (ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్‌లు) ఏర్పాటు, ప్రయాణికులకు సహాయం చేసేందుకు 110 ఏటీవీఎం ఫెసిలిటేటర్లను 24 గంటలు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మోహిత్ సోనాకియా అరుదైన రికార్డు సాధించడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

పెనమలూరు: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాది ఆకురాతి ప్రసన్న సోదరుడు చందర్లపాడుకు చెందిన వడ్లమూడి పవన్‌తేజ (25) పోరంకి శ్రీచైతన్యలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ క్యాంపస్‌లోనే ఉంటున్నాడు. పవన్‌తేజ శనివారం సాయంత్రం పురుగుల మందు ఫొటో తీసి బావ జగదీష్‌కు పెట్టాడు. దీంతో జగదీష్ కంగారుపడి పవన్‌తేజ మిత్రులు సతీష్, భార్గవ్‌లకు ఫోన్ చేసి చెప్పాడు. సతీష్, భార్గవ్ చైతన్య క్యాంపస్‌లో ఉన్న పవన్‌తేజను కలిసి నచ్చచెప్పి వెళ్లి పోయారు. రాత్రి 7 గంటలకు పవన్‌తేజ భార్గవ్‌కు ఫోన్ చేసి తాను కాలేజీ సమీపంలో పంటపొలాల్లో ఉన్నానని, విషం తాగానని చెప్పాడు. మిత్రులు ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే పవన్‌తేజ వాంతులు చేసుకోవటంతో పటమటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పవన్‌తేజ ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి మహిళ ....

కంకిపాడు: అనారోగ్యంతో చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని కుందేరు గ్రామానికి చెందిన దంతనాల కనకదుర్గ (49) విశ్వప్రసాద్ భార్యాభర్తలు. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి సంతానం. కనకదుర్గ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం తెల్లవారుజామున గ్రామంలోని చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి...

కంకిపాడు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...కంకిపాడుకు చెందిన చలపాటి వీర వెంకట సత్యనారాయణమూర్తి (41) నాగలక్ష్మి భార్యాభర్తలు. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి సంతానం. మూర్తి కుటుంబం కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతోంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక గతనెల 24న సత్యనారాయణమూర్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

లారీ ఢీకొని చిరు వ్యాపారి దుర్మరణం



ఘటనా స్థలంలో మృతుడు సూర్యారావు

గుడివాడరూరల్: లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని బిళ్లపాడు రైల్వేగేటు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పట్టణంలోని ద్రోణాదుల వీధిలో నివాసం ఉండే లంకపల్లి సూర్యారావు(63) గుడివాడ మండలంలోని బిళ్లపాడు సమీపంలో ఉన్న చినఎరుకపాడు గ్రామంలో ప్లాస్టిక్ సామానులు అమ్మే షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం షాపు దగ్గర నుంచి స్కూటీపై ఇంటికి వస్తుండగా బిళ్లపాడు రైల్వే గేటు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యారావును రోడ్డుపై లారీ ఈడ్చుకెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. రోడ్డు ప్రమాద విషయాన్ని తెలుసుకున్న తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య లంకపల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బుడమేరులోకి ఎన్టీటీపీఎస్ బూడిద నీరు



ఇబ్రహీంపట్నం వద్ద బుడమేరులో నేరుగా బూడిద నీరు కలవడంతో రంగు మారిన నీరు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడే బూడిద నీటిని సమీపంలోని వేడినీటి కాలువ (బుడమేరు)లోకి అధికారులు విడుదల చేస్తున్నారు. ఈ పరిణామాలతో బుడమేరు కాలువలో నీరు మొత్తం బూడిద రంగులోకి మారింది. నెలరోజులకు పైగా జూపూడి సమీపంలోని బూడిద చెరువులో లారీలకు బూడిద లోడింగ్ నిలిచిపోయింది. దీంతో చెరువు మొత్తం బూడిద నిల్వలతో నిండిపోయింది. ప్రత్యామ్నాయ మార్గంగా ఆర్‌డబ్ల్యూఎస్ పంపింగ్ స్కీమ్ సమీపంలో బుడమేరులోకి బూడిద నీరు విడుదల చేస్తున్నారు. కృష్ణానదిలో చేరిన బూడిదతో నదీ పరీవాహక గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. ఫిల్టరైజేషన్ లేని గ్రామాల్లో నేరుగా తాగునీటిని సరఫరా చేస్తే బూడిద నీటినే పంపిణీ చేయాల్సి వస్తుంది. ఈ పరిణామాలతో బూడిద నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని స్థానికులు భయపడుతున్నారు. నదిలోకి బూడిద నీటిని వదలడం నిలిపివేయాలని కోరుతున్నారు.

సూర్యలంక తీరంలో ఇద్దరు గల్లంతు : కాపాడిన సెక్యూరిటీ సిబ్బంది



బాపట్ల టౌన్: సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తూ ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా టేకుమిట్ల గ్రామానికి చెందిన బొడ్డు శ్రీను, నల్గొండ జిల్లాకు చెందిన కత్తుల వినేష్‌లు తమ కుటుంబ సభ్యులతో ఆదివారం మధ్యాహ్నం సూర్యలంక తీరానికి చేరుకున్నారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ఇరువురు నీటిలో మునిగారు. గమనించిన కుటుంబసభ్యులు కేకలు వేయడంతో అప్రమత్తమైన కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, గజ ఈతగాళ్లు సముద్రంలోకి వెళ్లారు. కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను సురక్షితంగా కాపాడి ఒడ్డుకు చేర్చారు. కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, గజ ఈతగాళ్లను ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. తీరానికి వచ్చే పర్యాటకులు పోలీస్ సిబ్బంది ఆదేశాలను పాటించి, సముద్రస్నానాలు చేయాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

వీఎంసీలో నేడు ప్రజాఫిర్యాదుల కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ నగర వాసులకు అందించే మౌలిక వసతుల కల్పనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో, చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నాని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర వీఎంసీ అధికారులు పాల్గొని నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం నాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ గురించి క్విజ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ నాయకులు చరిత్రలో తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ప్రతి నెల చివరి ఆదివారం క్విజ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశంను ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. క్విజ్‌ను మాస్టర్ దేవ్, దుర్గా భవాని నిర్వహించారు. వివిధ స్కూల్స్ నుంచి నాలుగో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు 30 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా అనే చిన్నారి మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి విద్యార్థులను ఆకట్టుకుంది. గాంధీజీ వేషధారణతో అలరించిన ఉమాను గ్రంథాలయ అధికారి జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య సమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించారు. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న భక్తులకు ఆరోగ్య సిద్ధితో పాటు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయని పేర్కొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

గుడివాడటౌన్: జనగణనలో కుల జనగణన చేపట్టి జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లను ఎ,బి,సి,డి లుగా వర్గీకరణ చేసిన తరువాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో బీసీలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. బీసీలు అధిక సంఖ్యాకులుగా ఉండి కొన్ని సామాజిక వర్గాలు రాజ్యాధికారానికి దూరమవుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే లోపు ఈ నిర్ణయాన్ని తీసుకోవాలని ఆయన కోరారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. మహిళా భక్తులు పాల పొంగళ్లను పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు తాగునీరు తదితర కనీస సౌకర్యాలను కల్పించారు.

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్టు చేయాలి

పామర్రు: మండలంలోని కొమరవోలులో మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా సభ్యులు ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా సభ్యులు బి.కీర్తి, పి.రజని, డి.ఆదిలక్ష్మీ మాట్లాడారు. కొమరవోలులో నివాసం ఉంటున్న మేడపాటి వసంతను అదే గ్రామానికి చెందిన మేరుగుమాల పవన్ అనే వ్యక్తి నాలుగు నెలల నుంచి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ వేధింపులు భరించలేక ఈ నెల 4వ తేదీన ఆ మహిళ ఆత్మహత్యకు పాల్పండిందని తెలిపారు. వేధింపుల కారణం అయిన పవన్‌ను వెంటనే అరెస్టు చేసి, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కొండ ప్రాంతాల్లో వసతులు కరువు!

- నివాసాల మధ్య మురుగు
- ఆవేదనలో స్థానికులు
- స్పందించని అధికారులు

గుణదల(విజయవాడ తూర్పు):నివాసాల మధ్య ఏళ్ల తరబడి నిలిచి ఉన్న మురుగు కొండ ప్రాంత ప్రజల పాలిట శాపంగా మారింది. ఎక్కడ చూసినా వాడుక, బురద నీరే దర్శనమిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దుర్వాసనల మధ్య జీవనం సాగిస్తున్నారు. మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని కార్మికనగర్, యారం వారి వీధి, ఎలిశల వారి వీధి తదితర ప్రాంతాల్లో వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్లు దెబ్బతిని తాగునీరు అందడం లేదు. ఎగువ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం సర్వసాధారణమైంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ మృగ్యమైపోయింది. కల్వర్టులు కుంగిపోయాయి. దీంతో ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు నేరుగా రోడ్ల పైనే ప్రవహిస్తోంది. రోజుల తరబడి మురుగునీరు ఇలా రోడ్డు పై ప్రవహిస్తున్నా సబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మాచవరం ఎలిశల వారి వీధిలో రోడ్డు పై పారుతున్న మురుగునీరు



నివాసాల మధ్య ఉన్న మురికి కూపం

నివాసాల మధ్య మురుగు..

యారం వారి వీధి ఎగువ భాగంలో ముదు దశాబ్దాలుగా ఉన్న మురుగు నీటి సమస్య నెలకొంది. కొండ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పెద్ద గుంత ఉంది. చుట్టుపక్కల ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు ఈ గుంతలోకి చేరుతోంది. ఎటూ పోయే వీలు లేకపోవడంతో ఏళ్ల తరబడి ఈ నీరు ఇక్కడే నిల్వ ఉండి మురికి కూపంగా మారింది. దీని వలన స్థానికుల కంటి మీద కునుకు లేకుండా పోతోంది. నిత్యం విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగి పగలు రాత్రి తేదా లేకుండా దాడి చేస్తున్నాయి. ఫలితంగా స్థానికులు విష జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్ర తరంగా ఉంటుంది. నీటి స్థాయి పెరిగి ఇళ్లు సైతం ముంపునకు గురవుతుంటాయి. పాములు, విషపురుగులు ఇళ్లలోకి చేరి స్థానికులను కలవర పెడుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టినా ఫలితం లేకుండా పోయింది.

ముక్కు మూసుకోవాల్సిందే



యారం వారి వీధిలో ఉన్న మురికి కూపం కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతినిత్యం దుర్వాసన వస్తోంది. ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–కె.మురళి, మాచవరం

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న హాకర్స్, వెండర్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ తూర్పు నగర నగర అధ్యక్ష కార్యదర్శులు వి.బి. రాజు, ఎన్.కోటబాబు డిమాండ్ చేశారు. స్థానిక రాణిగారితోటలోని గుంటూరు బాపనయ్య భవనంలో ఆదివారం విజయవాడ తూర్పు నగర హాకర్స్ అండ్ వెండర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు, కోటబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి చూపించక పోయినా చిరువ్యాపారులు ఎవరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వీరి ఉపాధిని దెబ్బతీసి నోటి దగ్గర కూడును లాగేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అధికార పార్టీ నాయకులు ఉపాధి కల్పించకపోగా ఉన్న షాపులు, బండ్లను బలవంతంగా తొలగిస్తున్నారని చెప్పారు. పైన్లు వేసి కేసులు నమోదు చేయిస్తున్నారని తెలిపారు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వాలు ప్రజలకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్న హాకర్లకు కనీసం బ్యాంకు లోన్లు కూడా ఇవ్వటంలేదన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవిత బీమా, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.చంద్రశేఖర్, కో కన్వీనర్‌గా బి.శ్రీనివాసులు, 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.కృష్ణ, టి.చంద్రశేఖర్, ఎస్.నాగేశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి తదితర పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీనివాసుని కల్యాణం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాల్లో ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు నాయాణం తనుజ విష్ణు వర్ధనాచార్యుల బృందంచే పుష్పయాగయుక్త శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం శోభాయమానంగా జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ప్రజలు క్షేమంగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవంలో గంగాధర భట్ల రాధా కుమారి చేసిన అన్నమాచార్య కీర్తనలు ఆహ్లాదంగా, మనస్సుకి స్వాంతన చేకూర్చే విధంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ జంధ్యాల శంకర్, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, టీటీడీ విశ్రాంత సమన్వయాధికారి మండలీక శ్రీకృష్ణ కుమార శర్మ, జోన్నవితుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సమేతంగా శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మల్లాది విష్ణు

కనులపండువగా దుర్గమ్మ ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):కనకదుర్గ అమ్మ వారి దేవి శరన్నవరాత్రుల ప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాలాంధ్ర రోడ్డులో కనకదుర్గ అమ్మ వారి ప్రభ మహోత్సవం కనులపండువగా జరిగింది. గత నెల 22 వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు చలసాని చౌక్‌లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లో కనకదుర్గమ్మను వివిధ అలంకారాల్లో పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి సన్నాయి వేళాలు, బేతాళ వేషాలు, మహిళల కోలాటంతో పాటుగా కోయ డాన్స్‌తో భారీ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు.

'అమృత మంజరి' అంకురం - 2 పుస్తకావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనుజ్యోతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత దేవాశీర్ ఇలారి రచించిన 'అమృత మంజరి' అంకురం – 2(తన ప్రేమగల చేతుల నైపుణ్యం) ఆధ్యాత్మిక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం గొల్లపూడిలోని శ్రీపద్మావతి కల్యాణమండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మికవేత్త వేదాంతం రాజగోపాల చక్రవర్తి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతి, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ బేధం లేకుండా అందరూ సమానమేనని పేర్కొన్నారు. ఒకే దేవుడు.. ఒకే దేశం నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భగవంతుని జ్ఞానాన్ని అందరూ పొందేందుకు మనుజ్యోతి ఆశ్రమం నిర్వాహకులు అమృత మంజరి పేరుతో పుస్తకాలను ప్రచురించడం అభినందనీయమని అన్నారు. ప్రపంచ శాంతి కోసం మనుజ్యోతి ఆశ్రమం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మాజీ అధ్యక్షుడు చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ గురూజీ మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి వాసు, గరికపాటి శివశంకర్, నిడుమోలు రమా సత్యనారాయణ, పీవీ రామన్, పణుకు రాజేష్, సాంబశివ రావు, జయప్రకాష్, ఎస్ఎన్ ప్రసాద్, నరేంద్ర, నానాజీ, శ్రీను, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు అలరించాయి.



అమృత మంజరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజగోపాల చక్రవర్తి తదితరులు

ట్రాఫిక్ వలయంలో పటమట!



నిర్మలాకాన్వెంట్ వద్ద జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులో దుస్థితి



స్టెల్లా కళాశాల వద్ద అనధికారిక పార్కింగ్

- సర్వీస్‌రోడ్డును ఆక్రమించేస్తున్న అనధికారిక పార్కింగ్
- జంక్షన్ల వద్ద అదే పరిస్థితి

పటమట(విజయవాడతూర్పు):పటమటలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల తాకిడితో రోడ్లపై నడిచే అవకాశం కూడా లేకుండా పోతుంది. నగరంలోని సర్వీస్ రోడ్లపై ఆక్రమణలు నిరంతర సమస్యగా మారాయి. ట్రాఫిక్ రద్దీ, భద్రత గురించి స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నగరానికి ల్యాండ్‌మార్క్‌గా ఉన్న బెంజ్ సర్కిల్ వంటి ప్రాంతాల నుంచి ఆక్రమణలను తొలగించడానికి అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. రోడ్ల వెంబడి అనధికారికంగా వాహనాలను పార్కింగ్ చేయటం వల్ల రాకపోకలకు విఘాతం కలగటమే కాకుండా వాహన చోదకుల మధ్య తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం–సాయంత్ర వేళల్లో జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి, సర్వీస్‌రోడ్డు నుంచి జాతీయ రహదారికి వచ్చే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. అనధికారికంగా పార్కింగ్ చేసే వాహనాల యజమానులు, ఈ ప్రాంతంలోని వివిధ వ్యాపార సముదాయాలు, వాణిజ్య కార్యకలాపాలు సాగించే సంస్థలకు అవగాహన కల్పించి తగిన చర్యలు తీసుకోవాలని పటమటవాసులు కోరుతున్నారు.

అనధికారిక పార్కింగ్‌పై చర్యలేవీ..?

చెన్నై–కోల్‌కత్త జాతీయ రహదారి నం. 16 వెంబడి రమేష్ ఆస్పత్రి నుంచి స్క్రూబ్రిడ్జి వరకు ఉన్న సర్వీస్ రోడ్డులో ప్రతినిత్యం వందలాది వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆస్పత్రులు కూడా ఉండటం, కొంతమంది తమ వాహనాలకు ఇక్కడ నిలిపి వెళ్లిపోవటంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని స్థితి నెలకొంటుంది. ఈ ప్రాంతమంతా బ్యాంకులు, ఆస్పత్రులు, కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వాహనాల విక్రయ షోరూంలు, మాల్స్‌తోపాటు ఇతర వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరిగే ప్రాంతం కావటంతో ఆయా షోరూంలలోకి వచ్చే వారంతా రోడ్డువెంబడి ఇరువైపుల వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో వెళ్లాలంటేనే వాహన చోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలపటంతో రాకపోకలు సాగించే వాహనాలు వాటికి తగిలినా, రాసుకున్న సంబంధింత వాహన యజమానులు ఘర్షణలు దిగుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో రామవరప్పాడుకు చెందిన ఓ వ్యక్తి తన కారును ఓ మాల్ ఎదురుగా నిలపటంతో గురునానాక్‌కాలనీ వైపు వెళ్లే వాహనం తగిలింది.. దీంతో సదరు వాహన యజమానికి ప్రయాణికుడికి మధ్య తీవ్రస్థాయిలో వివాదం చోటుచేసుకుంది. రోడ్డుపైనే ఇరువురు ఘర్షణకు దిగటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సుమారు గంటపాటు నిలిచిపోయింది.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనునిత్యం ద్విచక్రవాహనాదారులు హెల్మెట్‌లేదని, కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోలేదని చలాన్లు రాసే పోలీసులు అనధికారిక పార్కింగ్‌లపై చర్యలు తీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రాంత మంతా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు అధికంగా జరగటంతో వారి నుంచి పోలీసులకు నెలవారి మామూళ్లు అందుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.

అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



వెండి బోనం సమర్పించేందుకు వస్తున్న భవానీ



భక్తజన కీలాద్రి

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో భవానీల రద్దీ కొనసాగుతోంది. వేలాది మంది భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. ఆదివారం కావడంతో భవానీలతో పాటు సాధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



క్యూ లైన్‌లో అస్వస్థతకు గురైన భక్తురాలికి సపర్యలు చేస్తున్న బంధువులు



అమ్మ సన్నిధిలో భవానీలు



ఇరుముడి సమర్పిస్తున్న భవానీలు



దుర్గమాత మాల విరమణ చేస్తున్న గురు భవానీ

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేడు అన్నమయ్య గృహసాధన సమితి ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తిరుమల కొండపై కూల్చేసిన ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులవారి గృహాన్ని అక్కడే యథాతథంగా యథాస్థానంలో పునర్నిర్మించాలని కోరుతూ శ్రీఅన్నమయ్య గృహసాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. పవిత్రమైన అన్నమయ్య మండపంలో ఆయన స్వహస్తాలతో పూజించిన హనుమంతుని విగ్రహంతోపాటు అన్నమయ్య విగ్రహాన్నికూడా యథాస్థానంలో ఉన్నది ఉన్నట్లుగా పునఃప్రతిష్ఠించాలి. సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్లపూడిలోని వెంకయ్య స్వామి ఆలయం నుంచి ఎండోమెంట్ ఆఫీస్ వరకు వివిధ పీఠాధిపతులు, స్వామీజీలు, కళాకారులతో ప్రదర్శనగా బయలుదేరి దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందించనున్నట్లు అన్నమయ్య గృహసాధన సమితి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా...

'మేఘా' కృష్ణారెడ్డికి మాతృ వియోగం


విజయలక్ష్మి (ఫైల్)

గుడ్లవల్లేరు(గుడివాడ): కృష్ణాజిల్లా డోకిపర్రుకు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత కృష్ణారెడ్డి తల్లి పురిటిపాటి విజయలక్ష్మి(75) మరణించారు. ఆమె భౌతికకాయానికి ఆదివారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంతకుముందు మాజీ మంత్రులు కొడాలి వెంకటేశ్వరరావు(నాని), పేర్ని వెంకట్రామయ్య(నాని), మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, కాంగ్రెస్ నేత కేవీపీ రామచంద్రరావు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, చింతమనేని ప్రభాకర్‌తో పాటు విజయలక్ష్మి సోదరుడు పామిరెడ్డి పిచ్చిరెడ్డి(పి.పి.రెడ్డి) తదితరులు నివాళులర్పించారు. డోకిపర్రు గ్రామాభివృద్ధికి విజయలక్ష్మి ఎంతో కృషి చేశారని.. పేదలకు ఎనలేని సేవలందించారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

ఆటో డ్రైవర్లకు తండ్రీకొడుకులు మోసం

వైఎస్సార్‌సీపీ నేత గౌతమ్ రెడ్డి విమర్శ



సాక్షి, అమరావతి: అధికారంలోకి వస్తే బ్యాడ్జి ఉన్న ప్రతి ఒక్క ఆటో, లారీ, టిప్పర్ డ్రైవర్‌కు వార్షికంగా రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని దారుణంగా మోసగించారని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లకు అండగా వారి సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో ఈనెల్లో సమావేశం ఏర్పాటు చేసి, వారి సమస్యల పరిష్కారంపై కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం గౌతమ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 'వాహనమిత్ర పథకం కింద వైఎస్ జగన్ అర్హులైన ఆటో డ్రైవర్లు అందరికీ రూ.10 వేలు ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు, 15 లక్షల మంది అర్హులు ఉంటే, కేవలం 2.90 లక్షల మందికే డబ్బు జమ చేసి దాదాపు లక్షల మందికి వెన్నుపోటు పొడిచారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఇస్తామని ఎన్నికల్లో చెప్పింది రూ.2,250 కోట్లు కాగా, జమచేసింది కేవలం రూ.436 కోట్లు. ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. 16 నెలల కూటమి పాలన మోసం, దగా, వెన్నుపోటు, అబద్ధాలకు ప్రతిరూపంగా నిలుస్తోంది. ఎన్నికల్ల ఇచ్చిన హామీలు వేరు. అమలు చేస్తున్న తీరు వేరు. అమలు చేశామని చెప్పుకునే విధానం అంతకన్నా వేరు' అని విమర్శించారు.

మద్యం తాగి తల్లిని వేధిస్తున్నాడని తండ్రిని చంపిన కుమారుడు


క్రిష్ణ మృతదేహం

కుక్కునూరు: రోజూ మద్యం తాగి తల్లిని వేధిస్తుండడాన్ని చూసి తట్టుకోలేక కుమారుడు కొట్టడంతో తండ్రి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన కిష్టం క్రిష్ణ (52) మద్యానికి బానిసై రోజూ భార్య ధనలక్ష్మిని శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. శనివారం రాత్రి సమయంలో మద్యం పూటుగా సేవించి వచ్చిన క్రిష్ణ భార్యను తిడుతూ, కొడుతుండగా చిన్న కుమారుడైన జవహర్ తల్లిని ఎందుకు కొడుతున్నావంటూ ఆవేశంతో తండ్రి తలను గుమ్మానికి కొట్టడంతో తలకు గాయమైంది. ఆ రాత్రి గాయంతోనే పడుకున్న క్రిష్ణ ఆదివారం ఉదయానికి మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

స్టాక్స్‌పై అవగాహన ఉంది.. కానీ ఇన్వెస్ట్ చేయం

స్టాక్‌మార్కెట్లో పెట్టుబడికి వెనుకాడుతున్న అత్యధిక భారతీయ కుటుంబాలు

63 శాతం మందికి అవగాహన ఉంటే ఇన్వెస్ట్ చేస్తున్నది 9.5 శాతం మందే

రాష్ట్రంలో ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నవారు 6 శాతమే

తక్కువ నష్టభయం ఉన్నవాటిపైనే 80 శాతం కుటుంబాల చూపు

సెబీ తాజా సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశీయ స్టాక్ సూచీలు నూతన గరిష్టస్థాయిల దిశగా దూసుకుపోతున్నా.. భారతీయులు అత్యధిక మంది ఈ అంశాలను గమనిస్తున్నారేగానీ, పెట్టుబడి పెట్టడం ద్వారా వాటి ప్రతిఫలాలను పొందడం లేదు. స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) తాజాగా నిర్వహించిన ఇన్వెస్టర్ సర్వే–2025 ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అత్యధికమందికి స్టాక్‌మార్కెట్‌పై అవగాహన ఉన్నా వాస్తవంగా పెట్టుబడి పెడుతున్న వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉందని ఈ సర్వే వెల్లడించింది. స్టాక్‌మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్స్ పథకాల్లో కనీసం ఒకదానిపైనైనా 63 శాతం మందికి అవగాహన ఉన్నప్పటికీ 9.5 శాతం మంది మాత్రమే ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 400 పట్టణాలు, వెయ్యికిపైగా గ్రామాల్లో 90 వేల కుటుంబాలపై సెబీ ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం.. 21.3 కోట్లమందికి స్టాక్‌మార్కెట్‌పై అవగాహన ఉన్నా ఇన్వెస్ట్ చేసింది మాత్రం 3.2 కోట్ల మందే. పట్టణ ప్రాంతాల్లో 15 శాతం వరకు ఇన్వెస్ట్ చేస్తుంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఆరుశాతం మంది మాత్రమే ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా ఢిల్లీలో 20.7 శాతం మంది ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఆ తర్వాత గుజరాత్‌లో 15.4 శాతం మంది పెట్టుబడి పెడుతున్నారు.

భారతీయులు తక్కువ నష్టభయం ఉండే పథకాల్లో ఇన్వెస్ట్ చేయడానికి మొగ్గుచూపుతున్నారు. 80 శాతం మంది ఎటువంటి నష్టభయం లేని సురక్షితమైన పథకాల్లో పెట్టుబడి పెట్టేందుకే ముందుకొస్తున్నారు. పెట్టుబడిదారుల్లో 79.7 శాతం మంది తక్కువ నష్టభయం ఉన్నవాటిని, 14.7 శాతం మంది కొద్దిగా రిస్క్ ఉన్నవాటిని ఎంపిక చేసుకుంటుండగా.. 5.6 శాతం మంది ఎక్కువ రిస్క్ తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఈక్విటీల్లో కూడా అత్యధికంగా సగటున 6.7 శాతం మంది ఇన్వెస్ట్ చేస్తుంటే షేర్లలో 5.3 శాతం మంది పెట్టుబడి పెడుతున్నారు. ఈక్విటీ పెట్టుబడుల్లో ఉండే సంక్లిష్ట పరిస్థితులపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో వెనుకాడుతున్నట్లు 74 శాతం మంది తెలిపారు. వీటిపై కొద్దిగా అవగాహన కల్పిస్తే పెట్టుబడులు పెట్టడానికి మొగ్గు చూపుతున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన పెంచుకుని పెట్టుబడులు పెట్టడానికి యువతీయువకులు ముందుకొస్తున్నారు. ఏటా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య పెరుగుతోందని, వచ్చే ఏడాది నుంచి పెట్టుబడులు పెడతామని 22 శాతం మంది చెప్పడం ఒక శుభసంకేతమని సెబీ ఆ నివేదికలో పేర్కొంది.

పెట్టుబడి రక్షణకే అధిక ప్రాధాన్యత

దక్షిణాది రాష్ట్రాల్లో ఇన్వెస్టర్ల శాతం ఇలా..

ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	కర్ణాటక
6.0	8.4	11.6
తమిళనాడు	**కేరళ**	**పాండిచ్చేరి**
9.8	9.5	16.4

సగటు ఈక్విటీ పెట్టుబడుల శాతం

కన్న కొడుకే కాలయముడయ్యాడు

డబ్బు పంపలేదని తల్లిని కడతేర్చిన కుమారుడు

మృతురాలు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని


లక్ష్మీదేవి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం: డబ్బు పంపలేదనే కోపంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకే కన్న తల్లిని గొంతుకోసి హత్యచేసిన ఘటన వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. డబ్బు పంపకుంటే కొడుకు ఇంటికి వస్తాడనుకుంది ఆ తల్లి. కానీ ఆ ఆలోచనతోనే కుమారుని ఆగ్రహానికి ఆమె బలైపోయింది. ప్రొద్దుటూరు మండలంలోని శ్రీరాంనగర్‌లో ఆదివారం ఉప్పలూరు లక్ష్మీదేవి (51)ని ఆమె కుమారుడు యశ్వంత్‌రెడ్డి కత్తితో గొంతుకోసి హతమార్చాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముచ్చుగుంట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఉప్పలూరు లక్ష్మీదేవి పట్టణంలోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి యశ్వంత్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. లక్ష్మీదేవి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. విజయర్ భాస్కరెడ్డి గతంలో బార్‌లో పని చేసేవాడు. యశ్వంత్‌రెడ్డి చెన్నైలోని సత్యభామ ఇంజినీరింగ్ కాలేజీలో మూడేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. జూబ్లీహిల్స్‌లోని హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. హాస్టల్, కోచింగ్ ఫీజులతో పాటు ఖర్చుల నిమిత్తం లక్ష్మీదేవి ప్రతినెలా అతనికి డబ్బు పంపేవారు. అయితే ఎప్పుడు ఇంటికి రమ్మన్నా వచ్చేవాడు కాదు. అతడికి సినిమాల్లో నటించాలనే కోరిక ఉందని, ఆ దిశగా ప్రయత్నాలు చేసేవాడని సన్నిహిత వర్గాల సమాచారం. కొన్ని నెలల క్రితం బంధువులు, కుటుంబ సభ్యులు యశ్వంత్‌రెడ్డిని కారులో బలవంతంగా ప్రొద్దుటూరుకు తీసుకొచ్చారు. ఆరోగ్యం సరిగా లేదని భావించిన తల్లిదండ్రులు అతనికి నాటు మందు కూడా తినిపించారు. **రెండు నెలల పాటు ఇంటి** వద్దే ఉన్న యశ్వంత్‌రెడ్డి తల్లిదండ్రులకు నచ్చజెప్పి మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఇటీవల కుమారుడిని ఇంటికి రమ్మని అనేకసార్లు తల్లిదండ్రులు ఫోన్ చేశారు. అయినా అతను రాలేదు. ఇటీవల యశ్వంత్‌రెడ్డి తల్లికి ఫోన్ చేసి హాస్టల్ ఫీజుతో పాటు తన ఖర్చులకు డబ్బు పంపించాలని కోరాడు. ఆమె పంపలేదు. అలా అయినా కొడుకు వస్తాడని తల్లిదండ్రులు భావించారు. ఆదివారం ఉదయాన్నే యశ్వంత్ ప్రొద్దుటూరుకు వచ్చాడు. నేరుగా వంట గదిలో ఉన్న తల్లి లక్ష్మీదేవితో గొడవపడ్డాడు. తండ్రి విజయభాస్కర్‌రెడ్డి బెడ్‌రూంలో స్నానం చేస్తుండగా గది తలుపులు మూసి గొళ్లెం పెట్టాడు. ఈ క్రమంలోనే వంటగదిలో ఉన్న కూరగాయలు కోసే కత్తి తీసుకొని లక్ష్మీదేవి గొంతుకోశాడు. ఆమె రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా ఈడ్చుకొచ్చి వరండాలో పడేశాడు. తర్వాత స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి బెడ్‌రూం తలుపులు తీయడంతో తండ్రి విజయభాస్కర్‌రెడ్డి బయటికి వచ్చాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. కాగా, తల్లిని హత్యచేసిన అనంతరం యశ్వంత్‌రెడ్డి ఇంట్లో టీవీ చూస్తూ కూర్చున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన పోలీసులుసైతం అవాక్కయ్యారు.

పిన్నిని ముక్కలుగా నరికి..!

గోనె సంచుల్లో కట్టి మురికి కాల్వల్లో పడవేత

విజయవాడలో దారుణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్వయాన అక్క కొడుకే ఆమె పాలిట రాక్షసుడిగా మారాడు. తన భార్య పుట్టింటికి వెళ్లిపోవడానికి పిన్నే కారణమని భావించి ఈ దారుణానికి ఒడిగట్టాడు. వృద్ధురాలని కూడా చూడకుండా తన మైనర్ కొడుకుతో కలిసి ముక్కలుముక్కలుగా నరికి గోనె సంచుల్లో చుట్టి వేర్వేరు కాలువల్లో పడవేశాడు. సభ్యసమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భవానీపురం ఊర్మిళానగర్‌లో విజయలక్ష్మి(60) ఒంటరిగా నివసిస్తోంది. ఆమె ఇంటికి కొద్ది దూరంలో ఆమె అక్క కుమారుడు వంకదార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యం కుటుంబం నివసిస్తోంది. కొద్ది రోజులుగా సుబ్రహ్మణ్యం, అతని భార్య మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం భార్య అతడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. దీనికి కారణం పిన్ని విజయలక్ష్మి చెప్పుడు మాటలేనని సుబ్రహ్మణ్యం భావించాడు. ఆమెపై పగ పెంచుకొని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం కొద్ది రోజులుగా అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. సుబ్రహ్మణ్యం గత బుధవారం విజయలక్ష్మి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి మాయమాటలతో తన ఇంటికి ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చాడు. ఆ తరువాత ఆమెపై ఒక్కసారిగా కత్తితో దాడికి దిగాడు. ఆమెపై దాడి చేయటానికి సుబ్రహ్మణ్యం మైనర్ కుమారుడు సహకరించాడు. విజయలక్ష్మిని ముక్కలుగా చేసి ఆమె శరీర భాగాలను వేరు చేశారు. వాటిని వేర్వేరు గోనెసంచుల్లో మూటకట్టి ఊర్మిళానగర్, గొల్లపూడి తదితర ప్రాంతాల్లో మురుగుకాలువల్లో పడేశాడు. అయితే విజయలక్ష్మి కనపడటం లేదని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు అందింది. శనివారం గొల్లపూడి పంటకాలువ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి శరీర భాగాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అవి విజయలక్ష్మి శరీరభాగాలుగా పోలీసులు గుర్తించారు. అనంతరం పోలీసుల విచారణలో సుబ్రహ్మణ్యమే ఈ హత్యకు కారణమని నిర్ధారించారు. ఘటన తర్వాత నంద్యాల పరారైన సుబ్రహ్మణ్యం, అతనికి సహకరించిన కుమారుడిని నగరానికి తీసుకొచ్చి విచారణ చేస్తున్నట్లు సమాచారం. విజయలక్ష్మి శరీర భాగాలు పూర్తిగా లభించకపోవటంతో విచారణ కొనసాగుతోంది.

బాలికపై లైంగికదాడి

ప్రేమించి పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసం

నెల్లూరు (క్రైమ్): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించి ఆమెపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నెల్లూరు నగరంలోని సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. సంతపేట పోలీసుల కథనం మేరకు.. సంతపేట కామాక్షినగర్‌కు చెందిన ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. అదే ప్రాంతంలోని ఓ దుకాణంలో శశి అనే యువకుడు పనిచేస్తున్నాడు. కొంత కాలంగా బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నెల 3వ తేదీన బాలిక స్కూల్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో యువకుడు అడ్డుకుని ఆమెను బాలాజీనగర్‌లోని తన పిన్ని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై బలవంతంగా లైంగిక దాడి చేశాడు. అనంతరం ఆమెను బైక్‌పై మైపాడుబీచ్‌కు తీసుకెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. సాయంత్రం అవుతున్నా బాలిక ఇంటికి రాకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు స్కూల్ వద్దకు వెళ్లి విచారించారు. బాలిక రాలేదని తెలియడంతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు రాత్రి 8 గంటల సమయంలో బాలికను ఆమె ఇంటికి సమీపంలో వదిలి వెళ్లాడు. ఇంటికి చేరుకున్న బాలికను కుటుంబ సభ్యులు నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక నానమ్మ శనివారం రాత్రి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

గుడిలోకి రానీయకుండా దళితులను అడ్డుకున్న ఓ వర్గం


గ్రామ పెద్దలపై ఫిర్యాదు చేస్తున్న దళితులు

దొరవారిసత్రం/సాక్షి, అమరావతి: దళితులను గుడిలోకి రానీయకుండా గ్రామస్తులు అడ్డుకున్న ఘటన తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, దొరవారిసత్రం మండల పరిధిలోని పాళెంపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోరిందమ్మ గ్రామ శక్తి దేవాలయంలోకి స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వారిని రానీయకుండా గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం పెద్దలు అడ్డుకున్నారు. దళితుల కథనం మేరకు వివరాలు... 2016లో గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల వారు విరాళాలు వేసుకుని గ్రామ శక్తి దేవాలయం నిర్మించుకున్నారు. అప్పటి నుంచి గ్రామానికి చెందిన పలువురు దళితులు పొంగళ్లు పెట్టుకునే సమయంలో వారిని గుడిలోకి రానీయకుండా గ్రామస్తులు అడ్డుకోవడం రివాజుగా మారుతోంది. దీన్ని ఎలాగైన అడ్డుకోవాలనే తలంపుతో ఆదివారం దళితులందరూ గుడి వద్ద పొంగళ్లు వండుకుని, గుడిలోని దేవతకు నైవేద్యం పెట్టేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అక్కడ ఉన్న గ్రామ పెద్దల నుంచి పూజారి వరకు దళితులను గుడిలోకి వెళ్లనీయకుండా తాళం వేశారు. దీంతో వివాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తాత్కాలికంగా పరిష్కరించి సర్దుబాటు చేశారు. గుడిలోకి వెళ్లకుండా అడ్డుకున్న వారిపై దళితులు ఫిర్యాదు చేశారు. కాగా, ఆలయంలోకి వస్తున్న ఎస్సీలను అడ్డుకుని గుడికి తాళాలు వేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డిమాండ్ చేసింది. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అంద్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ వైపు ఎస్సీ పేటల్లో వెయ్యి గుడులు కట్టిస్తామని టీటీడీ ప్రకటించిందని, మరోవైపు ఎస్సీలను గుడిలోకి రాకుండా అడ్డుకోవడంతో ఏంటని ప్రశ్నించారు.

భారత నావికాదళంలో మరో మైలురాయి 'ఆండ్రోత్'

నేడు విశాఖలో ప్రారంభం



సింధియా (విశాఖ) : భారత నావికాదళం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకోనుంది. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ సిరీస్‌లో రెండోదైన 'ఆండ్రోత్' యుద్ధనౌకను నేవల్ డాక్‌యార్డ్ విశాఖపట్నంలో సోమవారం ప్రారంభించనున్నారు. ఈ లాంఛన కార్యక్రమానికి తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెండ్హార్కర్ అధ్యక్షత వహిస్తారు. 'ఆండ్రోత్' యుద్ధనౌక పూర్తి స్వదేశీ సామర్థ్యంతో, వినూత్న సాంకేతికతతో నిర్మించారు. ఈ నౌక చేరికతో భారత నావికాదళ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయి. ఇది ముఖ్యంగా లిటోరల్ జలాల్లో (తీర ప్రాంతానికి దగ్గరగా ఉన్న జలాలు) ఎదురయ్యే బెదిరింపులను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సహాయపడుతుంది. 'ఆండ్రోత్' భారత నావికాదళ స్వదేశీ ఆవిష్కరణలకు, సామర్థ్యాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తుంది.

వాణిజ్య నౌక 'శివాలిక్' తొలిసారి విశాఖకు..

మహారాణిపేట (విశాఖ): వాణిజ్య నౌక శివాలిక్ దేశంలోనే తొలిసారిగా విశాఖ పోర్టుకు రానుంది. వీఎల్‌జీసీ (వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్)గా గుర్తింపు పొందిన ఈ నౌకను షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసింది. కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సోమవారం విశాఖలో దీనికి స్వాగతం పలుకుతారు. మొదటిసారిగా ఈ నౌక విశాఖ పోర్టుకు ఎల్పీజీని తీసుకొస్తోంది. భారత సముద్ర రవాణా రంగంలో ఈ శివాలిక్ నౌక ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుంది.

'పోలవరం'పై నేడు కేంద్రం సమీక్ష

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులపై ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సోమవారం సమీక్షించనున్నారు. 2023 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కేంద్ర కేబినెట్ నిర్దేశించిన నేపథ్యంలో పీపీఏ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

కవలలకు జన్మనిచ్చి బాలింత మృతి

ప్రసవానంతరం రక్తస్రావమవుతున్నా పట్టించుకోని వైద్య సిబ్బంది

తుని ఏరియా ఆస్పత్రిలో దారుణం

ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబీకుల ఆందోళన


రత్నకుమారి (ఫైల్)

తుని రూరల్: కవలలకు జన్మనిచ్చిన బాలింత వైద్యుల నిర్లక్ష్యంతో తీవ్ర రక్తస్రావంతో కొద్దిసేపటికే మృతి చెందిన విషాద ఘటన తుని ఏరియా ఆస్పత్రిలో శనివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు.. కాకినాడ జిల్లా, తుని మండలం, టి.తిమ్మాపురానికి చెందిన కాపారపు సతీష్ భార్య రత్నకుమారి నెలలు నిండడంతో శుక్రవారం తుని ఏరియా ఆస్పత్రిలో చేరింది. ఆమెకు శనివారం ఉదయం ఇద్దరు మగ బిడ్డలు (కవలలు) జన్మించారు. అనంతరం ఆమెకు రక్తస్రావం జరుగుతోందని గమనించిన బంధువులు వైద్యులకు సమాచారం ఇచ్చారు. కానీ, వైద్య సిబ్బంది స్పందించకపోవడంతో రత్నకుమారి పరిస్థితి విషమించింది. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించడంతో హుటాహుటిన అంబులెన్సులో కాకినాడ బయలుదేరారు. అన్నవరం సమీపానికి వెళ్లేసరికి రత్నకుమారి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. దీంతో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తిరిగి తుని ఏరియా ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. అపస్మారక స్థితిలో ఆస్పత్రికి వచ్చిన తన భార్యకు వైద్యులు సినీ ఫక్కీలో వైద్యం చేసినట్టు హడావుడి చేశారని, రాత్రి సమయానికి మృతి చెందినట్టు తెలిపారని మృతురాలి భర్త సతీష్ వాపోయారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందించనందునే తన భార్య మృతి చెందిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రి బయట తుని–ఎస్.అన్నవరం రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులతో చర్చించారు. విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, బాలింత మృతిపై జిల్లా కలెక్టర్ షన్మోహన్ విచారణకు ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యాన విచారణ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

పొలంలోనే ఉల్లిని వదిలేసిన అన్నదాత



ఉల్లిగడ్డలు కోసే వారికే కాదు... సాగు చేసిన రైతుకు కూడా కన్నీళ్లు తప్పడం లేదు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి, నాలుగు నెలల పాటు రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఉల్లిని సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో ధరలేక రైతులు పొలంలోనే వదిలేస్తున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామానికి చెందిన రైతు కోలంట్ల విశ్వనాథ్ తన రెండు ఎకరాలతోపాటు ఎకరా పొలం గుత్తకు తీసుకుని రూ.3 లక్షలతో ఉల్లి పంట సాగు చేశాడు. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వం ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించ లేదు. పంటకోత కోస్తే రూ.80వేలు దాకా ఖర్చవుతోందన్న ఆవేదనతో పంటను పొలంలో వదిలేశాడు. ఆ పంటను ఆదివారం గొర్రెలు మేస్తూ కనిపించాయి. – పత్తికొండ



కడుపు మండి రోడ్డెక్కిన టమాట రైతులు

గిట్టుబాటు ధర లేక టమాట రైతులు కన్నీరుపెడుతున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్ యార్డుకు రైతులు ఆదివారం భారీగా టమాటాలు తీసుకొచ్చారు. అయితే వ్యాపారులు 25 కేజీల జత గంపలను రూ.100కే కొనుగోలు చేయడంతో కడుపుమండి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు స్పందించక పోవడంతో పత్తికొండలోని గుత్తి–ఆదోని ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. – పత్తికొండ



తొలి రౌండ్‌లోనే బోపన్న జోడీ అవుట్

షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. పురుషుల డబుల్స్‌లో బోపన్న (భారత్)–జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జోడీ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బోపన్న–రోజర్ ద్వయం 6–7 (5/7), 2–6తో రాబర్ట్ క్యాష్–జేమ్స్ ట్రేసీ (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న–రోజర్ జోడీకి 19,050 డాలర్ల (రూ. 16 లక్షల 90 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



సెమీఫైనల్లో హుసాముద్దీన్

భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) కప్ టోర్నమెంట్‌లో తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (55 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. చెన్నైలో ఆదివారం మొదలైన ఈ టోర్నీలో సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హుసాముద్దీన్ తొలి రౌండ్‌లో 5–0తో హితేశ్ సింగ్ (సర్వీసెస్)పై ఘనవిజయం సాధించాడు. ఇతర వెయిట్ కేటగిరీల్లో అమిత్ పంఘాల్, విశ్వనాథ్ (సర్వీసెస్) కూడా సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు.

భారత్ రికార్డు ప్రదర్శన

- 6 స్వర్ణాలు సహా మొత్తం 22 పతకాలు
- చివరి రోజు సిమ్రన్, ప్రీతి, నవ్‌దీప్‌కు రజతాలు
- ముగిసిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు నయా చరిత్ర సృష్టించారు. సొంతగడ్డపై జరిగిన పోటీల్లో రికార్డు స్థాయిలో 22 పతకాలు సాధించారు. పోటీల చివరి రోజు ఆదివారం భారత్ మూడు రజతాలు, ఒక కాంస్యంతో 4 పతకాలు ఖాతాలో వేసుకుంది. దీంతో ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత పారా అథ్లెట్లు మొత్తం 22 పతకాల (6 స్వర్ణాలు, 9 రజతాలు, 7 కాంస్యాలు)తో పదో స్థానంలో నిలిచారు. ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్ ఇప్పటి వరకు 2024లో (జపాన్) అత్యుత్తమంగా 17 పతకాలు సాధించింది. పతకాల పట్టికలో బ్రెజిల్ 44 (15 స్వర్ణాలు, 20 రజతాలు, 9 కాంస్యాలు) అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారం మహిళల 100 మీటర్ల టి35 విభాగంలో ప్రీతిపాల్ 14.33 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజత పతకం సాధించింది. టి35 200 మీటర్ల పరుగులో సైతం ప్రీతి కాంస్యం నెగ్గింది. పురుషుల జావెలిన్ ఎఫ్41 విభాగంలో పారిస్ పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత నవ్‌దీప్ సింగ్ రజతం గెలిచాడు. నవ్‌దీప్ జావెలిన్‌ను 45.46 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు.



నవ్‌దీప్

మహిళల 200 మీటర్ల టి12 విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ సిమ్రన్ 24.42 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది. పురుషుల 200 మీటర్ల టి44 విభాగంలో సందీప్ 23.60 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్యం పతకం కైవసం చేసుకున్నాడు.

విజేత శ్రియాన్షి

అల్ అయిన్ (అబుదాబి): హైదరాబాద్ యువ షట్లర్ శ్రియాన్షి వలిశెట్టి అల్ అయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా అవతరించింది. అబుదాబిలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ విభాగంలో 18 ఏళ్ల శ్రియాన్షి టైటిల్‌ను సొంతం చేసుకుంది. పుల్లెల గోపీచంద్ అకాడమీకి చెందిన శ్రియాన్షి ఫైనల్లో భారత్‌కే చెందిన తస్నిమ్ మీర్‌పై 15–21, 22–20, 21–7తో విజయం సాధించింది. 49 నిమిషాల్లో ముగిసిన ఈ తుది పోరులో శ్రియాన్షి తొలి గేమ్‌లో తడబడింది. అయితే రెండో గేమ్‌లో తన తప్పిదాలను సరిదిద్దుకొని ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. నిర్ణాయక మూడో గేమ్‌లో మాత్రం ప్రపంచ 61వ ర్యాంకర్ శ్రియాన్షి ధాటికి ప్రపంచ 59వ ర్యాంకర్ తస్నిమ్ తేలిపోయింది. 6–7తో వెనుకబడిన దశలో శ్రియాన్షి ఒక్కసారిగా చెలరేగిపోయి వరుసగా 15 పాయింట్లు సాధించి 21–7తో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.



తద్వారా తన కెరీర్‌లో తొలి వరల్డ్ టూర్–100 లెవెల్ టైటిల్‌ను గెల్చుకుంది. చాంపియన్ శ్రియాన్షికి 9,000 డాలర్ల (రూ. 7 లక్షల 99 వేలు) ప్రైజ్‌మనీ, 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఇదే టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను హరిహరన్–అర్జున్ (భారత్) జోడీ గెలుచుకుంది. ఫైనల్లో హరిహరన్–అర్జున్ ద్వయం 21–17, 21–18తో రేమండ్ ఇంద్ర–నికోలస్ (ఇండోనేసియా)పై నెగ్గింది. హరిహరన్–అర్జున్ జోడీకి 9,480 డాలర్ల (రూ. 8 లక్షల 41 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మహిళలూ మురిపించారు

పాకిస్తాన్‌పై 88 పరుగులతో హర్మన్‌ప్రీత్ బృందం జయభేరి

పాక్ టాస్ నెగ్గిన తీరు... బౌలింగ్ **జోరు...** భారత శిబిరాన్ని కాస్త కలవర**పెట్టింది.** కానీ చివరకు నిర్ణీత ఓవర్ల **తర్వాత భారత** స్కోరు హర్మన్‌ప్రీత్ బృందం **ఆందోళనను** దూరం చేసింది. లక్ష్యఛేదనకు **దిగిన** చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను **టీమిండియా** కట్టుదిట్టమైన బౌలింగ్‌తో **ఆరంభంలోనే** చిక్కుల్లో పడేసింది. బౌలర్లు **ఏమాత్రం** పట్టుసడలించకుండా క్రమం **తప్పకుండా** వికెట్లు తీస్తూనే మ్యాచ్‌ను ఏక**పక్షంగా** ముగించారు. పాకిస్తాన్‌పై తమ **అజేయ** రికార్డును పొడిగించారు.

- రాణించిన హర్లీన్ డియోల్
- బంతితో మెరిసిన క్రాంతి, దీప్తి
- ఈ నెల 9న దక్షిణాఫ్రికాతో భారత్ తదుపరి పోరు



క్రాంతిని అభినందిస్తున్న హర్లీన్, జెమీమా

కొలంబో: సొంతగడ్డపై ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో బోణీ కొట్టిన భారత మహిళల జట్టు ఇప్పుడు శ్రీలంకలో పాకిస్తాన్ పనిపట్టింది. బ్యాటింగ్ వైఫల్యంతో తడబడిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం బౌలింగ్ బలగంతో పాక్‌ను చిత్తు చేసింది. 88 పరుగుల తేడాతో భారత మహిళల జట్టు పాకిస్తాన్‌ను ఓడించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్ కూడా పురుషుల ఈవెంట్‌లాగే ఏకపక్షంగా ముగిసింది. మొత్తమ్మీద వరుసగా నాలుగు ఆదివారాలు పాక్ జట్లకు, వారి అభిమానులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 247 పరుగుల వద్ద ఆలౌటైంది. హర్లీన్ డియోల్ (65 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, రిచా ఘోష్ (20 బంతుల్లో 35 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడింది. ప్రత్యర్థి బౌలర్లలో డయానా బేగ్ 4, సాదియా, ఫాతిమా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్ 43 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. సిద్రా అమిన్ (106 బంతుల్లో 81; 9 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్రాంతి గౌడ్, దీప్తి శర్మ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన భారత జట్టు నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈనెల 9న విశాఖపట్నంలో జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. నేడు ఇండోర్‌లో జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా తలపడుతుంది.

మెరుగ్గానే మొదలైనా...

ప్రతీక (37 బంతుల్లో 31; 5 ఫోర్లు), స్మృతి మంధాన (23; 4 ఫోర్లు) ఓపెనింగ్ వికెట్‌కు 48 పరుగులతో మంచి ఆరంభమే ఇచ్చారు. కానీ 19 పరుగుల వ్యవధిలో ఇద్దరు నిష్క్రమించారు. తర్వాత హర్లీన్, కెప్టెన్ హర్మన్ జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. కాసేపటికే కెప్టెన్ వికెట్‌ను పారేసుకుంది. జెమీమా (37 బంతుల్లో 32; 5 ఫోర్లు), హర్లీన్ కొద్దిసేపు ఇన్నింగ్స్‌ను నడిపించారు. కానీ జట్టు స్కోరు 151 వద్ద హర్లీన్, 159 వద్ద జెమీమా అవుట్‌కావడంతో భారత్ ఇబ్బందిపడింది. స్నేహ్ రాణా (20; 2 ఫోర్లు), ఆఖర్లో రిచా మెరుపులతో చివరకు గట్టిస్కోరే ప్రత్యర్థి ముందుంచింది.

సిద్రా ఒంటరి పోరాటం

లక్ష్యం ఏమంత కష్టమైంది కాకపోయినా... పాక్ మాత్రం ఆరంభం నుంచే కష్టాల్లో కూరుకుపోయింది. తర్వాత ఏటికి ఎదురీదలేక, పూర్తి కోటా ఓవర్లనైనా ఆడలేక ఆలౌటైంది. భారత బౌలింగ్ దెబ్బకు ఓపెనర్లు మునీబా (2), సదాఫ్ షమా (6) సహా, మిడిలార్డర్‌లో అలియా (2), కెప్టెన్ ఫాతిమా సనా (2) సింగిల్ డిజిట్‌లకే వెనుదిరిగారు. సిద్రా అమిన్, నటాలియా (33; 4 ఫోర్లు)తో కలిసి ఒంటరి పోరాటం చేసింది. ఇద్దరు నాలుగో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. అయితే వీరిద్దరు అవుటయ్యాక ఇన్నింగ్స్ కూలేందుకు ఎంతోసేపు పట్టలేదు. స్నేహ్ రాణాకు 2 వికెట్లు దక్కాయి.

మ్యాచ్ రిఫరీ చేసిన పొరపాటుతో...

దక్షిణాఫ్రికాకు చెందిన రిఫరీ శాండ్రె ఫ్రిజ్ గందరగోళంతో 'టాస్' నిర్ణయమే బోల్తా పడింది. పాక్ సారథి ఫాతిమా 'బొరుసు' చెప్పగా... హర్మన్ ఎగరేసిన నాణెం 'బొమ్మ'గా తేలింది. మ్యాచ్ రిఫరీ మాత్రం పాక్ కెప్టెన్ టాస్ గెలిచినట్లు ప్రకటించింది. అంతా తెలిసినా హర్మన్ కూడా అభ్యంతరం చెప్పకపోవడమే ఇక్కడ కొసమెరుపు! ఇక మహిళా సారథులు సైతం కరచాలనం చేసుకోకుండానే సమరానికి సై అన్నారు.

12 పాకిస్తాన్ మహిళల జట్టుతో ఇప్పటి వరకు ఆడిన 12 వన్డేల్లోనూ భారత మహిళల జట్టే గెలిచింది.



స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతీక (బి) సాదియా 31; స్మృతి (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫాతిమా 23; హర్లీన్ (సి) నష్రా (బి) రమీన్ 46; హర్మన్‌ప్రీత్ (సి) సిద్రా నవాజ్ (బి) డయానా 19; జెమీమా (ఎల్బీడబ్ల్యూ) (బి) నష్రా 32; దీప్తి శర్మ (సి) సిద్రా నవాజ్ (బి) డయానా 25; స్నేహ్ రాణా (సి) అలియా (బి) ఫాతిమా 20; రిచా ఘోష్ (నాటౌట్) 35; శ్రీచరణి (సి) నటాలియా (బి) సాదియా 1; క్రాంతి (సి) అలియా (బి) డయానా 8; రేణుక (సి) సిద్రా నవాజ్ (బి) డయానా 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 247. వికెట్ల పతనం:** 1–48, 2–67, 3–106, 4–151, 5–159, 6–201, 7–203, 8–226, 9–247, 10–247. **బౌలింగ్:** సాదియా 10–0–47–2, డయానా బేగ్ 10–1–69–4, ఫాతిమా 10–2–38–2, రమీన్ 10–0–39–1, నష్రా 10–0–52–1.

పాకిస్తాన్ మహిళల ఇన్నింగ్స్: మునీబా అలీ (రనౌట్) 2; షమా (సి అండ్ బి) క్రాంతి 6; సిద్రా అమిన్ (సి) హర్మన్ (బి) స్నేహ్ రాణా 81; అలియా (సి) దీప్తి (బి) క్రాంతి 2; నటాలియా (సి) సబ్–రాధ (బి) క్రాంతి 33; ఫాతిమా (సి) స్మృతి (బి) దీప్తి 2; సిద్రా నవాజ్ (సి అండ్ బి) స్నేహ్ 14; రమీన్ (బి) దీప్తి 0; డయానా బేగ్ (రనౌట్) 9; నష్రా (నాటౌట్) 2; సాదియా (సి) స్మృతి (బి) దీప్తి 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (43 ఓవర్లలో ఆలౌట్) 159. వికెట్ల పతనం:** 1–6, 2–20, 3–26, 4–95, 5–102, 6–143, 7–146, 8–150, 9–158, 10–159. **బౌలింగ్:** రేణుక 10–1–29–0, క్రాంతి 10–3–20–3, స్నేహ్ రాణా 8–0–38–2, శ్రీచరణి 6–1–26–0, దీప్తి శర్మ 9–0–45–3.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సకుటుంబ సపరివార సమేతంగా... టీవీ ముందు కూర్చుంటున్నారు. అది కేబుల్ కనెక్షన్ టీవీ కాదు.. 'కనెక్టెడ్ టీవీ'. అందులో తమకు నచ్చిన సినిమా లేదా వెబ్ సిరీస్ లేదా షో చూస్తున్నారు. సంప్రదాయ టీవీ చానళ్లలో కాదు.. ఓటీటీ వేదికల్లో. ఇదే ఇప్పుడు ట్రెండ్. ఇది కరోనా తరవాత రికార్డు స్థాయిలో దేశమంతా పాకేసింది. దేశంలో ఓటీటీ చూస్తున్న ప్రేక్షకుల సంఖ్య రికార్డు స్థాయిలో 60 కోట్లకు ఎగబాకిందన్న అంచనాలే ఇందుకు నిదర్శనం. అంటే దేశ జనాభాలో 40 శాతానికిపైగా ఓటీటీలకు అలవాటుపడ్డారన్నమాట.

– సాక్షి, స్పెషల్ డెస్క్



2024తో పోలిస్తే **9.9%** పెరుగుదల నమోదు

దేశ జనాభాలో **41%** ఆన్‌లైన్ వీడియో వీక్షకులే


కనెక్టెడ్ టీవీ ప్రేక్షకుల సంఖ్య సుమారు 13 కోట్లు

ఓటీటీ వీక్షకులు @ 60 కోట్లు

టీవీ కొనాలంటే.. వందసార్లు ఆలోచించడం లేదు. హాల్లోకి సరిపోయే పెద్ద సైజు టీవీని.. అది కూడా స్మార్ట్ టీవీనే కొనేస్తున్నారు. 'మార్డోర్ ఇంటెలిజెన్స్' అంచనా ప్రకారం 2025లో దేశీయ స్మార్ట్ టీవీ మార్కెట్ విలువ 22.39 బిలియన్ డాలర్లు. 2023లో ఇది సుమారు 11 బిలియన్ డాలర్లే. స్మార్ట్ టీవీల కొనుగోళ్లు ఎంతలా పెరిగాయో చెప్పడానికి ఈ అంకెలే నిదర్శనం. అంత ఖరీదైన టీవీ కొన్నాక.. సాధారణ కేబుల్ టీవీ ఒక్కటే ఉంటే ఏం బాగుంటుంది? అందుకే, ఏదో ఒకటి లేదా అంతకుమించి ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ తీసేసుకుంటున్నారు. అంతే, ఎంచక్కా ఇక సకుటుంబ సపరివార సమేతంగా సినిమాలు, వెబ్ సిరీస్‌లు, షోలు చూస్తున్నారు. దేశంలో ఇటీవలి కాలంలో ఈ ధోరణి పెరిగింది.

కనెక్టెడ్ టీవీలో..: ఒకప్పుడు కేబుల్ టీవీ ప్రతి ఇంటా సర్వసాధారణంగా ఉండేది. ఇప్పుడు దాని స్థానాన్ని కనెక్టెడ్ టీవీ ఆక్రమిస్తోంది. కనెక్టెడ్ టీవీ అంటే ఇంటర్నెట్‌కి కనెక్ట్ అయ్యే టీవీ. ఇది మధ్య తరగతి, ఆపై స్థాయి కుటుంబాల్లో సర్వసాధారణం అయిపోయింది. మీడియా కన్సల్టింగ్ సంస్థ ఆర్మాక్స్ మీడియా 'ఓటీటీ ఆడియన్స్ రిపోర్ట్ 2025' ప్రకారం.. కనెక్టెడ్ టీవీ వీక్షకుల సంఖ్య 2024లో 6.97 కోట్లు మాత్రమే ఉండేది. 2025లో అది ఏకంగా 12.92 కోట్లకు పెరిగింది. అంటే.. దాదాపు రెట్టింపు అయిందన్నమాట.





ఆకట్టుకునే కంటెంట్

అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, జియో హాట్‌స్టార్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో విభిన్నమైన కంటెంట్‌తో వెబ్‌సిరీస్‌లు, సినిమాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కంటెంట్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోతున్నారు. ఆర్మాక్స్ అంచనా ప్రకారం.. దేశంలో ఓటీటీ వీక్షకుల (నెలలో కనీసం ఒక్కసారైనా ఓటీటీ వీడియో చూసినవారు) సంఖ్య 60 కోట్లకు పైనే. 2024తో పోలిస్తే ఇది దాదాపు 10 శాతం ఎక్కువ. దేశ జనాభాలో ఇది 40 శాతానికిపైనే. వీక్షకులు పెరగడంతో ఓటీటీల్లో దేశీయ భాషల్లో వచ్చే వెబ్‌సిరీస్‌ల సంఖ్య కూడా పెరుగుతోంది. ఓటీటీల్లోనే విడుదల చేసే సినిమాలూ పెరుగుతున్నాయి. సెలవు రోజుల్లోనూ... రాత్రుళ్ల భోజన సమయాల్లోనూ కుటుంబ సభ్యులతో అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, ఆహా, జీ5, సోనీ లివ్.. ఇలాంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో నచ్చిన సినిమా లేదా రియాలిటీ షో లేదా వెబ్‌సిరీస్ చూడటం సర్వసాధారణం అయిపోయింది.

దేశంలో ఓటీటీ చందాదారుల సంఖ్య (సుమారుగా)		
జియో హాట్‌స్టార్	అమెజాన్ ప్రైమ్	నెట్‌ఫ్లిక్స్
30 కోట్లు	2.8 కోట్లు	1.23 కోట్లు

ఆర్మాక్స్ మీడియా నివేదిక ప్రకారం.. 2025 జనవరి–జూన్ మధ్య ప్రసారమైన ఒరిజినల్స్‌లో వీక్షకులు అత్యధికంగా చూసినవి వెబ్ సిరీస్‌లే. వీక్షకుల పరంగా టాప్–50 ఒరిజినల్స్‌లో 80 శాతం వాటా వెబ్ సిరీస్‌లు కైవసం చేసుకోవడం విశేషం. ఆ తరవాతి స్థానంలో సినిమాలు, రియాలిటీ షోలు ఉన్నాయి.

వృక్షాలను రక్షిస్తే.. అవి జీవరాశిని సంరక్షిస్తాయి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్

చిలకలూరిపేట: వృక్షాలను రక్షిస్తే.. అవి జీవరాశిని సంరక్షిస్తాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో శ్రీవేంకటేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాలకు చెందిన 1.20 ఎకరాల భూమిలో ఏర్పాటు చేసిన నక్షత్ర వనం, రాశి వనం, పంచవటి, నవగ్రహ వనాలను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ వై.లక్ష్మణ రావు, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ, జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ రవినాథ్ తిల్హరి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దేవాలయాల అనువంశిక ధర్మకర్తల కుటుంబాలకు చెందిన జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. మనుషులు లేకపోయినా వృక్షాలు జీవిస్తాయని.. వృక్షాలు లేకుండా మనుషులు జీవించలేరన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. ప్రకృతిని కాపాడుకుంటూ.. భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పర్వదినాల్లో వనమహోత్సవాలు నిర్వహించుకునేలా ఈ వనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ.. బొప్పూడి రాజన్న అనువంశీకుడైన జస్టిస్ కృష్ణమోహన్.. ఆలయాలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పవిత్ర వనాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం న్యాయమూర్తులు నక్షత్రాలు, రాశుల వారీగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ్ చక్రవర్తి, ఎస్పీ బి.కృష్ణారావు, చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ.స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జస్టిస్ బి. కృష్ణమోహన్, ఇతర న్యాయమూర్తులు

యారాడ తీరంలో రష్యన్ మృతి

పెదగంట్యాడ(విశాఖ): యారాడ బీచ్‌లో ఈతకు వెళ్లిన రష్యా వ్యక్తి ఆదివారం మృతి చెందారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. కొందరు రష్యన్లు నేవల్ డాక్‌యార్డ్‌లో హెలికాప్టర్ మెయింటెనెన్స్ పనులు చేస్తూ.. విశాఖలోని ఓ హోటల్‌లో ఉంటున్నారు. ప్రతి వారం వారంతా కలిసి యారాడ బీచ్‌కు వస్తుంటారు. ఆదివారం కూడా 10 మంది యారాడకు వచ్చారు. అందులో ఏడుగురు సముద్రంలోకి దిగి ఈత కొడుతుండగా.. అలల తాకిడికి ముగ్గురు కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న లైఫ్ గార్డులు కదిరి లోవరాజ్, చుట్టూరు శ్రీను, కదిరి వెంకటేశ్ వెంటనే సముద్రంలోకి దిగి.. ముగ్గురినీ ఒడ్డుకు చేర్చారు. స్పెర్గీ అక్‌లోనా(62) స్పృహ కోల్పోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి.. స్పెర్గీ మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపారు.



మృతి చెందిన స్పెర్గీ అక్‌లోనా

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

వారం రోజుల పాటు తేలికపాటి వర్షాలు

సాక్షి, అమరావతి, విజయపురిసౌత్: నైరుతి బంగాళాఖాతం, తమిళనాడు తీరంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ ఆదివారం తెలిపింది. ఇది దక్షిణ తమిళనాడు దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్నట్లు పేర్కొంది. అలాగే ఏపీ తీరప్రాంతం నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఒక ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో వచ్చే వారం రోజులు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్రలో ఎక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని, కొద్దిచోట్ల భారీ వర్షాలు కూడా కురుస్తాయని పేర్కొన్నారు. 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 7.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. పల్నాడు జిల్లా గుట్లపల్లిలో 6, నెల్లూరు జిల్లా జలదంకిలో 3.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



సాగర్‌లో మూతపడ్డ క్రస్ట్‌గేట్లు..

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తగ్గటంతో అధికారులు ఆదివారం క్రస్ట్‌గేట్లు మూసివేశారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 63,398 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి 55,537 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 8,896, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,901, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 300 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 305.8030 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

భారత్‌ను బెదిరించేలా అమెరికా సుంకాలు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు



సాక్షి, అమరావతి: భారత్‌ను బెదిరించేలా అమెరికా సుంకాలు విధిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మండిపడ్డారు. విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో 'భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం' పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథంతో కలిసి రాఘవులు ఆవిష్కరించారు. ప్రజలకు అవసరమైన వాటిని ఏ దేశం నుంచి దిగుమతి చేసుకోవాలో నిర్ణయించుకునే హక్కు ఆ దేశానికి ఉంటుందన్నారు. అమెరికా మన దేశం ఎక్కడ, ఏం కొనాలో బెదిరించే స్థితికి చేరుకోవడం గర్హనీయమన్నారు. అమెరికా సుంకాలపై టీడీపీ, జనసేన కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
6-10-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
224	58
81,207	24,894

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,780	▽	63
డోజోన్స్	46,758	△	238
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,491	△	63
డాక్స్	24,378	△	265
షాంఘై	3,883	△	20
నికాయ్	45,769	△	832

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.78	120.76
€	యూరో	ఎస్‌బీఐ	102.65	105.44
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	59.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	56.22	60.08
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.54	70.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

'హెల్త్ ఎమర్జెన్సీ'కి సిద్ధమా!

అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోవాల్సి వస్తే ఆదుకునే సాధనం హెల్త్ ఇన్సూరెన్స్. ఆస్పత్రిలో నగదు రహిత వైద్యానికి బీమా పాలసీ భరోసానిస్తుంది. కానీ, ఆస్పత్రిలో చేరిన తర్వాత నగదు రహిత చెల్లింపులకు తిరస్కారం ఎదురైతే..? రూ.లక్షల బిల్లు సొంతంగా చెల్లించడం మినహా మరో మార్గం ఉండదు. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత అన్ని బిల్లులతో బీమా కంపెనీ వద్ద రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలు చేసుకోవాల్సి వస్తుంది. ఇటీవలి కాలంలో ఆస్పత్రులు, బీమా కంపెనీల మధ్య ఏర్పడిన విశ్వాస వైరుధ్యం.. పాలసీదారులను ఆందోళనకు గురిచేసే అంశమే. దీనిపై అవగాహన కలిగి ఉంటే.. అత్యవసర పరిస్థితులను ధైర్యంగా, సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

- సాక్షి, బిజినెస్ డెస్క్

- నగదు రహిత చికిత్సలకు తిరస్కారాలు
- చార్జీలు, క్లెయిమ్‌ల పరంగా వివాదాలు
- బీమా కంపెనీలు, ఏహెచ్‌పీఐ మధ్య ప్రతిష్టంభన
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు మొదటి ప్రాధాన్యం
- తప్పనిసరి అయితే రీయింబర్స్‌మెంట్
- నిబంధనల ప్రకారం వెళితే పరిష్కారం



స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ పాలసీదారులకు నగదు రహిత చికిత్సలను సెప్టెంబర్ 22 నుంచి నిలిపివేస్తున్నట్టు అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఏహెచ్‌పీఐ) సెప్టెంబర్ 12న ప్రకటించింది. ఏహెచ్‌పీఐ కింద దేశవ్యాప్తంగా 15 వేల ఆస్పత్రులు సభ్యులుగా ఉన్నాయి. అక్టోబర్ 10 నుంచి నగదు రహిత చికిత్సలను తిరిగి ప్రారంభించేందుకు పరస్పర అంగీకారం కుదిరినట్టు ఏహెచ్‌పీఐ, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కొన్ని రోజుల తర్వాత ప్రకటించాయి. అంతకుముందు ఆగస్టులో బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్,, నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీదారులకూ ఇదే అనుభవం ఎదురైంది. తన ఎంపానెల్డ్ హాస్పిటల్స్ జాబితా నుంచి మ్యాక్స్ హాస్పిటల్స్‌ను తొలగిస్తున్నట్టు ఆగస్ట్ 16న నివాబూపా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. సరిగ్గా మ్యాక్స్ హాస్పిటల్స్ విషయంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సైతం ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఇదే విధంగా వ్యవహరించింది. కొన్ని సందర్భాల్లో బీమా సంస్థలు, కొన్ని సందర్భాల్లో ఏహెచ్‌పీఐ ఈ తరహా చర్యలకు ఉపక్రమిస్తుండడం పాలసీదారులను అయోమయానికి గురిచేస్తోంది.

విధానం - వివాదం

- సాధారణంగా అన్ని బీమా సంస్థలకు 'నెట్‌వర్క్ హాస్పిటల్స్' అంటూ ఒక జాబితా ఉంటుంది. ఇందులో ఉన్న వాటిని 'ఎంపానెల్డ్ హాస్పిటల్స్' అని పేర్కొంటారు. బీమా సంస్థలు అన్ని ముఖ్యమైన ఆస్పత్రులతో ఒప్పందం చేసుకుంటూ ఉంటాయి. ప్రతి చికిత్సకు సంబంధించి తక్కువ రేట్లతో ఒక టారిఫ్‌పై అంగీకారం కుదుర్చుకుంటాయి.
- ప్రధానంగా ఈ ధరల విషయంలో ఆస్పత్రులు, బీమా సంస్థల మధ్య ప్రస్తుతం వివాదం నెలకొంది. ఆస్పత్రులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయని, బోగస్ క్లెయిమ్‌లకు (క్లెయిమ్ మోసాలు) చోటు కల్పిస్తున్నాయని, ప్రొటోకాల్‌కు విరుద్ధమైన, అవసరం లేని వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలను సూచిస్తున్నాయని, ముందు పేర్కొన్న క్లెయిమ్ కంటే తుది క్లెయిమ్ భారీగా పెరిగిపోతోందని.. ఇలా ఎన్నో ఆరోపణలు బీమా సంస్థలు నుంచి వినిపిస్తున్నాయి. 2020 తర్వాత చికిత్సల టారిఫ్‌లను సవరించలేదని, అత్యాధునిక చికిత్సా విధానాలు, పెరిగిన సిబ్బంది వేతనాల దృష్ట్యా రేట్లను సవరించాల్సి ఉందని.. కానీ, తక్కువ చార్జీలకు అంగీకారం తెలపాలంటూ బీమా కంపెనీలు ఒత్తిడి చేస్తున్నాయని, నగదు రహిత క్లెయిమ్‌లకు తొలుత అంగీకారం తెలిపి, తుది క్లెయిమ్ సమయంలో తిరస్కరిస్తున్నాయని ఆస్పత్రుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. అలాగే, క్లెయిమ్ మొత్తాన్ని తగ్గించేస్తున్నాయని అంటున్నాయి.
- ఆస్పత్రిలో పాలసీదారుడు చేరిన సమయంలో అతడి నుంచి ప్రీ ఆథరైజేషన్ ఫారమ్‌ను ఆస్పత్రి సిబ్బంది తీసుకుని, బీమా కంపెనీలు లేదా థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్‌కు (టీపీఏ) పంపిస్తాయి. ఈ పత్రంలో ఆరోగ్య సమస్య ఏమిటి, చికిత్స వివరాలు, అంచనా వ్యయాలు ఉంటాయి. దీనికి బీమా కంపెనీలు నాలుగు గంటల్లోపు స్పందిస్తాయి. ఆమోదిస్తే నగదు రహిత చికిత్స తీసుకోవచ్చు. లేదంటే సొంతంగా చెల్లించి, తర్వాత రీయింబర్స్‌మెంట్‌కు (తిరిగి పొందడం) వెళ్లాల్సి ఉంటుంది. బీమా కంపెనీ నుంచి ఆమోదం లభించిన కేసుల్లో.. డిశ్చార్జ్‌కు ముందు మొత్తం చికిత్స వ్యయం, పూర్తి వివరాలతో తుది క్లెయిమ్ బీమా కంపెనీకి వెళుతుంది. అప్పుడు చికిత్సలకు విధించిన చార్జీలు తమ ఒప్పందం ప్రకారమే ఉన్నాయా? లేక అదనంగా బాదేశారా? అని బీమా కంపెనీ లేదా టీపీఏ బృందాలు పరిశీలిస్తాయి. ఆరోగ్య సమస్య, చికిత్స, ఔషధ వినియోగం, వ్యాధి నిర్ధారణ పరీక్షలనూ లోతుగా పరిశీలిస్తాయి. ఏవైనా సందేహాలుంటే మరిన్ని వివరాలు కోరతాయి. పాలసీదారుడి ఆరోగ్య చరిత్ర విషయంలో సందేహాలు నెలకొంటే తుది క్లెయిమ్‌కు తిరస్కరిస్తాయి. రీయింబర్స్‌మెంట్ విధానంలో రావాలని సూచిస్తాయి. ఒకవేళ ఆస్పత్రులు అధికంగా చార్జీలు వేసినట్టు భావిస్తే, ఆ మేరకు బిల్లులో తగ్గించి క్లెయిమ్‌కు ఆమోదం తెలపొచ్చు. అప్పుడు మిగిలిన మొత్తాన్ని పాలసీదారు చెల్లించాల్సి ఉంటుంది. నగదు రహిత క్లెయిమ్ తిరస్కరణకు గురై, రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌కు వెళ్లిన సందర్భంలోనూ పూర్తి మొత్తం వస్తుందన్న భరోసా లేదు.

కొన్ని బీమా సంస్థలు తమ ఎంపానెల్డ్ జాబితా నుంచి కొన్ని ఆస్పత్రులను తొలగిస్తున్నాయి. బీమా సంస్థలు ఒక్కటైతే.. మేము కూడా (ఆస్పత్రులన్నీ) ఉమ్మడిగా చేతులు కలిపి, ఆయా కంపెనీలతో వ్యాపారం నిర్వహించబోం. కరోనా తర్వాత నుంచి రేట్లపై చర్చలు జరగాల్సి ఉంది. కొన్ని బీమా సంస్థలు అయితే 2017 నుంచి రేట్లను సవరించలేదు. అసాధారణ స్థాయిలో టెక్నాలజీ పరంగా పురోగతి, సిబ్బంది జీతభత్యాల పరంగా పెరిగిన భారాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా రేడియాలజీ, కేన్సర్, రోబోటిక్ చికిత్సల పరంగా ఎంతో పురోగతి ఉంది. సూపర్ స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధిస్తోంది. అధిక డిమాండ్ కారణంగా వారు మతిపోయే వేతనాలు డిమాండ్ చేస్తున్నారు

– గిరిధర్ జ్ఞాని, డైరెక్టర్ జనరల్, ఏహెచ్‌పీఐ

ఆస్పత్రులు కరోనా సమయంలో చార్జీలను అసాధారణంగా పెంచేయడమే కాదు, ఏటా ఇదే తీరులో వ్యవహరిస్తున్నాయి. హాస్పిటల్స్ ధరలను పెంచిన ప్రతి సందర్భంలోనూ బీమా కంపెనీలకు నష్టాలు పెరుగుతున్నాయి. దీంతో ప్రీమియంలను సవరించాల్సి వస్తోంది. దీన్ని పరిష్కరించాలన్నది బీమా పరిశ్రమ డిమాండ్. ద్రవ్యోల్బణం కారణంగా ఏటా రేట్లు పెరగడం సహజమే. కానీ, ఇది 15–20 శాతం స్థాయిలో ఉండరాదు. అపెండెక్టమీ చికిత్స ధర సాధారణంగా రూ.30,000–40,000 ఉంటుంది. పేరున్న ఆస్పత్రులు ఇందుకు రూ.1–1.5 లక్షలు చార్జీ వసూలు చేస్తున్నాయి. బీమా పరిశ్రమ అధిక నియంత్రణల మధ్య పనిచేస్తోంది. అలాగే, ఆస్పత్రులు, హెల్త్‌కేర్ ప్రొవైడర్లపైనా ఇదే మాదిరి నియంత్రణ వ్యవస్థను తీసుకురావాలి.

– హెల్త్ ఇన్సూరెన్స్ పరిశ్రమ

క్లెయిమ్ తిరస్కరిస్తే..



బీమా కంపెనీలు–ఆస్పత్రుల మధ్య వివాదం పాలసీదారుల ప్రయోజనాలకు భంగం కలిగించరాదు. అవసరంలో 'బీమా' ఆదుకోనప్పుడు పాలసీదారులు మిన్నకుండిపోనక్కర్లేదు. నిబంధనల మేరకు క్లెయిమ్ మొత్తాన్ని పొందే హక్కు పాలసీదారులకు ఉంటుంది. నగదు రహిత క్లెయిమ్ తిరస్కరణకు గురైతే, స్వయంగా చెల్లించి రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ను 30 రోజుల్లోపు (డిశ్చార్జ్ అనంతరం) దాఖలు చేయాల్సి ఉంటుంది. కొన్ని సంస్థలు 90 రోజుల వరకు అవకాశం కల్పిస్తున్నాయి.

- ముందుగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవ్వకముందే బీమా కంపెనీ కస్టమర్‌కేర్‌కు కాల్ చేసి, నగదు రహిత చెల్లింపులకు ఒప్పించే ప్రయత్నం చేయొచ్చు. ఫలితం లేకపోతే డిశ్చార్జ్ అనంతరం రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌కు వెళ్లడమే.
- చెల్లింపులు పూర్తి స్థాయిలో రాకపోతే పాలసీ నియమ, నిబంధనల ప్రకారమే బీమా కంపెనీ వ్యవహరించిందా? అన్నది సరిచూసుకోవాలి. క్లెయిమ్ తిరస్కరించినా లేక పాక్షిక చెల్లింపులతో సరిపెట్టినా.. అప్పుడు రాతపూర్వక వివరణ తీసుకోవాలి.
- బీమా కంపెనీ వివరణ సమంజసంగా, సహేతుకంగా, పాలసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టయితే.. తొలుత బీమా కంపెనీ అంబుడ్స్‌మన్ వద్ద ఫిర్యాదు దాఖలు చేసి, పరిష్కారానికి ప్రయత్నించాలి. ఫలితం లేకపోతే బీమా రంగ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించొచ్చు. అప్పటికీ పరిష్కారం కాకపోతే చట్టప్రకారం బీమా కంపెనీపై చర్యలకు వెళ్లాల్సి ఉంటుంది.

ఇవి తెలియాలి..

- పాలసీ కొనుగోలుకు ముందు నియమ నిబంధనలు, షరతులు, మినహాయింపులు, అర్హతల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి. ఏవైనా సందేహాలుంటే బీమా కంపెనీ కస్టమర్ కేర్‌ను సంప్రదించాలి.
- క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తి (సీఎస్ఆర్) సాధారణంగా 90కు పైన ఉంటే మంచిది. 95పైన ఉంటే మరింత భరోసా ఉన్నట్టుగా భావించొచ్చు. క్లెయిమ్ రేషియోను ఏటా ఐఆర్‌డీఏఐ ప్రకటిస్తుంటుంది. బీమా సంస్థలకు వ్యతిరేకంగా అంబుడ్స్‌మన్ వద్ద ఎన్ని ఫిర్యాదులు నమోదైనదీ పరిశీలించాలి.



- బీమా కంపెనీ నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితా విస్తృతంగా, తమ నివాస ప్రాంతంలోని అన్ని ముఖ్య ఆస్పత్రులతో ఉండేలా చూసుకోవాలి.
- సమగ్రమైన కవరేజీతో హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. కస్టమర్ సేవలు మెరుగ్గా ఉన్నాయో లేదో చూడాలి.
- పాలసీ దరఖాస్తులో కచ్చితమైన వివరాలను నమోదు చేయాలి. మరీ ముఖ్యంగా పాలసీ తీసుకునే ముందు కొన్నేళ్లలో ఏవైనా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటే వాటి వివరాలు.. తీసుకునే నాటికి ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే వాటి గురించి సమగ్రంగా వెల్లడించాలి.
- పాలసీ తీసుకున్న మొదటి 30 రోజుల్లో ప్రమాదాలు మినహా మిగతా క్లెయిమ్‌లు దాఖలు చేసుకోవడానికి ఉండదు. పాలసీ తీసుకునే నాటికి ఉన్న వ్యాధులకు 3–4 ఏళ్ల వరకు.. కొన్నింటికి రెండేళ్ల వెయిటింగ్ పీరియడ్ నిబంధన వర్తిస్తుంది. పాలసీ తీసుకునే ముందే ఏ వ్యాధులకు ఎంత కాలం పాటు వేచి ఉండాలో సమగ్రంగా తెలుసుకోవాలి. అదనపు ప్రీమియంతో వెయిటింగ్ పీరియడ్ లేకుండా కొన్ని బీమా సంస్థలు పాలసీలను ఆఫర్ చేస్తున్నాయి.
- ఆస్పత్రిలో చేరిక గురించి బీమా సంస్థలకు సకాలంలో సమాచారం ఇవ్వాలి. సకాలంలో క్లెయిమ్‌లు దాఖలు చేయాలి.
- బీమా సంస్థ ఎంపానెల్డ్ ఆస్పత్రుల్లోనే చికిత్స తీసుకోవడం సూచనీయం. ఎప్పటికప్పుడు తాజా జాబితా బీమా సంస్థ పోర్టల్‌పై అందుబాటులో ఉంటుంది.
- క్లెయిమ్‌ను స్వయంగా దాఖలు చేస్తే, అన్ని డాక్యుమెంట్లు సమగ్రంగా ఉండేలా చూసుకోవాలి.

కళ్లు తెరిపించే గణాంకాలు..




- ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ 2023–24 నివేదిక ప్రకారం.. హెల్త్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి బీమా కంపెనీలపై ఫిర్యాదులు అంతకుముందు సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 21.7 శాతం పెరిగాయి. మొత్తం 31,490 ఫిర్యాదులు వచ్చాయి.
- 13,308 ఫిర్యాదులు ఒక్క స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా వచ్చాయి. ఇందులో 10,196 ఫిర్యాదులు క్లెయిమ్‌ల తిరస్కారాలకు సంబంధించినవే.
- కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా 3,718 ఫిర్యాదులు పాలసీదారుల నుంచి దాఖలు కాగా, అందులో క్లెయిమ్ తిరస్కరణకు సంబంధించి 2,393 ఉన్నాయి.
- నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా 2,511 ఫిర్యాదులు రాగా, 1,770 క్లెయిమ్ తిరస్కరణకు సంబంధించినవే. నేషనల్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా 2,196, న్యూ ఇండియా అష్యూరెన్స్‌కు వ్యతిరేకంగా 1,602 ఫిర్యాదులు వచ్చాయి.
- ముఖ్యంగా క్లెయిమ్ తిరస్కరణలు, బీమా కంపెనీ సేవలపై ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ప్రతీ బీమా సంస్థ పరిధిలో అంతర్గత అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటునకు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

అత్యవసర నిధి..

ఎన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ.. చివరి నిమిషంలో క్లెయిమ్ రాకపోతే స్వయంగా చెల్లించక తప్పదు. ఒక్కోసారి బీమా కవరేజీ పరిధిలో లేని అనారోగ్య సమస్యలు కూడా ఎదురుకావొచ్చు. లేదా కవరేజీకి మించి చికిత్సల వ్యయాలు ఎదురుకావొచ్చు. కనుక ఒక కుటుంబం కనీసం రూ.4–5 లక్షలతో అత్యవసర వైద్యనిధిని ప్రత్యేకంగా సమకూర్చుకోవాలన్నది నిపుణుల సూచన.

పెళ్లి నిధిని ఎలా సమకూర్చుకోవాలి?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

కుమార్తె వివాహ అవసరాల కోసం ప్రతి నెలా రూ.45,000 చొప్పున ఆరేళ్ల పాటు పెట్టుబడి చేయాలన్నది ప్రణాళిక. ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? – జి. దేవిగుప్తా



మన దేశంలో వివాహ వేడుకలన్నవి భారీ ఖర్చుతో కూడుకున్నవి. ప్రతి నెలా రూ.45,000 చొప్పున వచ్చే ఆరేళ్ల పాటు ఇన్వెస్ట్ చేసినట్టయితే గణనీయమైన మొత్తమే సమకూరుతుంది. వివాహం లక్ష్యం విషయంలో రాజీపడలేం. అనుకున్న సమయానికి కావాల్సినంత చేతికి అందాల్సిందే. కనుక రిస్క్ తక్కువగా ఉండాలని కోరుకునే వారు తటస్థ మార్గాన్ని అనుసరించొచ్చు. ఇందులో భాగంగా 50 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీని వల్ల పెట్టుబడికి రిస్క్ ఉండదు. మిగిలిన 50 శాతాన్ని వృద్ధి కోసం ఈక్విటీలకు కేటాయించుకోవాలి. డెట్ విషయంలో షార్ట్ డ్యూరేషన్ ఫండ్స్ లేదా టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులకు లార్జ్‌క్యాప్ ఫండ్స్ లేదా ఇండెక్స్ ఫండ్స్ నుంచి ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉంటే.. ఈక్విటీలకు 65 శాతం నుంచి 80 శాతాన్ని కేటాయించుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. బంగారం కోసం గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనూ కొంత ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బంగారం విలువ పెరుగుదల రూపంలో రాబడి సమకూర్చుకోవచ్చు. వివాహ సమయంలో గోల్డ్ ఈటీఎఫ్‌లను విక్రయించి ఆభరణాలు కొనుగోలు చేసుకోవచ్చు.

నేను దీర్ఘకాలం కోసం స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోనే నూరు శాతం ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటున్నాను. ఇది సరైనదేనా? – నిరంజన్ దాస్

స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు పెట్టుకునే ముందు దీర్ఘకాలం ఒక్కటే చూడకూడదు. మార్కెట్ దిద్దుబాట్లలో స్మాల్‌క్యాప్ పెట్టుబడుల గణనీయమైన కుదుపులకు లోనవుతుంటుంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో ఇవి మెరుగైన రాబడులను ఇవ్వగలవు. కనుక పెట్టుబడుల కోసం స్మాల్‌క్యాప్ పథకాలను పరిశీలించొచ్చు. కాకపోతే ఆటుపోట్లు ఎక్కువగా ఉంటాయి కనుక, మీ మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతం మించి స్మాల్‌క్యాప్ పథకాలకు కేటాయించుకోకపోవడమే మంచిది. చిన్న కంపెనీ దిగ్గజ కంపెనీగా మారిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. అదే సమయంలో చిన్న కంపెనీల్లో సంపదను తుడిచిపెట్టేవీ ఉంటాయి. ఆటుపోట్లను తట్టుకునే బలం చిన్న కంపెనీలకు తక్కువగా ఉంటుంది. స్మాల్‌క్యాప్ కంపెనీల విషయానికొస్తే కావాల్సినంత లిక్విడిటీ ఉండదు. చిన్న కంపెనీలు కావడంతో ఫ్రీ ఫ్లోటింగ్ ఈక్విటీ తక్కువే ఉంటుంది. దీంతో మార్కెట్ల కరెక్షన్లలో కొద్ది విక్రయాలకే ఎక్కువ నష్టపోతుంటాయి. అందుకే మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీల్లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. స్మాల్‌క్యాప్ కంపెనీల్లో అయితే నేరుగా కాకుండా మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే మంచి నిర్ణయం అవుతుంది. ఎందుకంటే చిన్న కంపెనీల్లో ఏ ధరలో కొనుగోలు చేశారన్నది రాబడులను నిర్ణయిస్తుంది. పైగా ఈ విభాగంలో వైఫల్యాలు, మోసాల రిస్క్ కూడా ఎక్కువగా ఉంటుంది. నిపుణులైన ఫండ్ మేనేజర్లు వీటన్నింటినీ పరిశీలిస్తూ వేగంగా పెట్టుబడుల విషయంలో నిర్ణయాలు అమలు చేస్తుంటారు. కనుక మొత్తం పెట్టుబడుల్లో స్మాల్‌క్యాప్ విభాగానికి పరిమితంగానే కేటాయింపులు చేసుకోవాలి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్క్ తగ్గించుకోవచ్చు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గణాంకాలు, ప్రపంచ పరిణామాలే దిక్సూచి!
మెరుగైన రాబడులకు డీఎస్‌పీ లార్జ్, మిడ్‌క్యాప్ ఫండ్!

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ కాంగ్లోమెరేట్ ఫండ్

మ్యూచువల్ ఫండ్ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ కొత్తగా కాంగ్లోమెరేట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ అక్టోబర్ 17 వరకు అందుబాటులో ఉంటుంది. ఇది ప్రధానంగా వివిధ రంగాలవ్యాప్తంగా కనీసం రెండు లిస్టెడ్ కంపెనీలున్న, బలమైన ప్రమోటర్ల సారథ్యంలోని గ్రూప్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. 71 దిగ్గజ గ్రూప్‌లలో సుమారు 240 కంపెనీల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఎన్ఎఫ్‌వో వ్యవధిలో కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా కాంగ్లోమెరేట్స్ వద్ద భారీగా నిధులు, మెరుగైన క్రెడిట్ రేటింగ్స్, కొత్త రంగాల్లోకి విస్తరించే సామర్థ్యాలు ఉండటం వల్ల మందగమనాలను, అనిశ్చితులను ఎదుర్కొనగలిగే సత్తా ఉంటుందని పేర్కొంది. సంఘటిత రిటైల్, టెలికం, రెన్యువబుల్ ఎనర్జీ తదితర రంగాల్లో భారతదేశపు దిగ్గజ బిజినెస్ గ్రూప్‌లు దశాబ్దాలుగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ పురోగమిస్తున్నాయని సంస్థ ఈడీ శంకరన్ నరేన్ తెలిపారు. ప్రతీకార టారిఫ్‌లు, అనిశ్చితులు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు మొదలైన సవాళ్లు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో దిగ్గజ గ్రూప్స్ ప్రాధాన్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అలాగే నిఫ్టీ 100లో కాంగ్లోమెరేట్స్ వాటా కూడా గణనీయంగా పెరుగుతోందని, ఈ నేపథ్యంలోనే ఈ ఫండ్‌ను ఆవిష్కరించామని ఆయన చెప్పారు.

స్టాక్స్ వ్యూ

జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ | యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 921 టార్గెట్: రూ. 1,090

ఎందుకంటే: అధిక నాణ్యత కలిగిన మెషీన్ టూల్స్ ఉత్పత్తిలో, ఆటోమేషన్ సొల్యూషన్ల తయారీలో కంపెనీ మంచి నైపుణ్యం కలిగి ఉంది. దేశంలో మెషీన్ టూల్స్ ఉత్పత్తి రెండంకెల వృద్ధిరేటుతో పెరుగుతుందని అంచనా. జ్యోతి సీఎన్‌సీ వంటి సంస్థలు ఈ యంత్రాలను దేశీయంగా తయారు చేయడంపై ఫోకస్ చేస్తున్నాయి. డిమాండ్ –సరఫరా అంతరాన్ని సమర్థవంతంగా పూరిస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ సర్వీసెస్, ఏరోస్పేస్ , డిఫెన్స్ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జ్యోతి సి.ఎన్.సి.రూ.450 కోట్ల మూలధన వ్యయంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని 10000 యూనిట్ల నుంచి 16,000యూనిట్లకు పెంచుకుంటోంది. ప్రస్తుతం సంస్థకు రూ.4,410 కోట్ల ఆర్డర్ బ్యాక్‌లాగ్ ఉంది. గత రెండేళ్లలో కంపెనీ ఆర్థిక పనితీరు గణనీయంగా మెరుగుపడింది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఎబిటా మార్జిన్ 8.3 శాతం ఉండగా ఇది 2025లో 27 శాతానికి పెరిగింది.

బీపీసీఎల్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.341 టార్గెట్: రూ 390

ఎందుకంటే: 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఎబిటా 9,660 కోట్లు, లాభాలు 6,120 కోట్లుగా నమోదయ్యాయి. ఇవి వార్షిక ప్రాతిపదికన, త్రైమాసిక ప్రాతిపదికన భారీ వృద్ధిని చూపిస్తున్నాయి. రిఫైనింగ్ మార్జిన్లు తగ్గినప్పటికీ, మార్కెటింగ్ ఆదాయం పెరగడం ఇతర ఆదాయాలు అధికంగా రావడం కంపెనీకి లాభించింది. ప్రభుత్వం నుంచి ఎల్‌పీజీ నష్టాల చెల్లింపు త్వరగా రావడం, ప్రభుత్వం సిలిండర్ ధర పెంచడం కలిసొచ్చింది. అంతర్జాతీయంగా ఎల్‌పీజీ ధరలు తగ్గడం కూడా నష్టం తగ్గడానికి కారణమైంది. తగ్గిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా సర్దుబాటు కావడం వల్ల రిఫైనింగ్ మార్జిన్ (జీఆర్ఎం) పుంజుకుంటుందని అంచనా. వచ్చే 12 నెలల్లో డిమాండ్ పెరుగుతుందనే అంచనాలు, మొజాంబిక్ ప్రాజెక్టు పునరుద్ధరణ కంపెనీకి అనుకూలంగా మారింది. రిటైల్ ఇంధన ధరల్లో కోత, క్రూడ్ ఆయిల్ ధరలు అనూహ్యంగా పెరగడం, తగ్గడం లాంటి రిస్కులు ఉన్నప్పటికీ దేశీయంగా ఇంధన వినియోగం , పెట్రోకెమికల్ డిమాండ్ వేగంగా పెరగడం సానుకూల పరిణామంగా చూడొచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ప్రపంచంలోని సంపన్న దేశాల ఆహారపుటలవాట్లు మారితే.. చాలావరకు కాలుష్యం తగ్గిపోతుంది! చెప్పాలంటే 30 శాతం సంపన్నుల వల్ల.. 70 శాతం ఆహార సంబంధ పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి!! ప్రపంచ ప్రసిద్ధ 'ఈఏటీ - లాన్సెట్ కమిషన్' వెల్లడించిన వాస్తవమిది. ఇటీవలి కాలంలో ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ ఆహార తయారీలో వాడుతున్న రసాయనాలు, ప్లాస్టిక్స్, పురుగుమందులు.. ఇవన్నీ పెనుముప్పును తెచ్చిపెట్టనున్నాయి అని ఆందోళన వ్యక్తం చేసింది. ఆహార వ్యవస్థలు మారకపోతే భవిష్యత్తులో మానవాళికి ఆరోగ్యకరమైన ఆహారం కలగా మారిపోతుందని హెచ్చరించింది.

సంపన్న దేశాల.. ఆహార విధ్వంసం



సాక్షి, స్పెషల్ డెస్క్

ఈఏటీ - లాన్సెట్ కమిషన్‌లో.. 6 ఖండాల్లో ఉన్న అనేక దేశాల్లోని పోషకాహార, వాతావరణ, ఆర్థిక, ఆరోగ్య, సామాజిక శాస్త్రాలకు చెందిన అంతర్జాతీయ నిపుణులు సభ్యులు. 'ఆహార ఉత్పత్తి, వినియోగం ద్వారా ఉత్పన్నమయ్యే ఉద్గారాలు.. శిలాజ ఇంధనాల కంటే ప్రమాదకరమైనవి' - వీళ్లంతా ముక్తకంఠంతో చెబుతున్న మాట ఇది. ఇప్పటికిప్పుడు శిలాజ ఇంధనాల వాడకాన్ని పూర్తిగా ఆపేసినా.. ప్రస్తుత ఆహార వ్యవస్థలు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పెంచగలవని వీరు హెచ్చరిస్తున్నారు. ఆహార వ్యవస్థల వల్ల ఏటా 16 - 17.7 గిగా టన్నుల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదల అవుతోంది. ఇవి మొత్తం భౌగోళిక ఉద్గారాల్లో 30 శాతం!

5 లక్షల కోట్ల డాలర్లు!

ఇప్పుడున్న ఆహార వ్యవస్థలు ఇలాగే కొనసాగితే.. ఏటా 15 లక్షల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లుతుందని.. అనేక దేశాల శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్న 'ఫుడ్ సిస్టమ్ ఎకనామిక్స్ కమిషన్' అంచనా వేసింది. అదే, ఈ ఆహార వ్యవస్థలకు కొత్త రూపు ఇస్తే ఆరోగ్యకరమైన సమాజం, పర్యావరణ వ్యవస్థల పునరుజ్జీవం వంటి పరిణామాల వల్ల ఏటా 5 లక్షల కోట్ల డాలర్లు ఆర్థిక వ్యవస్థలోకి వస్తాయని చెబుతోంది. ఈ మార్పులో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా రెడ్ మీట్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, పంపిణీ వంటివి 33 శాతం తగ్గాలని తెలిపింది. పండ్లు, కూరగాయలు, గింజల ఉత్పత్తి 63 శాతానికి పెరగాలని సూచించింది. ఇందుకోసం కమిషన్ మరో 8 పరిష్కార మార్గాలనూ ప్రపంచ దేశాల ముందు ఉంచింది. ఇవన్నీ అమలు జరిగితేనే.. 2050 నాటికి క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ భూమిపై ఉండే 960 కోట్ల జనాభాకూ ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని తెలిపింది.

ఆహార వ్యవస్థలతో పర్యావరణ కాలుష్యం
ఏటా 15 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం
'రెడ్‌మీట్ విభాగం' 33% తగ్గాలి
మొక్కల నుంచి వచ్చే ఆహారం పెరగాలి

అష్ట పరిష్కారాలు


- ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉంచడం
- సంప్రదాయ వంటకాలు / ఆహారాలను పరిరక్షించడం
- సుస్థిర ఉత్పత్తి పద్ధతులు అమలు చేయడం
- అడవుల వంటి చెక్కుచెదరని పర్యావరణ వ్యవస్థలను కాపాడటం
- ఆహార వృథాను అరికట్టడం
- గౌరవప్రదమైన వృత్తి లేదా పని, తద్వారా గౌరవప్రదమైన సంపాదన
- అణగారిన వర్గాలపై వివక్ష చూపకుండా ఉండటం
- అణగారిన వర్గాల వారికి అన్ని అవకాశాలూ కల్పించడం

పీహెచ్‌డీ ఆహారం

ప్రపంచ ప్రజల ఆరోగ్య సమస్యలకు, వాతావరణ సమస్యలకు పరిష్కారంగా 'ప్లానెటరీ హెల్త్ డైట్ (పీహెచ్‌డీ)' ఆహారాన్ని ఈఏటీ - లాన్సెట్ కమిషన్ సూచించింది. ఇందులో మొక్కల నుంచి వచ్చే ఆహారం పాళ్లు ఎక్కువగా, జంతువుల నుంచి వచ్చే ఆహారం చాలా తక్కువగా ఉంటుంది. చక్కెరలు, సంతృప్త కొవ్వులు, ఉప్పు చాలా మితంగా ఉంటాయి. పీహెచ్‌డీ ఆహారం వల్ల టైప్ 2 మధుమేహం, హృద్రోగాలు, కేన్సర్ల వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది ఆరోగ్యానికీ, పర్యావరణానికీ మంచిదని రుజువైంది.

ఆహార వ్యవస్థల వల్ల వచ్చే ఉద్గారాలు ఎక్కడెక్కడి నుంచి వస్తున్నాయంటే..

- మూడో వంతు వ్యవసాయం నుంచి
- మూడో వంతు భూ వినియోగ మార్పిడి ద్వారా
- మూడో వంతు ప్రాసెసింగ్, రవాణా, రిటైల్ వంటి సరఫరా వ్యవస్థల వల్ల



ఆధారం: ఐక్యరాజ్యసమితి వాతావరణ కార్యక్రమం 'ఆహార వృథా సూచీ నివేదిక 2024'


వైద్య కళాశాలల్ని ప్రైవేటుకు ఇవ్వడం దుర్మార్గం

ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్



లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు పీపీపీ పద్ధతిలో అప్పగించడం దుర్మార్గమని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్‌అహ్మద్ షేక్ మండిపడ్డారు. ఆదివారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటుకు ఇస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావడమే కాకుండా, ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో ఐదు కళాశాలల నిర్మాణాలను పూర్తిచేసి 2023–24 విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు జరిపారని గుర్తు చేశారు. మరో రెండు కళాశాలల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న దశలో ఎన్నికలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీకి అప్పగించేందుకు యత్నించడం దుర్మార్గమన్నారు.

తిరుమల తరహాలో 'శ్రీశైలం' అభివృద్ధి: సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి : తిరుమల తరహాలోనే శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. తిరుమల తర్వాత అతిపెద్ద ఆలయంగా శ్రీశైలం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా భక్తులకు విస్తృతమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. శ్రీశైలం దేవాలయ అభివృద్ధి ప్రణాళికలపై ఆదివారం క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొనగా, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ, అటవీ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రస్తుతం శ్రీశైలంలో సరైన పార్కింగ్ సదుపాయాలు కూడా లేవని.. భూమి అందుబాటులో లేకపోతే పెద్దఎత్తున వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలను కల్పించలేమని.. ఈ నేపథ్యంలో అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు ఈ అంశాలను వివరించాలని చంద్రబాబు సూచించారు. ఈనెల 16న ప్రధాని మోదీ శ్రీశైల మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు వస్తున్నందున ప్రధానితోనూ ఆలయ అభివృద్ధిపై చర్చించాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. అలాగే, ఆలయ అభివృద్ధి కోసం రెండువేల హెక్టార్ల అటవీ భూమిని దేవదాయ శాఖకు కేటాయించేలా కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేయాలని కూడా నిర్ణయించారు.

పులుల సంఖ్య పెరిగేలా చర్యలు..

ఇక వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు శ్రీశైల క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో రద్దీకి తగ్గట్లు శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను సైతం అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. దోర్నాల, సుండిపెంట, ఈగలపెంట తదితర ప్రాంతాల సమీపంలో ఉన్న జాతీయ రహదారులను దేవాలయానికి అనుసంధానించేలా చూడాలన్నారు. అలాగే, శ్రీశైలం పులుల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని.. దీనికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధంచేయాలని అటవీ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేయాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు



గుంటూరు ఎడ్యుకేషన్: గురుకుల విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతో మంది ఉన్నతాధికారులుగా ఎదిగారని.. వారంతా గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సూచించారు. వీఎస్సార్ ఫౌండేషన్ ఆదివారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, తాడికొండ గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ డి.మధుసూదనరావు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ వి.మరియరోజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏపీపీ పోస్టుల రాత పరీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షను ఆదివారం విజయవంతంగా నిర్వహించినట్టు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) చైర్మన్ రాజీవ్ కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న www.slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో ప్రిలిమినరీ కీ విడుదల చేస్తామని, అభ్యంతరాలను 8వ తేదీలోగా slprbapp@gmail.com కు మెయిల్ చేయాలని తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి

- అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి
- సీఎం చంద్రబాబుకు రైతు ఉద్యమ నేత శోభనాద్రీశ్వరరావు బహిరంగ లేఖ



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని రైతు ఉద్యమ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆదివారం రాసిన బహిరంగ లేఖను విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో మూడింట రెండొంతుల మంది పేదల నుంచి రేషన్ బియ్యాన్ని కిలో రూ.8 నుంచి రూ.10 చొప్పున బ్రోకర్లు కొనుగోలు చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. దీనిని మార్పు చేయాల్సిన అవసరం ఉంది. పేదలకు పంపిణీ చేసే బియ్యంలో గతంలో నూక 25 శాతం వరకు ఉన్నప్పటికీ ఎఫ్‌సీఐ అనుమతించేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందించేలా.. ఆహారం మెత్తబడకుండా నూక శాతాన్ని 15కి తగ్గించి సార్టెక్స్ మెషినరీ ద్వారా మిల్లింగ్ చేసి ఇచ్చేలా మిల్లర్లను ఒప్పించింది. అందుకయ్యే ఖర్చును కూడా గత ప్రభుత్వమే భరించింది. రేషన్ బియ్యం అమ్ముకోకుండా పేదలకు వాడుకునే విధంగా ధాన్యాన్ని స్టీమ్ ప్రాసెస్ చేసి అరబెట్టి సార్టెక్స్ మెషినరీతో మిల్లింగ్ చేస్తే పేదలకు అత్యంత నాణ్యమైన బియ్యం పంపిణీ చేయవచ్చు. ఇలా చేయడం వల్ల పేదలకు బజారులో కొనుగోలు చేసే బియ్యంతో సమానంగా నాణ్యమైన బియ్యం అందుబాటులోకి వస్తాయి. తద్వారా బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి' అని శోభనాద్రీశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

'ఆలిండియా కోటా' విద్యార్థులకు ఫీజు మినహాయింపు

సాక్షి, అమరావతి: ఆలిండియా కోటాలో ఎంబీబీఎస్ సీట్లు పొందిన రాష్ట్ర కోటా విద్యార్థులకు యూనివర్సిటీ ఫీజు రూ.10,600 మినహాయింపు ఇచ్చినట్లు హెల్త్ యూనివర్సిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే రాష్ట్ర కోటాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చేరి.. తర్వాత ఆలిండియా కోటాలోకి వెళ్లిన అభ్యర్థులకు మాత్రమే ఇది వర్తిస్తుందని వర్సిటీ స్పష్టం చేసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., **EDITOR: Dhananjaya Reddy Rakkasi,** (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

విజయవాడలో నవంబరు 30న కాపుల భారీ సభ

కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం



మధురవాడ: కాపుల ఉనికి, శక్తిని చాటే విధంగా నవంబరు 30న విజయవాడలో ఒక భారీ సభను ఏర్పాటు చేయనున్నట్లు కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో స్వర్గీయ మిరియాల వెంకటరావు నాయకత్వంలో ఏర్పాటైన కాపు ఉద్యమం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం విశాఖలో జరిగిన కాపునాడు జోన్–1 శ్రీకాకుళం, విజయనగరం, అరకు, విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రాంతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. కాపులు ఉన్న 24 శాతం ఓటింగ్‌కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో సీట్లు ఇవ్వాలని, విశాఖలో కాపు భవనం నిర్మాణానికి అవకాశం కల్పించాలని, కాపు కార్పొరేషన్ ద్వారా లోన్‌లు ఇవ్వాలని తదితర డిమాండ్లను ఈ సదస్సులో రూపొందించారు. కాపులంతా ఐకమత్యంగా ఉంటే రాజ్యాధికారం రాష్ట్రంలోనే కాదు, దేశంలో కూడా బీసీలు చేపట్టడం సులభమేనని గాళ్ల సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు.

వేడుకగా భక్త కనకదాసు విగ్రహావిష్కరణ



భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: శ్రీభక్త కనకదాసు విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సర్కిల్లో నూతనంగా ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహం ఆవిష్కరణ ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు రాజ్యసభ సభ్యుడు నాగరాజు, రాష్ట మంత్రులు సవిత, పార్థసారథి, కర్ణాటక మాజీ మంత్రి రేవన్న, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బెంగళూరు కనకదాస మఠం సిద్ధరామానంద స్వామి, కురబ కుల పెద్దలు హాజరయ్యారు. దీనికి ముందు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి విగ్రహావిష్కరణ వేదిక వరకు ర్యాలీ చేపట్టారు.

విద్యార్థుల అనారోగ్యం విషయం తెలిసి బాధపడ్డా..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి : కురుపాంలోని బాలికల గురుకులంలోని విద్యార్థినులు అనారోగ్యానికి గురైన విషయం తెలిసి బాధపడ్డానని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్కడ నెలకొన్న పరిస్థితులపై జిల్లా అధికారులు, వైద్యుల నుంచి వివరాలు తీసుకున్నట్టు తెలిపారు. పిల్లలు కామెర్లు, సంబంధిత లక్షణాలతో అనారోగ్యానికి గురయ్యారని, కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఇద్దరు విద్యార్థినులు మృతి చెందినట్టు వారు చెప్పారని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విశాఖ కేజీహెచ్ లో 37 మంది విద్యార్థినులకు చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. త్వరలో కురుపాం వెళ్లి గురుకులంలో పరిస్థితిని పరిశీలిస్తానని ప్రకటనలో పేర్కొన్నారు.

జడలు విప్పిన జూదం



- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల పరిధిలోని మైలారంపల్లి వద్ద వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరం నడుస్తున్నట్లు పోలీసులకు ఇటీవల సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లి 21 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.77 వేల నగదు, 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- తాడిపత్రిలో సెప్టెంబర్ 29న పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. మూడు చోట్ల 21 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ రెండు చోట్లే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా పేకాట యథేచ్ఛగా సాగుతోంది. 'తెలుగు తమ్ముళ్ల హస్తం' ఉండడంతో పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

ఊరూరా అనధికారిక పేకాట క్లబ్బులు
జేబులు నింపుకుంటున్న 'తమ్ముళ్లు'

- నగరాలు, పట్టణాలు, పల్లెల్లో యథేచ్ఛగా దందా
- మంత్రి పయ్యావుల ఇలాకాలో జోరుగా పేకాట
- ఆటగాళ్లకు సకల సౌకర్యాలు.. అవసరానికి అక్కడికక్కడే అప్పులు

అనంతపురం/ తాడిపత్రి టౌన్: అనంతపురం జిల్లాలో 'మూడు ముక్కలు, ఆరు ఆటలు' అన్న చందాన పేకాట దందా సాగుతోంది. పేకాట క్లబ్బుల ద్వారా రోజూ అధికార పార్టీ నేతలు రూ.లక్షలు సంపాదిస్తున్నారు.ఉరవకొండ నియోజకవర్గంలో విపరీతంగా పేకాట నిర్వహిస్తున్నారు. కూడేరు మండలంలో పేకాటరాయుళ్లకు అంతే లేకుండా పోయింది. తాడిపత్రి పట్టణంలో గత సోమవారం ఒక్క రోజే మూడు పేకాట స్థావరాలపై దాడి చేసి 21 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక.. ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్లలో పట్టపగలే యథేచ్ఛగా పేకాట ఆడుతున్నా పట్టించుకునే వారే లేరు.కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కంబదూరు మండలాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లో అటవీ ప్రాంతాల్లోనూ పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఇక్కడికి కర్ణాటక నుంచి సైతం పేకాటరాయుళ్లు భారీగా వస్తున్నారు. ఒక్కో స్థావరం నుంచి రోజుకు రూ.3 లక్షల చొప్పున కమీషన్ రూపంలో వెళ్తోంది. రూ.లక్షకు రూ.2 వేల చొప్పున కమీషన్ తీసుకుంటూ అప్పుగా ఇస్తున్న వారు కూడా పెరిగిపోయారు. ప్రతి జూద కేంద్రం నుంచి 20 శాతం టీడీపీ నాయకులు కమీషన్ తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మట్కా, పేకాట హబ్‌గా తాడిపత్రి

కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి ప్రాంతం మట్కా, పేకాటకు హబ్‌గా మారింది. పట్టణ శివారు ప్రాంతాల్లో పేకాట కేంద్రాలు నడుస్తుండగా.. పట్టణ ప్రధాన కూడళ్లు, పలు కాలనీలు మట్కా కేంద్రాలకు కేరాఫ్‌గా మారాయి. నిర్వాహకులు అధికారపార్టీ నాయకులు కావడంతో పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోతున్నారు. నేరుగా ఏఎస్పీకి సమాచారం వస్తేగానీ మట్కా, పేకాట నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన ఓ అధికారపార్టీ నాయకుడికి పేకముక్క ముట్టనిదే తెల్లవారదు. నిత్యం తన నివాసంలోనే పేకాట కేంద్రాన్ని నడుపుతున్నాడు. పోలీసులందరికీ ఈ విషయం తెలిసినా ఆయన ఇచ్చే మామూళ్లతో మిన్నకుండిపోతున్నారు. రెండు నెలల క్రితం ఎస్పీకి సమాచారం రావడంతో.. సదరు నాయకుడి ఇంట్లో పేకాటరాయుళ్లను ఎస్పీ టీం అరెస్ట్ చేసింది. అరెస్ట్ అయిన వారిలో ఆ అధికార పార్టీ నాయకుడు ఉన్నాడు. అయితే పోలీసులు ఆయన పేరు బయటకు రాకుండా, జూదరుల పేర్లు చెప్పకుండా స్వామి భక్తి ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి. పెన్నానది శివారు తోటలు, నిలిచిన నాపరాళ్ల ఫ్యాక్టరీలు పేకాట కేంద్రాలుగా మారుతున్నాయి.
- తాడిపత్రిలో ఏ వీధిలో చూసినా మట్కా బీటర్లు హల్‌చల్ చేస్తున్నారు. సాయంత్రమైతే చాలు రోడ్లపైనే మట్కా చీటీలు రాస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా 10 మంది చేతిలో మట్కా వ్యాపారం సాగుతోంది. ఆర్టీసీ బస్టాండ్,చాంద్ టాకీస్,నందలపాడు, శ్రీనివాస పురం, విజయ నగర్‌కాలనీ, గన్నెవారిపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో మట్కా పెద్ద ఎత్తున సాగుతోంది. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ పక్కనే నివాసంలో ఓ మహిళ మట్కా బీటర్‌గా అవతారమెత్తినా పోలీసులు ఆవైపు చూడటం లేదు. ముఖ్యంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో రోడ్డుపైనే బీటర్లు మట్కా సాగిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందిస్తే గానీ తాడిపత్రిలో జూదకేంద్రాలను నిలువరించలేరని ప్రజలు వాపోతున్నారు.

రండి బాబూ రండి..

పేకాట ఆడేవాళ్లను బ్రోకర్లు ఎక్కడికక్కడ ఆహ్వానిస్తున్నారు. 'అనువైన చోటు, తిండి తిప్పల బాధ్యత మాదే. ముక్కలూ మావే.. మీరు డబ్బు తెచ్చుకుంటే చాలు.. అదీ కష్టం అనుకుంటే ఫోన్ పే/ గూగుల్ పే అయినా ఓకే' అంటూ ఎర వేస్తున్నారు. 'మీ భద్రతకు మాది పూచి.. మీకు ఏం కావాలన్నా తెచ్చి పెట్టడానికి చేతికింద ఎంతో మంది 'జాకీ'లూ సిద్ధం.. పైన 'కింగ్' మనోడే.. ఇంకెందుకు ఆలోచిస్తారు' అంటూ అభయమిస్తున్నట్లు తెలిసింది.

విజయనగర వైభవం ఉట్టిపడేలా..



- ఘనంగా ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు..7న పైడితల్లి జాతర
- 11 వేదికల్లో సాంస్కృతిక కార్యక్రమాలు
- అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, విజయనగరం: కళలకు కాణాచి.. విద్యలకు నిలయం... సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన విజయనగరం ఉత్సవాలకు సన్నద్ధమవుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విజయనగరం వైభవం ఉట్టిపడేలా విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 5న విజయనగరం ఉత్సవాలు ప్రారంభమవ్వగా... 6వ తేదీ వరకు కొనసాగుతాయి. అదే రోజు పైడితల్లమ్మవారి తొలేళ్ల ఉత్సవం ప్రారంభం కానుంది. 7న జాతర మహోత్సవంలో కీలకమైన అమ్మవారి సిరిమాను సంబరం జరగనుంది. రెండు ఉత్సవాలను తిలకించేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలి వస్తుండగా... వారికి కనుల విందు చేసేందుకు 11 వేదికల్లో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వేదికలు... కార్యక్రమాలు ఇలా...

- ఈ నెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు కోట ఎదురుగానున్న బొంకులదిబ్బ వద్ద విజయనగరం ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుక జరిగింది.
- అయోధ్యామైదానంలో 5వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పెట్ షో నిర్వహించారు.
- మహారాజా కోటలో 5, 6వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సైన్స్ ఫెయిర్, స్టాంప్స్ అండ్ కాయిన్స్ ఎగ్జిబిషన్, ఆర్ట్ గ్యాలరీ జరుగుతుంది.
- 5వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు (రంజిని, శివరంజిని థియేటర్ ఎదురుగా) విజయనగరం వైభవంపై 'లేజర్ షో ప్రదర్శిస్తారు. అంతేకాకుండా విజయనగరంలోని ప్రముఖ స్థలాల, కట్టడాలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారు.
- కోట ఎదురుగా ఉన్న బొంకుల దిబ్బపై 5, 6వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కన్యాశుల్కం, సీతాకళ్యాణం, మోహినీ భస్మాసుర, సత్యహరిశ్చంద ప్రదర్శన ఉంటుంది.
- 6వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కోట ప్రధాన ద్వారం సమీపంలో పులివేషాల ప్రదర్శన జరుగుతుంది.
- గురజాడ కళాభారతిలో ఈ నెల 5, 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక కళాకారుల నాటకాలు, వేదిక, బ్యాక్‌డ్రాప్‌లను వెలిగించడం, వేదిక ప్రదర్శనలు, అలంకరణ, హోర్డింగుల ప్రదర్శన ఉంటుంది.
- క్రీడోత్సవంలో భాగంగా విజ్జి స్టేడియంలో 5, 6వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నీస్, చెస్ క్రీడా పోటీలు నిర్వహిస్తారు.
- మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో 5, 6 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత, నృత్య పోటీలు జరుగుతాయి.
- ఎం.ఆర్.లేడీస్ రిక్రియేషన్ అండ్ వెల్ఫేర్ క్లబ్‌లో 5, 6 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పుస్తక ప్రదర్శన, చారిత్రక కథనాలు, ప్రముఖులకు సంబంధించిన ఛాయాచిత్రాలు, శ్రీపాద సుబ్రహ్మణ్యం గారి పుస్తకాల ప్రదర్శన ఉంటాయి.
- లయన్స్ కమ్యూనిటీ హాలులో 5, 6వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డాక్యుమెంటరీ ప్రదర్శన, జానపద కళాకారుల (గిరిజన కళాకారుల)లో నృత్యాలు, స్ట్రీట్ ఫైట్, కత్తిసాము, పులివేషాలు, డప్పు ప్రదర్శన, జముకుల కథ, రేలారే రేల, కోలాటాలు, తప్పెటగుళ్లు, బుర్రకథ, తూర్పు భాగోతం వంటి అనేక సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.
- లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డులో గల మాన్సాస్ గ్రౌండ్‌లో ఈ నెల 8 వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జాతీయ స్థాయి సరస్ మేళా ఏర్పాటు చేస్తారు.
- 5, 6వ తేదీ ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పుష్ప, ఫల ప్రదర్శన ఉంటుంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు గోగర్భం డ్యామ్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 83,380 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,275 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.



సప్త వర్ణ శోభితం

ప్రకృతి రమణీయమైనది. సాయంసంధ్య వేళల్లో ప్రకృతి అందాలను చూస్తే ఎవరైనా సరే మైమరచిపోవలసిందే. నగర జీవి బిజీ బతుకుల్లో పట్టించుకోవడం లేదు కాని...కాస్త తీరిక చేసుకుని ప్రకృతి వైపు ఓసారి కన్నేసి తిలకిస్తే అలసి సొలసిన మనసుకు ఆహ్లాదంతో పాటు మానసిక ప్రశాంతత లభించడం ఖాయం. విజయవాడ కరకట్ట శివారులో సూర్యాస్తమ సమయాన కనిపించిన ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విసురు లేని జాలిర్లు



వరద లేనప్పుడు గోదావరి నదీపాయలో చేపల వేట (ఫైల్)

- వేట లేక పూట గడవని మత్స్యకారులు
- ఈ ఏడాది గోదావరికి ఐదుసార్లు వరదలు
- ప్రతిసారీ చేపలవేటకు దూరం
- జూలై నెలాఖరు నుంచి 40 రోజుల విరామం
- ఊహించని అవరోధమంటూ గగ్గోలు
- ప్రభుత్వాన్ని పరిహారం కోరుతున్న వైనం

సాక్షి, అమలాపురం: కడలిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులు కోనసీమ జిల్లాలో వేలాది మంది ఉండగా.. గోదావరి నదీపాయలను నమ్ముకుని రోజువారీ వేటతో జీవనం సాగిస్తున్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. ఆత్రేయపురం నుంచి దిగువన గోగుల్లంక వరకు.. ఇటు ఓడలరేవు, అంతర్వేది ఇలా గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయల వెంబడి మత్స్యకారులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని వేట సాగిస్తున్నారు. గోదావరి చప్పనీటితో పాటు, సముద్ర సంగమ ప్రాంతంలో ఇటు చప్పనీరు.. అటు ఉప్పునీటిలో దొరికే మత్స్య సంపదతో వీరి జీవనం సాగుతోంది. అటువంటి మత్స్యకారులకు ఈ ఏడాది గోదావరి వరద కన్నీటిని మిగిల్చింది. భారీ వరదలు రాకున్నా, తరచూ పోటెత్తిన వరదల వల్ల ఇంచుమించు 40 రోజులకు పైగా వేటకు దూరమై పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లాలో గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయల్లో అపార మత్స్య సంపద దొరుకుతుంది. ఈ కారణంగానే వందల మంది మత్స్యకారులు నదీపాయల వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇలా వేటపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు మూడు వేలకు పైగా ఉంటాయని అంచనా.

- మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో వశిష్ఠ తీరాన్ని ఆనుకుని అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి లాకుపేట, గొంది, రామరాజులంకలో 500 మత్యకార కుటుంబాలు ఉండగా, వేటపై 300 కుటుంబాల వారు ఆధారపడ్డారు.
- అల్లవరం మండలంలో సుమారు 350 మంది వరకు మత్స్యకారులున్నారు. 200 కుటుంబాలు వేటపైనే జీవనం సాగిస్తున్నాయి. ఈ మండలంలో బోడసకుర్రు, గోడితిప్ప, రెబ్బనపల్లి, ఓడలరేవు గ్రామాల్లో చేపల వేట అధికం. ఇప్పుడు వరద కారణంగా చేపల వేట నిలిచిపోయింది.

40 రోజులుగా ఆదాయానికి గండి

గోదావరిలో దొరికే అరుదైన పులస, చీరమేను వంటి విలువైన మత్స్య సంపదతో పాటు, పండుగప్ప, మోసు, ఎర్రమోసు, కొయ్యింగ, కట్టి చేపలు, గోదావరి రొయ్య (సాక రొయ్య), బుంగరొయ్య, టైగర్ రొయ్య, పీతలు అధికంగా దొరుకుతాయి. బోడసకుర్రు, పి.గన్నవరం, కోటిపల్లి, ముక్తేశ్వరంలో నదీ ఉత్పత్తులతోనే పెద్ద మార్కెట్లు నిర్వహిస్తున్నారు. మరికొన్ని ఉత్పత్తులు హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. వేటపై ప్రతి మత్స్యకారునికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తోంది.

- ఐ.పోలవరం మండలంలో సుమారు 300 మంది మత్స్యకారులు చేపల వేటపైనే జీవనం సాగిస్తున్నారు. జి.మూలపొలం, ఎదుర్లంక, పశువుల్లంక, కేశనకుర్రుపాలెంలో వీరు ఎక్కువగా ఉన్నారు. కాట్రేనికోన మండలం నడవపల్లిలో 150, పల్లంకుర్రు రేవులో 30 కుటుంబాల వారు వేట చేసి జీవనం సాగిస్తున్నారు. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంక, గురజాపులంక వంటి ప్రాంతాల్లో కూడా మత్స్యకారులు అధిక సంఖ్యలో ఉన్నారు.
- ఆత్రేయపురం మండలంలో సుమారు 400 కుటుంబాలు ఉన్నాయి. ఆత్రేయపురం, బొబ్బర్లంక, వెలిచేరు, వాడపల్లిలంకలో మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారు. రావులపాలెం మండలంలో ఊబలంక, ముమ్మిడివరప్పాడులో సుమారు 50 కుటుంబాలు ఉండగా, వీరంతా వరదల సమయంలో వేటకు దూరమయ్యారు.
- కె.గంగవరం మండలం కోటిపల్లి, మసకపల్లి, కూళ్ల, బ్రహ్మపురిలో 1,500 మంది వరకు చేపల వేటపైనే జీవనం సాగిస్తున్నారు.



ఐ.పోలవరం మండలం మురమళ్లలో వరద వల్ల వేట లేక నిలిచిన పడవలు

గోదావరికి ఈ ఏడాది ఐదుసార్లకు మించి వరద పోటెత్తింది. సెప్టెంబర్‌లో అయితే ఏకంగా మూడుసార్లు వరద వచ్చింది. వరద తాకిన ప్రతిసారీ పది రోజులు వేట లేకుండా పోతుంది. పోటెత్తిన వరదలో మత్స్యకారులు వేటను నిలిపివేయాల్సి వస్తుంది. ఈ సమయంలో వీరు పస్తులతో ఉంటున్నారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సుమారు 60 రోజుల పాటు వేట నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో వేటకు దూరంగా ఉన్న మత్స్యకారులకు రూ.20 వేల చొప్పున పరిహారం అందిస్తున్నారు. వరదల వల్ల ఇంచుమించు 40 రోజుల పాటు వేటకు దూరమయ్యామని, తమకు కూడా ఇదే స్థాయిలో పరిహారం ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు. పైగా వరదలకు తొలి ముంపుదారులు కూడా వీరే కావడం గమనార్హం. తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేయగానే.. కోటిపల్లి, లంకాఫ్ ఠానేల్లంక, బోడసుకుర్రు పల్లెపాలెం వంటి ప్రాంతాల్లో మత్స్యకారుల ఇళ్లు నీట మునగడం సహజం. ఈ ఏడాది పలు సందర్భాల్లో ఇళ్లు మునిగినా.. ఆ స్థాయిలో కూడా పరిహారం అందలేదని మత్స్యకారులు వాపోతున్నారు.



అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలో ముంపులో మత్స్యకారుల ఇళ్లు



అండమాన్ టూర్... అమేజింగ్ టూర్.
ఎందుకంటే... ఇది రోడ్డు టూర్ కాదు.
అలాగని రైలు బండి పర్యటనా కాదు.
గాల్లో విమాన విహారమూ కాదు.
నీటి మీద క్రూయిజ్‌లో విహారం.
ఇంకా...
నగరం మధ్య వీధుల్లో విహారం కాదు.
ఇది... సముద్రం మధ్య దీవుల్లో విహారం.
ఎటు చూసినా సముద్రమే...
ఎటు వెళ్లినా ప్రకృతి ఆహ్లాదమే.
ఒకవైపు ఇంద్రధనసు సూర్యోదయం.
మరో వైపు ప్రకృతి చెక్కిన రాతి వంతెన.
ఇన్ని ప్రకృతి అద్భుతాల సుమహారం ఈ టూర్.

• క్రూయిజ్ జర్నీ


అమేజింగ్ అండమాన్

1 రోజు 17వ తేదీ తెల్లవారు జామున 4. 35 గంటలకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో టూర్ నిర్వహకులకు రిపోర్ట్ చేయాలి. మీట్ అండ్ గ్రీట్ తర్వాత పర్యాటకులందరూ విమానం ఎక్కాలి. విమానం దాదాపు తొమ్మిది గంటలకు పోర్ట్‌బ్లెయిర్‌కు చేరుతుంది. ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి హోటల్‌కు చేరి చెక్ ఇన్ చేయాలి. లంచ్ తర్వాత అండమాన్‌లోని సెల్యూలార్ జైలు మ్యూజియం వీక్షణం, కోర్బిన్స్ కోవ్ బీచ్ విహారం. సాయంత్రానికి తిరిగి సెల్యూలార్ జైలుకు చేరుకుని లైట్ అండ్ సౌండ్ షో కి హాజరుకావడం.



శ్రీ విజయపురం!

పోర్ట్ బ్లెయిర్ పట్టణం ఇప్పుడు భారతీయతను సంతరించుకుంది. దీని కొత్త పేరు శ్రీ విజయపురం. అండమాన్ దీవులంటే ఇప్పుడు మనకు పర్యాటక ప్రదేశంగా మాత్రమే గుర్తు వస్తోంది. కానీ మనదేశానికి స్వాతంత్ర్యాన్ని అధికారికంగా ప్రకటించకముందే మన జాతీయ పతాకం ఎగిరిన నేల ఇది. అందుకే శ్రీ విజయపురం అనే పేరును ఖరారు చేసింది భారత ప్రభుత్వం. ఇక్కడ వీర సావర్కర్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన క్షణం నుంచి జాతీయోద్యమకాలంలోకి వెళ్తున్న భావన మొదలవుతుంది. సెల్యూలార్ జైలు ప్రాంగణంలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి అసంకల్పితంగా గుండె బరువెక్కుతుంది. ఇది పోరాట యోధుల జీవించే హక్కునే కాలరాయడం కోసమే నిర్మించిన చెరసాల. బ్రిటిష్ దమన నీతికి నిదర్శనం. ప్రధాన భూభాగానికి దూరంగా విసిరేసినట్లున్న దీవుల్లో పెద్ద జైలు కట్టి జాతీయోద్యమకారులను బంధించేవారు. ఖైదీల చేత చేయించే పనుల నమూనా చిత్రాలతో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. నాటి పాలన దురాగతాలకు కళ్లకు కడుతుంది సాయంత్రం జరిగే సౌండ్ అండ్ లైట్ షో.



2 రోజు పోర్ట్ బ్లెయిర్ నుంచి హావ్‌లాక్ (స్వరాజ్ ద్వీప్)కు ప్రయాణం. తెల్లవారు జామునే హోటల్ గది చెక్ అవుట్ చేయాలి. బ్రేక్‌ఫాస్ట్ ప్యాక్ చేసి ఇస్తారు. క్రూయిజ్ జర్నీ మొదలవుతుంది. హావ్‌లాక్ ఐలాండ్‌కి చేరిన తర్వాత హోటల్‌లో చెక్ ఇన్ చేయాలి. మధ్యాహ్న భోజనం తర్వాత రాధానగర్ బీచ్ విహారం. తిరిగి హోటల్‌కు వచ్చిన తర్వాత డిన్నర్. రాత్రి బస హావ్‌లాక్ దీవిలో.

స్వరాజ్ ద్వీప్ విహారం

అండమాన్- నికోబార్ దీవుల్లో అనేక దీవులు, పట్టణాలు బ్రిటిష్ అధికారుల పేర్లతోనే ప్రాచుర్యంలోకి వచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిన తర్వాత మెల్లమెల్లగా కొత్త పేర్లతో వ్యవహారంలోకి వస్తున్నాయి. హావ్‌లాక్ కూడా బ్రిటిష్ అధికారి పేరే. అయితే దీనిని స్వరాజ్ ద్వీప్‌గా పేరు అధికారికంగా మారింది.



ఇందుకు కారణం జాతీయోద్యమంలో భాగంగా అండమాన్ దీవుల్లో సుభాష్ చంద్ర బోస్ భారత జాతీయపతాకాన్ని ఆవిష్కరించి బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందినట్లు ప్రకటన చేశాడు. ఆయన గౌరవార్థం పాత పేర్లను హావ్‌లాక్ ఐలాండ్- స్వరాజ్ ద్వీప్, రాస్ ఐలాండ్- నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ద్వీప్, నీయెల్ ఐలాండ్ - షాహీద్ ద్వీప్‌గా మార్చింది భారతప్రభుత్వం. ఈ దీవులు అచ్చమైన ప్రకృతి వరాలనే చెప్పాలి. చిరు అలల సవ్వడి వింటూ, మెత్తటి ఇసుకలో నడుస్తూ నీలిరంగు నీటికి- నీలాకాశానికి మధ్యనున్న గీత ఎక్కడో వెతుక్కుంటూ ఉంటే టైమ్ తెలియదు. ఇది ఎకో టూరిజమ్ జోన్. నియమాలను పాటించాలి. టైమ్ మ్యాగజైన్ 2004లో ఇక్కడి రాధానగర్ బీచ్‌కి టైమ్ 'బెస్ట్ బీచ్ ఇన్ ఏషియా' గుర్తింపునిచ్చింది. ఈ టూర్‌లో ఎదురు చూసిన క్రూయిజ్ జర్నీని క్షణక్షణం ఆస్వాదించాలి.



Map for representation purposes only



3 రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత వాటర్ స్పోర్ట్స్ కోసం ఎలిఫెంట్ బీచ్‌కు వెళ్లాలి. వాటర్ స్పోర్ట్స్ టికెట్‌లు పర్యాటకులే కొనుక్కోవాలి. హోటల్ చేరేది రాత్రికే. హోటల్‌కు భోజనం, బస హావ్‌లాక్ ఐలాండ్‌లోనే.

పగడపు దీవుల విహారం!

ఎలిఫెంట్ బీచ్ సముద్రంలో స్విమ్మింగ్, సన్‌బాత్‌కి బాగుంటుంది. వాటర్ స్కూబా డైవింగ్ వంటి స్పోర్ట్స్ ఆడుకోవచ్చు. మరకతాలు పరిచినట్లున్న సముద్రాన్ని ప్రశాంతం తీరాన కూర్చుని ఆస్వాదించడానికి వీలుగా రెల్లుగడ్డి గొడుగులతో పొడవాటి కుర్చీలుంటాయి. ఇక్కడ కూర్చుని సూర్యాస్తమయాలను వీక్షించడం మధురానుభూతి. స్కూబా డైవింగ్‌లో సముద్రగర్భంలోకి దూరిపోయి అక్కడ విస్తరించిన పగడపు దీవులను చుట్టి రావచ్చు.

4 రోజు హావ్‌లాక్ నుంచి నీల్‌కు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత కాలాపత్థర్ బీచ్ విహారం తర్వాత క్రూయిజ్‌లో నీల్ ఐలాండ్‌కు చేరాలి. హోటల్ గదిలో చెక్ ఇన్. సాయంత్రం సీతాపూర్ బీచ్, లక్ష్మణ్ పూర్ బీచ్‌లో సూర్యాస్తమయ వీక్షణం. రాత్రి బస నీయెల్ ఐలాండ్‌లో.



సన్‌రైజ్ బీచ్

షాహీద్ దీవి నుంచి సూర్యోదయ వీక్షణం ఓ మధురానుభూతి. చక్కటి వ్యూ పాయింట్ అని చెప్పవచ్చు. అందుకే దీనికి సన్‌రైజ్ బీచ్ అనే విశేషణం. ఫొటోగ్రఫీకి ది బెస్ట్ లొకేషన్. నవదంపతులు మంచి లొకేషన్‌లో ఫొటోలు తీసుకుంటే పర్యటన జ్ఞాపకాలు కూడా కలకాలం పదిలంగా ఉంటాయి.

ప్రకృతి అద్భుతం- శిలావంతెన

షాహీద్ (నీయెల్) దీవి ప్రకృతి చేసే చిత్రవిచిత్రాలకు, విన్యాసాల నిలయం. తిరుమల గిరుల్లో శిలాతోరణాన్ని చూస్తాం. కొండ రాళ్లు నీటి ప్రవాహ తాకిడికి అరిగిపోయి పై భాగంలో శిల అలాగే ఉండిపోవడంతో ఆ రూపం తోరణాన్ని తలపిస్తుంటుంది. ఈ దీవిలోని లక్ష్మణ్‌పూర్ బీచ్‌లో కూడా అలాంటి ప్రకృతి అద్భుతం ఉంది. దీనిని శిలా వంతెన, సహజ వంతెన అంటారు. ఈ బీచ్ సూర్యాస్తమయ వీక్షణానికి గొప్ప ప్రదేశం కావడంతో సన్‌సెట్ బీచ్ అంటారు. ఈ దీవిలో అరవై కిందటి వరకు ఇక్కడ మనుష సంచారం ఉండేది. ఇక్కడ ఉన్న స్థానికులు బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చిన హిందూ శరణార్థులే.



5 రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి భరత్‌పూర్ బీచ్ విహారానికి వెళ్లాలి. ఆ తర్వాత పోర్ట్‌బ్లెయిర్‌కు ప్రయాణం. ఈ రోజు సాయంత్రం విశ్రాంతిగా గడపడమే. రాత్రి బస పోర్ట్ బ్లెయిర్‌లో.



సప్తవర్ణమాలిక

సముద్రం మీద సూర్యోదయం అంటే మనకు గుర్తుకు వచ్చేది ఆరెంజ్‌కలర్‌లో బంతిలాగ నీటి నుంచి ఉద్భవిస్తున్న సూర్యుడి రూపమే. కానీ భరత్‌పూర్ బీచ్‌లో సూర్యోదయం సప్తవర్ణ సంగమం. సముద్రం ఈమద ఇంద్రధనసు విన్యాసాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. అలాగే ఇక్కడ సముద్రపు నీరు తక్కువ లోతులో ఈదడానికి అనువుగా జెట్టీ నిర్మాణం ఉంది. అందులో వాటర్ స్పోర్ట్స్, కోరల్ రీఫ్స్ విజిట్‌తోపాటు ప్రశాంతంగా నీటిలో సేదదీరవచ్చు.

6 రోజు హైదరాబాద్‌కు ప్రయాణం. పోర్ట్‌బ్లెయిర్‌లో తెల్లవారు జామునే హోటల్ గది చెక్ అవుట్ చేసి ఎయిర్‌పోర్టుకు చేరాలి. టూర్ నిర్వహకులు పర్యాటకులను ఎనిమిది లోపు ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేసి, వీడ్కోలు చెబుతారు. విమానం 9.55కి బయలుదేరి 12.10 గంటలకు హైదరాబాద్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.



అమేజింగ్ అండమాన్ టూర్ అక్టోబర్ 17వ తేదీన హైదరాబాద్ నుంచి మొదలవుతుంది. 6ఈ- 6305 నంబర్ విమానం 17వ తేదీ ఉదయం ఆరు గంటల 25 నిమిషాలకు హైదరాబాద్ నుంచి బయలుదేరుతుంది. ఎనిమిది గంటల 55 నిమిషాలకు పోర్ట్‌బ్లెయిర్‌కు చేరుతుంది.


ప్యాకేజ్ ఇలా:


కంఫర్ట్ కేటగిరీలో సింగిల్ ఆక్యుపెన్సీ టికెట్ 74, 425 రూపాయలు. డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 56,625 రూపాయలు. ట్రిపుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 54, 925 రూపాయలు. పిల్లలకు (5-11 ఏళ్ల మధ్య) 48, 785 రూపాయలు. ఇందులో విడిగా బెడ్ ఉంటుంది. బెడ్ లేకుండా (2-11 ఏళ్ల మధ్య) 45, 485 రూపాయలు. రెండేళ్లలోపు పిల్లలకయితే టికెట్ బుక్ చేయాల్సిన అవసరం లేదు. కానీ విమానం ఎక్కే ముందు ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో దాదాపుగా 1,750 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

బుకింగ్ ఎలా:


సంప్రదించాల్సిన చిరునామా:
ఐఆర్‌సీటీసీ, సౌత్‌సెంట్రల్ జోన్,
ఐఆర్‌సీటీసీ 9-1-129/1/302, థర్డ్ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా,
ఎస్‌డీ రోడ్, సికింద్రాబాద్, తెలంగాణ.
ఫోన్ నంబరు: 040- 27702407
విజయవాడ ఏరియా ఆఫీస్ : 92810 30714
టూర్ కోడ్: SHA18 - AMAZING ANDAMAN OCT 17

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి









విజయం అంటే గమ్యాన్ని చేరడం కాదు.
దారిలో నేర్చుకున్న పాఠాలు.
- స్టీవ్ జాబ్స్, యాపిల్ కంపెనీ సహ వ్యవస్థాపకుడు

గణాంకాలు, ప్రపంచ పరిణామాలే దిక్సూచి!

ఈ వారం మార్కెట్ గమనంపై నిపుణుల అభిప్రాయం

- 9న టీసీఎస్ ఫలితాలతో క్యూ2 షురూ..
- విదేశీ ఇన్వెస్టర్ల ధోరణీ కీలకమే...
- రూపాయి, ముడి చమురు కదలికలపైనా ఫోకస్

న్యూఢిల్లీ: స్థూల ఆర్థిక గణాంకాలు, ప్రపంచ పరిణామాలతో పాటు ఐటీ దిగ్గజం టీఎస్ఎస్‌తో బోణీ కానున్న రెండో త్రైమాసిక (క్యూ2) ఫలితాలు మన మార్కెట్ల గమనాన్ని నిర్దేశించనున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. వరుసగా మూడు నెలల నుంచి అమ్మకాల బాటలో సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలను కూడా మార్కెట్లు నిశితంగా పరిశీలిస్తాయని చెప్పారు. మరోపక్క, జారుడు బల్లపై ఉన్న రూపాయి మారకం విలువ, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల కదలికలు కూడా మార్కెట్లకు దిశా నిర్దేశం చేయనున్నాయి.


టీసీఎస్ బోణీ...

కార్పొరేట్ల క్యూ3 (జూలై–సెప్టెంబర్) ఆర్థిక ఫలితాలు ఈ వారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 9న ఐటీ దిగ్గజం టీసీఎస్ ఫలితాలతో బోణీ కొట్టనుంది. ట్రంప్ సర్కారు హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం, 25 శాతం అదనపు టారిఫ్‌ల మోత తదితర భారత్ వ్యతిరేక చర్యల నేపథ్యంలో క్యూ2 ఫలితాలపై, కంపెనీల భవిష్యత్తు అంచనాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు. 'క్యూ2 ఫలితాల సందర్భంగా టారిఫ్‌ల ప్రభావం, వీసా ఫీజుల పెంపు, డీల్స్, కంపెనీల వ్యయాలు, ఉద్యోగాల కోత, హైరింగ్ అవుట్‌లుక్ వంటి అంశాలపై టీసీఎస్ యాజమాన్యం చేసే వ్యాఖ్యలు ఐటీ రంగంలో పాటు మార్కెట్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉంది' అని ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్ టెక్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సీఈఓ పోన్ముడి ఆర్ అభిప్రాయపడ్డారు.



మెగా ఐపీఓ వారం..

పబ్లిక్ ఆఫర్ల వరదతో కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్లను ఈ వారం మెగా ఐపీఓలు (దాదాపు రూ.27,000 కోట్లు) ముంచెత్తనున్నాయి. టాటా క్యాపిటల్ రూ.15,512 కోట్ల ఇష్యూతో పాటు (6న ప్రారంభమై 8న ముగుస్తుంది). దీని ప్రైస్ బ్యాండ్‌ను కంపెనీ రూ.310–326గా నిర్ణయించింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓ కూడా ఈ వారమే ప్రారంభమవుతోంది. దాదాపు రూ.11,607 కోట్ల ఈ ఆఫర్ అక్టోబర్ 7న మొదలై 9న క్లోజవుతుంది. దీని ధరల శ్రేణి రూ.1,080–1,140. ఇవి కాకుండా రూబికాన్ రీసెర్చ్ రూ.1,377 కోట్ల ఇష్యూ అక్టోబర్ 9న షురూ కానుంది. ఇప్పటికే మొదలైన రూ.3,000 కోట్ల వియ్‌వర్క్ ఆఫర్ 7న ముగియనుంది. 2025లో ఇప్పటికే 78 ఐపీఓలు పూర్తవగా.. రానున్న నెలల్లో మరిన్ని కంపెనీలు వరుస కట్టనున్నాయి.



గణాంకాలపై ఫోకస్..

'టీసీఎస్ ఫలితాలకు తోడు హెచ్ఎస్‌బీసీ సర్వీస్ రంగం పీఎంఐ డేటా, బ్యాంకింగ్ రంగ రుణ, డిపాజిట్ వృద్ధి గణాంకాలు రానున్నాయి. టాటా క్యాపిటల్, ఎల్‌జీ బడా ఐపీఓలతో ప్రైమరీ మార్కెట్ కార్యకలాపాలు జోరందుకోనున్నాయి' అని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా చెప్పారు. కాగా, అమెరికాలో ఫెడర్ రిజర్వ్ ఇటీవలి పాలసీ భేటీ వివరాలు (మినిట్స్), నిరుద్యోగ గణాంకాలు, కన్జూమర్ సెంటిమెంట్ డేటా వంటి వాటిపై ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ఫోకస్ చేసే అవకాశం ఉంది. కొనసాగుతున్న అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కొన్ని కీలక ఆర్థిక గణంకాలు ఇప్పటికే ఆలస్యమయ్యాయని మిశ్రా పేర్కొన్నారు.

గత వారమిలా...

వరుసగా 8 రోజుల పాటు నష్టాల బాటలో సాగిన దేశీ మార్కెట్లకు ఆర్‌బీఐ పాలసీ కాస్త ఊరట నిచ్చింది. గురు, శుక్రవారాల్లో ప్లస్‌లో నిలిచిన సూచీలు లాభాలతో వారాన్ని ముగించాయి. సెన్సెక్స్ 781 పాయింట్లు (0.97%), నిఫ్టీ 240 పాయింట్లు (0.97%) చొప్పున ఎగబాకాయి. కీలక రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించినప్పటికీ, రానున్న నెలల్లో రేట్ల కోతకు ఆస్కారం ఉందంటూ ఇచ్చిన సిగ్నల్స్ మార్కెట్‌ను మెప్పించింది. మరోపక్క, ఐపీఓ ఫైనాన్సింగ్, షేర్ల తనఖా రుణ పరిమితిని భారీగా పెంచడం కూడా ఇన్వెస్టర్లలో జోష్ నింపింది. 'జీడీపీ వృద్ధి అంచనాలను పెంచడంతో పాటు పాలసీ సందర్భంగా ఆర్‌బీఐ తీసుకున్న చర్యలు ఇన్వెస్టర్లలో విశ్వాసం పెంచింది. ఇటీవలి కరెక్షన్ నుంచి మార్కెట్లు మళ్లీ సానుకూల పథంలోకి మారాయి' అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ వ్యాఖ్యానించారు.

ఎఫ్‌పీఐల రివర్స్ గేర్...

సెప్టెంబర్ నెలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) అమ్మకాల జోరు పెంచారు. ఈ ఒక్క నెలలోనే రూ.23,885 కోట్ల విలువైన షేర్లను నికరంగా అమ్మేశారు. దీంతో ఈ ఏడాది ఇప్పటిదాకా ఈక్విటీ మార్కెట్లో ఎఫ్‌పీఐల నికర అమ్మకాలు రూ.1.58 లక్షల కోట్లకు చేరాయి. వరుసగా మూడో నెలలోనూ విదేశీ ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం తాజా కరెక్షన్‌కు ఆజ్యం పోసింది. ఆగస్ట్‌లో ఏకంగా రూ.34,990 కోట్లు ఉపసంహరించున్న ఎఫ్‌పీఐలు, జూలైలో రూ.17,700 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. 'ఇటీవలి అమ్మకాలకు ప్రధానంగా అమెరికా టారిఫ్‌ల మోతతో పాటు ఇతరత్రా పాలసీ షాక్‌లు ప్రధాన కారణం. భారతీయ వస్తువులపై 50 శాతం టారిఫ్‌ల విధింపు, హెచ్1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు వంటివి ఎగుమతి ఆధారిత రంగాలపై, ముఖ్యంగా ఐటీ పరిశ్రమ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రూపాయి రికార్డు కనిష్టాలకు పడిపోతుండటం వల్ల తలెత్తుతున్న కరెన్సీ రిస్క్, భారతీయ స్టాక్స్‌లో అధిక వేల్యుయేషన్లు వంటివి కూడా ఎఫ్ఐపీలను తాత్కాలికంగా ఇతర ఆసియా మార్కెట్ల వైపు (రొటేషన్) దృష్టి సారించేలా చేస్తోంది' అని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా ప్రిన్సిపల్ మేనేజర్ హిమాన్షు శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు.



ఎలక్ట్రానిక్స్ తయారీకి రాష్ట్రాలూ చేయూతనివ్వాలి

- పరిశ్రమల సంఘం 'ఎల్సినా' డిమాండ్
- కేంద్రం పథకంతో 40 శాతానికి స్థానిక విలువ

న్యూఢిల్లీ: నాన్ సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్పాదక అనుసంధాన ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడం స్థానిక తయారీకి జోష్‌నివ్వనుంది. తుది ఉత్పత్తుల విలువలో స్థానిక తయారీ విలువ 40 శాతానికి పెరుగుతుందని ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల సంఘం (ఎల్సినా) ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ 'ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం' (ఈసీఎంఎస్)కు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వాలు సైతం వ్యాపార నిర్వహణను సులభతరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈసీఎంఎస్ కింద రూ.1.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ప్రతిపాదనలు రావడం గమనార్హం. రూ.59,000 కోట్ల పెట్టుబడులు రాబట్టుకోవాలని కేంద్రం ఆశించగా, అంతకు రెట్టింపు మేర స్పందన వచ్చింది. మొత్తం 249 కంపెనీలు పెట్టుబడుల ప్రతిపాదనలు సమర్పించాయి. కేంద్ర ప్రభుత్వ కమిటీ వీటిని పరిశీలించిన అనంతరం, అర్హత కలిగిన వాటికి ఆమోదం లభించనుంది. ''దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థలో స్థానిక విలువ జోడింపును ప్రస్తుతమున్న 15–20 శాతం నుంచి 35–40 శాతానికి వచ్చే ఐదేళ్లలో పెరిగేందుకు ఈ పథకం దోహదం చేస్తుంది'' అని ఎల్సినా సెక్రటరీ జనరల్ రాజు గోయల్ తెలిపారు.



రూ.10.34 లక్షల కోట్ల తయారీ

తాము రూ.4,56,500 కోట్ల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంటే, రూ.10.34 లక్షల కోట్ల ఉత్పత్తికి సంబంధించిన ప్రతిపాదనలు వచ్చినట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ నెల 2న ప్రకటించడం గమనార్హం. ఇందులో ప్రధానంగా ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులకు సంబంధించి రూ.16,542 కోట్లు, ఎలక్ట్రో మెకానికల్ విడిభాగాలకు సంబంధించి రూ.14,362 కోట్లు, మల్టీ లేయర్ పీసీబీలకు సంబంధించి రూ.14,150 కోట్లు, డిస్‌ప్లే మాడ్యూల్ సబ్ అసెంబ్లీకి సంబంధించి రూ.8,642 కోట్లు, కెమెరా మాడ్యూల్ సబ్ అసెంబ్లీకి సంబంధించి రూ.6,205 కోట్లు, లిథియం అయాన్ సెల్స్‌కు సంబంధించి రూ.4,516 కోట్ల చొప్పున ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో ఎలక్ట్రో మెకానికల్స్, ఐటీ ఉత్పత్తులకు సంబంధించి ఎన్‌క్లోజర్లు, మల్టీ లేయర్ పీసీబీలు, ఫ్లెక్సిబుల్ పీసీబీలకు ంసబంధించి పెద్ద మొత్తంలో, అధిక విలువ మేర ప్రతిపాదనలు వచ్చినట్టు ఎల్సినా తెలిపింది. తయారీ కేంద్రంగా భారత్‌పై పెరుగుతున్న విశ్వాసానికి ఈ స్పందన నిదర్శనమని ఎల్సినా ప్రెసిడెంట్ శశి గంధనం పేర్కొన్నారు. వ్యాపార నిర్వహణకు అనుకూలమైన పరిస్థితులను కల్పించడం ద్వారా ఈ ధోరణికి రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రాలు సైతం తమవంతు ప్రోత్సాహకాలు కల్పిస్తే మరిన్ని పెట్టుబడులు రావడంతోపాటు, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాల కల్పన సాధ్యపడుతుందన్నారు.

భవిష్యత్తులో పాలసీ రేట్ల కోతకు మరింత చాన్స్: క్రిసిల్

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణ అంచనాలను తగ్గించిన రిజర్వ్ బ్యాంక్, భవిష్యత్తులో పాలసీ రేట్లను మరింత తగ్గించేందుకు అవకాశాలను తెరిచి ఉంచిందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ ఒక నివేదికలో తెలిపింది. అమెరికా టారిఫ్‌లపరమైన అనిశ్చితుల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) ద్వితీయార్థంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి తిరోగమించే రిస్కులు ఉన్నట్లు మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) కూడా పేర్కొందని గుర్తు చేసింది. అయితే, ఇటీవల జీఎస్‌టీ రేట్లను క్రమబద్ధీకరించడం వల్ల టారిఫ్‌లపరమైన ప్రతికూల ప్రభావం కొంత తగ్గొచ్చని క్రిసిల్ ఇంటెలిజెన్స్ తెలిపింది. కార్మిక శక్తి అధికంగా ఉండే నిర్దిష్ట రంగాలపై టారిఫ్‌ల ఎఫెక్ట్ గణనీయంగా ఉంటుందని, వాటికి పాలసీపరమైన మద్దతును అందించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణంపరమైన ఆందోళన కొంత తగ్గే అవకాశం ఉందని, అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల తగ్గింపు ప్రభావంతో ఆర్‌బీఐ కూడా పాలసీ రేట్లను తగ్గించడానికి కాస్త ఆస్కారం ఉంటుందని వివరించింది. 2025 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు (1%) తగ్గించింది. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్నందున, ఎంపీసీ సిఫార్సుల మేరకు, పాలసీ రేట్లను ఆర్‌బీఐ ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో మరో 25 బేసిస్ పాయింట్లు, జూన్‌లో 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఇది ప్రస్తుతం 5.5 శాతానికి చేరింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రిటైల్ ద్రవ్యోల్బణం, రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న 4 శాతం లోపే కొనసాగుతోంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-10-2025	
విశాఖ	515–00
చిత్తూరు	528–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

ఏడాదిలో బీఎస్ఎన్ఎల్ 5జీ నెట్‌వర్క్

న్యూఢిల్లీ: భారత్ సొంతంగా అభివృద్ధి చేసిన బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌ని ఏడాదిలోగా 5జీకి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. భారత దేశం కూడా సొంతంగా 4జీ టెక్నాలజీ రంగంలోకి అడుగుపెట్టిందని ప్రపంచవ్యాప్తంగా స్వీడన్, ఫిన్లాండ్, దక్షిణ కొరియా, చైనాకు చెందిన హువావే, జడ్‌టీఈ, శాంసంగ్, నోకియా, ఎరిక్సన్ తదితర ఐదు కంపెనీలు 4జీ టెక్నాలజీలో ఆధిపత్యం వహిస్తున్నాయని, భారత్ కూడా ఇప్పుడు 4జీ ప్రపంచ క్లబ్‌లో ప్రవేశించిందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భరూచ్ నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు 92564 టవర్లను ప్రారంభించినట్లు సింధియా తెలిపారు. ఈ వేగం ఇక్కడితో ఆగదని వచ్చే ఏడాదిలోగా ఈ 4జీ టవర్లను 5జీ నెట్‌వర్క్‌కు అప్‌గ్రేడ్ చేసి దేశమంతా 5జీ సేవలు అందిస్తామని సింధియా వెల్లడించారు.



జాయింట్ డెవలప్ అగ్రిమెంట్లు.. జాగ్రత్తలు

జాయింట్ డెవలప్ అంటే మీకు బాగా తెలుసు.. ఒక ఓనర్, ఒక డెవలపర్, వారి మధ్య అగ్రిమెంటు. అపార్ట్‌మెంట్లు ఎన్ని కడతారు, వాటిని ఎలా పంచుకోవాలిలాంటి మిగతా విషయాలతో కూడుకున్న ఒక అగ్రిమెంటు.

ఒకప్పుడు ఇలా ఒప్పందంపై సంతకం పెట్టగానే ఓనర్ నెత్తి మీద బాంబు పడేది. ఏ రోజు సంతకం పెట్టారో ఆ రోజునే ఆ ల్యాండ్ బదిలీ అయినట్లు లెక్క. డెవలపర్ పని మొదలుపెట్టకపోయినా, మొదలుపెట్టి పూర్తి చేయకపోయినా, పూర్తి చేసి ఓనర్‌కి వారి వంతు అపార్ట్‌మెంట్లు ఇవ్వకపోయినా, డబ్బులు చేతికి రాకపోయినా కూడా.. పన్ను భారం మాత్రం విధించే వారు. ఇది అశనిపాతంలాంటిది. ఏదో శాపవిమోచనంలాగా 2017 సంవత్సర శుభవేళ, చట్టంలో (అధికారులు చూడటంలో) మార్పు వచ్చింది. ఇక నుంచి అగ్రిమెంటు రోజు కాదు, డెవలపర్ అపార్టుమెంట్‌ను పూర్తి చేసి, కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేసిన నాడు పన్ను భారం ఏర్పడుతుంది. ప్రతిఫలం ఎంత అంటే, ల్యాండ్ ఓనర్‌కి ఇచ్చిన షేరు, స్టాంప్ డ్యూటీ విలువ, అదనంగా ఇచ్చిన నగదు. ఈ కథ సజావుగా సాగుతోంది. అందరూ బాగున్నారు. కానీ అధికారులకు ఇందులో కొన్ని లొసుగులు కనిపించాయి. కొన్ని మోసాలు బైటపడ్డాయి. వేల్యుయేషన్లలో అవకతవకలు కనిపించాయి. వివిధ రకాల వేల్యుయేషన్, అస్థిరమైన అంకెలు, చాలా సందర్భాల్లో అండర్ వేల్యుయేషన్, కొన్ని చోట్ల అండర్ రిపోర్టింగ్.. వెరసి మతలబుల గారడీ అయ్యింది.

2014 సంవత్సరంలో జారీ చేసిన ఉత్తరం (ఉత్తర్వులాంటిది) ప్రకారం 2021–22, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో జారీ చేసిన ఆక్యుపెన్సీ-కమ్-కంప్లీషన్ సర్టిఫికెట్లను రివ్యూ చేయాలన్నారు. ఆ డేటాని డిపార్టుమెంటు వాళ్లకు దాఖలు చేసిన డాక్యుమెంట్లు/సమాచారంతో సమన్వయం చేయాలన్నారు. ఈ విషయంలో కలకత్తా అధికారులు ఒక సరైన, సమర్థవంతమైన, సమగ్రమైన పద్ధతి ఫాలో అయ్యారు. అదేమిటంటే..

a) రెరా (ఆర్ఈఆర్ఏ), హిరా (హెచ్ఐఆర్ఏ)లాంటి ప్రభుత్వ సంస్థల అధికారిక వెబ్‌సైట్లలో సమాచారాన్ని తీసుకుని, సమన్వయం ద్వారా డేటాని సేకరించడం

b) జాయింటు డెవలప్‌మెంటు అగ్రిమెంట్లో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించడం. ప్రాజెక్టు వివరాలు, కాగితాలు, అసలు ఎన్నింటికి అనుమతి లభించింది? ల్యాండ్ ఓనర్లు ఎవరు, డెవలపర్లు ఎవరు, ఏ సంవత్సరంలో, ఏ స్థాయిలో వర్క్ జరిగింది మొదలైన వివరాల పరీక్ష, సమీక్ష.

c) సీపీసీ 2.0 పోర్టల్ ద్వారా రిటర్నుల్లో ఏయే సమాచారం ఉంది, రిటర్న్ ప్రకారం ఏయే ప్రాజెక్టులు పూర్తయ్యాయి మొదలైన వివరాలను క్రాస్ వెరిఫై చేయడం

d) రిటర్నులో ఒక షెడ్యూలు క్యాపిటల్ గెయిన్స్‌కి సంబంధించినది. అందులో పొందుపర్చిన వివరాల సేకరణ.

e) అన్ని వివరాలు చేతిలో పడ్డాక, పిలక దొరికినట్లే. సమన్లు జారీ చేయడం, అస్సెసీలను పిలవడం, అన్ని వివరాలు రాబట్టుకోవడం, గుట్టు రట్టు చేయడం.

దీనివల్ల రెవెన్యూపరంగా ఎన్నో సత్ఫలితాలు వచ్చాయి. వివరాలను వెల్లడించని ఎందరో బడా బాబులు చట్టాన్ని గౌరవించడం (విధి లేక) మొదలెట్టారు. దేశమంతటా కలకత్తా మోడల్‌ని ఒక ప్రామాణిక ఆపరేటింగ్ విధానంగా మలిచారు. ఉత్తమ పద్ధతిగా తీర్చిదిద్దారు. స్పష్టమైన వైఖరి, డేటా ఆధారిత ఫ్రేమ్‌వర్క్, పారదర్శకత, దేశమంతటా ఒకే విధానం, గోప్యత పాటిస్తూ వివరాల సేకరణ.. ఇదీ లక్ష్యం.

ఈమధ్యే, అంటే 2025 సెప్టెంబర్ 15న ఒక ఆఫీస్ మెమొరాండంను జారీ చేశారు. దీని లక్ష్యాలు రెండు..

1. కాంప్లయెన్స్ (నిబంధనలను పాటించడం) జరగాలి
2. పన్ను వసూళ్లు అస్సెస్సీలు ఇచ్చే సమాచారం మీద తక్కువగా ఆధారపడటమనేది ఇక్కడ ప్రధానమైన ఉద్దేశం.

సూచన ఏమిటంటే: సరైన, సమగ్రమైన సమాచార సేకరణ కోసం రెరా అధికారులు, డెవలప్‌మెంట్ అధికారులను సంప్రదించాలి.


వారు ఏం చేస్తారు: సమాచారాన్ని సేకరించి ఇన్వెస్టిగేషన్ అధికారులకు పంపుతారు. తేడా ఉంటే వారు తోలు తీస్తారు.

చివరగా 2025 అక్టోబర్ 31లోగా ఈ సమాచారాన్ని సేకరించాలి. అధికారులు త్వరితగతిన పురోగతి చూపిస్తారు.

ఏం చేయాలి: మీరు ఓనర్ అయినా డెవలపర్ అయినా జాగ్రత్త వహించాలి. ఇన్వెస్ట్‌మెంటుపరంగా డెవలపర్, క్యాపిటల్ గెయిన్స్‌పరంగా ఓనర్.. తగిన శ్రద్ధ పెట్టాలి. ఈ విషయంలో మీ నిజాయితీ, నీతే మీ స్థిరాస్తి!



కె.సీహెచ్. ఏ.వీ.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మెరుగైన రాబడులకు మార్గం!

డీఎస్‌పీ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్

ఈక్విటీ మార్కెట్లలో స్వల్పకాలం పాటు అనిశ్చితులు ఉన్నా కానీ, దీర్ఘకాలానికి చూసుకుంటే మెరుగైన పనితీరే కనిపిస్తుంది. ఇప్పటి వరకు ఉన్న చరిత్ర ఇదే తెలియజేస్తుంది. కనుక ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు దీర్ఘకాల దృష్టితోనే అడుగులు వేయడం మంచిది. మధ్య కాలం నుంచి దీర్ఘకాల (కనీసం ఐదేళ్లు, ఆ పైన) లక్ష్యాల కోసం పరిశీలించాల్సిన పథకాల్లో డీఎస్‌పీ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఒకటి. ఈ పథకం లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగాల్లో ప్రధానంగా ఇన్వెస్ట్ చేస్తుంది.



రాబడులు

దీర్ఘకాలంలో 'నిఫ్టీ లార్జ్ మిడ్‌క్యాప్ 250' సూచీని మించి ఈ పథకం రాబడులను ఇచ్చింది. గడిచిన ఏడాది కాలంలో మార్కెట్లలో ఎలాంటి రాబడి లేకపోవడంతో ఈ పథకం 1.59 శాతం నష్టాలు కనిపిస్తున్నాయి. ఇదే కాలంలో నిఫ్టీ లార్జ్‌మిడ్‌క్యాప్ 250టీఆర్ఐ 4.45 శాతం నష్టపోవడం గమనార్హం. అంటే సూచీకంటే ఈ పథకమే నష్టాలను తక్కువకు పరిమితం చేసినట్టు అర్థమవుతోంది. గడిచిన మూడేళ్ల కాల పనితీరును గమనిస్తే ఏటా 22 శాతం చొప్పున పెట్టుబడులపై రాబడులను తెచ్చిపెట్టింది. ఇక ఐదేళ్ల కాలంలో ఈ పథకం వార్షికంగా ఇచ్చిన రాబడి 24 శాతం చొప్పున ఉంది. ఇదే కాలంలో నిఫ్టీ లార్జ్‌మిడ్‌క్యాప్ 250టీఆర్ఐ వృద్ధి 19.76 శాతానికి పరిమితమైంది. ఇలా అన్ని కాలాల్లోనూ బెంచ్‌మార్క్ కంటే బలమైన పనితీరును ఈ పథకంలో గమనించొచ్చు. సాధారణంగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల పనితీరు విశ్లేషణకు కచ్చితత్వంగా ఉంటుంది. ఎందుకంటే స్వల్ప కాలంలో మార్కెట్లలో ఆటుపోట్లు ఎక్కువగా ఉంటాయి. పనితీరుపై వీటి ప్రభావం పడుతుంది. దీనికితోడు ఆయా పథకాల పెట్టుబడుల విధానాల ఆధారంగానూ స్వల్పకాలంలో రాబడుల పరంగా వ్యత్యాసం ఉంటుంది. కానీ, దీర్ఘకాలంలో వీటన్నింటినీ అధిగమించి ఒక పథకం ఏ విధంగా పనిచేసిందన్నది చూడాలి.



పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో

పోర్ట్‌ఫోలియోలో తగినంత వైవిధ్యాన్ని ఈ పథకం అనుసరిస్తోంది. ప్రధానంగా లార్జ్‌క్యాప్‌తో పాటు, రాబడుల కోసం కొంత మొత్తాన్ని మిడ్‌క్యాప్ కంపెనీల్లోనూ ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. ప్రస్తుతానికి ఈ పథకం నిర్వహణలో రూ.15,356 కోట్లు ఉన్నాయి. ఇందులో 97.22 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలినది నగదు రూపంలో కలిగి ఉంది. మొత్తం పెట్టుబడుల్లో లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 63 శాతం, మిడ్‌క్యాప్ కంపెనీల్లో 36 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్ కంపెనీలకు 1.18 శాతం కేటాయించింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 72 స్టాక్స్ ఉన్నాయి. వీటిల్లో టాప్ 10 స్టాక్స్‌లోనే 33 శాతం వరకు పెట్టుబడులు ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 32.81 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 13.28 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 11 శాతం, ఇంధనం, యుటిలిటీ కంపెనీలకు 9.54 శాతం చొప్పున కేటాయింపులు చేసింది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో (సిప్) ఇన్వెస్టర్లు ఈ పథకంలో పెట్టుబడులను దీర్ఘకాలం కోసం పరిశీలించవచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఎస్‌బీఐ	5.52
ఇన్ఫోసిస్	4.81
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4.52
యాక్సిస్ బ్యాంక్	4.30
ఐసీఐసీఐ బ్యాంక్	3.95
కోటక్ బ్యాంక్	2.52
కోఫోర్జ్	2.29
సిప్లా	1.99
భారత్ పెట్రోలియం	1.82
ఐసీఐసీఐ లాంబార్డ్	1.77

ప్రభ్‌సిమ్రన్ మెరుపు శతకం

- మూడో వన్డేలో ఆ్రస్టేలియా 'ఎ'పై భారత్ 'ఎ' విజయం
- 2–1తో సిరీస్ హస్తగతం



కాన్పూర్: ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (68 బంతుల్లో 102; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగడంతో ఆ్రస్టేలియా 'ఎ' జట్టుతో జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత 'ఎ' జట్టు విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఆఖరి పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత 'ఎ' జట్టు 2 వికెట్ల తేడాతో ఆ్రస్టేలియా 'ఎ' జట్టుపై గెలుపొందింది. దీంతో 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆ్రస్టేలియా 'ఎ' జట్టు 49.1 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జాక్ ఎడ్వర్డ్స్ (75 బంతుల్లో 89; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... లియామ్ స్కాట్ (64 బంతుల్లో 73; 1 ఫోర్, 6 సిక్స్‌లు), కూపర్ కొనొల్లీ (49 బంతుల్లో 64; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలు చేశారు. మొత్తంగా ఆసీస్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో 15 సిక్స్‌లు కొట్టారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 38 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... ఇటీవల ఆ్రస్టేలియా పర్యటనకు ఎంపికైన హర్షిత్ రాణా 61 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. ఆయుశ్ బదోనీ 2 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం లక్ష్య ఛేదనలో భారత 'ఎ' జట్టు 46 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 322 పరుగులు చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ ధనాధన్ సెంచరీకి... కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (58 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ పరాగ్ (55 బంతుల్లో 62; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలు తోడవడంతో భారత జట్టు అలవోకగా గెలుపొందింది. ఆసీస్ బౌలర్లలో టాడ్ మార్ఫీ, తన్వీర్ సంఘా చెరో 4 వికెట్లు తీశారు. ప్రభ్‌సిమ్రన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', రియాన్ పరాగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో సైతం భారత 'ఎ' జట్టే విజయం సాధించింది.



బెంగళూరుకు రెండో గెలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో బెంగళూరు టార్పెడోస్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 11–15, 15–13, 15–11, 15–11తో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ జట్టును ఓడించింది. మరో మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్ 11–15, 17–15, 15–13, 10–15, 15–10తో గోవా గార్డియన్స్‌పై గెలిచింది.



విన్నర్స్ ట్రోఫీతో విదర్భ జట్టు సంబరం

విజేత విదర్భ

- మూడోసారి ఇరానీ కప్ కైవసం
- 93 పరుగుల తేడాతో రెస్టాఫ్ ఇండియా ఓటమి
- పోరాడిన యశ్ ధుల్, మానవ్ సుతార్

నాగ్‌పూర్: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ ఇరానీ కప్‌లో విదర్భ జట్టు విజేతగా నిలిచింది. రంజీ ట్రోఫీ చాంపియన్ విదర్భ జట్టు... ఇరానీ కప్‌లో 93 పరుగుల తేడాతో రెస్టాఫ్ ఇండియాను మట్టికరిపించింది. 2018, 2019లోనూ ఇరానీ కప్ చేజిక్కించుకున్న విదర్భ జట్టు... ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ట్రోఫీ హస్తగతం చేసుకుంది. ఇరానీ కప్ బరిలోకి దిగిన ప్రతిసారి విదర్భ విజేతగా నిలవడం విశేషం. 361 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 30/2తో ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్టాఫ్ ఇండియా చివరకు 73.5 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. యశ్ ధుల్ (117 బంతుల్లో 92; 8 ఫోర్లు, 1 సిక్స్) పోరాడాడు. మానవ్ సుతార్ (113 బంతుల్లో 56 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీతో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ రజత్ పాటీదార్ (10), రుతురాజ్ గైక్వాడ్ (7) విఫలమవడం జట్టుపై ప్రభావం చూపగా... వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ (65 బంతుల్లో 35; 3 ఫోర్లు), సారాంశ్ జైన్ (29) ఫర్వాలేదనిపించారు. ఒక దశలో రెస్టాఫ్ ఇండియా జట్టు 133 పరుగులకే 6 వికెట్లు కోల్పోగా... మానవ్‌తో కలిసి యశ్ ధుల్ ఏడో వికెట్‌కు 104 పరుగులు జోడించి జట్టులో ఆశలు రేపాడు. అయితే చివరివరకు దాన్ని కొనసాగించడంలో రెస్టాఫ్ ఇండియా ప్లేయర్లు విఫలమయ్యారు. విదర్భ బౌలర్లలో హర్ష్ దూబే 4 వికెట్లు పడగొట్టగా... ఆదిత్య ఠాకరే, యశ్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు తీశారు. అంతకుముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులు చేయగా... రెస్టాఫ్ ఇండియా 214 పరుగులు చేసింది. అనంతరం విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 232 పరుగులు చేసి... రెస్టాఫ్ ఇండియా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. 'విదర్భ జట్టు చాలా బాగా ఆడింది. ఈ విజయానికి వారు అర్హులు. మేము పరిస్థితులకు తగ్గట్లు ఆడలేకపోయాం. లక్ష్యానికి దూరంలో నిలిచిపోయాం' అని రెస్టాఫ్ ఇండియా జట్టు కెప్టెన్ రజత్ పాటీదార్ అన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేసిన విదర్భ ఓపెనర్ అథర్వ తైడెకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 342; రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్: 214; విదర్భ రెండో ఇన్నింగ్స్: 232; రెస్టాఫ్ ఇండియా రెండో ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (ఎల్బీ) (బి) హర్ష్ దూబే 17; ఆర్యన్ జుయల్ (బి) ఆదిత్య 6; ఇషాన్ కిషన్ (సి) పార్థ్ రేఖడే (బి) హర్ష్ దూబే 35; రజత్ పాటీదార్ (సి అండ్ బి) ఆదిత్య 10; రుతురాజ్ గైక్వాడ్ (సి) అక్షయ్ వాడ్కర్ (బి) దర్శన్ నల్కండే 7; యశ్ ధుల్ (సి) అథర్వ తైడె (బి) యశ్ ఠాకూర్ 92; సారాంశ్ జైన్ (ఎల్బీ) (బి) పార్థ్ రేఖడే 29; మానవ్ సుతార్ (నాటౌట్) 56; అన్షుల్ కంబోజ్ (బి) యశ్ ఠాకూర్ 0; ఆకాశ్‌దీప్ (బి) హర్ష్ దూబే 3; గుర్‌నూర్ బ్రార్ (సి) అథర్వ తైడె (బి) హర్ష్ దూబే 7; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (73.5 ఓవర్లలో ఆలౌట్) 267. వికెట్ల పతనం: 1–16, 2–24, 3–52, 4–64, 5–80, 6–133, 7–237, 8–237, 9–249, 10–267. బౌలింగ్: హర్ష్ దూబే 27.5–5–73–4; ఆదిత్య ఠాకరే 11–1–27–2; పార్థ్ రేఖడే 18–1–59–1; యశ్ ఠాకూర్ 7–1–47–2; దర్శన్ నల్కండే 10–1–60–1.



రయ్... రయ్... రసెల్



రసెల్

- సింగపూర్ గ్రాండ్‌ప్రి టైటిల్ కైవసం
- ఈ సీజన్‌లో రెండో విజయం సాధించిన మెర్సిడెస్ డ్రైవర్

సింగపూర్: ఫార్ములావన్ తాజా సీజన్‌లో మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రసెల్ తన ఖాతాలో రెండో విజయం వేసుకున్నాడు. ఆదివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రిలో రసెల్ విజేతగా నిలిచాడు. తుది రేసును 'పోల్ పొజిషన్' నుంచి ప్రారంభించిన రసెల్ వాయువేగంతో దూసుకెళ్లాడు. 62 ల్యాప్‌ల రేసును రసెల్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 40 నిమిషాల 22.367 సెకన్లలో పూర్తి చేశాడు. నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ 1 గంట 40 నిమిషాల 27.792 సెకన్లలో రేసును పూర్తి చేసి రెండో స్థానం దక్కించుకున్నాడు. గత రెండు రేసుల్లో 'టాప్'లో నిలిచిన వెర్‌స్టాపెన్ మూడో రేసులోనూ దూసుకెళ్లినా... పోల్ పొజిషన్ నుంచి రేసును ఆరంభించిన రసెల్‌దే పైచేయి అయింది. రెండేళ్ల క్రితం ఇక్కడే జరిగిన రేసు చివరి ల్యాప్‌లో ప్రమాదానికి గురైన రసెల్ ఇప్పుడు అదే చోట విజేతగా నిలిచాడు. 'ఈ అనుభూతి బాగుంది. కొన్నాళ్ల క్రితం ఇక్కడ ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. ఆ రోజు పోడియంపై నిలవలేకపోయా. ఇప్పుడు అది సాధ్యమైంది' అని విజయం అనంతరం రసెల్ అన్నాడు. కెనడా గ్రాండ్‌ప్రి తర్వాత రసెల్‌కు ఈ ఏడాది ఇది రెండో టైటిల్. మెక్‌లారెన్ డ్రైవర్లు లాండో నోరిస్ (1 గంట 40 నిమిషాల 28.433 సెకన్లు), ఆస్కార్ పియాస్ట్రి (1 గంట 40 నిమిషాల 30.513 సెకన్లు) వరుసగా మూడో, నాలుగో స్థానాల్లో నిలిచారు. ఈ సీజన్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్లిన మెక్‌లారెన్ డ్రైవర్లకు గత మూడు రేసుల నుంచి అగ్రస్థానం దక్కలేదు. మెర్సిడెస్‌కే చెందిన మరో డ్రైవర్ కిమి అంటొనెల్లి 1 గంట 40 నిమిషాల 56.048 సెకన్లు ఐదో స్థానం దక్కించుకోగా... చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 41 నిమిషాల 8.363 సెకన్లు; ఫెరారీ) ఆరో స్థానంలో నిలిచాడు. ఏడుసార్లు ప్రపంచ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (1 గంట 41 నిమిషాల 42.618 సెకన్లు) ఏడో స్థానానికి పరిమితమయ్యాడు. 24 రేసుల సీజన్‌లో 18 రేసులు ముగిసేసరికి ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 336 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... నోరిస్ 314 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. వెర్‌స్టాపెన్ 273 పాయింట్లతో మూడో స్థానాన్ని మరింత మెరుగు పర్చుకున్నాడు. తదుపరి రేసు ఈనెల 20న యునైటెడ్ స్టేట్స్ గ్రాండ్‌ప్రి జరుగనుంది.

కన్‌స్ట్రక్టర్స్ చాంపియన్... మెక్‌లారెన్

ఫార్ములావన్ తాజా సీజన్‌లో మరో 6 రేసులు మిగిలుండగానే... మెక్‌లారెన్ జట్టు కన్‌స్ట్రక్టర్స్ (టీమ్) చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. 24 రేసుల సీజన్‌లో సింగపూర్ గ్రాండ్‌ప్రితో 18 రేసులు ముగియగా... 650 పాయింట్లతో మెక్‌లారెన్ జట్టు టీమ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్లు 12 రేసుల్లో విజేతలుగా నిలిచారు. అందులో ఆస్కార్ పియాస్ట్రి 7 రేసులు నెగ్గగా... మరో ఐదింట నోరిస్ అగ్రస్థానం దక్కించుకున్నాడు. కన్‌స్ట్రక్టర్స్ చాంపియన్‌షిప్‌లో మెర్సిడెస్ 325 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా... ఫెరారీ 300 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. మిగిలిన రేసుల్లో ఈ రెండు జట్లకు మెక్‌లారెన్‌ను అధిగమించే అవకాశం లేకపోవడంతో... ఆ జట్టు టీమ్ చాంపియన్‌గా నిలిచింది.

సింగపూర్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్–10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	రసెల్	మెర్సిడెస్	62	1:40:22.367 సెకన్లు	-	25
2	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	62	1:40:27.797 సెకన్లు	5.430 సెకన్లు	18
3	నోరిస్	మెక్‌లారెన్	62	1:40:28.433 సెకన్లు	6.066 సెకన్లు	15
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	62	1:40:30.513 సెకన్లు	8.146 సెకన్లు	12
5	అంటొనెల్లి	మెర్సిడెస్	62	1:40:56.048 సెకన్లు	33.681 సెకన్లు	10
6	లెక్‌లెర్క్	ఫెరారీ	62	1:41:08.363 సెకన్లు	45.996 సెకన్లు	8
7	హామిల్టన్	ఫెరారీ	62	1:41:42.618 సెకన్లు	80.251 సెకన్లు	6
8	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	62	1:41:43.034 సెకన్లు	80.667 సెకన్లు	4
9	బేర్‌మన్	మనీగ్రామ్ హాస్	62	1:41:55.894 సెకన్లు	93.527 సెకన్లు	2
10	సెయింజ్	విలియమ్స్ రేసింగ్	61	1:40:33.121 సెకన్లు	1 ల్యాప్	1

తెలుగు టైటాన్స్ గెలుపు జోరు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ విజయపరంపర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 40–35 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌ను ఓడించింది. ఈ సీజన్‌లో టైటాన్స్ జట్టుకిది ఓవరాల్‌గా ఏడో విజయం కాగా... వరుసగా నాలుగో గెలుపు. టైటాన్స్ తరఫున భరత్ హుడా 14 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ విజయ్ మలిక్ తొమ్మిది పాయింట్లతో మెరిశాడు. డిఫెండర్ శుబ్‌మన్ షిండే ఐదు పాయింట్లతో ఆకట్టుకున్నాడు. యూపీ యోధాస్ తరఫున భవానీ రాజ్‌పుత్ 16 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ ఏడింటిలో గెలిచి, ఐదింటిలో ఓడి 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 33–29తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్‌పాంథర్స్‌తో దబంగ్ ఢిల్లీ; యూపీ యోధాస్‌తో పట్నా పైరేట్స్ తలపడతాయి.

అప్పుడు కోహ్లి అండ్ కో సభ్యులు ఇప్పుడు అంపైర్లు

ఫీల్డ్ అంపైర్లుగా తన్మయ్, అజితేశ్



కాన్పూర్: 'కింగ్' కోహ్లి టీనేజ్‌లో భారత్‌ను అండర్–19 ప్రపంచకప్ విజేతగా నిలిపాడు. 2008లో అతని సారథ్యంలోనే యువ భారత్ 'కప్' తెచ్చింది. తర్వాత సీనియర్ జట్టు సభ్యుడైన కొన్నాళ్లకే 2011లో ధోని నేతృత్వంలోని టీమిండియా వన్డే ప్రపంచకప్ గెలిచింది. తర్వాత చాంపియన్స్ ట్రోఫీ, గతేడాది టి20 ప్రపంచకప్, ఈ ఏడాది మరో చాంపియన్స్ ట్రోఫీ ఇలా చాలా ఐసీసీ ట్రోఫీల్లో కోహ్లి కీలక ఆటగాడయ్యాడు. తదుపరి 2027 వన్డే ప్రపంచకప్ బరిలో నిలిచేందుకు ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. అయితే అతని 2008 సహచరుల్లో ఇద్దరు తన్మయ్ శ్రీవాస్తవ, అజితేశ్ అర్గల్‌లు ఇప్పుడు ఫీల్డ్ అంపైర్లుగా మారారు. 35 ఏళ్ల తన్మయ్, 37 ఏళ్ల అజితేశ్‌లకు కాలం కలిసివస్తే... ఐసీసీ ఎలైట్ అంపైర్లయితే... కోహ్లి ఆడే మ్యాచ్‌లకు, 2027 మెగా ఈవెంట్‌కు ఫీల్డ్ అంపైర్లుగా బరిలోకి దిగే అవకాశాలు లేకపోలేదు. ఇదే జరిగితే 22 గజాల పిచ్‌పై వికెట్ల ముందు కోహ్లి ఆడుతుంటే... వికెట్ల వెనుక (నాన్ స్ట్రయిక్ ఎండ్‌లో) ఒకప్పటి సహచరులు అంపైరింగ్ చేయడాన్ని చూడొచ్చు. ఇక ప్రస్తుత విషయానికొస్తే తన్మయ్, అజితేశ్‌లు 2023లో బీసీసీఐ అంపైరింగ్ పరీక్షల్లో పాసయ్యారు. ఇప్పటికే రంజీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలకు అంపైరింగ్ చేశారు. తాజాగా వీరికి ప్రమోషన్ లభించింది. వీళ్లిద్దరు ఇప్పుడు భారత్ 'ఎ', ఆ్రస్టేలియా 'ఎ' జట్ల మధ్య జరుగుతున్న సిరీస్‌కు కాన్పూర్‌లో అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.





ఆదివారం శ్రీనగర్‌లో జరిగిన హజ్రత్ షేక్ సయ్యద్ అబ్దుల్ ఖదీర్ జిలానీ ఉర్సుకు పెద్ద సంఖ్యలో హాజరైన జనం (ఇన్‌సెట్లో) పవిత్ర వస్తువులను ప్రదర్శిస్తున్న మత గురువు. ఉర్సు సందర్భంగా ఓ మహిళ ప్రార్థన.. తినుబండారాల దుకాణాల్లో విక్రయాలు

ట్రంప్ నాణెంపై వివాదం

వచ్చే ఏడాది అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం

- ట్రంప్ చిత్రంతో స్మారక నాణెం ముద్రించాలని ప్రభుత్వం నిర్ణయం
- సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన నమూనా కాయిన్
- పదవిలో ఉన్న అధ్యక్షుడి చిత్రంతో నాణెం ముద్రించడం చట్టవిరుద్ధమే



వాషింగ్టన్: ప్రపంచంలో నేడు అగ్రరాజ్యంగా గౌరవం అందుకున్న అమెరికాకు 1776 జూలై 4న బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం లభించింది. స్వతంత్ర అమెరికాకు వచ్చే ఏడాది నాటికి 250 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక వేడుకలకు అమెరికా ఇప్పటినుంచే సిద్ధమవుతోంది. ప్రజలంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్మారక నాణేన్ని ముద్రించి విడుదల చేయాలని యునైటెడ్ స్టేట్స్ మింట్(టంకశాల) నిర్ణయించింది. ఒక డాలర్ విలువ కలిగిన ఈ నాణెంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాన్ని ముద్రిస్తారన్న ప్రచారం మొదలైంది. అయితే, చాలామంది ఈ విషయం నమ్మలేదు. ట్రంప్‌తో కూడిన నమూనా నాణెం చిత్రాన్ని యూఎస్ ట్రెజరీ విడుదల చేయడంతో అనుమానాలకు తెరపడింది. ట్రంప్ ముఖం కలిగిన ఒక డాలర్ కాయిన్ రావడం అనేది ఫేక్ న్యూస్ కాదని, ముమ్మాటికీ నిజమని ట్రెజరర్ బ్రాండన్ బీచ్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. నమూనా నాణెం సోషల్ మీడియాలో ఇప్పటికే వైరల్‌గా మారింది. అమెరికా స్వతంత్ర దేశంగా మారి 250 ఏళ్లు పూర్తికానుండడం ప్రాధాన్యత కలిగిన సందర్భమని, అందుకే తమ అధ్యక్షుడి చిత్రంతో కూడిన స్మారక నాణేన్ని విడుదల చేయబోతున్నామని స్పష్టంచేశారు. దీనిపై త్వరలో మరిన్ని వివరాలు పంచుకుంటానని పేర్కొన్నారు.

నాణెంపై ట్రంప్ పోరాట పటిమ

కొత్త నాణెంపై అమెరికాలో చర్చ మొదలైంది. నమూనా నాణెంపై ఒక వైపు ట్రంప్ ముఖం కనిపిస్తోంది. పైభాగంలో లిబర్టీ (స్వేచ్ఛ) అనే పదం ముద్రించారు. కిందిభాగంలో ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్(మనం నమ్మే దేవుడి సాక్షిగా) అనే పదాలు కనిపిస్తున్నాయి. మధ్యలో 1776, 2026 సంవత్సరాలను ముద్రించారు. ఇక రెండోవైపు ట్రంప్ పిడికిలి బిగించిన చిత్రం ఉంది. గత ఏడాది పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆయన త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. తాను పోరాటం ఆపబోనని పిడికిలి బిగించి నినదించారు. ఈ సందర్భాన్ని గుర్తుచేస్తూ నాణెంపై ఫైట్, ఫైట్, ఫైట్ అనే పదాలకు స్థానం కల్పించారు. అంతేకాకుండా ట్రంప్ వెనుకభాగంలో రెపరెపలాడుతున్న అమెరికా జాతీయ జెండా కనిపిస్తోంది.

కాయిన్ రీడిజైన్ చట్టానికి ఆమోదం

సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఈ నాణెన్ని ముద్రిస్తారా? లేక మార్పులేమైనా చేస్తారా? అనేది ఇంకా తెలియరాలేదు. సోషల్ మీడియా చిత్రాన్ని ట్రంప్ అభిమానులు రూపొందించి ఉంటారని తెలుస్తోంది. మొత్తానికి ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ఎందుకంటే అమెరికా చట్టాల ప్రకారం చూస్తే ప్రస్తుతం పదవిలో ఉన్న అధ్యక్షుడు లేదా జీవించి ఉన్న మాజీ అధ్యక్షుడి చిత్రాన్ని నాణెంపై ముద్రించడానికి వీల్లేదు. మరణించాక రెండేళ్ల తర్వాత మాత్రమే ముద్రించవచ్చు. ఈ నేపథ్యంలో ట్రంప్ చిత్రంతో ప్రత్యేక కాయిన్ తీసుకురావాలని మింట్ నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. అమెరికా కాంగ్రెస్ ఇటీవల కాయిన్ రీడిజైన్ యాక్ట్‌ను ఆమోదించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఒక డాలర్ నాణెన్ని ముద్రించడానికి ట్రెజరీకి అనుమతి మంజూరు చేసింది. 2026 జనవరి 1 నుంచి ఏడాది కాలంపాటు ఒక డాలర్ నాణెలను ముద్రించవచ్చని పేర్కొంది. అయితే, వీటిపై జీవించి ఉన్న లేదా మరణించిన వ్యక్తుల తల గానీ, భుజం గానీ, భుజం పైభాగం నుంచి జుట్టు వరకు గానీ ఉండడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. అయితే, చట్టాన్ని ఉల్లంఘించని విధంగా ట్రంప్ చిత్రంతో కొత్త కాయిన్ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. తుది డిజైన్‌ను ట్రెజరీ ఇంకా ఆమోదించలేదని సమాచారం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పదవిలో ఉండగానే అమెరికా నాణెంపై చోటు దక్కించుకున్న ఏకైక అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్. 1926లో ఆయన చిత్రంతో కాయిన్ ముద్రించారు.

అసోం బోడోల్యాండ్ కౌన్సిల్ చీఫ్‌గా మొహిలరీ

బీపీఎఫ్ నేతకు ప్రధాని మోదీ అభినందనలు



కొక్రాఝర్: అసోం రాష్ట్రంలోని బోడోల్యాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ (బీటీసీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్(సీఈఎం)గా హగ్రమ మొహిలరీ ప్రమాణం చేశారు. డిప్యూటీ సీఈఎంగా మాజీ మంత్రి రిహాన్ డైమరీ కూడా ప్రమాణం చేశారు. కొక్రాఝర్‌లోని బోడోల్యాండ్ సెక్రటేరియట్ ఫీల్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వీరితో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రవి కోటా ప్రమాణం చేయించారు. గవర్నర్ ఎల్పీ ఆచార్య, సీఎం హిమంత బిశ్వ శర్మ, పలువురు మంత్రులు కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా, మొహిలరీ ఈ పదవీ బాధ్యతలను చేపట్టడం ఇది నాలుగోసారి. సెప్టెంబర్ 22వ తేదీన జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్(బీపీఎఫ్) 40 సీట్లకుగాను 28 సీట్లను సొంతం చేసుకుంది. యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్(యూపీపీఎల్) బీజేపీలు కలిసి ఏడింటిని, ఇతరులు ఐదు సీట్లను గెలుచుకున్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు కొత్తగా ఎన్నికైన బీపీఎఫ్ సభ్యులు డోట్మాలోని బోడో నేత బొడొఫా ఉపేంద్రనాథ్ బ్రహ్మ విగ్రహం వద్ద నివాళులర్పించారు. 2020 జనవరి 27వ తేదీన ఢిల్లీలో జరిగిన తాజా బోడో ఒప్పందం అనంతరం జరిగిన రెండో ఎన్నికలివి. మొదటి దఫా ఎన్నికల్లో బీపీఎఫ్ 17 సీట్లు గెలుచుకుని ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. అయితే, గణ సురక్ష పరిషత్, బీజేపీ, యూపీపీఎల్ కలిసి బోడో కౌన్సిల్ ఏర్పాటు చేశాయి. కాగా, అసోం బోడోల్యాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ చీఫ్‌గా ప్రమాణం చేసిన హగ్రమ మొహిలరీని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధి కోసం కేంద్రం, అసోం ప్రభుత్వం బీటీసీ కౌన్సిల్‌కు పూర్తి మద్దతు కొనసాగిస్తాయని ఆయన హామీ ఇచ్చారు.

బీటీసీ ఏం చేస్తుందంటే..

కొక్రాఝర్, చిరంగ్, బక్సా, ఉదల్‌గిరి, తముల్పూర్ జిల్లాలను కలిపి ఏర్పాటైందే బీటీసీ. సుమారు 9 వేల చదరపు కిలోమీటర్ల భూభాగంలో విస్తరించిన ఉన్న బోడోలు మెజారిటీగా కలిగిన ఈ ప్రాంతంపై శాసన, కార్యనిర్వాహక అధికారాలను బీటీసీ కలిగి ఉంటుంది. 1993లో జరిగిన ఒప్పందం ప్రకారం, బోడోలాండ్ భారత రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ ప్రకారం ఏర్పాటైన స్వయంప్రతిపత్తి కలిగిన పరిపాలనా విభాగం.

'పహల్గాం' ముష్కరులకు సాయమందించిన వ్యక్తి అరెస్ట్

ఉగ్ర నెట్‌వర్క్ నిర్వీర్యం దిశగా కీలక ముందడుగు: కశ్మీర్ పోలీసులు

శ్రీనగర్: ఏప్రిల్ 22వ తేదీన కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి తెగబడ్డ ముష్కరులకు సాయం అందించాడనే ఆరోపణలపై పోలీసులు మహమ్మద్ యూసుఫ్ కటారి(26) అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఓవర్ గ్రౌండ్ వర్కర్ (ఓజీడబ్ల్యూ)గా పనిచేస్తున్న ఇతడు ఆ ఉగ్రవాదులను నాలుగుసార్లు కలిశాడని, వారికి ఆండ్రాయిడ్ ఫోన్ ఛార్జర్‌ను అందించాడని జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు ఆధారం దొరకడంతో అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రిసార్టు పట్టణం పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ముష్కరులను సులేమాన్ అలియాస్ ఆసిఫ్, జిబ్రాన్, హమ్‌జా అఫ్గానీగా గుర్తించారు. వీరిని శ్రీనగర్ వెలుపల ఉన్న జబర్వాన్ కొండల్లో మూడు, నాలుగు పర్యాయాలు కలుసుకున్నట్లు ఇతడు విచారణలో వెల్లడించాడన్నారు. విషాదం చోటుచేసుకున్న ప్రాంతంలో లభించిన వివిధ వస్తువుల్లో సగం ధ్వంసమైన ఛార్జర్ కూడా ఉంది. దీన్ని ఎవరు, ఎవరికి విక్రయించారనే విషయంపై జరిపిన దర్యాప్తులో కటారి విషయం వెలుగు చూసిందన్నారు. అక్కడి కొండ ప్రాంతాలపై గట్టి పట్టున్న కటారి విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరిస్తుంటాడు. అదే సమయంలో, ఇతడు ఉగ్రవాదులకు సైతం మార్గదర్శిగా ఉంటూ, వారికి అవసరమైన సెల్ ఛార్జర్ వంటి వాటిని సమకూర్చాడు. కశ్మీర్ లోయలో ఉగ్రవాదులకు మద్దతిచ్చే నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేయడంలో కటారి అరెస్ట్ ముఖ్యమైన ముందడుగుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా, బలగాలు చేపట్టిన ఆపరేషన్ మహదేవ్ సమయంలో పహల్గాం ముష్కరులు ముగ్గురూ హతమవడం తెల్సిందే. పహల్గాం ఉగ్ర ఘటన వెనుక భారీ కుట్ర కోణాన్ని వెలికితీసే లక్ష్యంతో విచారణ సాగిస్తున్న జాతీయ దర్యాప్తు విభాగం (ఎన్ఐఏ) ఇప్పటికే ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చారన్న ఆరోపణలపై ఇద్దరిని అరెస్ట్ చేసింది.

బస్తర్‌లో 10 వేల రేడియో సెట్ల పంపిణీ

మావోయిస్టుల ప్రభావాన్ని చెరిపేసేందుకే: సీఆర్‌పీఎఫ్

న్యూఢిల్లీ/బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు 10 వేలకు పైగా రేడియో సెట్లను ప్రజలకు పంపిణీ చేసింది. జాతీయ స్థాయి పరిణామాలను వారికి అందజేయడం, మావోయిస్టుల సైద్ధాంతిక ప్రభావం నుంచి స్థానికులను దూరం చేసేందుకు ఉద్దేశించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో వీటిని అందజేశామని సీఆర్‌పీఎఫ్ తెలిపింది. గడిచిన నాలుగు నెలల కాలంలో దట్టమైన బస్తర్ అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో వందలాది చిన్నాపెద్దా సమావేశాలను పూర్తి చేసినట్లు వివరించింది. ఇందుకోసం బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాల కోసం హోంశాఖ రూ. 1.62 కోట్లు కేటాయించిందని సీఆర్‌పీఎఫ్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. సుమారు రూ.1,500 ఖరీదు చేసే ఈ రేడియోలు బ్యాటరీలతోపాటు కరెంట్ సాయంతోనూ పనిచేస్తాయన్నారు. మారుమూల ప్రాంతాల్లోని గ్రామాల్లో 180 కంపెనీల బలగాల సాయంతో మొత్తం 10,800 రేడియో సెట్లను అందజేశామన్నారు. కుటుంబానికి ఒకరు చొప్పున కనీసం 54 వేల మందిని మావోయిస్టుల ప్రభావం నుంచి బయటపడేయటమే తమ లక్ష్యమని చెప్పారు. 2026 మార్చికల్లా మావోయిస్టులను పూర్తిగా ఏరిపారేయడమే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సంక్షేమ, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'సహా రేడియోలో ప్రసారమయ్యే వివిధ కార్యక్రమాలను గురించి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని వారికి వివరిస్తున్నామని తెలిపారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో మరిన్ని రేడియో టవర్లను ఏర్పాటు చేసి, స్థానికులకు రేడియో ప్రసారాలను అందుబాటులోకి తేవాలని హోం శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు.



జుట్టుపట్టి ఈడ్చి.. నిర్బంధించి

- గాజా సహాయ నౌకాయాత్ర బృందంపై ఇజ్రాయెల్ దాడి
- గ్రెటా థన్‌బర్గ్ నిర్బంధం.. దౌర్జన్యం
- పర్యావరణ ఉద్యమ కార్యకర్తల ఆరోపణ

టెల్ అవీవ్: గాజాకు మానవతా సాయం తీసుకెళ్లిన నౌకాయాత్ర సభ్యురాలైన స్వీడన్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌తో ఇజ్రాయెల్ అధికారులు అనుచితంగా ప్రవర్తించారని సహ కార్యకర్తలు ఆరోపించారు. ఆమెను నిర్బంధంలోకి తీసుకుని దురుసుగా ప్రవర్తించారని.. ఆ యాత్రలో పాల్గొన్న పలువురు పర్యావరణ ఉద్యమ కార్యకర్తలు తెలిపారు. టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ కథనం ప్రకారం.. గాజాకు సహాయాన్ని తీసుకెళ్లిన నౌకలో ప్రయాణించిన 137 మంది పర్యావరణ ఉద్యమ కార్యకర్తలను ఇజ్రాయెల్ బహిష్కరించింది. వారు శనివారం ఇస్తాంబుల్‌కు చేరుకున్నారు. ఈ బృందంలో 36 మంది టర్కిష్ జాతీయులు సహా అమెరికా, యూఏఈ, అల్జీరియా, మొరాకో, ఇటలీ, కువైట్, లిబియా, మలేషియా, మౌరిటానియా, స్విట్జర్లాండ్, ట్యునీషియా, జోర్డాన్ తదితర దేశాలకు చెందిన వారు ఉన్నారు.

జంతువుల్లా చూశారు..

గ్రెటా థన్‌బర్గ్‌పై జరిగిన దురుసు ప్రవర్తనను కళ్లారా చూశామని.. మలేషియా జాతీయుడైన హజ్వానీ హెల్మీ, అమెరికన్ పౌరుడు విండ్‌ఫీల్డ్ బీవర్ అనే ఇద్దరు కార్యకర్తలు రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. 'అదొక విపత్తు. మమ్మల్ని జంతువుల్లా చూశారు. గ్రెటా థన్‌బర్గ్‌ను జుట్టు పట్టుకొని లాగి, ఇజ్రాయెల్ జెండాను ముద్దు పెట్టుకోమని బలవంతం చేశారు'.. అని 28 ఏళ్ల హెల్మీ ఆవేదన వ్యక్తం చేశారు. శుభ్రమైన ఆహారం, నీరు కూడా ఇవ్వలేదన్నారు.

నల్లులున్న గదిలో బంధించి..: గ్రెటా థన్‌బర్గ్ అనుచరులకు స్వీడిష్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పంపిన ఒక ఈమెయిల్‌లో.. థన్‌బర్గ్‌ను నల్లులున్న గదిలో ఉంచారని, సరైన ఆహారం, నీరు ఇవ్వలేదని పేర్కొన్నట్లు 'ది గార్డియన్' పత్రిక వెల్లడించింది. 'రాయబార కార్యాలయం గ్రెటా థన్‌బర్గ్‌ను కలవగలిగింది. తనకు నీరసంగా ఉన్నట్లు ఆమె తెలిపింది. తగినంత నీరు, ఆహారం అందలేదు. శరీరమంతా దద్దుర్లు వచ్చాయి.. అవి నల్లుల వల్లే వచ్చాయని అనుమానిస్తున్నట్లు కూడా ఆమె తెలిపింది..' అని ఈమెయిల్‌లో వెల్లడించారు. అయితే, ఈ ఆరోపణలన్నీ అబద్ధాలని ఇజ్రాయెల్ కొట్టిపారేసింది.

ఇండోనేసియా స్కూలు ప్రమాదం.. 40కి చేరిన మరణాలు

సిడోఅర్జో: ఇండోనేసియాలో స్కూలు భవనం కుప్పకూలిన ఘటనలో మరణాలు 40కి చేరాయి. జాడ తెలియకుండా పోయిన మరో 23 మంది విద్యార్థుల కోసం శిథిలాలను తొలగిస్తూ అన్వేషణ కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. తూర్పు జావాలోని సిడోఅర్జోలోని అల్ ఖొజినీ స్కూలు భవనం సెప్టెంబర్ 30వ తేదీన అకస్మాత్తుగా కుప్పకూలడం తెల్సిందే. ఈ ఘటనలో ఒకే ఒక్కరు విద్యార్థి మాత్రమే ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు. స్కూలులో చదివే 12–19 ఏళ్ల విద్యార్థుల్లో 95 మంది గాయపడ్డారు. వీరిలో తీవ్ర గాయాలైన 8 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు ఆదివారం వెల్లడించారు. స్కూలు భవనంపై మరో అంతస్తు నిర్మిస్తుండటమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ప్రమాదంపై స్కూల్ కేర్ టేకర్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ మత పెద్ద అబ్దుస్ సలామ్ ముజిబ్ ప్రజలకు బహిరంగ క్షమాపణలు తెలిపారు. దుర్ఘటనపై అధికారులు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

200 మంది ప్రయాణికులు, 75 వాహనాలతో సముద్రంలోనే నిలిచిపోయిన ఫెర్రీ

పాల్ఘార్: మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లాలో సఫాలె-విరార్‌ల మధ్య రాకపోకలు సాగించే రో-రో ఫెర్రీ ఆదివారం సాయంత్రం సముద్రం మధ్యలోనే మొరాయించింది. ఆ సమయంలో ఫెర్రీలో 200 మంది ప్రయాణికుల, 75 వరకు వాహనాలున్నాయి. సామర్థ్యానికి మించి లోడు వేయడంతో సాంకేతిక లోపం ఏర్పడిందని అధికారులు తెలిపారు. హైడ్రాలిక్ ర్యాంప్ నిలిచిపోవడంతో ఎంహరం బల్‌పడ వద్ద సముద్రంలో కదలకుండా నిలిచిపోయిందని పేర్కొన్నారు. తక్కువ ఎత్తులో అలలు కూడా మరో కారణమని వివరించారు. దీంతో, కొన్ని గంటలపాటు ప్రయాణికులు ఫెర్రీపైనే ఉండిపోవాల్సి వచ్చింది. విషయం తెలియడంతో పోలీసులు, మెరైన్ అధికారులు అక్కడికి చేరుకుని సమస్యను సరిచేశారు.

సైనిక ఘర్షణకు దిగితే..

పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి అసిమ్ ఖవాజా ప్రేలాపన

ఇస్లామాబాద్: భారత్‌పై పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి అసిమ్ ఖవాజా నోరుపారేసుకున్నారు. భవిష్యత్తులో సైనిక ఘర్షణ జరిగితే తమ యుద్ధవిమానాల శిథిలాల కింద భారత్ సమాధి అవుతుందని అన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను ఎగదోస్తే ప్రపంచ పటం నుంచి పాకిస్తాన్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది రెండు రోజుల క్రితం హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదులను పెంచి పోషించడం పాకిస్తాన్ ఇకనైనా మానుకోవాలని, భారత్‌ను రెచ్చగొట్టవద్దని ఆయన తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపించిన సహనాన్ని ఆపరేషన్ సిందూర్ 2.0లో చూపించబోమని స్పష్టంచేశారు. దీనిపై అసిమ్ ఖవాజా ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. భారత సైనికాధికారులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన దాడుల్లో భారత్‌కు భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. దెబ్బతిన్న ప్రతిష్టను, విశ్వసనీయతను పునరుద్ధరించుకోవడానికి ఆరాటపడుతున్నారని, విఫల యత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ 0-6 స్కోర్‌తో ఓడిపోయిందని అన్నారు. అయితే, 0-6 స్కోర్‌కు అర్థం ఏమటన్నది అసిమ్ ఖవాజా వెల్లడించారు. మరోసారి తమతో సైనిక ఘర్షణకు దిగితే భారత్‌ను సమాధి చేస్తామని హెచ్చరించారు.

జార్జియాలో అధికార పార్టీ విజయం

ఎన్నికలను బహిష్కరించిన ప్రధాన ప్రతిపక్షం

టిబిలిసి: జార్జియాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ భారీ విజయం సాధించింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలనూ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికలను రెండు ప్రధాన ప్రతిపక్ష కూటములు బహిష్కరించాయి. ఎన్నికల ఫలితాల అనంతరం రాజధాని టిబిలిసిలో భారీ ప్రదర్శన జరిగింది. నెలల తరబడి అసమ్మతిని అణగదొక్కేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వారు తీవ్రంగా నిరసించారు. అధ్యక్ష భవనం వద్ద గుమికూడిన ఆందోళనకారులు గేట్లు పగులగొట్టి, భవనంలోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కెనన్లను, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. గాయకుడు పాట బుర్చులద్జె సహా ఐదుగురు ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని కూలదోయాలంటూ వీరు ప్రజలను రెచ్చగొట్టారని పోలీసులు ఆరోపించారు. జనాన్ని కూడదీసి, హింసకు ప్రేరేపించారన్నారు. 2024 అక్టోబర్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. అయితే, ప్రభుత్వం రిగ్గింగ్‌కు పాల్పడిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ నిరసనలు ప్రారంభించాయి.

ధనిక-పేద అంతరం పెరుగుతోంది: కాంగ్రెస్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితంగానే దేశంలో ధనికులు, పేదల మధ్య అంతరం పెరుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. కోటీశ్వరులకు కొత్త అడ్డాగా భారత్ మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో 'దేశంలో సంపద విస్తృతంగా కేంద్రీకృతమవుతోందని పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. కోట్లాది మంది భారతీయులు నిత్యావసరాలు తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతుండగా.. కేవలం 1,687 మంది చేతుల్లోనే సగం సంపద పోగుపడి ఉంది. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు దేశంలో తీవ్ర ఆర్థిక అసమానతలను సృష్టిస్తున్నాయి. ఇది సామాజిక అభద్రత, అసంతృప్తికి దారితీస్తోంది. సాధారణ ప్రజలకు ఆదాయ అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ పరిణామాలు ఆర్థిక వ్యవస్థకు పెను సమస్య. ప్రజాస్వామ్యం ఆత్మపైనే ప్రత్యక్ష దాడి. ఆర్థిక శక్తి కొందరి చేతుల్లో కేంద్రీకృతమైనప్పుడు రాజకీయ నిర్ణయాలు సైతం వారికి అనుకూలంగా మారడం మొదలవుతాయి'అని పేర్కొన్నారు.

కేరళ బీజేపీ చీఫ్‌కు గాయాలు

తిరువనంతపురం: కేంద్ర మాజీ మంత్రి, కేరళ బీజేపీ చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్ ట్రెడ్‌మిల్‌పై వ్యాయామం చేస్తూ కిందపడి గాయాలపాలయ్యారు. తల, చేతులకు అయిన గాయాల ఫొటోలను ఫేస్‌బుక్ పేజీలో ఆయన ఆదివారం షేర్ చేశారు. తనకు కలిగిన అనుభవాన్ని హాస్యం జోడించి, ఆయన ఆ పోస్ట్‌లో వివరించారు. 'మీరు ట్రెడ్‌మిల్లుపై నడుస్తున్నప్పుడు ఫోన్ రింగైందనుకోండి. అజాగ్రత్తతో వ్యవహరిస్తే జారి పడే ప్రమాదముంది. గాయాలు కావచ్చు లేదా ముఖానికి గీతలు పడొచ్చు. ఇదంతా సొంతంగా కలిగిన అనుభవంతోనే చెబుతున్నా'అంటూ ఆయన చెప్పుకొచ్చారు. 'నాకు అయిన గాయాలు, ఇబ్బంది కలిగించే నొప్పి ఇందుకు సాక్ష్యాలు. దీనివల్ల తెలియాల్సిన నీతి: ట్రెడ్‌మిల్ మీద ఉన్నపుడు సెల్ ఫోన్ వాడకంపై చాలా జాగ్రత్తగా ఉండటం'అని ఆయన ముక్తాయించారు.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరు మృతి

మాంట్‌గొమెరి: అమెరికాలోని అలబామా రాష్ట్ర రాజధాని మాంట్‌గొమెరీలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న కాల్పుల్లో ఇద్దరు చనిపోగా 12 మంది గాయపడ్డారు. బార్లు, క్లబ్బులతో ఎప్పుడూ రద్దీగా ఉండే డౌన్‌టౌన్‌లో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జనసమ్మర్దం ఉండే ప్రాంతంలో ప్రత్యర్థి వర్గాలు సామాన్యుల గురించి పట్టించుకోకుండా కాల్పులకు తెగబడ్డాయని మాంట్‌గొమెరీ పోలీసులు తెలిపారు. పలువురు అనుమానితులను నిర్బంధించి, ప్రశ్నిస్తున్నామని ఎవరినీ అరెస్ట్ చేయలేదని చెప్పారు.

చెక్ రిపబ్లిక్ పార్లమెంట్ ఎన్నికల్లో ట్రంప్ మద్దతుదారు విజయం

ప్రేగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు, బిలియనీర్ అంద్రెజ్ బేబీస్ నేతృత్వంలోని ఏఎన్ఓ పార్టీ చెక్ రిపబ్లిక్ పార్లమెంటరీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఏఎన్ఓ పార్టీకి పూర్తి మెజార్టీ దక్కలేదు. 200 సీట్లకు గాను 80 సీట్లు సాధించింది. మరో రెండు చిన్న పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అంద్రెజ్ బేబీస్ ప్రకటించారు. చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. కొత్త ప్రభుత్వం యూరోపియన్ యూనియన్‌తో విభేదించే అవకాశం ఉందన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. యూరప్‌ను రక్షించుకోవాలన్నదే తమ లక్ష్యమని, అందుకోసం యూరోపియన్ యూనియన్, నాటోలతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. అంద్రెజ్ బేబీస్‌కు చెక్ రిపబ్లిక్ ప్రస్తుత ప్రధానమంత్రి పెట్ర్ ఫైలా అభినందనలు తెలియజేశారు. తాము అధికారంలోకి వస్తే పన్నులు తగ్గిస్తామని, విద్యార్థులకు పన్నుల్లో మినహాయింపుల ఇస్తామని, ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లు పెంచుతామని, దేశ అభివృద్ధిని వేగవంతంగా చేస్తామని బేబీస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. అంద్రెజ్ బేబీస్ వలసల వ్యతిరేకిగా పేరుగాంచారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన గట్టి మద్దతుదారుడు.

'బిల్డథాన్' బ్రాండ్ అంబాసిడర్‌గా శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి చేరుకున్న మొట్టమొదటి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన కెప్టెన్ శుభాంశు శుక్లా 'వికసిత్ భారత్ బిల్డథాన్'బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. దేశవ్యాప్తంగా 6 నుంచి 12వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులను ఆవిష్కరణల దిశగా నడిపించేందుకు కేంద్రం చేపట్టిన జాతీయ కార్యక్రమమే వికసిత్ భారత్ బిల్డథాన్ అని అధికారులు తెలిపారు. దేశంలోని 1.5 లక్షల స్కూళ్లలోని కోటి మందికి పైగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న అతిపెద్ద స్కూల్ హ్యాకథాన్ అని కూడా చెప్పారు. బిల్డథాన్‌ను కేంద్ర విద్యాశాఖ అక్టోబర్ 13న నిర్వహించి, డిసెంబర్‌లో ఫలితాలను వెల్లడించనుంది.


దళిత, ముస్లిం మహిళల పేర్లను తొలగించారు

బిహార్ ఓటరు జాబితాపై కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ: బిహార్‌లోని ఓటరు జాబితాలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)సమయంలో సుమారు 23 లక్షల మంది మహిళా ఓటర్ల పేర్లు తొలగింపునకు గురయ్యాయని కాంగ్రెస్ పేర్కొంది. అత్యధిక ఓట్లు ప్రత్యేకించి 59 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనివేనని అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా తెలిపారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానాల్లో నువ్వానేనా అన్నట్లుగా హోరాహోరీ పోరు జరిగిందని గుర్తు చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారం కుట్రపన్ని దళిత, ముస్లిం మహిళా ఓటర్లను ఈసీ లక్ష్యంగా చేసుకుని ఎస్ఐఆర్ సమయంలో తొలగించిందని కూడా ఆరోపించారు.

'సింహాసన ద్వాత్రింశిక' కావ్యాన్ని ఎవరు రచించారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ



పద్మనాయకులు తాము శివ దేవతాపారాయణులమని చెప్పుకున్నారు. ఒకటో అనపోతానాయకుడు శైవమతాభిమాని. ఆయన ఉమామహేశ్వరం వద్ద శ్రీశైల ఉత్తర ద్వార మండపాన్ని కట్టించాడు. అనేక శివాలయాలను నిర్మించాడు. కానీ రెండో సింగభూపాలుడి కాలం నుంచి వైష్ణవ మత ప్రాధాన్యం పెరిగింది. వేదాంత దేశికులు వైష్ణవ మత వ్యాప్తికి తోడ్పడ్డారు. వైష్ణవం వడగల్, తెంగల్ అనే శాఖలుగా చీలిపోయింది.

కాకతీయానంతర యుగం

భాష-సాహిత్యం

దేవగిరి యాదవులు, కాకతీయులపై ఢిల్లీ సుల్తాన్ల దండయాత్ర సమయంలో ఉర్దూ భాష దక్కన్ ప్రాంతంలో ప్రవేశించింది. ఉర్దూ భాష ఈ ప్రాంతంలో దక్కనీ ఉర్దూగా మారింది. తెలంగాణ భాషా సాహిత్యాలపై తనదైన ముద్ర వేసింది. పద్మనాయకుల రాజ్యంలో సంస్కృతంతోపాటు, తెలుగు భాషా సాహిత్యాలు ఆదరణ పొందాయి. సర్వజ్ఞ సింగభూపాలుడు రచించిన సారంగధరచరిత్రను తొలి యక్షగానంగా భావించవచ్చు. ఇతణ్నే ఒకటో సింగ భూపాలుడిగా పిలుస్తారు. అతడి కుమారుడైన అనపోతానాయకుడు రాచకొండ రాజ్యాన్ని విస్తరించాడు. అన పోతానాయకుడు కవి పండిత పోషకుడు. ఇతడు 'అభిరామ రాఘవమ'నే నాటకాన్ని రాశాడు.

విశ్వేశ్వరుడు చమత్కార చంద్రిక అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీన్ని సంస్కృత లక్షణ గ్రంథాలైన ధ్వన్యాలోకం, కావ్య ప్రకాశంతో పోల్చవచ్చు. ప్రతాపరుద్ర యశోభూషణం తరహాలోనే ఈ గ్రంథంలోని శ్లోకాలు కూడా సింగ భూపాలుడి ప్రశంసతో ఉన్నాయి. ఈ గ్రంథం నాటి చారిత్రక విషయాలను తెలుపుతోంది. వీరభద్ర విజృంభణం(డిమం), కరుణాకందళం(అంకం) ఇతడి ఇతర రచనలు. విశ్వేశ్వరుడు.. అనపోతానాయకుడి, రెండో సింగ భూపాలుడి ఆస్థానాల్లోనూ స్థానం పొందాడు. అనపోతనాయకుడి మరో ఆస్థానకవి పశుపతి నాగనాథ కవి. ఇతడు విశ్వేశ్వరుడి శిష్యుడు. ఇతడు మదన విలాసం(సంస్కృతం), విష్ణుపురాణం అనే గ్రంథాలను రచించాడు. మదన విలాసంలో పద్మనాయకుల చరిత్ర విశేషాలు కనిపిస్తాయి. ధర్మపురికి చెందినగొప్ప పండితుడు నరసింహసూరి. ఇతడు విద్యారణ్య స్వామి సమకాలికుడు. ఇతడు ప్రయోగపారిజాతం అనే స్మృతి గ్రంథాన్ని రచించాడు.

అనపోతానాయకుడి కుమారుడైన రెండో సింగ భూపాలుడు బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి. ఇతడికి సంగీతం, నాటకం, నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. విశ్వేశ్వరుడు, నాగనాథుడు, బొమ్మకంటి అప్పయాచార్యుడు, శాకల్య మల్ల భట్టు తదితర కవి పండితులను పోషించాడు. రెండో సింగభూపాలుడు రసార్ణవ సుధాకరమనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ఇతడి మరో ప్రసిద్ధ గ్రంథం సంగీత సుధాకరం. కందర్ప సంభవం అనే డిమం (నాటక భేదం)ను, కువలయావళి అనే నాటికను ఇతడు రచించాడు.

రాచకొండకు చెందిన మరో కవి మాధవ భూపాలుడు(రావుమాదానీడు). ఇతడు రామాయణానికి రాఘవీయ వ్యాఖ్య రాశాడు. ఇతడే 1376లో శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర బృహత్ శిలా మండపం కట్టించాడు. మాయిభట్టు దీనికి శాసనం రాశాడు. ఈ శాసన కావ్యంలో 28 శ్లోకాలు ఉన్నాయి. ఇందులో మాధవ నాయకుడి శౌర్య పరాక్రమాలను వర్ణించారు. మాధవ భూపాలుడి భార్య నాగాంబిక. ఈమె ఒక తటాకాన్ని నిర్మించింది. దాని కోసం 1429లో నాగారం శాసనాన్ని వేయించింది. ఈ శాసన రచయిత శంభునాథ కవి.

పద్మనాయకులతో సంబంధం లేకపోయినా ఈ యుగానికి చెందినవాడు కందనామాత్యుడు. ఇతడు సబ్బినాడు(కరీంనగర్, వరంగల్) పాలకుడైన ముప్ప భూపాలుడి మంత్రి. పద్మపురాణం, భాగవత దశమ స్కంధాలను మడికి సింగన, కందనామాత్యుడికి అంకితమిచ్చాడు. కందనామ్యాతుడు రచించిన నీతితారావళి ద్వారా ఆ కాలం నాటి వ్యక్తుల ప్రవర్తనను తెలుసుకోవచ్చు. మడికి సింగన రచించిన 'సకలనీతి సమ్మతం' తెలుగులో తొలి సంకలన గ్రంథం. కాలగర్భంలో కలిసిపోయిన చాలా మంది కవులపేర్లు ఈ గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి. 21 గ్రంథాల నుంచి లోక, రాజనీతులను సంపుటీకరించిన గ్రంథమిది. ఇతడు పద్మపురాణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం, జ్ఞానవాసిష్ఠ రామాయణం తదితర రచనలు చేశాడు.

తొలి కవయిత్రి గంగాదేవి

ఈ యుగానికి చెందిన తొలి కవయిత్రి గంగాదేవి. కాకతీయుల ఆడపడచు అయిన గంగాదేవి విజయనగర రాజైన బుక్కరాయల కోడలు. కంపరాయల భార్య. ఈమె సంస్కృతంలో 'మధురావిజయ'మనే కావ్యాన్ని రచించింది. నాగేంద్రకవి తొలి శతకాల్లో ఒకటిగా పేర్కొనదగిన రమాధీశ్వర శతకాన్ని రచించాడు.ఇతడు భువనగిరికి చెందినవాడు. కవి భల్లటుడు గణమంజరి, పదమంజరి, శూద్రక రాజ చరిత్ర, భేతాళ పంచవింశతి, విక్రమార్క చరిత్ర (తెలుగు) అనే కావ్యాలను రాశాడు.

పోతన కొంత కాలం మూడో సింగభూపాలుడి ఆస్థానంలో ఉన్నాడు. పోతనను ఒంటిమిట్ట నుంచి ఓరుగల్లు తీసుకురావడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చింది. దేశీఛందస్సును పాల్కురికి ప్రవేశపెట్టాడు. పోతన దీన్ని స్వీకరించలేదు. కానీ దేశీ కవిత్వంలోని సరళత్వం ఇతడి కవిత్వంలో కనిపిస్తుంది. పోతన భోగినీ దండకంలో నాటి రాజుల భోగలాలసత్వాన్ని వర్ణించాడు. ఇతడు రాజాశ్రయాన్ని తిరస్కరించి ప్రత్యామ్నాయ సంస్కృతికి పట్టం కట్టాడు. మూడో సర్వజ్ఞ సింగభూపాలుడు స్వయంగా గొప్ప పండితుడు. వెలుగోటి వంశావళిలో పేర్కొన్న శ్రీనాథుడి పద్యం ద్వారా ఈ విషయం తెలుస్తోంది. మల్లినాథసూరి మెదక్ జిల్లా కొలిచెలిమకు చెందినవాడు. ఇతడు రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం, కిరాతార్జునీయం, శిశుపాలవధకు వ్యాఖ్యానాలు రాశాడు. మల్లినాథసూరి తమ్ముడైన పెద్దిభట్టు సంస్కృతంలో గొప్ప పండితుడు. పెద్దిభట్టు కుమారుడైన కొలిచెలిమ కుమార స్వామి సోమపీథి(సోమయాజి) కూడా గొప్ప వ్యాఖ్యాత. ఇతడు ప్రతాపరుద్రీయానికి రత్నాపణం అనే వ్యాఖ్యానం రాశాడు. రాచకొండకు చెందిన బొమ్మకంటి హరిహరుడు అనర్ఘరాఘవానికి వ్యాఖ్య రాశాడు.

నాథ సంప్రదాయం

రాచకొండ మంత్రుల వంశానికి చెందిన గౌరన ఈ యుగానికి చెందిన మరో గొప్పకవి. పాల్కురికి 'ద్విపద'ను స్వీకరించి హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్రలను రచించాడు. ఇతడు తెలుగు సాహిత్యంలో తొలిసారిగా నాథ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు. అది తెలంగాణ, రాయలసీమల్లో విశేష ప్రాచుర్యం పొందింది. నాథ సంప్రదాయం విగ్రహారాధన, కులతత్వాన్ని నిరసించింది. దేవరకొండకు చెందిన సూరన తొలి కల్పిత కావ్యమైన ధనాభిరామాన్ని రచించాడు. గౌరన కుమారుడైన భైరవకవి తెలంగాణలో బంధకవిత్వ ప్రక్రియకు ఆద్యుడు. ఇతడు శ్రీ రంగమహాత్మ్యం, రత్నపరీక్ష, కవి గజాంకుశం (ఛందోగ్రంథం)ను రచించాడు.

అనంతామాత్యుడు భోజరాజీయ కావ్యం, ఛందోదర్పణం, రసాభరణం అనే గ్రంథాలను రచించాడు. ఏర్చూరి సింగన భాగవత షష్ఠమస్కంధాన్ని రాశాడు. ఇతడు నల్లగొండ జిల్లాలోని ఏరూర్చుకు చెందినవాడు. ఇతడి మరో రచన కువలయాశ్వ చరిత్ర. బొప్పరాజు గంగన పంచమస్కంధను రచించాడు.

రేచర్ల రెడ్డి వంశస్థుల రాజధాని పిల్లలమర్రి. ఇది పిన వీరభద్రుడి జన్మస్థలం. 'వాణి నా రాణి' అని సగర్వంగా చెప్పుకున్న మహాకవి పిల్లలమర్రి పినవీరభద్రుడు. ఇతడు అవతారదర్పణం, నారదీయ పురాణం, మాఘమహాత్మ్యం, మానసోల్లాస సారం, శృంగార శాకుంతలం, జైమినీ భారతం అనే గ్రంథాలను రచించాడు. ప్రబంధాల్లో కనిపించే అనేక వర్ణనలకు, పద్యాల ఎత్తుగడలకూ ఒరవడి సృష్టించిన మార్గదర్శి పినవీరభద్రుడు.

కొలని గణపతి దేవుడు శివయోగసారం, మనోబోధ రచించాడు. కాకతీయ సామ్రాజ్య చరిత్రలో కొన్ని ఘట్టాలకు శివయోగసారం ఆధారం. భాగవతంలోని షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను పోతన అనువదించలేదు. వీటిని హరిభట్టు అనువదించాడు. రతి రహస్యం, వరాహపురాణం, మత్స్య పురాణం, నారసింహపురాణం ఇతడి ఇతర రచనలు. త్రిలోకభేది సకల ధర్మసారం రాశాడు. ఇతడు గౌరన మనవడు.

రాజుల మెప్పు కోసం కవులు.. అవధానం, సమస్య పూరణం, గర్భ, గోప్య, బంధ, అక్షరచ్యుత, మాత్రాచ్యుత, ఏక, ద్విసంధాదారణ ప్రక్రియలను అనుసరించడం ఈ కాలం నుంచే మొదలైంది.

ఏకామ్రనాథుడు

కాకతీయ రాజుల చరిత్ర, వంశావళి, వారి పూర్వీకుల క్రమాభివృద్ధి తదితరాలను తెలిపేందుకు ఏకామ్రనాథుడు ప్రయత్నించాడు. ఇతడు తొలి తెలుగు చరిత్రకారుడు. ఓరుగల్లుకు చెందిన ఇతడు ప్రతాపరుద్ర చరిత్రం, ద్వాత్రింశత్సాలభంజికల కథలు అనే గ్రంథాలను రచించాడని తెలుస్తోంది. ప్రతాపరుద్ర చరిత్రం తెలుగులో తొలి వచన రచన. తొలి చారిత్రక గ్రంథం. కాకతీయుల వివరాలతో పాటు నాటి మతాలు, మత వైషమ్యాలు, సంప్రదాయాలు, సాంఘిక ఆచారాలు, సంప్రదాయాలను ఇందులో పేర్కొన్నారు. ప్రతాపరుద్రుడి దినచర్య, వ్యక్తిత్వాన్ని గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. ఓరుగల్లు సమీపంలోని వివిధ వర్ణాల, వృత్తుల వారి సంఖ్య తదితర విషయాలను ఈ గ్రంథం తెలుపుతోంది. ప్రతాపరుద్ర చరిత్రం ఆనాటి సాంఘిక చరిత్ర.

కొరవి గోపరాజు

పాల్కురికి రచనల తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. దీని రచయిత కొరవి గోపరాజు. ఇతడు నిజామాబాద్ జిల్లా వేముగల్లు (భీమగల్లు)కు చెందినవాడు. ఇతడి పూర్వీకులు రాచకొండలో మంత్రులుగా పనిచేశారు. సింహాసన ద్వాత్రింశికకు విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం మూలం. కానీ గోపరాజు అనేక కల్పనలు చేసి దీన్ని స్వతంత్ర కావ్యంగా రూపొందించాడు. అందుకే ఈ గ్రంథంలో నాటి సాంఘిక జీవితాన్ని చిత్రించడం సాధ్యమైంది. గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో పేద, ధనిక తారతమ్యాలను చక్కగా వర్ణించాడు. మనసు లోతుల్ని విశ్లేషించిన తొలి మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తగా ఫ్రాయిడ్‌ను పేర్కొంటారు. కానీ శతాబ్దాల ముందే కొరవి గోపరాజు మనసు లోతుల్ని, కలల్ని విశ్లేషించాడు. సింహాసన ద్వాత్రింశిక తెలంగాణ గొప్ప కావ్యాల్లో ఒకటిగా నిలిచిపోయింది.

పిడుపర్తి కవులు పాల్కురికి మార్గంలో శైవ సాహిత్యాన్ని విరివిగా రాశారు. ఓరుగల్లుకు చెందిన పిడుపర్తి ఒకటో బసవకవి పిల్లనైనారుకథ, బ్రహ్మోత్తర ఖండంతోపాటు గురుదీక్షాబోధను రచించాడు. ఇతడి పెద తండ్రి కుమారుడైన పిడుపర్తి నిమ్మనాథుడు 'నిజ లింగ చిక్కయ్య కథ' అనే యక్షగానాన్ని రచించాడు. రెండో సోమనాథుడు పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్రను పద్య ప్రబంధంగా రచించాడు. ఇతడు ఒకటో బసవకవి కుమారుడు. ఇతడే 'ప్రభులింగలీలలు' అనే ద్విపద కావ్యాన్ని కూడా రచించాడు. పిడుపర్తి రెండో బసవ కవి దీన్నే పద్యకావ్యంగా కూర్చాడు. ఇతడు ఒకటో బసవకవి మనవడు.

మత పరిస్థితులు

ఈ యుగంలో శైవమత ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వైష్ణవ మతం కూడా ప్రాచుర్యం పొందింది. ఈ రెండు మతాల మధ్య వివాదాలు తలెత్తేవి. పద్మనాయకుల ఆస్థానంలోని శాకల్య భట్టు, పరాశర భట్టు మధ్య జరిగిన వివాదమే అందుకు నిదర్శనం. పద్మనాయకులు తాము శివ దేవతాపారాయణులమని చెప్పుకున్నారు. ఒకటో అనపోతానాయకుడు శైవమతాభిమాని. ఆయన ఉమామహేశ్వరం వద్ద శ్రీశైల ఉత్తర ద్వార మండపాన్ని నిర్మించాడు. అనేక శివాలయాలు, శ్రీ పర్వత శిఖరానికి సోపానాలు నిర్మించాడు. తొలి పద్మనాయకులు శైవమతాన్ని ఆదరించారు. కానీ రెండో సింగభూపాలుడి కాలం నుంచి వైష్ణవ మత ప్రాధాన్యం పెరిగింది. రెండో అనపోతానాయకుడు రామాలయం నిర్మించాడు. రావు మాదానీడు రాఘవీయ వ్యాఖ్య రాశాడు.శ్రీ రంగనాథుడికి దానాలిచ్చాడు. మూడో సింగ భూపాలుడు బెల్లంకొండ, తిరుపతి శాసనాలు వేయించాడు. వసంత నాయకుడు కంజీవర శాస నాన్ని, ధర్మానాయకుడు శాయంపేట శాసనాన్ని వేయించాడు. ఇవన్నీ వైష్ణవ మత ఉన్నతిని సూచిస్తున్నాయి.

వేదాంత దేశికులు వైష్ణవ మత వ్యాప్తికి తోడ్పడ్డారు. వీరు సుభాషిత నీతి, తత్త్వ సందేశ, రహస్య సందేశ గ్రంథాలను రచించారు. వైష్ణవం వడగల్, తెంగల్ అనే శాఖలుగా చీలిపోయింది. వేదాంత దేశికులు వడగల్ శాఖను ప్రచారం చేశారు. ఈ శాఖకు చెందిన వారు వైదిక ఆచార వ్యవహారాలను పాటించేవారు. ఈ శాఖ తెలంగాణ అంతటా వ్యాపించింది. మత ప్రచారం కోసం మఠాలను నిర్మించేవారు. వైదిక, పురాణ దేవతలతోపాటు కట్టమైసమ్మ, రేణుక, ముత్యాలమ్మ, మైసమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతలకు కూడా ఆలయాలు నిర్మించేవారు. యక్షగానాలు, భాగోతుల ప్రాచుర్యం కూడా వైష్ణవ మత వ్యాప్తిని సూచిస్తున్నాయి. బహమనీ సుల్తాన్‌లు మత అసహనాన్ని ప్రదర్శించారు. హుమాయూన్ జలీం షా పిల్లలమర్రి దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. బహమనీ సుల్తాన్ల చర్యలకు మత కారణాలే కాక రాజకీయ, ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. వీరి దాడుల నుంచి ప్రాణాలను రక్షించుకోవడానికి లక్షలాది మంది ప్రజలు ఇస్లాం మతాన్ని స్వీకరించారు. దీన్నిబట్టి తెలుగు ప్రజల ఇస్లామీకరణ ఈ కాలం నుంచే మొదలైందని తెలుస్తోంది.

వాస్తు, శిల్పకళ

పద్మనాయకులు కాకతీయుల శిల్పకళను అనుసరించారు. వీరి నిర్మాణాల్లో రాచకొండ, దేవరకొండ దుర్గాలు ప్రముఖమైనవి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్ఐ, బెంగళూరులో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు:15.10. 2025 నాటికి 32ఏళ్ల నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.58,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.10.2025
» వెబ్‌సైట్: https://www.rri.res.in

ఆర్ఆర్ఐ, బెంగళూరులో ప్రొఫెసర్ఐఐ పోస్టులు

బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొఫెసర్-ఐఐపోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» మొత్తం పోస్టుల సంఖ్య: 01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 20.10.2025 నాటికి 55 ఏళ్లు ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.10.2025
» వెబ్‌సైట్: https://www.rri.res.in

ఆర్ఆర్ఐ, బెంగళూరులో రీసెర్చ్ ఫెలోలు

బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్, రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 05.
» ఖాళీల వివరాలు: జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-01, సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)-02, రీసెర్చ్ అసోసియేట్-2/3-02.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ, బీటెక్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు, ఎస్ఆర్ఎఫ్‌కు 35 ఏళ్లు, ఆర్ఏకు 32 నుంచి 35 ఏళ్లు.
» వేతనం: నెలకు జేఆర్ఎఫ్‌కు రూ.37,000, ఎస్ఆర్ఎఫ్‌కు రూ.42,000, ఆర్ఏకు రూ.61,000 నుంచి రూ.67,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:10.10.2025
» వెబ్‌సైట్: www.rri.res.in

'మిక్సోవైరస్ పరోటైడస్' వల్ల కలిగే వ్యాధి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ - కంటెంట్ (ఎస్ఏ)

వ్యాధులు

1. ఒక వ్యాధిగ్రస్థుడికి నీటిని చూస్తే భయం, వణుకు పుడుతుంది. అతనికున్న వ్యాధి?
   1) డెంగ్యూ 2) టెటానస్
   3) రేబిస్ 4) ఎయిడ్స్
2. కిందివాటిలో ఏ వ్యాధి లైంగిక సంపర్కానికి సంబంధించింది కాదు?
   1) వైరల్ ఎన్‌సెఫాలిటిస్
   2) గనేరియా 3) సిఫిలిస్
   4) యాంటీ ఇమ్యునో డెఫిషియన్సీ- సిండ్రోమ్
3. లాలాజల గ్రంథులపై దాడి చేసే పారామిక్సో వైరస్ వల్ల కలిగే వ్యాధి?
   1) జలుబు 2) గవద బిళ్లలు
   3) మీజిల్స్ 4) డయేరియా
4. సిఫిలిస్, మలేరియా, కలరా వంటి వ్యాధులు సంక్రమించడానికి కారకాలు వరుస క్రమంలో?
   1) ప్రోటోజోవా - ప్రత్యక్ష సంబంధం - ఈగలు
   2) ఎలుకలు - ఆడ అనాఫిలిస్ దోమ- నీరు
   3) లైంగిక సంపర్కం - ఆడ అనాఫిలిస్ దోమ - ఈగలు
   4) మట్టిలోని బ్యాక్టీరియా -కలుషిత ఆహారం - గాలి
5. ట్రిపనో సోమా గాంబియన్సీ అనే ప్రోటోజోవన్ వల్ల కలిగే వ్యాధి?
   1) టైఫాయిడ్ 2) అతిసారం
   3) న్యుమోనియా 4) నిద్రాజాడ్యం
6. కిందివాటిలో సరైన జత?
   1) ప్లాస్మోడియం - సాండ్ ఈగ
   2) విబ్రియో కలరా - ఆడ అనాఫిలిస్ దోమ
   3) ట్రిపనో సోమా - సీసీ ఈగ
   4) క్లాస్ట్రీడియం టిటాని - పెంపుడు జంతువు
7. చికిత్స కోసం వైద్యుడి వద్దకు వెళ్లిన వ్యాధిగ్రస్థులు చెప్పిన లక్షణాల క్రమం కింది విధంగా ఉంది.
   ఎ. చలిజ్వరం, తీవ్ర తల నొప్పి
   బి. రక్త విరేచనాలు - పొత్తి కడుపు నొప్పి
   సి. కండరాల సంకోచం - నరాల తీపులు
   వీరు బాధపడుతున్న వ్యాధులు వరుస క్రమంలో తెల్పండి.
   1) కలరా - టైఫాయిడ్ - డిఫ్తీరియా
   2) అమీబియాసిస్-మలేరియా-డయేరియా
   3) మలేరియా-అమీబియాసిస్-ధనుర్వాతం
   4) అపెండెసైటిస్ - ధనుర్వాతం- పోలియో
8. కిందివాటిలో ఏ వ్యాధి కలుషిత ఆహారం, ఈగల వల్ల సంక్రమించదు?
   1) మలేరియా 2) కలరా
   3) టైఫాయిడ్ 4) అమీబియాసిస్
9. న్యుమోనియా వ్యాధిని కలిగించే సూక్ష్మజీవికి సంబంధించింది?
   1) వైరస్ 2) బ్యాక్టీరియా
   3) ప్రోటోజోవన్ 4) శిలీంధ్రం
10. వ్యాధి, వ్యాధి కారకానికి సంబంధించి సరికాని జత?
    1) మలేరియా - ప్లాస్మోడియం
    2) స్లీపింగ్ సిక్‌నెస్ - ట్రిపనోసోమా
    3) గవదబిళ్లలు - ఎన్‌సెఫలాటిస్ వైరస్
    4) జలుబు - రినో వైరస్
11. ఏ వ్యాధి ప్రభావం శ్వాస అవయవాలపై ఉండదు?
    1) ట్యూబర్ క్యులోసిస్ 2) న్యుమోనియా
    3) కోరింత దగ్గు 4) మీజిల్స్
12. కిందివాటిలో క్షయ వ్యాధికి చెందిన లక్షణం?
    1) శ్లేష్మంతో కూడిన దగ్గు
    2) ఆకలి తగ్గడం, బరువు తగ్గడం
    3) జ్వరం 4) పైవన్నీ
13. 'హైడ్రోఫోబియా'ను కలిగించే వైరస్?
    1) హెర్పెస్ వైరస్ 2) రాబ్డో వైరస్
    3) ఎన్‌సెఫలాటిస్ 4) ఆర్థోమిక్సో వైరస్
14. ప్లేగు వ్యాధి నిర్మూలనకు ఎవరు కనుగొన్న టెట్రాసైక్లిన్ అనే ఔషధం ఉపయోగపడింది?
    1) అబ్దుల్ కలాం
    2) డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు
    3) లూయీ పాశ్చర్
    4) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
15. ఏ వ్యాధి బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజోవన్ వల్ల కలుగదు?
    1) క్యాషియోర్కర్ 2) టెటానస్
    3) మలేరియా 4) న్యుమోనియా
16. క్యాషియోర్కర్ దేని లోపం వల్ల వస్తుంది?
    1) ఇనుము 2) ప్రోటీన్
    3) అయోడిన్ 4) కాల్షియం
17. పొటాషియం లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) హైపోకలేమియా 2) హైపోనట్రేమియా
    3) హైపోగ్లైసిస్ 4) అనీమియా
18. పోషక పదార్థాలు, వాటి లోపాలకు సంబంధించి సరైన జతలు?
    ఎ. ఇనుము - కండరాల పక్షవాతం
    బి. సోడియం - హైపోనట్రేమియా
    సి. కాల్షియం - ఆస్టియో మలేసియా
    డి. పొటాషియం - క్వాషియోర్కర్
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, డి 4) సి, డి
19. అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) రక్తహీనత 2) బానపొట్ట
    3) థైరాయిడ్ వాయడం 4) మెరాస్మస్
20. ఒక వ్యక్తిలో నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు గుర్తించారు. ఆ వ్యక్తిలో కింది వాటిలో ఏ ధాతులోపం ఉన్నట్లు నిర్ధారించవచ్చు?
    1) కాల్షియం 2) అయోడిన్
    3) పొటాషియం 4) సోడియం

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 3;
5) 4; 6) 3; 7) 3; 8) 1;
9) 2; 10) 3; 11) 4; 12) 4;
13) 2; 14) 2; 15) 1; 16) 2;
17) 1; 18) 3; 19) 3; 20) 4.

పోషక పదార్థాల లోపం వల్ల వచ్చే వ్యాధులు

పదార్థ లోపం	వ్యాధి	కారణం/లక్షణాలు
ప్రోటీన్	క్యాషియోర్కర్	తల్లిపాల బదులు కార్బోహైడ్రేట్ ఆహారంపై ఆధారపడ్డ ఐదేళ్లలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. వికారంగా ఉండటం, పెరుగుదల ఆగిపోవడం, బరువు కోల్పోవడం, బాన పొట్ట, మానసిక వైకల్యం కలుగుతాయి.
ఖనిజాలు	మెరాస్మస్	తల్లిపాలకు బదులు పోషక విలువలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకునే ఏడాదిలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. కండరాలు సరిగా ఎదగక పోవడం, అవయవాల బలహీనత, పక్క టెముకలు బయట పడటం వంటివి కలుగుతాయి.
ఇనుము (Fe)	రక్త హీనత	ఎర్ర రక్తకణాల్లో హీమోగ్లోబిన్ లోపం వల్ల వ్యక్తులు పాలిపోవడం, ఆకలి కోల్పోవడం, త్వరగా అలసిపోవడం.
పొటాషియం K(Kalium)	హైపోకలేమియా	విపరీతమైన వాంతులు, విరేచనాలతో పొటాషియం కోల్పోవడం, హృదయ స్పందన రేటు అధికమవడం, మూత్రపిండం దెబ్బతినడం, బలహీనత, కండరాల పక్షవాతం.
సోడియం Na (Natrium)	హైపోనట్రేమియా	సోడియం నష్టపోవడం, నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం
అయోడిన్ (I)	గ్రంథివాపు	థైరాయిడ్ గ్రంథివాపు
కాల్షియం Ca	రికెట్స్, ఆస్టియో మలేసియా	విటమిన్ డి లోపం ఏర్పడుతుంది.

వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధులు

వ్యాధి	కారకం	వ్యాపించే విధానం	లక్షణాలు
జలుబు	రినోవైరస్	తుంపరల వల్ల, ప్రత్యక్ష సంబంధం	ముక్కు కారడం, తలనొప్పి
పోలియో మైలిటిస్	పోలియో వైరస్, ఎంటరో వైరస్	ఈగలు, నీరు, ఆహారం	తలనొప్పి, వాంతులు, శరీరంలో ఒకటి రెండు అవయవాలకు పక్షవాతం, బలహీనత
గవద బిళ్లలు (మంప్స్)	పారామిక్సో వైరస్ పరోటైడస్	ప్రత్యక్ష సంబంధం, వైరస్ లాలాజల గ్రంథుల మీద దాడి	జ్వరం, తలనొప్పి, లాలాజలం అధికంగా ఊరడం - లాలాజల గ్రంథులు వాయడం, గొంతు ఎండిపోవడం
తట్టు (మీజిల్స్)	పారామిక్సో వైరస్ (తట్టు వైరస్)	ప్రత్యక్ష సంబంధం దగ్గేటప్పుడు వెలువడే తంపరల ద్వారా	ముక్కు కారడం, శ్లేష్మ పటలం వాపు, చర్మం మీద ఎర్రని గుల్లలు
మశూచి (స్మాల్‌పాక్స్)	వరియొల వైరస్	ప్రత్యక్ష సంబంధం	జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి, చర్మం మీద గుల్లలు, పొక్కులు ఏర్పడి గుంటలు పడటం
ఇన్‌ఫ్లూయెంజా (ఫ్లూ)	ఆర్థోమిక్సో వైరస్	ప్రత్యక్ష సంబంధం, వస్తువుల ద్వారా	జ్వరం, కండరాల నొప్పి, గొంతు పుండు, పొడిదగ్గు, ఊపిరితిత్తులపై బ్యాక్టీరియా దాడి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మలేరియా సోకిన మానవునిలో చలిజ్వరం వచ్చే సమయం?
   1) ఎర్ర రక్తకణాలు పగిలి మీరో జాయింట్లు విడుదలయ్యే సమయం
   2) స్పోరో జాయింట్ల ఉత్పత్తి సమయం
   3) స్పోరో జాయింట్లు కాలేయ కణాల్లో చేరే సమయం
   4) క్రిప్టో మీరో జాయింట్లు ఎర్ర రక్త కణాల్లో ప్రవేశించే సమయం
2. మానవుల్లో వచ్చే x -డిఫ్తీరియా, y- తట్టు, z - కోరింత దగ్గు అనే వ్యాధులను కల్గించే సూక్ష్మజీవుల పేర్ల క్రమం?
   1) x- వైరస్, y -బ్యాక్టీరియా, z- ప్రోటోజోవా
   2) x- ప్రోటోజోవా, y -బ్యాక్టీరియా, z- వైరస్
   3) x -వైరస్, y-బ్యాక్టీరియా, z- వైరస్
   4) x బ్యాక్టీరియా, y వైరస్, z బ్యాక్టీరియా
3. ఏ వ్యాధి సోకితే శరీరం నుంచి ఎక్కువ శాతం నీరు బయటకు పోయి నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది?
   1) టైఫాయిడ్ 2) మలేరియా
   3) కలరా 4) డిఫ్తీరియా
4. వేటిని తగినంత మొత్తాల్లో భుజించకపోతే మనం త్వరగా అలసిపోయి నీరసంగా తయారవుతాం?
   1) కార్బోహైడ్రేట్‌లు 2) ప్రోటీన్‌లు
   3) కొవ్వులు 4) విటమిన్‌లు
5. 'మిక్సోవైరస్ పరోటైడస్' వల్ల కలిగే వ్యాధి?
   1) మెదడువాపు 2) గవద బిళ్లలు
   3) తట్టు 4) హెపటైటిస్

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1; 5) 2.

ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ లభించింది?

పరమాణు నిర్మాణం

క్వాంటం సిద్ధాంతం - కాంతి విద్యుత్ ఫలితం

కాంతి విద్యుత్ ఫలితం: ఒక లోహ ఉపరితలాన్ని కాంతి కిరణపుంజంతో ఢీకొట్టించినప్పుడు, దాని ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి. ఈ దృగ్విషయాన్నే కాంతి విద్యుత్ ఫలితం(Photo Electric Effect) అంటారు.

» అన్ని రకాల కాంతి కిరణాలు అన్ని లోహాల ఉపరితలాల నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయవు.

» ఎలక్ట్రాన్‌లను తేలికగా కోల్పోయే స్వభావం అంటే అతి తక్కువ అయనీకరణ శక్మం (ఒక వాయుస్థితిలోని ఒంటరి పరమాణువు చిట్ట చివరి కక్ష్యలోని ఎలక్ట్రాన్‌ను తొలగించడానికి కావాల్సిన శక్తి) ఉన్నటువంటి లోహాలే కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి.


» ప్రతి లోహానికి సంబంధించి ఒక అభిలాక్షణిక (దానికే ప్రత్యేకమైన) పౌనఃపున్యం ఉంటుంది. లోహ ఉపరితలాన్ని ఢీకొట్టే పతనకాంతి పౌనఃపున్యం, ఆ లోహానికి సంబంధించిన అభిలాక్షణిక పౌనఃపున్యం కంటే ఎక్కువ ఉన్నప్పుడే లోహ ఉపరిత లం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి.

» ఉదాహరణకు పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఊదారంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేస్తాయి. కానీ, ఎరుపు రంగు కిర ణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేయవు.

» దీనికి కారణాలను ఆయా కాంతి కిరణాల పౌనఃపున్యాల (లేదా తరంగదైర్ఘ్యం లేదా శక్తి) ఆధారంగా విశ్లేషించొచ్చు.

» కింది పట్టికను పరిశీలిస్తే ఎరుపు కిరణాల పౌనఃపున్యం లేదా శక్తి తక్కువ (తక్కువ తరంగదైర్ఘ్యం) కాబట్టి పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదల కావని తెలుస్తుంది.

» సాధారణంగా తక్కువ అయనీకరణ శక్మం ఉన్న క్షార లోహాలు ఫొటో విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి. అవి పొటాషియం, రుబీడియం, సీజియం. ఈ క్రమంలోనే పరమాణు సైజు పెరిగి అయనీకరణ శక్మాలు పెరగడం వల్ల కాంతి విద్యుత్ ఫలితం చూపించే సామర్థ్యం కూడా ఎక్కువ. అంటే క్షార లోహాలైన లిథియం, సోడియం దాదాపుగా కాంతి విద్యుత్ ఫలితాన్ని



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ

చూపించవు. సీజియం తేలికగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తుంది.

» కాంతి విద్యుత్ ఫలితాన్ని 'సాధారణీకృత క్వాంటం సిద్ధాంతం' ద్వారా ఐన్‌స్టీన్ వివరించాడు. ఆయన కృషి ఫలితంగా 1905 లో నోబెల్ బహుమతి లభించింది.

» ఈ సిద్ధాంత ప్రకారం ఫోటాన్‌లుగా భావించే కాంతి కణాల శక్తి (E), పౌనఃపున్యానికి (υ) అనులోమానుపాతంలో ఉంటుంది.

[E = hυ, h ప్లాంక్ స్థిరాంకం]

» లోహం నుంచి ఎలక్ట్రాన్‌ను బయటకు తొలగించడానికి అవసరమైన శక్తి ఫోటాన్ కు ఉన్నప్పుడే లోహ ఉపరితలాన్ని ఫోటాన్ ఢీకొట్టినప్పుడు దాని నుంచి ఎలక్ట్రాన్‌లు బహిర్గతమవుతాయి. ఫోటాన్ శక్తి అవసరమైన దానికంటే తక్కువగా ఉంటే అది లోహం నుంచి ఎలక్ట్రాన్‌లను విడుదల చేయదు.

» ఒక ఫోటాన్ లోహ ఉపరితలాన్ని ఢీకొట్టినప్పుడు అది రెండు పనులు చేయాలి. ఎలక్ట్రాన్‌ల మీద ఉన్న లోహ కేంద్రక ఆకర్షణ బలాలను అధిగమించి విడుదల చేయగలగాలి. తర్వాత వాటికి కొంత శక్తి(గతిజశక్తి) నిచ్చి లోహ ఉపరితలానికి దూరంగా(తిరి గి లోహంలో చేరకుండా) తీసుకెళ్లగలగాలి. అంటే ఈ రెండు పనులు చేయగలిగిన శక్తి లోహాన్ని ఢీకొట్టే ఫోటాన్‌లకు ఉండాలి.

» దీనికి సమీకరణ రూపం: hυ = W + KE

hυ = ఫోటాన్‌ల శక్తి

W = ఎలక్ట్రాన్‌లపై ఉన్న లోహ ఆకర్షణ బలాలను అధిగమించే శక్తి (పని ప్రమేయం)

KE = విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజశక్తి

కాంతి విద్యుత్ ఫలితానికి సంబంధించిన ముఖ్య విషయాలు

» ప్రతి లోహం, కొంత కనీస పౌనఃపున్యం లేదా శక్తి ఉన్న కాంతి పడినప్పుడే ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేస్తుంది. దీన్నే ఆరంభ లేదా ద్వార పౌనఃపున్యం (Threshold Frequency) అంటారు. ఈ ఆరంభ పౌనఃపున్యం కంటే తక్కువ పౌనఃపున్యం ఉన్న కాంతిని ఎంతసేపు ప్రసరింపజేసినా లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయలేం.

» వేర్వేరు లోహాలకు ఈ ఆరంభ పౌనఃపున్యం వేరుగా ఉంటుంది. విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజశక్తి పతన (ఢీకొట్టిన) కాంతి పౌనఃపున్యం పై ఆధారపడి ఉంటుంది. దాని తీవ్రతపై ఆధారపడదు.

» ఒక సెకనులో విడుదలైన ఎలక్ట్రాన్‌ల సంఖ్య కాంతి తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. దాని పౌనఃపున్యంపై ఆధారపడి ఉండదు.

» ఒకవేళ ఎలక్ట్రాన్ విడుదలకు కావాల్సిన శక్తికంటే తక్కువ శక్తి ఉన్న ఫోటాన్‌ను వస్తువు గ్రహించినప్పుడు ఎలక్ట్రాన్‌లు భూస్థాయి (అల్ప శక్తిస్థాయి) నుంచి ఉత్తేజిత శక్తిస్థాయి (అధిక శక్తిస్థాయి)లోకి పరివర్తనం చెందుతాయి. అయితే అధిక శక్తి స్థాయిల్లో ఎలక్ట్రాన్‌లు ఎక్కువసేపు ఉండలేవు (అస్థిరం). కాబట్టి తిరిగి భూస్థాయికొస్తాయి. ఈ ప్రక్రియలో అంటే ఎలక్ట్రాన్‌లు అధికశక్తి నుంచి తిరిగి భూస్థాయిలోకి వస్తున్నప్పుడు గ్రహించిన శక్తి విడుదలవుతుంది. ఈ విడుదలయ్యే శక్తి వికిరణ రూ పంలో ఉంటుంది. తద్వారా వర్ణపటాలు ఏర్పడతాయి. కాబట్టి వివిధ మూలకాలను వేడిచేసినప్పుడు అవి విలక్షణమైన రంగులనిస్తాయి. (దీపావళి టపాకాయలు)

లోహం	-	జ్వాల రంగు
మెగ్నీషియం	-	తెలుపు
కాల్షియం	-	ఇటుక ఎరుపు
స్ట్రాన్షియం	-	కెంపు రంగు
బేరియం	-	లేత ఆకుపచ్చ
లిథియం	-	సింధూర ఎరుపు
సోడియం	-	పసుపు
పొటాషియం	-	ఊదా
రుబీడియం	-	ఎరుపు - ఊదా
సీజియం	-	నీలి వర్ణం

రంగు	తరంగ దైర్ఘ్య అవధి (nm)	పౌనఃపున్య అవధి (Hz)
ఎరుపు (Red)	622 – 780	$4.8 \times 10^{14} - 3.85 \times 10^{14}$
నారింజ (Orange)	597 – 622	$5.01 \times 10^{14} - 4.82 \times 10^{14}$
పసుపు (Yellow)	577 – 597	$5.19 \times 10^{14} - 5.05 \times 10^{14}$
ఆకుపచ్చ (Green)	492 – 577	$4.92 \times 10^{14} - 5.19 \times 10^{14}$
నీలి (Blue)	455 – 492	$6.59 \times 10^{14} - 6.10 \times 10^{14}$
ఊదా (Violet)	390 – 455	$7.69 \times 10^{14} - 6.59 \times 10^{14}$

మాదిరి ప్రశ్నలు

1. ప్లాంక్ సిద్ధాంతం ప్రకారం సరైన వాక్యాలు ఏవి?
ఎ) కాంతి ఫోటాన్‌లు (క్వాంటా) అనే చిన్న చిన్న శక్తి ప్యాకెట్‌ల రూపంలో ఉద్గారం లేదా శోషణం చెందుతుంది
బి) ఫోటాన్‌లు కాంతి వేగానికి సమానమైన వేగంతో ప్రయాణిస్తాయి.
సి) పదార్థ కాంతి శోషణం లేదా ఉద్గారం అవిచ్ఛిన్నంగా ఉంటుంది.
1) ఎ, సి 2) ఎ, బి
3) బి, సి 4) ఎ, బి, సి
2. తనపై పడిన వికిరణాలను సంపూర్ణంగా శోషించుకునే లేదా ఉద్గారం చేసే వస్తువును ఏమంటారు?
1) ఉత్సర్గ నాళిక 2) శీతల వస్తువు
3) కృష్ణ వస్తువు 4) హరిత వస్తువు
3. క్వాంటా అనేది?
1) శక్తి ప్యాకెట్ 2) కరెన్సీ
3) క్వింటాలు 4) కాంతి ప్రమాణం
4. ఫొటో విద్యుత్ ఫలితంలో ఫొటో ఎలక్ట్రాన్‌ల ఉద్గారం దేనిపై ఆధారపడి ఉంటుంది?
1) ఆరంభ పౌనఃపున్యం
2) పతన కాంతి తీవ్రత
3) లోహ స్వభావం 4) అన్నీ
5. ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ బహుమతి లభించింది?
1) సాపేక్షతా సిద్ధాంతం
2) కాంతి పరిక్షేపణం
3) కాంతి విద్యుత్ ఫలితం
4) క్వాంటం సిద్ధాంతం
6. ఒక ఫోటాన్ శక్తి ..... కు అనులోమానుపాతంలోనూ ..... కు విలోమానుపాతంలోనూ ఉంటుంది?
1) పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యం
2) తరంగదైర్ఘ్యం, పౌనఃపున్యం
3) కాంతి తీవ్రత, తరంగదైర్ఘ్యం
4) పౌనఃపున్యం, కాంతి తీవ్రత
7. ఎక్కువ పౌనఃపున్యం (తక్కువ తరంగ దైర్ఘ్యం ఉన్న) దృగ్గోచర కాంతి రంగు?
1) నారింజ 2) ఎరుపు
3) పసుపు 4) ఊదా
8. అల్యూమినియం (Al) తలం పని ప్రమేయం **4.2eV**. సోడియం (Na) తలం పని ప్రమేయం **2.0eV** ఈ రెండు లోహాల తలాలపై వికిరణాలు పడి ఫొటో విద్యుత్ ఫలితం ఇవ్వగా కింది పరిశీలనలు వచ్చాయి.
1) Al, Naలకు ఒకే ద్వార పౌనఃపున్యం ఉంది.
2) Al ద్వార పౌనఃపున్యం > Na ద్వార పౌనఃపున్యం
3) Na ద్వార పౌనఃపున్యం > Al ద్వార పౌనఃపున్యం
4) ఏదీకాదు
9. లిథియం, సోడియం, పొటాషియం, కాల్షియంల ప్రథమ అయనీకరణ శక్మాలు (eV) వరుసగా **5.39, 5.13, 4.34, 6.11** అయితే ఏది కాంతి విద్యుత్ ఫలితాన్ని సులభంగా ప్రదర్శిస్తుంది?
1) పొటాషియం 2) లిథియం
3) సోడియం 4) కాల్షియం
10. సీజియం, సోడియం, అల్యూమినియంల పని ప్రమేయాలు వరుసగా **1.9eV, 2.0eV, 4.2eV** అయితే అతి తక్కువ ఆరంభ పౌనఃపున్యం ఉన్నది?
1) సీజియం 2) సోడియం
3) అల్యూమినియం 4) చెప్పలేం
11. నిశ్చిత వాక్యం (A): రేడియో తరంగాలు, అయస్కాంత క్షేత్రంలో వంగి ప్రయాణిస్తాయి.
వివరణ (R): రేడియో తరంగాలు స్వభావ రీత్యా విద్యుదయస్కాంతాలు
1) A, R రెండూ సరైనవే R, A కు సరైన వివరణ
2) A, R రెండూ సరైనవే, కానీ, R, A కు సరైన వివరణ కాదు
3) A సరైంది. R సరైంది కాదు.
4) A సరైంది కాదు. R సరైంది.

సమాధానాలు:

1) 2; 2) 3; 3)1; 4) 2; 5)3; 6) 1; 7) 4; 8) 2; 9) 1; 10) 1; 11) 1.

The synonym of Surreptitious is..

BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Hindus constitute less than one per cent of the American population, (1)/ on an overwhelming majority of who (2)/ are either from India (3)/or are people of Indian-origin. (4)/ No error (5)
2. Ever since the Supreme Court ruling (1)/ on the entry of women of all ages into Sabarimala, (2)/ questions of patriarchy, equality, (3)/ constitutional and tradition have been raised. (4)/ No error (5)
3. The controversy that began with a public tussle among (1)/ Mr. Verma and Special Director Rakesh Asthana (2)/ has ended with the former's removal, (3)/ although it is couched as a transfer. (4)/ No error (5)
4. India's largest software exporter Tata Consultancy Services has appointed Daniel Hughes Callahan, (1)/ popularly known Don Callahan as additional and independent director for a period of five years (2)/ with effect from January 10, 2019, based on the recommendations of the Nomination and Remuneration Committee, (3)/ and subject to approval of shareholders. (4)/ No error (5)
5. ISRO had hit upon (1)/ the idea of transforming (2)/ the expendable fourth stage (3)/ in a makeshift satellite to reduce space debris. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Drinking milk enriched with vitamin D may significantly reduce the risk of rickets and also aid for sufferers of heart disease, according to studies recently completed at the Indian Institute of Medical Sciences, New Delhi.
1) be significant in reducing the risk of rickets and aid for
2) significantly reduce the risk of rickets and aid
3) cause a significant reduction in the risk of rickets and aid to
4) significantly reduce the risk of rickets as well as aiding
5) no correction required
7. If you are in a three-month software design project and, in two weeks, you've put together a program that solving part of the problem, show it to your boss without delay.
1) and, you've put together a program that solves part of the problem in two weeks
2) and, you've put together a program that has solved part of the problem in two weeks
3) and, in two weeks, you've put together a program that solves part of the problem
4) and, in two weeks, you put together a program that solved only part of the problem
5) no correction required
8. Many of these environmentalists proclaim to save nothing less than the planet itself.
1) to save nothing lesser than
2) that they are saving nothing lesser than
3) to save nothing less than
4) that they save nothing less than
5) no correction required
9. The rate of inflation in this country has been increasing steadily, and this is a source of concern for those in power.
1) steadily: which
2) steadily; this trend
3) steadily, this increase
4) steadily: this
5) no correction required
10. Generally, in the fine print of insurance documents lies the clauses that make a fool out of the gullible consumer.
1) lie the clauses that makes a fool
2) lies the clauses that makes a fool
3) lie the clauses that make a fool
4) Lied the clause that making a fool
5) no correction required



Directions (Q.No.11-15): In the passage given below there are several blanks with numbers, choose the right word to fill in the blanks from the five options given against each blank to complete the passage.

Come New Year and the state of Andhra Pradesh will ______(11) a separate High Court as the Supreme Court has given the green signal for issuing the notification to this_____ (12). It will be the 25th high court in the country and will ______ (13) function from a temporary structure till the permanent building comes up in the ambitious Justice City complex in the state's capital Amaravati. ______(14) the bifurcation of the state on June 2, 2014, Andhra Pradesh and Telangana have had a common High Court situated at Hyderabad, the_____ (15) capital city.

11. 1) have 2) have been
3) being 4) have being
5) been
12. 1) affect 2) purpose
3) problem 4) effect
5) issue
13. 1) initial 2) initially
3) initialize 4) informally
5) formerly
14. 1) from 2) further
3) farther 4) for
5) since
15. 1) former 2) farther
3) latter's 4) later's
5) further

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) On the one hand, Mr. Trump has steadily contributed to the strident and crude anti-migrant rhetoric, characterising prospective migrants from Latin America as drug-dealers, rapists and violent criminals and shutting down the U.S. border to travellers from certain Muslim-majority countries.
B) Matters took a darker turn as Mr. Trump doubled down on his refusal to negotiate over funding for the wall and said he may declare a state of national emergency over this uncomfortable status quo.
C) It began as a populist campaign promise that brought President Donald Trump's supporters cheering to their feet and paved the way for his election.
D) On the other, his insistence that he will not sign any appropriations bill to break the funding logjam in Congress and end what could soon become the longest shutdown in U.S. history, unless that bill includes $5.7 billion in financing for a border wall, has gone down badly with Democrats, who control the House.
E) Now, the border wall with Mexico has become a morass of partisan bickering that has stalemated the U.S. federal government into a three-week-long shutdown, leaving nearly 800,000 public sector workers furloughed without pay.
F) At the heart of this political crisis is the increasingly bitter polarization of public opinion over immigration.

16. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-23): Choose the correct synonym for the words given below

21. OBNOXIOUS
1) abhorrent 2) detect
3) pleasant 4) project
5) propel
22. SURREPTITIOUS
1) fugitive 2) renegade
3) punitive 4) clandestine
5) castigate
23. DOCILE
1) uncontrollable
2) plaint 3) wild
4) irrepressible 5) loathsome

Directions (Q.No. 24-25): Choose the correct antonym for the words given below

24. ABHORRENT
1) obscene 2) nasty
3) vile 4) salubrious
5) lousy
25. EXUBERANT
1) phlegmatic 2) ruckus
3) commotion 4) frolic
5) crank

Directions (Q.No. 26-35): Choose a word/words to fill in the blanks given below to complete the sentence.

26. There is no way around it: plagiarism is ______ to thievery.
1) tantamount 2) apathetic
3) fatuous 4) unscrupulous
5) indecisive
27. For ____ deeds during her mission overseas, Eesha was awarded the Congressional Medal of Honor.
1) inept 2) valorous
3) erroneous 4) malodorous
5) benign
28. Adrith read the employee manual so that he might ______ himself with his new responsibilities at the company.
1) relinquish 2) synthesize
3) orient 4) validate
5) motivate
29. I am ______ of the problems that this solution will cause, but I still believe that this is the best possible solution.
1) innocuous 2) cognizant
3) precipitous 4) reminiscent
5) belligerent
30. The spectacular presentation by a rainforest adventurer ______ Sampath with the desire to travel to South America to see the jungles for himself.
1) disheartened 2) inhibited
3) imbued 4) reconstituted
5) abhorred
31. As the city grew and stretched its borders, it began to feel the ______ problems of urban sprawl and overpopulation.
1) improvident 2) mendacious
3) ersatz 4) concomitant
5) surreptitious
32. Terrance, a dentist, ______ to be with the media, so he could see the concert for free.
1) facilitated 2) conjugated
3) purported 4) tended
5) placated
33. ______ on a lounge chair by the pool was the very tan owner of the estate, relaxing in the midday sunshine.
1) Trident 2) Renegade
3) Fraught 4) Renowned
5) Supine
34. Observing his sister's ______ behavior of riding without a helmet, Bandarkar ran to get his mother.
1) contemptuous
2) contented
3) ctitious
4) parlous
5) pensive
35. As the discussions _____concluded, the_____continued further.
1) Definitely , problem
2) Miserably, issues
3) Purposefully, impasse
4) abruptly, stalemate
5) Soon, curfew

KEY

1) 2	2) 4	3) 1	4) 2	5) 4
6) 2	7) 3	8) 4	9) 2	10) 3
11) 1	12) 4	13) 2	14) 5	15) 3
16) 1	17) 4	18) 4	19) 3	20) 2
21) 1	22) 4	23) 2	24) 4	25) 1
26) 1	27) 2	28) 3	29) 2	30) 3
31) 4	32) 3	33) 5	34) 4	35) 4